ఈనాడు

విజయవాడ 30-8-2026 ఆదివారం సిటీ సంపుటి 53 . సంచిక 21

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Delhi, Mumbai

తిరుమల శ్రీవారి దర్శనానికి సేవా మార్గం

తితిదే 'శ్రీవారి వైద్యసేవ'కు అపూర్వ స్పందన • 83 రోజుల్లో 723 మంది వైద్యుల దరఖాస్తు

వైద్య సేవలో భాగంగా రోగికి చికిత్స అందించిన వైద్యులు

త్వరలో 'విద్యాసేవ', 'ఇంజినీరింగ్ సేవ', 'రక్షక సేవ'

ఈనాడు డిజిటల్, తిరుపతి: దశాబ్దాలుగా తిరుమలలో విజయవంతంగా సాగుతున్న 'శ్రీవారి సేవ' ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. భక్తులకు వసతి, భోజన సంబంధిత సేవలకే పరిమితం కాకుండా.. వృత్తి నిపుణుల (ప్రొఫెషనల్స్)ను తితిదే స్వామివారి సేవలో భాగస్వాములను చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో తిరుమల పర్యటనకు వచ్చినప్పుడు.. శ్రీవారిసేవలో సామాన్య భక్తులతో పాటు వృత్తి నిపుణులనూ భాగస్వాములను చేయాలని (మిగతా 2లో)

ఏనుగుకు వైద్యం చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు

ఆటకు దక్కిన గౌరవం

రూ.8.80 కోట్ల ప్రోత్సాహకాల విడుదల

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను ప్రభుత్వం గౌరవించింది. 264 మందికి రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) రూ.8.80 కోట్లు విడుదల చేసింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో.. ఆటగాళ్ల ఖాతాల్లో నగదు ప్రోత్సాహకాల్ని జమ చేసింది. - ఈనాడు, అమరావతి, చిత్తూరు

రూ.35 లక్షలు జమైనట్లు వచ్చిన మెసేజ్‌ను చూపుతున్న విజయనగరానికి చెందిన క్రీడాకారుడు అజయ్‌బాబు

'సంజీవని' గేమ్‌ఛేంజర్

ఆదివాసీల ఆరోగ్యానికి.. అగ్ర ప్రాధాన్యం

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పక్కా ప్రణాళిక

3 నెలల్లో పీహెచ్‌సీల్లో డ్రోన్ సేవలు

అరకులోయ సభలో సీఎం చంద్రబాబు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - పాడేరు, అరకులోయ: గిరిజనుల ఆరోగ్యం కాపాడంతో పాటు వారిని అన్నివిధాలా అభివృద్ధిలోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆరోగ్య పరంగా, ఆర్థికంగా వారి ఉన్నతికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలకు సంజీవని కార్యక్రమం ద్వారా చెక్ పెడతామన్న నమ్మకం వచ్చిందని అన్నారు. సంజీవని రాష్ట్రానికి, దేశానికి ఒక గేమ్ ఛేంజర్ అవుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ నియోజకవర్గం గన్నెలలో 'సంజీవని' పథకం అమలులో భాగంగా ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం సంజీవని లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించడంతోపాటు ఆరోగ్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. డ్రోన్‌ల ద్వారా రక్త నమూనాల రవాణా విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఇప్పుడే ఏజెన్సీలో ఓ మహిళకు కాళ్లు నొప్పులంటే పరీక్షలు చేసి, కిడ్నీ సమస్యలేమైనా ఉన్నాయా అని గుర్తించడానికి డ్రోన్లు పంపి రక్త నమూనాలు తీసుకొచ్చాం. ఇప్పటికి పీహెచ్‌సీల్లో రక్త నమూనాల సేకరణకు డ్రోన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వచ్చే 3 నెలల్లో (మిగతా 3లో)

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం ఆర్‌కే నగర్‌లో గ్రామస్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాటామంతి

కాఫీ, మిరియాలు ఎగుమతి చేసే స్థాయికి

గత ప్రభుత్వంలో ఏజెన్సీ ఏరియాలో గంజాయిని వాణిజ్య పంటగా మార్చేసి, ఈ ప్రాంతానికే చెడ్డపేరు తెచ్చారు. జె బ్రాండ్‌లు పెట్టి వేల మంది ఆరోగ్యాన్ని పొట్టనపెట్టుకున్నారు. ఈ రోజు గంజాయి కాదు కాఫీ, మిరియాలు, వాణిజ్య పంటలు పండించి ఈ ప్రాంతం నుంచి సేంద్రియ పంటలు ప్రపంచానికి అందిస్తాం. వాణిజ్య పంటలతో ఎక్కువ ఆదాయం వచ్చేలా చేసి గిరిజనుల పేదరికాన్ని నిర్మూలించే బాధ్యత మాది. ఇందులో భాగంగానే లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రధాని మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్, నేను.. ముగ్గురం కలిసి రాష్ట్రం కోసం పనిచేస్తున్నాం. - **చంద్రబాబు**

అడవుల్లో ఉన్నారని ఇష్టానుసారం చేస్తే కుదరదు

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే

అధికారులకు సీఎం క్లాస్ 3లో

నైపుణ్యం సాధిస్తే.. అవకాశాలెన్నో

ఏఐ మన ప్రత్యర్థి కాదు.. సహాయకుడు

- ఉద్యోగాలు పోవు.. చేసే తీరే మారుతుంది
- వాయిస్ ఏఐతో గ్రామీణులకు ప్రభుత్వ సేవలందించొచ్చు
- ఈనాడు ముఖాముఖిలో 'జ్ఞాని ఏఐ' సీఈఓ గణేశ్ గోపాలన్

ఈనాడు వాణిజ్య విభాగం

కృత్రిమ మేధ(ఏఐ) తమ స్థానాన్ని భర్తీ చేస్తుందేమోనని చాలా మంది ఉద్యోగులు భయపడుతున్నారు. మరీ ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఐటీ, కస్టమర్ సర్వీస్ రంగంలోని వారిని ఈ ఆందోళన వెంటాడుతోంది. అయితే ఉద్యోగాలు మాయమైపోవని, వాటి తీరు మారుతుందని జ్ఞాని ఏఐ సీఈఓ గణేశ్ గోపాలన్ అంటున్నారు. అలాగే ఇంజినీరింగ్ విద్యార్థులు ఏఐ గురించి థియరీ చదివితే సరిపోదని, వాస్తవ ప్రపంచంలో ప్రాక్టికల్స్ నేర్చుకోవాలన్నారు. ఇంజినీరింగేతర విద్యార్థులు తమ రంగంలో ఏఐ టూల్స్ ఎలా వాడాలో తెలుసుకుంటేనే ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తాయని 'ఈనాడు'కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సూచించారు.

? ఏఐ ఏజెంట్లు, వాయిస్ ఏఐ వల్ల భారత్‌లో ప్రారంభ స్థాయి ఐటీ, కస్టమర్ సర్వీస్ ఉద్యోగాలు తగ్గుతాయా? లేక కొత్త అవకాశాలు వస్తాయా..

ఏఐని ఉద్యోగాల స్థానంలో వచ్చే ఒక సాంకేతికతగా కాకుండా, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే సాధనంగా చూడాలి. సంస్థల్లో ప్రస్తుతం బ్యాలెన్స్ వివరాలు చెప్పడం, (మిగతా 2లో)

పరుగులు పెట్టించారు.. పనులు చేయించారు

వెలిగొండ సాకారానికి కూటమి సర్కారు పట్టుదల

రెండేళ్లలోనే రూ.2,402 కోట్ల వ్యయం

లోపలి పేజీలో

వరదల కారణంగా నేపాల్‌లోని దేవీఘాట్ గ్రామంలో బురదలో కూరుకుపోయిన భవనాలు

బతికున్నారేమోనని!

నేపాల్ విలయంలో గల్లంతైన వారి కోసం వెతుకులాట

ఆచూకీ దొరకని వారి సంఖ్య 2,400కు చేరిక

అందులో 287 మంది భారతీయులు • 682కు పెరిగిన మృతుల సంఖ్య

4,400 మంది సురక్షితం • వరద ప్రాంతాలకు మళ్లీ వర్షాల హెచ్చరిక 2లో

కళ్లులేవు..

ఇంజినీరింగ్ ఎందుకన్నారు!

కళ్లులేకున్నా... కటిక పేదరికం అడ్డుకున్నా... ఇంజినీరింగ్ చేయాలనుకున్నారాయన. కానీ 'చూపులేనివాడివి ఇంజినీరింగ్ చేయలేవు' అంటూ నిబంధనలు చూపించారు అధికారులు. అయినా హైకోర్టు మెట్లెక్కి మరీ సీటు సాధించి... దేశంలోనే ఇంజినీరింగ్ చేసిన తొలి అంధునిగా నిలిచారు. తిరుగులేని ఐటీ నిపుణుడిగా ఎదిగారు. కాసింత కుదురుకున్నాడని అనుకునేలోగానే క్యాన్సర్ మహమ్మారి దాడి చేసింది. దాన్నీ అధిగమించి నేడు జేపీ మోర్గాన్ అంతర్జాతీయ సంస్థకు చెందిన టెక్నికల్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్నారు జన్ను నాగబాబు.

ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం ఆదివారం అనుబంధంలో...



బిహార్‌లో 'ఫెయిల్' ఉండదిక!

'నైపుణ్య శిక్షణకు అర్హులు'తో భర్తీ లోపలి పేజీలో

ఇదీ సంగతి!

వైకాపాలో సజ్జలే నంబర్ వన్.. జగన్‌ది రెండో స్థానమే

- నాడు రాజ్యాంగేతర శక్తిగా ప్రభుత్వాన్ని.. నేడు వైకాపానూ కబ్జా చేసింది ఆయనే
- 2022 పార్టీ ప్లీనరీలో నాపై దాడి చేసినా జగన్ పట్టించుకోలేదు
- నన్ను ముసలోడు అని పక్కన పెట్టారు
- జగన్‌కు నమ్మకస్థుడిని కాబట్టే ఆయన కేసుల్లో నన్ను ఏ-2ను చేశారు
- సజ్జలపై ఒక్క కేసూ ఎందుకు లేదు?
- జగన్‌కు ఆయన కుటుంబ సభ్యులు దూరమైంది ఈ ప్రబుద్ధుడి వల్లే
- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి లేఖాస్త్రం



ఈనాడు, అమరావతి: వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి.. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నుపోటు పొడుస్తున్నారని వైకాపా మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ మెప్పు పొందడానికి తనను తాను నాస్తికుడిగా, కమ్యూనిస్ట్‌గా చెప్పుకొంటున్న సజ్జల.. వైకాపాకే కాదు, రాష్ట్రానికి కూడా నమ్మకద్రోహేనని ధ్వజమెత్తారు. జగన్‌కు ఆయన కుటుంబ సభ్యులు దూరమైంది ఈ ప్రబుద్ధుడి వల్ల కాదా అని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి శనివారం సజ్జలపై లేఖాస్త్రం సంధించారు. నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ తనపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నందుకే (మిగతా 3లో)

(c) eenadu

దార్శనిక నాయకత్వానికి విలువలే కీలకం

మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలకు మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ పిలుపు

ఈనాడు, బెంగళూరు: మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు కేవలం సంప్రదాయ తరగతులు, పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా.. కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ సాంకేతికతతో వేగంగా మారుతున్న ప్రపంచానికి నాయకులను తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలని మార్గదర్శి చిట్ ఫండ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) శైలజాకిరణ్ పిలుపునిచ్చారు. శనివారం ఆమె బెంగళూరులోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (జిమ్)లో భారతీయ మేనేజ్‌మెంట్ విద్యాలయాల సంఘం (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్-ఏఐఎంఎస్) 37వ వ్యవస్థాపక దినోత్సవంలో 'భవిష్యత్తు మేనేజ్‌మెంట్ విద్య కోసం దార్శనిక నాయకత్వం పాత్ర' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. విద్యా సంస్థలు వాటి నేపథ్యాలు, పూర్వ సాధనలపై ఆధారపడకుండా పెట్టుబడులు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా డిజిటల్ సాంకేతికతలతో సేవలందించే ప్రయత్నం చేయాలన్నారు. మానవ వనరులకు ప్రత్యామ్నాయంగా కాకుండా సేవల్లో నైపుణ్యాలకు సాంకేతికత ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు విలువలు, బాధ్యతలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. వినూత్న ఆలోచనలు, సమస్యల పరిష్కారాలు, విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకునే పారిశ్రామికవేత్తలుగా, జాతి నిర్మాతలుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. దార్శనిక నాయకత్వం వేల మంది ఉద్యోగులతో సేవలు చేయించుకునే హోదా కాదన్నారు. చక్కని నాయకులను తయారు చేస్తూ, భవిష్యత్తు సవాళ్లకు పరిష్కారాలు చూపడమే దేశానికి ఉపయోగపడే నాయకత్వమని అభిప్రాయపడ్డారు.

చిన్నపాటి సమస్యల పరిష్కారానికి వినూత్న వ్యాపార నమూనాలు

దేశంలోని అంకుర (స్టార్టప్) విప్లవం ఎందరో యువకుల లక్ష్య సాధనకు వేదికగా మారిందని శైలజాకిరణ్ అన్నారు. చిన్నచిన్న ఆలోచనలు, చిన్నపాటి సమస్యలకు పరిష్కారాలు చూపుతూ వినూత్న వ్యాపార నమూనాలు సృష్టిస్తున్నారని ప్రశంసించారు. బొగ్గులతో ఇస్త్రీ చేయడం ఆరోగ్యానికి హానికరమని ఆలోచించిన వినీష ఉమాశంకర్ డిజైన్ చేసిన సౌరశక్తి ఆధారిత సంచార ఇస్త్రీ బండిని ఇందుకు ఉదాహరణగా ప్రస్తావించారు. చిన్న వయసులోనే అంకురాలు స్థాపించిన అద్వైత్ ఠాకుర్, అంతరిక్ష ప్రయోగాలు చేసిన ఓంకార్ సింగ్ బాత్రా, శ్యామ్ సంగ్రైల నవ్యాలోచనలు ఔత్సాహికులకు స్ఫూర్తిగా నిలిచాయని విశ్లేషించారు. విలువలు లేని నాయకత్వం, వ్యాపారం స్వల్ప కాలంలోనే కనుమరుగవుతాయని హెచ్చరించారు. నిజాయతీతో విశ్వాసం, విశ్వాసంతో సంబంధాలు.. తద్వారా మెరుగైన జాతి నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. తాజాగా నేపాల్‌లో సంభవించిన వరదల గురించి ప్రస్తావిస్తూ భూమి, పర్యావరణంపై విస్తృత పరిశోధనలతో ఇలాంటి విపత్తులను అరికట్టే వీలుందన్నారు. కేవలం అంతరిక్ష ప్రాజెక్టులకు మిలియన్ డాలర్లను వ్యయం చేయకుండా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని సూచించారు.

మార్గదర్శి చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్‌కు ఆచార్య జే ఫిలిప్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డును అందజేస్తున్న న్యాక్ ఛైర్మన్ ఆచార్య నాగేశ్వరరావు. చిత్రంలో ఏఐఎంఎస్ అధ్యక్షుడు డాక్టర్ పరాగ్ కాల్కర్, జిమ్ అధ్యక్షుడు ఆచార్య అనిల్ జె.ఫిలిప్, ఏఐఎంఎస్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నందగోపాల్, జీఆర్‌జీ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ నందిని రంగస్వామి

సమష్టి సాధన..

మహిళల్లో ఆర్థిక స్వావలంబనకు మార్గంగా రూపుదిద్దుకున్న మార్గదర్శి చిట్ ఫండ్‌ను విజయవంతమైన వ్యాపార సంస్థగా మలచినందుకుగానూ 2026 ఏడాదికి ఆచార్య జే ఫిలిప్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డును శైలజా కిరణ్ ఈ సందర్భంగా అందుకున్నారు. ఎయిమ్స్ అధ్యక్షుడు డాక్టర్ పరాగ్ కాల్కర్, జిమ్ అధ్యక్షుడు ఆచార్య అనిల్ జె.ఫిలిప్, న్యాక్ కమిటీ ఛైర్మన్ ఆచార్య నాగేశ్వరరావు ఈ పురస్కారాన్ని శైలజా కిరణ్‌కు అందించారు. సంస్థ సహోద్యోగులు, కుటుంబ సభ్యులకు ఈ పురస్కారాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటించిన శైలజాకిరణ్.. ఈ సాధన సమష్టి కృషికి ఫలితమన్నారు. 'నేను 30 ఏళ్ల వయసులో కేవలం 12 శాఖలు, రూ.వంద కోట్ల వ్యాపారం నమోదైన రోజున ఈ సంస్థకు ఎండీగా బాధ్యతలు స్వీకరించాను. ఆ సమయంలోనే రూ.వేల కోట్ల వ్యాపారాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నేడు ఆ మైలురాయిని సాధించగలిగాం. వ్యాపారంలో విలువలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలందిస్తున్నాం' అని ఆమె వివరించారు. జీఆర్‌జీ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ నందిని రంగస్వామి కూడా ఉమెన్ లీడర్‌షిప్ పురస్కారం అందుకోగా, దయానంద్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిషా గోయల్‌కు ఏఐఎంఎస్ బెస్ట్ మేనేజ్‌మెంట్ స్కాలర్ పురస్కారం అందజేశారు.

గ్రామాల్లో తాగునీటి వ్యవస్థల పర్యవేక్షణకు 6 దశల్లో కార్యాచరణ

- పథకాల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే
- జేజేఎం 2.0 మార్గదర్శకాల మేరకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థల పర్యవేక్షణకు ఆరు దశల్లో కార్యాచరణ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జలజీవన్ మిషన్ (జేజేఎం) 2.0 మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో తాగునీటి పథకాల వార్షిక నిర్వహణ, మరమ్మతులకు (ఓఅండ్‌ఎం) పంచాయతీల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

■ నీటి వనరుల పరిస్థితి, పైపులైన్లు, పంపులు, శుద్ధికేంద్రాలు, నిల్వ ట్యాంకులు, పంపిణీ వ్యవస్థ, క్లోరినేషన్, నీటి నాణ్యత, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై ఓఅండ్‌ఎం కోసం పంచాయతీలు ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలి. తాగునీటి వ్యవస్థ పనితీరును పరిశీలించడంతో పాటు అత్యవసర పనులకు ప్రాధాన్యమివ్వాలి.

■ గ్రామాల్లో తలసరి రోజూ 55 లీటర్ల రక్షిత నీరు సరఫరా చేసేలా పంచాయతీ అధికారులు బాధ్యత వహించాలి.

■ నీటిలో క్లోరినేషన్ నిరంతరం ఉండేలా చూడాలి. కిట్లతో పరీక్షలు చేసి, వాటి ఫలితాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. గ్రామస్థాయిలో సుజలం శక్తి సభ్యులు, కమ్యూనిటీ వాలంటీర్లకు నీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ ఇవ్వాలి. తాగునీటి పథకాల నిర్వహణకు అవసరమైన నిధులను వివిధ ప్రభుత్వ పథకాల నుంచి సమీకరించాలి.

■ శనివారం నుంచి 90 రోజుల్లోగా ప్రతి గ్రామ పంచాయతీ తొలి వార్షిక ఓఅండ్‌ఎం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ఆమోదించాలి. ఏటా మార్చి 31లోగా తదుపరి ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక రూపొందించాలి.

- మరిన్ని వివరాలు www.eenadu.net లో

సముద్రంపై గాడ్జిల్లా ఎల్‌నినో ప్రభావం

- మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ రమాశంకర్ నాయక్

అల్లవరం, న్యూస్‌టుడే: ప్రస్తుతం బంగాళాఖాతం, హిందూ, అరేబియా సముద్రాల ఉపరితలంపై గాడ్జిల్లా ఎల్‌నినో ప్రభావం ఉందని మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ రమాశంకర్ నాయక్ అన్నారు. దీనివల్ల సముద్రంలో అంతర్లీనంగా సుడిగుండాల ప్రవాహం ఏర్పడి మత్స్యకారుల బోట్లు ప్రమాదాల బారిన పడుతున్నాయని వివరించారు. శనివారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో పర్యటించారు. ఇటీవల సముద్రంలో చిక్కుకుని సురక్షితంగా ఇళ్లకు చేరిన మత్స్యకారుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. నడిసంద్రంలోకి వేట కోసం ఒక్కొక్క బోటులో కాకుండా రెండు అంతకంటే ఎక్కువ బోట్లలో వెళ్లాలని సూచించారు.

- మరిన్ని వివరాలు www.eenadu.net లో

తిరుమల శ్రీవారి దర్శనానికి సేవా మార్గం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు సూచించారు. దీనిని తితిదే వెంటనే ఆచరణలో పెట్టింది. పైలట్ ప్రాజెక్టుగా 'శ్రీవారి వైద్యసేవ'కు జూన్ 5న అంకురార్పణ చేసింది.

దరఖాస్తుల వెల్లువ

■ స్విమ్స్, బర్డ్, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, సెంట్రల్ హాస్పిటల్, అశ్విని హాస్పిటల్, ఆయుర్వేద ఆసుపత్రులతోపాటు గోశాలను వారు ఎంచుకోవచ్చు. స్పెషలిస్ట్ వైద్యులైతే కనీసం 3 రోజులు, ఎంబీబీఎస్ వైద్యులైతే ఏడు రోజులకు స్లాట్ బుక్ చేసుకోవాలి.

■ 3 రోజులు సేవలందించిన స్పెషలిస్ట్ వైద్యులకు శ్రీవారి బ్రేక్ దర్శనం కల్పిస్తారు. 7 రోజులు సేవలందించే ఎంబీబీఎస్ వైద్యులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత దర్శనం అవకాశం ఇస్తారు.

■ ఈ 83 రోజుల్లోనే 723 మంది వైద్యులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోగా, 586 దరఖాస్తులను తితిదే ఆమోదించింది. స్పెషలిస్టులు, ఎంబీబీఎస్, ఆయుర్వేద, పశువైద్యులు కలిపి మొత్తం 109 మంది డాక్టర్లు ఇప్పటికే తమ సేవలను అందించారు.

నమోదు ప్రక్రియ ఇలా..

■ హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్యులు https://ttdevasthanams.ap.gov.in/srivari-seva/instructions ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

■ ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ, లేదా బీవీఎంఎస్/వెటర్నరీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 5 ఏళ్ల క్లినికల్ అనుభవం తప్పనిసరి.

■ వెబ్‌సైట్‌లో 'వైద్యసేవ' ఎంచుకుని, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశాక.. నచ్చిన ఆసుపత్రి, స్లాట్‌ను ఎంచుకోవాలి. తితిదే ఆమోదం తెలిపిన తర్వాత విధుల్లో చేరి రోజుకు 6 గంటల పాటు సేవలు అందించాలి.

మూడు విధాలుగా సేవలు

వైద్యసేవ: శ్రీవారి వైద్యసేవలో రిజిస్టర్ చేసుకున్న నిపుణులు క్లిష్టమైన శస్త్రచికిత్సలూ చేస్తున్నారు. ఉదాహరణకు చెన్నై గ్లోబల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ రజినీకాంత్ స్విమ్స్‌లో తొలిసారి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. అపోలో (బెంగళూరు)కు చెందిన డాక్టర్ కొఠారి ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ పేస్‌మేకర్స్ వేశారు.

విద్యాసేవ: ఎంబీబీఎస్, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్ చదివే వైద్య విద్యార్థులకు పాఠాలు చెప్పొచ్చు.

పరిశోధనా సేవ: జన్యుపరమైన, అత్యాధునిక వైద్య పరిశోధనల్లో భాగస్వాములు అవుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు జెనెటిక్స్ వైద్యులు అధ్యయనం ప్రారంభించారు.

గోవులకు కార్పొరేట్ చికిత్స

నిపుణులైన పశువైద్యులు లేక సతమతమవుతున్న గోశాలకు ఈ సేవ ప్రాణం పోసింది. శింగనమలలోని రీసెర్చ్ స్టేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.పద్మనాభన్, ఎస్వీ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డా.శ్యాంసుందర్, అమెరికా నుంచి వచ్చిన డా.చక్రవర్తిరెడ్డి వంటి వారు ఇక్కడ సేవలందించారు. ఇప్పటి వరకు 24 మంది వైద్యులు సుమారు 3,000 పశువులకు సేవలు అందించారు. సుమారు రూ.1.5 లక్షల విలువైన మందులు, పశుగ్రాసం ఉచితంగా ఇచ్చారు. ఏనుగులకు, గుర్రాలకు కొన్ని క్లిష్టమైన శస్త్రచికిత్సలూ చేశారు.

భవిష్యత్తులో ఈ సేవలూ..

ఈ ప్రాజెక్టును సెప్టెంబర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా భక్తులకు అంకితమిచ్చేలా తితిదే సన్నాహాలు చేస్తోంది. భవిష్యత్తులో శ్రీవారి విద్యాసేవ, ఇంజినీరింగ్ సేవ, రక్షణ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

బతికున్నారేమోనని!

నేపాల్ విలయంలో గల్లంతైన వారి కోసం వెతుకులాట

కాఠ్‌మాండూ: ఆసుపత్రుల దగ్గర పడిగాపులు.. గోడలపై వేసిన పోస్టర్లలో తమవారి కోసం వెతుకులాట.. కుప్పకూలిన భవనాల పక్కన దీనంగా జనం.. బురద, మట్టిలో తమ వస్తువుల కోసం అన్వేషణ.. శిథిలాల మధ్య చనిపోయి పడి ఉన్న జంతువులు.. గల్లంతైన తమవారు తిరిగి రావాలని ప్రార్థనలు. ఇదీ నేపాల్‌లోని ప్రస్తుత స్థితి. బుధవారం వరద ముంచెత్తినప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నా.. గల్లంతైనవారి ఆచూకీ పూర్తిగా లభించడంలేదు. మృతులతో పాటు ఆచూకీ దొరకని వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికీ 2,400 మంది ఎక్కడ ఉన్నారో.. ఏమయ్యారో తెలియడం లేదు. వారిలో 320 మంది విదేశీయులుకాగా... భారతీయులు 287 మంది ఉన్నారు. విపత్తు సంభవించి నాలుగు రోజులు కావడంతో ఆశలు సన్నగిల్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో చిక్కుకున్న దాదాపు 4,400 మందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతానికి తరలించగలిగాయి. అందులో 167 మంది భారతీయులు. మిగిలినవారు చైనా, ఉక్రెయిన్, జర్మనీ, మాల్టా, అమెరికా, తుర్కియే, పోర్చుగల్, రష్యా, స్పెయిన్, స్విట్జర్లాండ్, ఇటలీ, ఒమన్, బెల్జియం, బల్గేరియా దేశాలకు చెందినవారున్నారు. రహదారులు ధ్వంసం కావడంతో చాలా మందిని హెలికాప్టర్ల ద్వారానే తరలిస్తున్నారు.

■ మరోవైపు టిబెట్‌లో 550 మంది ఆచూకీ తెలియడం లేదు. నేపాల్‌లో ఇప్పటిదాకా మృతుల సంఖ్య 675గా తేలగా.. టిబెట్‌లో ఏడుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మొత్తం మృతుల సంఖ్య 682కు చేరుకుంది.

■ వరద దెబ్బతిన్న ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశముందని నేపాల్ వాతావరణశాఖ శనివారం హెచ్చరించింది.

వెతుకులాటలో వేల మంది..

11,000 మంది భద్రతా సిబ్బంది, 5,000 మంది నేపాల్ సైనిక సిబ్బంది సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. భారత్ నుంచి 11 మంది వైద్య సిబ్బంది, టన్నెల్ నిపుణులు నేపాల్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వారు శనివారం త్రిశూలి వద్ద జల విద్యుత్తు ప్రాజెక్టు టన్నెల్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

నేపాల్‌లో వరద ప్రభావిత ప్రాంతం దేవీఘాట్ గ్రామంలో తమ ఇళ్ల నుంచి వస్తువులను తీసుకెళ్తున్న స్థానికులు

■ త్రిశూలి, రసువాల్లోని టన్నెళ్ల నుంచి ఇప్పటిదాకా 191 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

■ 1,706 మందికి వైద్య సాయం అందిస్తున్నారు.

■ విపత్తు సమయంలో భారత్ అందిస్తున్న సాయాన్ని నేపాల్ ప్రశంసించింది. ప్రధాని మోదీ ఎంతో ఉదారంగా వ్యవహరిస్తున్నారని కొనియాడింది.

■ రసువా జల విద్యుత్తు ప్రాజెక్టు నుంచి నలుగురు భారతీయులను శనివారం బయటకు తీసుకొచ్చారు.

మరో మార్గం ద్వారా..

టిబెట్‌లో చిక్కుకున్న 120 మంది భారతీయులను మరో మార్గంద్వారా శనివారం నేపాల్‌కు తరలించారు. మానసరోవర్ యాత్రికులకు గైరాంగ్-నేపాల్ సరిహద్దు ప్రధాన మార్గంగా ఉండేది. వరదలకు అది ధ్వంసం కావడంతో ప్రస్తుతం జాంగ్ము మార్గం ద్వారా తరలించారు.

■ డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జి.సతీశ్ రెడ్డి శనివారం జాంగ్ము మార్గం ద్వారానే నేపాల్ చేరుకున్నారు. జాంగ్మువద్ద వందల బస్సులు, వాహనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆగస్టు 23న ఆయన 31 మందితో కలిసి టిబెట్‌కు వెళ్లారు.

■ గైరాంగ్ నుంచి 1,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వారిలో 555 మంది పర్యాటకులని చైనా అధికార మీడియా వెల్లడించింది.

సువాకోట్ జిల్లా దేవీఘాట్ గ్రామంలో వరదల కారణంగా ధ్వంసమైన తమ ఇంటిని పరిశీలిస్తున్న ఓ కుటుంబం

భారీ సాయం

వరద సహాయక చర్యల కోసం.. నేపాల్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, వ్యక్తుల నుంచి భారీగా విరాళాలొస్తున్నాయి.

■ 87ఏళ్ల రాజీ రాణా అనే దాత 10.98 మిలియన్ నేపాలీ రూపాయలను విరాళంగా అందజేశారు.

■ ఓ ప్రైవేటు సంస్థ 150 మిలియన్లను, మరో సంస్థ 50 మిలియన్లను అందజేసింది.

■ ఇప్పటిదాకా ప్రధాని సహాయ నిధికి 2.295 బిలియన్ నేపాలీ రూపాయలు విరాళాలుగా వచ్చాయి.

97 ఏళ్ల బామ్మ సురక్షితం

కేర్ సెంటర్ నుంచి 97 ఏళ్ల గుణ మాయ బొహరాను నాలుగు గంటలు కష్టపడి సహాయక సిబ్బంది రక్షించారు. ఆసుపత్రిలో ఆమె కోలుకుంటున్నారు. కేర్ సెంటర్‌లో పేరుకుపోయిన బురద నుంచి ఆమెను బయటకు తీసుకొచ్చి ఎక్స్‌కావేటర్ టబ్‌లో తరలిస్తున్న దృశ్యాలు వైరలయ్యాయి. తరలించే సమయంలో ఆమె ఒంటినిండా బురదే ఉంది. ఆమె యోధురాలిలా బయటకు వచ్చారని ఆమె మనవడు దీపక్ బొహరా తెలిపారు. ఆమె కోసం అతడు కాఠ్‌మాండూ నుంచి ఘటనా స్థలికి వెళ్లారు. అయితే మిగిలిన వారు చనిపోవడం తనను కలచివేసిందని దీపక్ తెలిపారు.

గుణ మాయ బొహరాను కాపాడి తరలిస్తున్న సహాయక సిబ్బంది

నైపుణ్యం సాధిస్తే.. అవకాశాలెన్నో

(మొదటి పేజీ తరువాయి)

ఆర్డర్ స్థితి తెలుసుకోవడం, అపాయింట్‌మెంట్ బుక్‌చేయడం వంటి పనులను ఏఐ ఏజెంట్లు చేస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగుల అవసరం పూర్తిగా తొలగిపోదు. మానవ నిర్ణయం, సంక్లిష్ట సమస్యల పరిష్కారం అవసరమైన వాటిపై దృష్టి పెట్టడానికి అవకాశం కలుగుతుంది. సేల్స్ సిబ్బందికి వాయిస్ సంభాషణల ద్వారా శిక్షణ ఇవ్వడం, కస్టమర్‌తో మాట్లాడే సమయంలో బ్రాంచి సిబ్బందికి అవసరమైన సమాచారం అందించడం, గృహ రుణ సర్వీసింగ్ వంటి విభాగాల్లో సిబ్బందికి ఏఐ ద్వారా మార్గనిర్దేశం జరుగుతోంది. దీన్నంతటినీ ఉద్యోగాలను తొలగించడం కంటే వాటి స్వభావాన్ని మార్చే, ఉద్యోగాల తీరు మార్చే ప్రక్రియగా చూడాలి.

? వచ్చే 2-3 ఏళ్లలో భారతీయ కంపెనీలు ఏఐ వినియోగంలో ఎలాంటి కీలక మార్పులు చేయగలవని మీరు భావిస్తున్నారు.

ప్రస్తుతం చాలా కంపెనీల్లో ఏఐ వినియోగం చాట్‌బాట్‌లు, ప్రయోగాత్మక ప్రాజెక్టులకే పరిమితమైంది. వచ్చే 2-3 ఏళ్లలో వాస్తవ వ్యాపార కార్యకలాపాల్లో విస్తృతంగా వినియోగించే దిశగా అడుగులు వేస్తాయి. ముఖ్యంగా మూడు ప్రధాన మార్పులు కనిపిస్తాయి. 1. వాయిస్ ఏఐ కీలక ఇంటర్‌ఫేస్‌గా మారుతుంది. భారత్‌లో పలు భాషలు మాట్లాడే వారున్నారు. ఇంగ్లిషులో టైప్ చేయడంలో ఇబ్బంది పడేవారికి వాయిస్ మరింత సౌకర్యంగా ఉంటుంది. 2. ఏఐ.. విడిగా పనిచేసే బాట్‌లుగా మాత్రమే కాకుండా, సీఆర్‌ఎమ్(కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్), కోర్ బ్యాంకింగ్, ఆసుపత్రుల సమాచార వ్యవస్థలు వంటి సంస్థల మౌలిక సదుపాయాలతో అనుసంధానమవుతోంది. 3. ఏఐ వినియోగంతో పాటు పాలన, గోప్యత, భద్రతకు ప్రాధాన్యం పెరుగుతుంది. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా, ఆరోగ్య రంగాల్లో ఆడిట్ చేయగల, నిబంధనలకు అనుగుణంగా పనిచేసే ఏఐ వ్యవస్థలకు గిరాకీ పెరుగుతుంది.

? భారతీయ భాషల వాయిస్ ఏఐలో మన దేశం ప్రపంచ స్థాయి పోటీ ప్రయోజనాన్ని సాధించగలదా.

అందుకు బలమైన అవకాశం ఉంది. అయితే నిరంతర పెట్టుబడులు, పరిశోధన అవసరం. ప్రపంచంలోని అనేక ఏఐ సంస్థలు ఇప్పటివరకు ఆంగ్లం, ఇతర ఐరోపా భాషలపై దృష్టి పెట్టాయి. భారత్‌లోని భాషా వైవిధ్యం వల్ల సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించాల్సి వస్తుంది. ఇది భారత్‌కు ప్రత్యేక ప్రయోజనాన్ని అందించగలదు. ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాల్లో కూడా మనలాగే పలు భాషలున్నాయి. అక్కడ మన మోడళ్లు పనికొస్తాయి.

? వచ్చే ఐదేళ్లలో ఉద్యోగావకాశాలను నిలబెట్టుకోవడానికి ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎలాంటి నైపుణ్యాలు నేర్చుకోవాలి.

ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం ఏఐని థియరీ వరకే కాకుండా ప్రాక్టికల్‌గా నేర్చుకోవాలి. ఏఐ వ్యవస్థలను ఎలా నిర్మించాలన్నది తెలుసుకోవాలి. రియల్ టైంలో భారీ డేటా మధ్య పనిచేయాలి. అప్పుడే ఏఐ ఏజెంట్ల డిజైనింగ్, టెస్టింగ్ అర్థమవుతుంది. ప్రస్తుత వ్యవస్థ, మౌలిక వసతులకు తగ్గట్లుగా ఏఐని ఎలా అభివృద్ధి చేయాలో తెలుస్తుంది. అన్నిటి కంటే ముఖ్యమైనది భద్రత, డేటా గోప్యత. ఏఐ వ్యవస్థలు భారీ స్థాయిలో వినియోగదారు డేటాను వాడతాయి. కాబట్టి.. నియంత్రణపరమైన తనిఖీలు పెరుగుతాయి. వీటినీ ముందే అర్థం చేసుకోవాలి. ఒక డొమైన్‌లో ప్రత్యేకతను సాధించడం అన్నిటి కంటే ముఖ్యం. అంటే ఏఐ+ ఆరోగ్య సంరక్షణ, ఏఐ+ఫైనాన్స్, ఏఐ+తయారీ.. ఇలా అన్నమాట. జనరిక్ ఏఐ నైపుణ్యాలతో పోలిస్తే ఇలా డొమైన్ ఆధారిత నైపుణ్యాలున్నవారికి ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తుంది. నాన్ ఇంజినీరింగ్ విద్యార్థుల విషయానికొస్తే.. ఏఐ ఫ్లూయెన్సీపై దృష్టి పెట్టాలి. అంటే ఏఐ టూల్స్‌ను తమ రంగంలో సమర్థంగా వినియోగించే సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవాలి.

? తెలుగు భాషను కచ్చితంగా అర్థం చేసుకునే ఏఐని అభివృద్ధి చేయడంలో ఎటువంటి సాంకేతిక సవాళ్లు ఎదురవుతున్నాయి.

తెలుగు వంటి భారతీయ భాషలు ఏఐ పరంగా 'లో రిసోర్స్' భాషలుగా ఉన్నాయి. అంటే మాట్లాడేవారు తక్కువగా ఉన్నారని కాదు, ఇంగ్లిష్‌తో పోలిస్తే శిక్షణకు అవసరమైన నాణ్యమైన, లేబుల్ చేసిన వాయిస్, టెక్స్ట్ డేటా తక్కువగా ఉందని అర్థం. ఇక తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మాండలిక వైవిధ్యం ఎక్కువ. ఒక ప్రాంతానికి చెందిన డేటాతో తయారైన ఏఐ మోడల్ ఇంకో ప్రాంతం వారిని అర్థం చేసుకోలేకపోవచ్చు. ఇంకోటి తెలుగు-ఇంగ్లిషు కలిపి మాట్లాడడం. ఉదాహరణకు 'నాకు లాగిన్ చెయ్యాలంటే ప్రాబ్లమ్ వస్తుంది' వంటి సంభాషణలను ఏఐ సరిగ్గా అర్థం చేసుకోవాలి. కాబట్టి ఆయా ప్రాంతాల భాషలకు సంబంధించిన డేటా, కోడ్-మిక్స్‌డ్ భాషా మోడళ్లు వంటివాటిపై నిరంతర పరీక్షలు అవసరమవుతాయి.

? గ్రామీణ భారత్‌లో బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ సేవలకు వాయిస్ ఏఐ ఎలా ఉపయోగపడుతుందంటారు.

గ్రామీణ భారత దేశంలో డిజిటల్ సేవల వినియోగానికి ఎదురయ్యే ప్రధాన అడ్డంకులు అక్షరాస్యత, ఇంగ్లిష్‌పై ఆధారపడడం. వాయిస్ ఏఐ ఈ రెండింటినీ అధిగమించగలదు. చాలా మంది ప్రజలు టైప్ చేయడం కంటే మాట్లాడడం సౌకర్యవంతంగా భావిస్తారు. మాతృభాషలో సేవలు అందుబాటులోకి వస్తే వాటి వినియోగం మరింత పెరుగుతుంది. స్మార్ట్‌ఫోన్ యాప్‌లకే పరిమితం కాకుండా సాధారణ ఐవీఆర్, ఫీచర్ ఫోన్లకు కూడా వాయిస్ ఏఐ అందుబాటులోకి వస్తే ప్రజలు తమ భాషలో బ్యాంక్ బ్యాలెన్స్ తెలుసుకోవడం, రుణాలు/ప్రభుత్వ పథకాల సమాచారం పొందడం, వైద్యుడి అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవడం, ప్రభుత్వ సేవల తాజా సమాచారం తెలుసుకోవడం వంటివి చేయగలరు. ఆర్థిక లావాదేవీలు, వైద్యం వంటి సున్నిత విషయాల్లో వినియోగదారు ఏఐతో మాట్లాడుతున్నాడనే అంశం స్పష్టంగా తెలియజేయాలి. అవసరమైనపుడు మానవ సిబ్బందికి అనుసంధానించే అవకాశం ఉండాలి. బ్యాంకింగ్, ఆరోగ్య, ప్రభుత్వ సేవలను పొందడంలో ఆంగ్లభాషా పరిజ్ఞానం అడ్డంకిగా ఉన్న ప్రజలకు వాయిస్ ఏఐ ద్వారా సులభంగా సమర్థ సేవలను అందించవచ్చు.

బలపడనున్న అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా తీరాలపై శనివారం అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణశాఖ తెలిపింది. ఇది రానున్న 48 గంటల్లో మరింత బలపడి ఉత్తర ఒడిశా, బెంగాల్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశంఉంది. ఈ సమయంలో సముద్రం అలజడిగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 48 గంటల పాటు ఉత్తర బంగాళాఖాతం, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంట మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

వైకాపా ప్రభుత్వం బీసీలకు మేలు చేసే అనేక సంక్షేమ పథకాలు రద్దు చేసిందని మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించిందని దుయ్యబట్టారు.

గ్రహం అనుగ్రహం

30-8-2026 ఆదివారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్షరుతువు, శ్రావణ మాసం, బహుళ పక్షం

విదియ: ఉ. 9-16 తదుపరి తదియ

ఉత్తరాభాద్ర: తె. 4-30 తదుపరి రేవతి

వర్జ్యం: మ. 2-04 నుంచి 3-40 వరకు

అమృత ఘడియలు: రా. 11-41 నుంచి 1-18 వరకు

దుర్ముహూర్తం: సా. 4-34 నుంచి 5-24 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.14

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.0	26.5
తిరుపతి	38.6	27.5
విశాఖపట్నం	36.2	28.6
అనంతపురం	35.7	25.0
నరసాపురం	35.4	28.2
గుంటూరు	35.0	26.0
విజయవాడ	34.6	28.3
శ్రీకాకుళం	34.0	27.0

Big Update for EM DSC Candidates!
APDSC SGT-EM
OFFLINE COACHING
Classes by experienced Faculties, Daily Tests
FREE STUDY MATERIAL
Hostel Facility Available Batch: 05-09-2026
SRI ANU PUBLICATIONS
MARUTHI NAGAR, VIJAYAWADA
Contact: 9640999794, 7842345555

AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LIMITED (AGICL)
Rayapudi, Amaravati - 522237 (A.P.)

E-PROCUREMENT TENDER NOTICE

S. No.	NIT No. & Name of Work
1.	NIT No. 36/PROC/MAU61/194/2026-HB/2nd Call, Dated: 29-08-2026 Name of Work: "Providing Façade Glazing & Cladding works like Glass, Cladding, Crown, Atrium, Canopy Skylight, Column Cladding, PV Panel & BMU works in Integrated Andhra Pradesh State Secretariat & HoD Offices (GAD Tower) in Amaravati Government Complex, Andhra Pradesh" Est. Cost - Rs.442.00 Crores
2.	NIT No. 37/PROC/MAU61-USI0HB(OTH)/148/2026-HB/2nd Call, Dated:29-08-2026 Name of Work: "Providing Façade Glazing & Cladding works like Glass, Cladding, Crown, Atrium, Canopy Skylight, Column Cladding, PV Panel & BMU works in Integrated Andhra Pradesh State Secretariat & HoD Offices (Tower 3&4) in Amaravati Government Complex, Andhra Pradesh" Est. Cost - Rs.727.00 Crores
3.	NIT No. 38/PROC/MAU61-USI0HB(ITWR)/1/2026-HB/2nd Call, Dated: 29-08-2026 Name of Work: "Providing Façade Glazing & Cladding works like Glass, Cladding, Crown, Atrium, Canopy Skylight, Column Cladding, PV Panel & BMU works in Integrated Andhra Pradesh State Secretariat & HoD Offices (Tower 1&2) in Amaravati Government Complex, Andhra Pradesh" Est. Cost - Rs.909.00 Crores

The bid can be downloaded on AP e-procurement portal from 31.08.2026 to 07.09.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 07.09.2026 up to 15.00 Hrs, Technical bid opening 07.09.2026 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.agicl.org.

Sd/- Chief Engineer (H&B), APCRDA, Amaravati

(c) eenadu

జీఎస్‌ఎల్‌వీ ప్రయోగానికి సన్నాహాలు ముమ్మరం

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట నుంచి జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు ముమ్మరం చేసింది. మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎమ్ఆర్ఆర్), లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ (ఎల్ఏబీ) సమీక్షలను సెప్టెంబరు ఒకటో తేదీన నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. సమీక్షల అనంతరం తదుపరి ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ రాకెట్ ద్వారా అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-05ను సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు.

గ్రూప్-1 పరీక్షలకు ఉచిత శిక్షణ

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించే గ్రూప్-1 పరీక్షల కోసం మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ద్వారా ఈ శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థుల ఎంపికకు రాష్ట్రస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

చెవులకు విందు... మనసుకు మందు!

ఇప్పుడున్న ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి, ఆందోళనతో సతమతమవుతున్నారు. వారు పక్షుల రావాలు, నదీ ప్రవాహాల శబ్దాల ద్వారా ఒత్తిడి తగ్గించుకుని.. ఉల్లాసంగా ఉండటానికి ఉపయోగపడతాయి. ఇలాంటి అహ్లాదకర శబ్దాలకు మనసును కుదుటపరిచే శక్తి ఉంది. కొన్ని ఆరోగ్య సమస్యలనూ తగ్గిస్తాయి. దీన్నే సౌండ్ హీలింగ్ అంటున్నారు. ఇప్పుడా ఆనందాన్ని ఇంట్లోనూ పొందొచ్చు...

...ఏం జరుగుతుంది?

మనం వినే శబ్దాలు మెదడుపై ప్రభావం చూపుతాయి. ట్రాఫిక్ హోరు, యంత్రాల చప్పుళ్లు ఒత్తిడిని పెంచితే.. ప్రకృతిసిద్ధమైన నాదాలు, సంప్రదాయ వాద్యాల ధ్వనులతో మెదడులో డోపమైన్, సెరోటోనిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. గుండె వేగాన్ని తగ్గించి, రక్తపోటును అదుపుచేసి ప్రశాంతత కలిగిస్తాయి.

ఏ స్థాయి ఒత్తిడి ? ఎలాంటి శబ్దం

సాధారణ ఒత్తిడి: పనిలో ఏకాగ్రత కుదరకపోవడం, చుట్టూ ఉండే చిన్నచిన్న శబ్దాలకు చికాకు కలగడం.

పరిష్కారం: (వైట్ నాయిస్) స్థిరంగా సాగే ఫ్యాన్ చప్పుడు, ఏసీ శబ్దం వంటివి పరిసరాల్లోని అనవసర రొదను కమ్మేస్తాయి. ఒకే అంశంపై దృష్టి కేంద్రీకరించేలా చేసి, పని సామర్థ్యాన్ని పెంచుతాయి.

మధ్యస్థ ఒత్తిడి: రోజంతా పనిచేసి అలసిపోవడం, చిరాకు, రాత్రుళ్లు త్వరగా నిద్ర పట్టకపోవడం.

పరిష్కారం: (పింక్ నాయిస్) ప్రకృతి శబ్దాలు, వాన చప్పుడు, ఆకుల కదలికలు, పక్షుల కూతలు, సముద్ర అలల ఘోష వంటివి గుండె వేగాన్ని తగ్గిస్తాయి. మెదడును హాయిగా గాఢనిద్రకు సిద్ధం చేస్తాయి.

తీవ్రమైన ఒత్తిడి: భవిష్యత్తుపై విపరీతమైన ఆందోళన, అదుపులేని ఆలోచనలు.

పరిష్కారం: (బ్రౌన్ నాయిస్) గంభీరంగా సాగే జలపాతం హోరు, ఉరుముల శబ్దం వంటివి మదిలోని ఆందోళనను తగ్గిస్తాయి. హెడ్‌ఫోన్స్‌తో బైనరల్ బీట్స్ వింటే మెదడును ధ్యాన స్థితికి తీసుకెళ్తాయి.

ప్రాచీన వాయిద్యాలు.. అద్భుత అస్త్రాలు

ప్రకృతి శబ్దాలతో పాటు మన సంప్రదాయ వాయిద్యాలకు శరీరంలోని చక్రాలను ఉత్తేజపరిచే, మానసిక స్థితిని మార్చే అద్భుత శక్తి ఉంది.

కైలాస నాదం: శివతత్వానికి, అంతర్గత శాంతికి ప్రతీక. ఇందులో గంభీరమైన, లయబద్ధమైన ధ్వనులు మెదడులోని అనవసర ఆలోచనల్ని ఆపేస్తాయి. తీవ్ర ఒత్తిడితో సతమతమయ్యే వారిని ప్రశాంతపరుస్తాయి.

చౌగడ: ప్రాచీన ఆలయాలలో, ఉత్సవాలలో వాడే ఈ చర్మ వాయిద్యం శరీరంలో సానుకూల ప్రకంపనలు పుట్టిస్తుంది. కుంగుబాటుతో వచ్చే బద్ధకం, మానసిక అలజడిని దూరం చేసి నూతనోత్సాహాన్ని నింపుతుంది. కర్ణాటకలోని గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయంలో ఈ తరహా వాద్యం వాయిస్తారు.

టిబెటన్ సింగింగ్ బౌల్స్: మిశ్రమ లోహాలతో చేసే గిన్నెలను ప్రత్యేకమైన కర్రతో రుద్దినప్పుడు 'ఓం'కారపు అనునాదం వస్తుంది. ఈ తరంగాలు తీవ్ర ఆందోళన, మైగ్రేన్ నుంచి ఉపశమనం ఇస్తాయి.

ఇంట్లో ఇలా..

- ప్లేస్టోర్‌లో 'రైన్ రైన్, అట్మాస్పియర్, వైట్ నాయిస్' వంటి ఉచిత యాప్స్ ఉన్నాయి.
- యూట్యూబ్‌లో 'టిబెటన్ సింగింగ్ బౌల్ మెడిటేషన్, కైలాస నాదం రిలాక్సింగ్ మ్యూజిక్, బ్రౌన్ నాయిస్ ఫర్ యాంగ్జైటీ' అని వెతికితే అద్భుతమైన ఆడియోలు వస్తాయి.
- వీలైతే ఇంట్లో చిన్న టిబెటన్ సింగింగ్ బౌల్ లేదా ఇండోర్ వాటర్ ఫౌంటెన్ ఉంచుకుంటే రోజంతా ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది.
- రోజంతా ఆఫీసు పనులు, ఒత్తిళ్లతో అలసిపోయినప్పుడు కనీసం 15-20 నిమిషాలు ఇలాంటి శబ్దాలు, సంగీతం వినడం అలవాటు చేసుకోండి.

జాగ్రత్తలు

- శబ్దాల పరిమితి ఎప్పుడూ 60 డెసిబెల్స్ దాటకూడదు.
- బైనరల్ బీట్స్ వినేందుకు నాణ్యమైన హెడ్‌ఫోన్స్ వాడాలి. మిగిలిన శబ్దాలను నేరుగా స్పీకర్ల ద్వారా వినొచ్చు.
- రోజుకు 20-30 నిమిషాలే వినాలి. గంటల తరబడి వింటే చెవులు, మెదడుపై భారం పడుతుంది.
- హోరెత్తించే శబ్దాలు వినే సమయంలో డ్రైవింగ్, యంత్రాలు నడపడం వంటివి చేయకూడదు.
- తీవ్రమైన మానసిక సమస్యలున్నవారు నిపుణుల సమక్షంలోనే ఈ థెరపీ తీసుకోవాలి.

- ఈనాడు అనంతపురం

తెలుగు భాషా పురస్కార గ్రహీతలతో మంత్రి కందుల దుర్గేష్

తెలుగు పరిరక్షకులకు సముచిత గుర్తింపు

- నంది నాటకోత్సవాలపై వారంలో కీలక ప్రకటన
- గిడుగు జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్
- తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ సాంస్కృతికం: తెలుగు భాష పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని గుర్తించి, ఘనంగా సత్కరిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏటా భాషా, ఉగాది పురస్కారాలను క్రమం తప్పకుండా అందజేస్తామని వెల్లడించారు. నంది నాటకోత్సవాలను ఏడాదిలోపే ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, దీనిపై మరో వారంలో కీలక ప్రకటన చేస్తామని తెలిపారు. ఏపీ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి వేడుకలు విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో శనివారం నిర్వహించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రాంధిక భాషగా ఉన్న తెలుగును ప్రజల వాడుకలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు కృషితోనే వ్యవహారిక భాషా ఉద్యమం బలపడిందన్నారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వును తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రతి జిల్లాలో వ్యవహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం ఛైర్మన్ పూల త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు. గిడుగు రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.

19 మందికి పురస్కారాలు

తెలుగు భాషా పురస్కారాల(2026)ను 19 మంది సాహితీ ప్రముఖులకు మంత్రి అందజేశారు. ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహూకరించారు. జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బి.వెంకటరమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్వీ రాఘవేంద్రరావు, పి.విజయ్‌కుమార్, బి.మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణుగోపాలరావు, జంధ్యాల శరత్‌బాబు, కోయి కోటేశ్వరరావు, కేవీఎల్ఎన్ శర్మ, ఎం.రామకృష్ణ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతిలతో పాటు వీవీఐటీయూ పుస్తక ప్రచురణ సంస్థకు ఈ పురస్కారాలు అందజేశారు.

'సంజీవని' గేమ్‌ఛేంజర్

(మొదటి పేజీ తరువాయి)

అన్ని పీహెచ్‌సీల్లో డ్రోన్లు అందుబాటులో ఉంచి అన్ని పరీక్షలు చేస్తాం. మామూలు ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో ఉండే మీ ఆరోగ్యం మెరుగ్గా చేసే బాధ్యత నాది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్‌పోర్టుకు పెట్టి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం. పీహెచ్‌సీలు, వైద్య కళాశాల దత్తత తీసుకోమంటే అరకు (పెదలబుడు పంచాయతీ) గ్రామాన్ని తీసుకున్నా. అదీ నా కమిట్‌మెంట్.

ఆరోగ్య రథాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

గన్నెల పీహెచ్‌సీ ఆవరణలో డ్రోన్ వద్ద సీఎం

మౌలిక వసతుల అభివృద్ధి

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిర్దిష్ట విధానాలతో మీ ముందుకు వస్తున్నాం. మౌలిక వసతులు కల్పించడం అభివృద్ధి మొదటి సూత్రం. అడవితల్లి బాట పేరుతో రూ.వెయ్యి కోట్లతో 905 కి.మీ. రోడ్లు నిర్మించాం. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేస్తాం. ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తాం. 1.6 లక్షల ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ఉచితంగా ఏర్పాటు చేస్తాం. రూఫ్ టాప్ అవకాశం లేకపోతే కామన్ ఏరియాలో పెట్టి, ఆ గ్రామంలో అందరికీ ఉచితంగా సౌర విద్యుత్తు అందిస్తాం. సోలార్ స్టవ్ పెట్టి విద్యుత్తుతో వంట చేసుకోండి. అవసరమైతే మూడు సిలిండర్ల డబ్బులు మీ ఖాతాల్లో జమ చేస్తాం. సెల్ టవర్ల సంఖ్య పెంచి, ఫోన్ ద్వారానే ప్రభుత్వ సేవలు పొందేలా చేస్తాం. పర్యాటకం అభివృద్ధి చేస్తే అరకుకు మించిన ప్రదేశం ఇంకోటి లేదు. కశ్మీర్, ఊటీ, కొడైకెనాల్‌ను తలపించే అరకు, పాడేరు, లంబసింగి మనకు ఉన్నాయి. గిరిజనుల్లో నైపుణ్యం పెరగడానికి నీట్, ఐఐటీకి ప్రత్యేక శిక్షణ ఇవ్వగా, 60 మంది సీట్లు సాధించారు. రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిద్ధం చేస్తున్నాం.

డీఎస్సీపై ఏడాది తర్వాత ఆరోపణలు

గిరిజన ప్రాంతాల్లో ఉండే ఉద్యోగాలన్నీ గిరిజనులకు దక్కాలనే జీవో నంబరు 3 తెచ్చాం. గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టుకు వెళ్లడం, సరిగా వాదించకపోవడంతో రద్దు చేసే పరిస్థితి వచ్చింది. మళ్లీ కోర్టుకు వెళ్లి గిరిజనులకు న్యాయం జరిగేలా, అందరికీ ఆమోదయోగ్యంగా విధానం తీసుకొస్తాం.

- గత ప్రభుత్వంలో దేవాలయాలపై దాడులు చేశారు. బలవంతపు మత మార్పిళ్లు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు బయటకొచ్చి.. తనను మతం మార్చాలని ఒత్తిడి తెచ్చారని, ఇంట్లో పూజ చేసుకోలేని పరిస్థితి ఉందని వాపోయింది. ఆ పార్టీలో ఉండాలంటే మతం కొలబద్ధగా పెట్టే పరిస్థితికి వచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని గొడ్డలి పార్టీ నేత కొత్త రాగాలు తీస్తున్నారు. ఎక్కడా ఏకగ్రీవం కాకూడదని మాట్లాడుతున్నారు. వారి పాలనలో మాత్రం ఏకగ్రీవాలు కావాలని మాట్లాడారు.

ఏజెన్సీలో వాగులపై చెక్‌డ్యాంలు

- ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులొచ్చాయి. దీనికి ప్రత్యామ్నాయ పంటలు ఆలోచిస్తున్నాం. మార్కాపురంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేస్తున్నాం. విశాఖ, అనకాపల్లికి వచ్చే నెల 2న గోదావరి నీళ్లు తెస్తున్నాం. ఏజెన్సీ ఏరియాల్లో వాగులపై చెక్ డ్యాంలు కట్టి చెరువులు నింపుతాం.
- గిరిజన ప్రాంతాల్లో జనాభా తగ్గిపోతోంది. సంతానమే నిజమైన సంపదని గుర్తించాలి.
- నా శరీరానికి ఎంత అవసరమో అంతే తింటా. దీని వల్ల నేను అనారోగ్యం బారిన పడటం లేదు. ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ తీసుకోవాలి" అని సూచించారు.

అడవుల్లో ఉన్నారని ఇష్టానుసారం చేస్తే కుదరదు

- ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే
- అధికారులకు సీఎం క్లాస్

ఈనాడు, ఈనాడు డిజిటల్-పాడేరు, న్యూస్‌టుడే-అరకులోయ: ఇక్కడి ప్రజలు అడవుల్లో ఉంటున్నారు కదా అని ఇష్టానుసారం చేస్తామంటే కుదరదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను హెచ్చరించారు. సంజీవని కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వివిధ శాఖల పనితీరుపై అధికారులతో మాట్లాడారు. 'పింఛను ఎక్కడ ఇస్తున్నారు అనేది టెక్నాలజీ ద్వారా తెలుసుకుంటున్నా. లబ్ధిదారులను డబ్బులు అడిగారా? మర్యాదగా మాట్లాడారా? అనేదీ పర్యవేక్షిస్తున్నా. ఆర్టీసీ బస్సులు, పీహెచ్‌సీల్లో సేవలు, వైద్యుల ప్రవర్తన ఇలా 55 సేవలు పరిశీలిస్తున్నా. గిరిజనులకు మెరుగైన సేవలందించాలి. మనం పెత్తందారులం కాదు.. ప్రజల సేవకులం. ఉద్యోగులు, రాజకీయ నాయకులు, యంత్రాంగం పనితీరు 80 శాతం సంతృప్త స్థాయికి వెళ్లాలి' అని సూచించారు. దేన్నీ తమాషాగా తీసుకోవద్దని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్, రవాణా, ఆర్టీసీ సర్వీసులు, పీహెచ్‌సీ సేవలు, గంజాయి కంట్రోల్, ఎకో టూరిజంపై కొంత సంతృప్తి వ్యక్తం చేయగా, మిగిలిన శాఖల పనితీరుపై సీఎం క్లాస్ తీసుకున్నారు.

సీమ వారసత్వాన్ని ఆర్థికాభివృద్ధికి అనుసంధానించాలి

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, న్యూస్‌టుడే-తిరుపతి: 'మన దేశ సంస్కృతి, వారసత్వం, చారిత్రక ప్రాంతాలను ఆసరాగా చేసుకుని ఇప్పుడు అభివృద్ధి జరుగుతోంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో ఉజ్జయిని కారిడార్ ద్వారా అక్కడి స్థానికుల ఆదాయం 589 శాతం పెరిగింది. రాష్ట్రంలోనూ ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అందుకు అనుగుణంగా సీమ సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థికాభివృద్ధికి అనుసంధానించాలి' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో శనివారం సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రైజింగ్ రాయలసీమ-కల్చరల్ ఎకానమీ' సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఏడు వింతల గురించి అందరూ గొప్పగా చెబుతుంటారని, అంతకుమించిన అద్భుతాలు ఏపీలో.. ప్రధానంగా రాయలసీమలో ఉన్నాయని అన్నారు. వీటిని మనం సద్వినియోగం చేసుకుని పెద్దఎత్తున యాత్రికులు, పర్యాటకులను రప్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాయలసీమలో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల ద్వారా కేవలం 1.80 శాతమే ఆదాయం వస్తోందని, అది పొరుగు రాష్ట్రాల్లో 10 శాతంగా ఉందని తెలిపారు. మాజీ సీఎస్, తితిదే పూర్వ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు, కేంద్ర పురావస్తుశాఖ శాసనాల అధ్యయనం డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, ఎస్వీయూ వీసీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి క్యాన్సర్‌కు సురక్షితంగా 'కీమో థెరపీ'

ఎల్వీపీఈఐ, బిట్స్ పిలానీ హైదరాబాద్ అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: పిల్లల్లో వచ్చే అరుదైన కంటి క్యాన్సర్ రెటినో బ్లాస్టోమా చికిత్సకు సంబంధించి సురక్షితమైన, వినూత్నమైన ఔషధ ప్రయోగంపై జరిపిన అధ్యయనం విజయవంతమైంది. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, బిట్స్ పిలానీ హైదరాబాద్ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. మైక్రో నీడిల్ స్కెర్లల్ ప్యాచ్ ద్వారా క్యాన్సర్ నిరోధక మందును కంటికి నేరుగా అందించవచ్చని ఈ పరిశోధన నిరూపించింది. ఈ పరిశోధనాత్మక కథనం ప్రముఖ ఆప్తాల్మాలజీ సైన్స్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమైంది. రెటినో బ్లాస్టోమా అనేది సాధారణంగా ఐదేళ్లలోపు పిల్లల్లో వచ్చే తీవ్రమైన కంటి క్యాన్సర్. ప్రస్తుతం దీనికి నరాల ద్వారా కీమోథెరపీ అందిస్తున్నారు. దీంతో శరీరమంతా ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇంజక్షన్లను నేరుగా కంటిలోకి ఇస్తుండటంతో రక్తం గడ్డకట్టడం, కంటి కణజాలం దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. తాజాగా పరిశోధకులు సోడియం హైల్యూరోనేట్ అనే సహజ సిద్ధమైన బయోపాలిమర్‌తో కూడిన 90 సూక్ష్మ సూదులు(మైక్రో నీడిల్స్) ఉన్న ఒక చిన్న ప్యాచ్‌ను తయారు చేసి అందులో కీమోథెరపీ మందును అమర్చారు. ఈ విధానంలో మందు ప్రభావం కంటిలోనే ఎక్కువగా ఉండి, రక్తంలో చాలా తక్కువగా కలవడంతో శరీరంలో ఇతర భాగాలకు ఎలాంటి హాని ఉండదని గుర్తించినట్లు ఈ పరిశోధన ప్రధాన రచయిత, ఎల్వీపీఈఐ వైద్య నిపుణులు డాక్టర్ విశాల్ రాహుల్ తెలిపారు.

పుష్కరిణిలో కాళికాదేవి విగ్రహం లభ్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శిథిలావస్థకు చేరిన పుష్కరిణిని శుభ్రం చేస్తుండగా పురాతన విగ్రహం బయటపడిన ఘటన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలో చోటుచేసుకుంది. స్థానిక కొత్తపేటలోని స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న రాయలకాలం నాటి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని పుష్కరిణి నిర్వహణ లేక చెట్లు, మట్టిదిబ్బలతో శిథిలావస్థకు చేరింది. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో స్థానికులు వికసిత్ భారత్-గ్రామీణ ఉపాధి పథకం కింద ఇక్కడ శుద్ధి పనులు చేపట్టారు. శనివారం పుష్కరిణిలోని పూడిక మట్టి తొలగిస్తుండగా ఉగ్రరూపంలో దశ ఆయుధాలు చేతపట్టుకుని ఉన్న కాళికాదేవి పంచలోహ విగ్రహం లభ్యమైంది. ఈ విగ్రహం ఏ కాలం నాటిదో తెలియట్లేదని, పురావస్తుశాఖ అధికారులు పరిశీలించాల్సి ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతానికి విగ్రహాన్ని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భద్రపరిచారు.

ఉన్నతస్థాయికి చేర్చే లక్షణాలు

మన జీవితాన్ని ఉన్నత స్థాయికి చేర్చే లక్షణాలు..
✦ మన చేతుల్లో ఉన్న విషయాలను చక్కదిద్దుకోవాలి.
✦ మన చేతుల్లో లేని అంశాలపై ఎక్కువ ఆలోచించకూడదు.
✦ క్లిష్ట పరిస్థితులపైనా ఓపికతో స్పందించాలి
✦ ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి
✦ మీ మానసిక ప్రశాంతతను మీరే కాపాడుకోవాలి

– సోను, టెక్నోక్రాట్

వైకాపాలో సజ్జలే నంబర్ వన్.. జగన్‌ది రెండో స్థానమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ బహిరంగ లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. లేఖలో ఇంకా ఏం రాశారంటే..

నేనా నమ్మక ద్రోహిని?

'నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ ఛార్జిషీట్‌లో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌కు నమ్మకస్తుడిని అనే ఒకేఒక్క కారణంగా జగన్‌తో పాటు ప్రతి ఛార్జిషీట్‌లోనూ నన్ను ఎ-2గా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు జైల్లో పెట్టారు. నమ్మక ద్రోహం నా రక్తంలో ఉంటే, అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని. 2024 ఎన్నికల తర్వాత కూడా నాకు సంబంధంలేని మద్యం కుంభకోణం కేసులో నన్ను ఎ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా చేర్చారు. ఈ రెండున్నరేళ్ల తెదేపా పాలనలో నాటి సకల శాఖల మంత్రి(సజ్జల) పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, ఆయనకు తెలియకుండా తెదేపాతో కలిసి ఎలా పని చేయాలో, ఏ కేసులూ లేకుండా ఎలా చేసుకోవాలో అక్కడ (వైకాపాలో) ఉన్న కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. నేను ఏనాడూ అలాంటి నమ్మక ద్రోహం పనులు చేయలేదు' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

జగన్‌కు.. నేతలకు మధ్య గోడ కట్టలేదా?

'2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శ్రుతి మించింది? పార్టీకి నా సేవలు ఏంటి, సజ్జల ద్రోహం ఏంటి? అప్పుడు పరిపాలన జగనే చేశారా? సకల శాఖల మంత్రిగా, ఒక రాజ్యాంగేతర శక్తిగా సజ్జల తన ముఠాతో చేసిన పాలనలో జగన్‌ను ఎవరూ కలవకుండా, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్ లేకుండా గోడ కట్టింది ఎవరు? ఈ సజ్జల కాదా? వైఎస్ కుటుంబం కోసం 40 ఏళ్లు అత్యంత నమ్మకస్తుడిగా నేను పనిచేస్తే.. నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించింది ఎవరు? నన్ను పీఎంఓలో, దిల్లీలో, పార్టీలో అవమానించి.. క్రమంగా తగ్గించింది ఎవరు? పొమ్మనలేక పొగ పెట్టింది ఎవరు?' అని సాయిరెడ్డి ప్రశ్నలు సంధించారు.

ఆత్మగౌరవాన్ని చంపుకొని సజ్జల కింద పనిచేయాలా?

'నేను, పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, అందరం పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలుగా పని చేయాలని. సజ్జల మాత్రం పార్టీ రాష్ట్ర సమన్వయకర్తగా మమ్మల్ని పర్యవేక్షిస్తారని, మేమంతా ఆయనకు రిపోర్ట్ చేయాలంటూ జగన్ ఆదేశాలిచ్చారు. అవి మిగతా నాయకులకు ఆమోదయోగ్యమేనేమో నాకు తెలియదు. నాకు మాత్రం కాదు. అందుకే నా ఆత్మగౌరవాన్ని చంపుకొని పని చేయలేక 4 ఏళ్ల రాజ్యసభ పదవీ కాలాన్ని వదులుకొని, వైకాపా గుర్తుపై ఎన్నికైనందుకు నైతికతను పాటిస్తూ రాజీనామా చేశా. కార్యకర్తలు, నాయకులు, పార్టీ కోసం పనిచేసేవారు, ఈ సజ్జల కింద పని చేయాలా? ఇది జగన్‌ను నమ్మి పని చేద్దామని పార్టీలో ఉన్న వారికి పట్టిన ఖర్మ కాదా? జగన్‌ను నమ్మి పని చేసే సీనియర్లు, నాయకులు, కార్యకర్తలు 2029లో మరోసారి పార్టీ ఓడిపోతే సజ్జలని తిట్టుకుంటూ రాజకీయాల నుంచి రిటైర్ అయిపోవాల్సిందేనా?' అని విజయసాయి ప్రశ్నించారు.

74 అవమానాలు..

'2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో నాటి సకల శాఖ మంత్రి నాపైన భౌతిక దాడి చేస్తే జగన్‌కు తెలిసి కూడా ప్రేక్షక పాత్ర వహించారు. అక్కడున్న పార్టీ నాయకులందరూ ఈ విషయాన్ని చూశారు. జగన్ పార్టీలో పెట్టుకున్న రెండు అంచెల వ్యవస్థలో.. అనేక విషయాల్లో నా ఆత్మాభిమానం మీద దెబ్బ కొడుతుంటే తట్టుకోలేకపోయాను. ఇవన్నీ తెలిసి కూడా, అప్పటికే అతడి (సజ్జలనుద్దేశించి) చేతిలో బందీ అయిపోయిన జగన్, నన్ను పూర్తిగా పక్కన పెట్టేందుకు నిర్ణయించుకున్నారు. 2022లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, సమన్వయకర్తల సమావేశంలో 'సాయన్న వయసు అయిపోయింది, ముసలోడు అయిపోయాడు' అంటూ మాట్లాడారు. పార్టీ అనుబంధ సంఘాల ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి నన్ను తప్పించారు. తర్వాత గుంటూరు నుంచి తిరుపతి జిల్లా వరకు ఉన్న ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి, పార్టీ కోర్ కమిటీ నుంచి తొలగించారు. ఇలాంటి అవమానాలు మొత్తం 74 ఉన్నాయి. అవమానాలకు గురైనా, కడుపులోనే దాచుకున్న విషయాలు అనేకం. నేను నమ్మకస్తుడినే అయినా నన్ను ఇలా టార్గెట్ చేయించటంలో కోటరీ విజయవంతమైంది' అని పేర్కొన్నారు.

వైకాపా బాస్ సజ్జలే!

'2020 వరకు జగన్ దృష్టిలో నా మాటకు ఎంతో విలువ ఉండేది. అదే కోటరీ కడుపు మంటకు కారణమైంది. నేను ఎప్పుడూ కోటరీలో లేను. జగన్ ఆదేశాల మేరకు నేను దిల్లీలో పని చేయటంలో బిజీగా ఉంటే, సకల శాఖల మంత్రి జగన్‌తోనే ఉండి నన్ను పడగొట్టే కార్యక్రమంలో బిజీగా ఉండేవారు. ఇప్పుడు పార్టీ మారటానికి సిద్ధంగా ఉన్న ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడితో కలిసి ఈ కోటరీ నాయకుడే 2020 నుంచి జగన్‌కు నా మీద విపరీతంగా చాడీలు చెప్పించారు. నన్ను ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించడానికి కారణమయ్యారు. ఇప్పుడు వైకాపాలో సజ్జలనే నెంబర్ వన్.. జగన్ నెంబర్ 2. ఆ పార్టీ గెలుస్తుందా? ఓడుతుందా అన్నది ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారు. కానీ, నిరంతరం కొత్త నంబర్ వన్ ఆజ్ఞలకు తలవంచి ఇప్పుడున్న సీనియర్ల మాదిరిగా నేను సర్దుకుపోలేను. అతనికి నమస్కారాలు, సాష్టాంగ దండాలు పెట్టలేను. ఇక అక్కడ ఉండలేని పరిస్థితి వచ్చింది. 2024 ఎన్నికల తర్వాత, ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. అందువల్లే పార్టీకి, నా రాజ్యసభ పదవికి రాజీనామా చేశాను. ఇప్పుడు వేరే పార్టీ పెడుతున్నా' అని విజయసాయి ప్రకటించారు.

జగన్‌కు నమ్మక ద్రోహం చేయను

'నేను జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు, చేయను. ఈ రెండేళ్లలో ఆయనపై ఒక్క మాటా మాట్లాడలేదు. కోటరీ వల్ల నాకు జరిగిన అవమానాల కారణంగా బయటకు వచ్చానని పదేపదే చెప్పాను. అయినా అదే కోటరీ వారంతా ఈ రోజు నేను పార్టీ పెడతానంటే విమర్శిస్తున్నారు. నేను నేరుగా గెలిచేందుకే ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం చేస్తా. అంతేకానీ అప్పట్లో ప్రభుత్వాన్ని, ఇప్పుడు పార్టీని కబ్జా చేసి, జగన్‌ను రోజూ మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం నాకు చేత కాదు. విజయసాయిరెడ్డిగా ఇది నా మాట. పార్టీలో ఉండి, ఎవరు కోవర్ట్‌గా పని చేస్తున్నారో, ఎవరు నమ్మక ద్రోహం చేస్తున్నారో వైకాపా కార్యకర్తలు, జగన్ అభిమానులు ఆలోచించుకోవాలి. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు వెల్లడిస్తా' అని లేఖ ముగించారు.

CR RAO ADVANCED INSTITUTE OF MATHEMATICS, STATISTICS AND COMPUTER SCIENCE (AIMSCS)
University of Hyderabad Campus, Hyderabad - 500046.
In collaboration with
JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY, HYDERABAD (JNTUH)
SPOT ADMISSIONS NOTIFICATION
SPOT ADMISSIONS for INTERMEDIATE qualified candidates from all over India, for leftover seats in the following AICTE Approved B.Tech Courses, as per the MoU with JNTUH - Ph : 7331155319.
1. Computer Science and Engineering (Data Science)
2. Computer Science and Engineering
3. Computer Science and Engineering (AI & ML)
4. Computer Science and Applied Mathematics
5. Computer Science and Engineering (Networks)
Admissions based on Intermediate or equivalent qualification with 50% and above in MPC Group subjects
For further details visit: https://crraoaimscs.res.in/btech/spot-admissions-2026.php
Sd/- DIRECTOR CR Rao AIMSCS

గురి పెడితే.. గెలుపు ఖాయం!
ఈనాడు ప్రతిభ
Latest Job Notifications
APPLY NOW
ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు
19,597
▸ ఎస్‌బీఐ ▸ ఐఓబీ
▸ ఆర్ఆర్‌బీ ▸ ఐఓసీఎల్ ▸ ఏఏఐ
▸ సీఏపీఎఫ్ ▸ యూపీఎస్సీ ▸ మరెన్నో
https://pratibha.eenadu.net https://eenadupratibha.net

(c) eenadu

ఈనాడు

కలతలు రేపే కలయికలు...!

కరిగిపోతుంది, మరిగిపోతుంది, విరిగిపోతుంది, పొంగిపోతుంది, కుంగిపోతుంది- చిత్రమైన ఆ మనసు ఎక్కడుంటుందో, ఎలా ఉంటుందో మాత్రం మనిషికి తెలియదు. 'ఉంది' అంటుంది ఐతరేయ బ్రాహ్మణం! శరీరం కన్నా భిన్నమది. అపూర్వమైనది. ప్రజాపతి దాన్ని మనిషిలోనే నిక్షిప్తం చేశాడంది. అందులోంచే పుట్టుకొచ్చే మాయదారి ప్రేమది మరోరకం దాపరికం. ఎప్పుడు ఎవరిపై ఎందుకు పుడుతుందో తెలియదు. ఉన్నట్టుండి మనసులోకి చొరబడుతుంది. వయసును చెరబడుతుంది. కాలాన్ని మర్చిపోయేలా చేస్తుంది. దేహభాషలో మార్పులు తెస్తుంది. 'నీయందు నా చిత్తము అనవరతము నచ్చి యున్నది నీ ఆన! నాన (సంకోచము)లేదు' అంటూ రుక్మిణి వంటి అమ్మాయి కృష్ణుడికి కబురెట్టిందంటే- ప్రేమ ప్రభావ తీవ్రతను ఊహించుకోవచ్చు. 'ఇటువంటి నీ మాట, నీదు పాట, నీ వలపు, చూపు- దొరకునే బహుతపంబులు గావించి బడయకున్న' అని రావణుడంతటి తపశ్శాలి- రంభను చూడగానే తెగ ఇదయ్యాడు. పురాణకాలం నాటి ముచ్చటలవి. 'వెలిగించవే చిన్ని వలపు దీపం... ఎందుకే నామీద అంత కోపం?' వంటి భావకవిత్వాలు వింటూ గర్వంతోను, లజ్జగాను చిరునవ్వును అదిమిపెట్టడం ఇప్పటి గడుసుదనం!

'ప్రేమను కోరింది నా దేహం కాదు- నా ఆత్మ! వేడి కాదది- జీవితాన్ని వెలిగించే విద్యుచ్ఛక్తి' అంటుంది చలం నాయిక శశిరేఖ. అలాంటి ప్రేమ అమృతత్వానికి దారితీస్తుంది. మౌనానికి నాదాన్నిస్తుంది. భావానికి దృశ్యాన్నిస్తుంది. చూపులకు మాటలు నేర్పిస్తుంది. 'సఖుని ఒడిలో సురిగి కోటి సుఖముల శిఖరమునైతి' వంటి సమాధి స్థితినిస్తుంది. కవయిత్రి రేవతీదేవి మాటల్లో 'తనువంతటా మనసైన, మనసంతటా తనువైన, నేనైన తనలో- పరిపూర్ణమై మేము!' తరహా అద్వైతస్థితికి చేరుస్తుంది. ఇదంతా వలపు- కామంతో కలిసి కలుషితం కానంతవరకే! దేహానికి దాహం పెరిగేకొద్దీ మనసును మోహం కమ్మేస్తుంది. కాంక్షలు జ్వలిస్తాయి. ప్రేమ ఓడిపోతుంది. వెన్నెల్లోని వికాసాన్ని కన్నుల్లో వెలిగించగల తన సహజసిద్ధమైన మంత్రశక్తిని కోల్పోతుంది. కొండేపూడి నిర్మల ఊహించినట్లే 'వలను ప్రేమించిన పిట్టల జాబితా' పెరిగిపోతుంది. 'మోహపరవశంతోనే ఉన్మాదమవుతోంది లోకం' అన్న ఆరోపణ నిజం అవుతుంది. 'ఊపిరి నిలిచేదాకా... ఈ జనమ కడదాకా...' వంటి బాసలు తేలిపోతాయి. వాటికి తోడు ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు, అపార్థాలు సైతం దూరాన్ని పెంచుతాయి. ప్రేమికులు విడిపోతారు. ప్రేమ బాధతో నిట్టూరుస్తుంది!

అంతమాత్రాన మరణించిందనుకుంటే పొరబాటు- ప్రేమ చిరంజీవి! నివురుకప్పిన నిప్పులాంటిదది. పాత లేఖలు బయటపడినప్పుడో, ఎవరిలోనో పోలిక తోచినప్పుడో, చిరపరిచిత ప్రదేశాలకు మరోసారి పోయినప్పుడో- ఆ జ్ఞాపకాలు పెనుగాలులై మంటను రాజేస్తాయి. ఒకప్పుడు చేతిస్పర్శ సోకగానే సెలయేరైన జోరును, మూతివిరుపుతో ఎద నీరైన తీరును గుర్తుచేసుకుని గాఢంగా మూల్గుతుంది. 'కళ్లు శ్రావణమేఘాలవుతున్నా- ఫిర్ భీ మేరా మన్ ప్యాసా... దప్పిక మాత్రం తీరక... మధురమైన బాధరా, సలుపుతోందిరా' అనుకుని ఎద నలిగిపోతుంది. అలాంటి భగ్నప్రేమికులకోసం వియత్నాం ప్రభుత్వం ఏటా ఓ సంప్రదాయ వేడుక జరుపుతోంది. భంగపడిన భగ్న ప్రేమికులంతా ఆ 'ప్రేమసంత'లో వేలాదిగా పాల్గొని, తీపిగాయాలకు లేపనాలు పూసుకునే విలక్షణ ఆచారం చిరకాలంగా కొనసాగుతోందట. చేరువ కాలేమని తెలిసీ చింతించి, వలచీ విలపించడంలోని తీయదనాన్ని తీరిగ్గా ఆస్వాదించి, సాయంత్రానికి- కవి రవూఫ్ చెప్పినట్లు 'పోగొట్టుకున్నదే జీవితం! పొందినదల్లా పోయినదాని ఆనవాళ్లు, కొన్ని గాయాలు, మరికొన్ని జ్ఞాపకాలు' అనుకుంటూ భారంగా వీడ్కోలు చెప్పుకొని, ఎవరి జీవితగమ్యాల దిశగా వారు సా...గిపోతారట- అవును, కన్నీళ్లతోనే...!

జ్ఞానం దాచుకునేది కాదు, ఎవరితోనైనా పంచుకోవాల్సింది. సంపద పంచితే ఆకలి తీరుతుంది, జ్ఞానాన్ని పంచితే ఆశలు తీరతాయి.

– అమృతా ప్రీతమ్, రచయిత్రి

ఆశాభావం

ఆశావహ దృక్పథం జీవితానికి ఇంధనం. ఈరోజు కన్నా రేపు మరింత సానుకూలంగా ఉంటుందనే చిన్న ఆశ మనలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపుతుంది. అందుకే ఆశ అంటే- భావి జీవితానికి శ్వాస... సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించగలమనే నమ్మకాన్ని కలిగి ఉండటం, పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, మార్పు సాధ్యమేనని ప్రగాఢంగా విశ్వసించడం. మనిషిలో నిరంతర చైతన్యాన్ని రగిలించే అంతర్గత శక్తి- ఆశ.

ఆధ్యాత్మిక దృష్టిలో ఆశకు మరింత గొప్ప స్థానం ఉంది. ఏ పరిస్థితీ శాశ్వతం కాదు. సుఖం శాశ్వతం కాదు. అలాగే దుఃఖం కూడా. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కర్మపై దృష్టి సారించమని బోధించాడు. ఫలితం గురించి ఆందోళన చెందకుండా ధర్మబద్ధంగా కర్తవ్యాన్ని నిర్వర్తించమనే గీతా సందేశంలో కూడా ఆశాభావం ఉంది. మనిషి తన పనిని తాను సక్రమంగా చేస్తే, జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోగలడు. ఆశ అంటే భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ముందే తెలుసుకోవడం కాదు. భవిష్యత్తు ఎలా ఉన్నా దాన్ని ఎదుర్కొనే శక్తి మనలో ఉందని నమ్మడం. శ్రీరాముడు రాజ్యాన్ని కోల్పోయి అడవికి వెళ్లాల్సి వచ్చింది. అయినా ఆయన నిరాశకు లోనుకాలేదు. అరణ్యవాసం, సీతాపహరణం, రావణుడితో యుద్ధం ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాడు. అయినా, శ్రీరాముడు ధర్మాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. పరిస్థితులు మారినా విలువలు మారకూడదు. కష్టాలు వచ్చినా ఆశను కోల్పోకూడదు.



అంతర్యామి

కొన్ని సందర్భాల్లో మనలోని శక్తి గురించి మనకు తెలియకపోవచ్చు. ఆ సమయంలో ఒక మంచి మాట, ఒక ఆధ్యాత్మిక గ్రంథం, ఒక గురువు బోధ మనలోని ఆశను మళ్లీ మేల్కొలుపుతాయి. సత్యవంతుడి ప్రాణాలను తిరిగి పొందడానికి సావిత్రి చూపిన ధైర్యం, విశ్వాసం, పట్టుదల గొప్ప సందేశాన్నిస్తాయి. అసాధ్యంగా కనిపించిన పరిస్థితికి తలొంచి ఆమె వెనక్కి తగ్గలేదు. ఆశాభావం ఉన్న వ్యక్తులు విపత్కర పరిస్థితులతో రాజీపడరు. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించి, సఫలమవుతారు. శిశిరంలో ఆకులు రాల్చిన చెట్టు, వసంతంలో మళ్లీ చిగురిస్తానని నమ్మకంతో ఉంటుంది. సమస్యలలో కూడా అవకాశాలను సృష్టించుకునే ప్రయత్నం చేసేవారే ఆశావాదులు. ఆశావాదులు ఎల్లప్పుడూ అన్నింటా సానుకూలతనే చూస్తారు.

ఆశ అంటే ఊరికే కూర్చుని ఫలితం కోసం ఎదురుచూడటం కాదు. ఆశ, ఆలోచన, శ్రమ, విశ్వాసం ఇవన్నీ సమ్మిళితమైతేనే విజయం సాకారమవుతుంది. విత్తనం వేసి నీరు పోయకుండా పంట కోసం ఎదురు చూడలేం. అలాగే ఆశ పెట్టుకుని ప్రయత్నం చేయకుండా విజయాన్ని ఆశించడం సాధ్యం కాదు. సానుకూల ఆలోచనతో రోజును ప్రారంభించాలి. మంచి పుస్తకాలు చదవాలి. మంచి వ్యక్తులతో సత్సంగం చేయాలి. ప్రార్థన, ధ్యానం వంటి ఆధ్యాత్మిక సాధనలకు సమయం కేటాయించాలి. గత వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. మనిషి శరీరానికి శ్వాస ఎంత అవసరమో, జీవిత ప్రయాణానికి ఆశ అంత అవసరం. ఆశ అనేది భవిష్యత్తుకు హామీ కాదు. రాబోయే కాలం ఎలా ఉన్నా దాన్ని మంచిగా మార్చుకోగలమనే మన అంతరంగ విశ్వాసం.

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

ముప్పు నేపాల్‌కు మాత్రమే కాదు..!

నేపాల్ తాజా వరద విధ్వంసం వాతావరణ మార్పుల దుష్ప్రభావమే. హిమాలయాల్లో హిమానీనదాలు, పురాతన మంచు పొరలు (పెర్మాఫ్రాస్ట్), కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడం వంటివి నానాటికీ పెరుగుతున్నాయి. పర్వత ప్రాంతాల సహజ ఆవరణ వ్యవస్థ దెబ్బతింటే హిమానీనదాలు కరిగి నీరు త్వరగా దేశ సరిహద్దులు దాటి వరదగా మారుతుంది. హెచ్చరిక వ్యవస్థలకు, మౌలిక సదుపాయాలకు, దౌత్యానికి అది సవాలు విసురుతుంది.

భోటే కోషి నది 720 కిలోమీటర్ల పొడవుండి టిబెట్ పీఠభూమి నుంచి నేపాల్ మీదుగా బిహార్‌లోకి ప్రవేశించి గంగానదిలో కలుస్తుంది. దీని పరీవాహక ప్రాంతంలో సుమారు 45శాతం నేపాల్‌లో, 33శాతం చైనాలో, 22శాతం భారత్‌లో ఉంది. ఆ నది 35-40 కోట్ల మందికి జీవనాధారం. కోషి హిమాలయాల నుంచి గంగా మైదానంలోకి ప్రవేశించే ముందు ఎగువన సున్ కోషి, అరుణ్, తామోర్ నదులు దానిలో కలుస్తాయి. కోషి పరీవాహక ప్రాంతంలోని హిమాలయాల్లో పగులు రేఖలు ఉండటంతో ఈ బేసిన్‌లో 5,653 కొండచరియలు విరిగిపడిన చరిత్ర ఉంది. అవి నదులకు అడ్డుకట్టగా నిలిచి, ఆ కట్టల వెనక ఆగిన నీరు ఒక్కపెట్టున కిందకు వరదలా వచ్చిపడే ప్రమాదం ఉంది. కోషి నది ఏటా దాదాపు 10 కోట్ల టన్నుల రాళ్లు, మట్టితో కూడిన అవక్షేపాన్ని దిగువకు రవాణా చేస్తుంది. కొన్నిసార్లు అది 13.5 కోట్ల టన్నులకు చేరుకుంటుంది. అవక్షేపం చేరిక వల్ల నదీగర్భం వరద నీటిని ఇముడ్చుకోలేకపోతుంది. ఇప్పటికే కోషి నది 100 కిలోమీటర్లకు పైగా తన ప్రవాహ మార్గాన్ని మార్చుకుంది. దీనికి వాతావరణ మార్పులు తోడై వరదలు సంభవిస్తున్నాయి.

వేలాదిగా హిమానీనదాలు

హిందూకుష్ హిమాలయ ప్రాంతంలోని అయిదు నదీ పరీవాహక ప్రాంతాల్లో 25 వేల నుంచి 31 వేలదాకా హిమానీనదాలు ఉన్నట్లు అంచనా. భూమి వేడెక్కడం వల్ల హిమానీనదాలు, పురాతన మంచు పొరలు (పెర్మాఫ్రాస్ట్) అస్థిరమై సరస్సులు ఏర్పడి, విస్తరిస్తున్నాయి. కొన్నిసార్లు ఆ సరస్సుల కట్టలు, కొండవాలులు బలహీనపడి ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. 2020లో కోషి బేసిన్‌లో అలాంటి 3,624 సరస్సులను గుర్తించారు. వాటిలో 47 ప్రమాదకరంగా ఉన్నట్లు తేల్చారు. ఆ సరస్సుల్లో చైనాలో పాతిక, నేపాల్‌లో 21 ఉన్నాయి. ఒకటి ఇండియాలో ఉంది. హిమానీనద సరస్సులు బద్దలై సంభవించే వరదలను 'గ్లాఫ్' అంటారు. 1977 నుంచి నేపాల్‌లో 26 గ్లాఫ్ ఘటనలు నమోదయ్యాయి. ఎవరెస్ట్-దుధ్ కోషి ప్రాంతం యాభైఏళ్లలో అయిదు ప్రధాన గ్లాఫ్‌లను చవిచూసింది. తూర్పు హిమాలయాల్లో గ్లాఫ్ ముప్పు 2100 నాటికి దాదాపు మూడు రెట్లు పెరగవచ్చని అంచనా! ఇలాంటి ప్రమాదాలను ముందే గుర్తించి, పరస్పరం హెచ్చరించుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. అంటే- వాతావరణ, భౌగోళిక సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలన్నమాట. కోషి నది విషయంలో ఇలాంటి దౌత్య సహకార చరిత్ర ఉంది. 1954లో కుదిరి 1966లో సవరించిన భారత్-నేపాల్ కోషి ఒప్పంద పరిధిలోకి బ్యారేజీలు, కరకట్టలు, సర్వేలు, వరద నియంత్రణ వస్తాయి. కోషి, గండక్, వరద నిర్వహణ కమిటీలతో సహా అనేక ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా రెండు దేశాల సహకారం కొనసాగుతోంది.

రుతుపవనాల సమయంలో నేపాల్ వాతావరణ-నదీ ప్రవాహ సమాచారం గంటకోసారి అప్‌డేట్ అవుతుంది. భారతదేశ అంచనాలకు అది ఉపయోగపడుతుంది. బిహార్ కోషి వ్యవస్థ 72 గంటల ముందుగానే 17 ప్రదేశాలలో ప్రయోగాత్మక అంచనాలను అందిస్తుంది. 2014 నుంచి రెండు దేశాల్లో కోషి వ్యవస్థ సెన్సర్లు, రాడార్, వర్షపాత అంచనాలను మిళితం చేసి మూడు రోజుల వరద సూచనలను అందిస్తోంది. హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పులు, హిమానీనదాల కరుగుదలతో ప్రమాదాలను ముందే గుర్తించి హెచ్చరించడానికి అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం, ప్రపంచ వాతావరణ పరిశోధన కేంద్రం కలిసి పనిచేస్తున్నాయి. అవి 2010లో ప్రారంభించిన ప్రాజెక్ట్ కింద బంగ్లాదేశ్, భూటాన్, చైనా, భారత్, నేపాల్, పాకిస్థాన్‌లలో 38 నిజసమయ హైడ్రోమెటియొరొలాజికల్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రాజకీయ కారణాలవల్ల ఈ ఏర్పాట్లు చట్టబద్ధమైన, నిరంతర వ్యవస్థగా మారలేదు. నిరుడు జులైలో రసువా వరద సమయంలో చైనా ఎలాంటి హెచ్చరిక జారీ చేయలేదని నేపాల్ అధికారులు తెలిపారు. తాజాగా వరద నీరు సరిహద్దు దాటిన తరవాతే కీలక సమాచారం నేపాల్‌కు చేరింది. వరదలు, హిమానీనద ప్రమాద సమాచారాన్ని రాజకీయం చేయకూడదు. తటస్థ మానవతా సహాయంగా పరిగణించాలి. హిమాలయ దేశాల సహకారం స్వచ్ఛంద సమాచార మార్పిడి నుంచి స్వయంచాలక హెచ్చరికల వ్యవస్థకు మారాలి. నీటిమట్టాలు, భూకంప ప్రమాదాలు, హిమానీనదాలు, సరస్సులు, కొండవాలు స్థానభ్రంశం, కొండచరియల స్థితిగతుల గురించి సమాచారాన్ని చైనా, నేపాల్, భారత్‌లు ఇచ్చిపుచ్చుకోవాలి. రాజకీయాలతో సంబంధం లేకుండా సర్వకాల సర్వావస్థల్లో హెచ్చరికలను పంపాలి. ఉపగ్రహ కమ్యూనికేషన్లను విరివిగా ఉపయోగించాలి.

సమాచారాన్ని పంచుకుంటేనే...

ఇంజినీరింగ్ ప్రాజెక్టులు గ్లాఫ్ ప్రమాదాన్ని తగ్గించగలవు కానీ హిమాలయ ప్రాంతమంతటా భద్రతకు హామీ ఇవ్వలేవు. హిందూకుష్-హిమాలయ ప్రాంతంలోనే 200 ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హిమాలయ ప్రాంతంలో వంతెనలు, ఆనకట్టలు, రోడ్లను భూకంపాలు, హిమానీనదాల ముప్పును తట్టుకునేలా డిజైన్ చేయాలి. నేపాల్‌లో హెచ్చరిక వ్యవస్థలు బలహీనంగా ఉన్నందువల్ల ఉపగ్రహ, కృత్రిమ మేధా పర్యవేక్షణ, సైరన్లు, మొబైల్ అలర్ట్‌లతో కూడిన బలమైన ముందస్తు హెచ్చరిక ప్రణాళికను చేపట్టాలి. అంతర్జాతీయ సంస్థలు వివిధ దేశాలకు హెచ్చరికలు పంపాలి. ముంచుకొస్తున్న ముప్పునకు సంబంధించిన డేటాను పరస్పరం పంచుకోవాలి. మొత్తంగా హిందూకుష్ హిమాలయాల్లో హిమానీనదాలు వేగంగా కరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అధునాతన శాస్త్ర సాంకేతికతలతో నిర్మించిన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ సహకారం, సకాలంలో హెచ్చరికల ద్వారానే భావి విపత్తులను విజయవంతంగా ఎదుర్కోవడం సాధ్యమవుతుంది.

హరికృష్ణ నిబానుపూడి

సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్

ముగ్గురు పర్వతారోహకులు ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దగ్గరలో ఉన్నారు. 'అర్ధరాత్రి పన్నెండుకల్లా బయల్దేరితే మధ్యాహ్నానికి శిఖరాన్ని చేరుకోగలం. ఒంటిగంట తర్వాత వాతావరణం అత్యంత ప్రమాదకరంగా మారుతుంది కాబట్టి శిఖరాన్నీ చేరుకోలేం, అలాగని వెనక్కీ మళ్లలేం' అని చెబుతాడు కోచ్. సరేనని ఈ ముగ్గురూ మిగిలినవారితో కలిసి బయల్దేరారు. వాళ్లలో కొందరు నెమ్మదిగా ఎక్కుతుండటంతో వెనకాల ఉన్న వీళ్లూ స్లో కాక తప్పలేదు. అలా పదకొండున్నరకు ముందున్న దారి చూసుకుంటే ఒంటిగంట లోపల శిఖరాన్ని చేరుకోవడం అసాధ్యమని తేలిపోయింది. చేసేది లేక ముగ్గురు స్నేహితుల్లో ఇద్దరు వెంటనే నిర్ణయం తీసుకుని వెనక్కి తిరిగి వచ్చేశారు. హాయిగా జీవితాలు గడిపారు. ఒక్కరు మాత్రం- కష్టపడి

వదిలేయడం తప్పుకాదు!



ఇక్కడి దాకా వచ్చాను, ఇంకాస్త ఓపికపడితే కల నెరవేరుతుంది కదా అనుకుని ముందుకెళ్లాడు. శిఖరం దాకా వెళ్లి ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేక కన్నుమూశాడు. 'క్విట్టర్స్ నెవర్ విన్ అండ్ విన్నర్స్ నెవర్ క్విట్' అన్నమాట వింటుంటాం. అతడు కూడా అలాగే అనుకున్నాడు. కానీ అటు ఎవరెస్ట్‌ను అధిరోహించిన ఆనందాన్నీ ఆస్వాదించలేకపోయాడు, ఇటు జీవితమూ మిగల్లేదు.

దేన్నయినా మధ్యలో వదిలేస్తే గొప్పవాళ్లం కాలేమన్నది చాలామంది నమ్మకం. ఎందుకంటే వాళ్లు- చేస్తున్న పనితో తమ ఐడెంటిటీని ముడిపెట్టుకుంటారు. అది లేకపోతే తాము లేమనుకుంటారు. అందుకే చదువు, ఉద్యోగం, వ్యాపారం, రిలేషన్‌షిప్... ఏదైనా సరే ఒకసారి ఎంటర్ అయ్యాక అందులో విజయం సాధించే అవకాశం లేదని తెలిసినా దాంట్లోంచి బయటపడటాన్ని చిన్నతనంగా భావిస్తారు. ఇతరుల దృష్టిలో పరాజితులుగా ముద్రపడతామని భయపడతారు. దాంతో వాయిదా వేస్తూ వేస్తూ చివరికి తప్పనిసరి పరిస్థితుల్లో చేతులెత్తేస్తారు. అప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. జీవితాన్ని అలా బయటికి రాలేని పద్మవ్యూహంలా చేసుకోవద్దంటారు 'క్విట్: ద పవర్ ఆఫ్ నోయింగ్ వెన్ టు వాక్ ఎవే' అనే పుస్తకం రాసిన యానీ డ్యూక్. విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నప్పుడు దేన్నయినా వదిలేయడంలో తప్పు లేదనీ, నిజానికి సరైన సమయంలో బయటపడగలగటమే గొప్ప నైపుణ్యమనీ అంటారామె.

పట్టుదలతో కొనసాగడం, వదిలివేయడం రెండూ ఒకే నిర్ణయానికి రెండు పార్శ్వాలు. సందర్భాన్ని బట్టి దేనికి కట్టుబడి ఉండాలో నిర్ణయించుకోవాలి. ఏ ఒక్కదానికీ అతిగా విలువివ్వకూడదు. కొంతమందికి ఉన్నచోటు నుంచి మారడం ఇష్టం ఉండదు. కంఫర్ట్ జోన్‌గా భావిస్తున్న దాంట్లో నెమ్మదిగా అసౌకర్యం చోటుచేసుకోవడాన్ని వాళ్లు గుర్తించలేక నిండా మునుగుతారు. పొరపాటు చేశాను, ఈ నిర్ణయమేదో ముందే తీసుకోవాల్సింది... అనే మాట తరచూ వింటూంటాం. ఎప్పుడు క్విట్ అవ్వాలో తెలియకపోవడమే దానికి కారణం. 'రోలింగ్ స్టోన్ గేదర్స్ నో మాస్' అన్న సామెతకు కాలం చెల్లింది. ఇప్పుడు చాలా సందర్భాల్లో వ్యక్తులకే కాదు, సంస్థలకూ క్విట్ అవడం అవసరం కూడా. అందుకే వ్యాపార సంస్థలు అకస్మాత్తుగా తమ దిశను మార్చుకుని మరో రంగంలోకి ప్రవేశించడం చూస్తుంటాం. ఎప్పుడు అంటిపెట్టుకుని ఉండాలీ ఎప్పుడు వదిలేయాలీ అన్నది తెలిస్తే ఎంతో సమయాన్నీ శక్తినీ డబ్బునీ ఆదా చేసుకోవచ్చని యానీ డ్యూక్ ఉదాహరణలతో వివరించారు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి భయపడేవారూ, ఎస్ ఆర్ నో మధ్య ఊగిసలాడుతూ పుణ్యకాలం కాస్తా గడిపేసేవారూ తప్పక చదవాల్సిన పుస్తకమిది.

– మిహిర

ప్రజారోగ్యాన్ని పట్టించుకునేదెవరు?

మన దేశంలో దేనికి కొరత ఉన్నా నాయకులకు మాత్రం కొరతేమీ లేదు. నింగిలో చుక్కల మాదిరిగా తెల్లచొక్కాల వాళ్లు అంతమంది ఉన్నారు కదా, జనానికి ఏమైనా ఉపయోగపడతారనుకుంటే పొరపాటే! ఆత్మస్తుతి, పరనిందలకు తప్ప ప్రజలకు పనికొచ్చేది ఏదైనా చేయడానికి వాళ్లకు తీరికే ఉండదు. నేతలు సరే వాతలు పెడుతున్నారు, అధికారులైనా ఆదుకుంటారనుకుంటే అది అంతకంటే అమాయకత్వమవుతుంది. సర్కారీ యంత్రాంగంలో చాలామందికి నాయకులూ బడాబాబుల సేవకే సమయం సరిపోవట్లేదు. ఇక వాళ్లు సామాన్యులను పట్టించుకోవాలంటే ఇటు పొద్దు అటు పొడవాలి. జీర్ణశక్తి ఎక్కువ, జ్ఞాపకశక్తి తక్కువ ఉండే నేతలూ సర్కారీ సిబ్బందికి అసలు మామూలు జనం బాధలేవీ గుర్తుండవు. ఆఖరికి న్యాయపాలిక నిర్దేశాలు కూడా వాళ్ల మహాద్భుత మెదళ్లకు ఎక్కవు. సరైన అర్హతల్లేని అనధికార వైద్యులు ప్రజలను దోపిడీ చేయడానికి అనుమతించరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించి పదహారేళ్లు గడచిపోయింది. 'స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలు దాటిపోయింది. అర్హతలు లేనివారు వైద్యులు కావడం మాత్రం ఆగట్లేదు. కోట్లాది మంది బతుకులతో వారు చెలగాటమాడుతూ యావత్ సమాజానికీ పెనుముప్పుగా తయారవుతున్నారు' అంటూ మరోకేసులో సుప్రీంకోర్టు హెచ్చరించి ఎనిమిదేళ్లవుతోంది. అయినా ఎవరికి పట్టింది? తాము పుట్టిందే ప్రజాసేవకోసమంటూ బహిరంగ వేదికలపై గొంతు చించుకునే నాయకుల్లో ఎవరికైనా చీమైనా కుట్టినట్టుందా? ప్రజలకు మేలుచేసేస్తామంటూ ఉద్యోగాల్లోకి వచ్చి, ప్రజాధనంతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వాధికారుల్లోనైనా ఏమైనా చలనం వచ్చిందా? వచ్చి ఉంటే, అడపాదడపా దాడులతో సరిపెట్టకుండా వైద్యుల ముసుగులోని కేటుగాళ్లందరినీ కటకటాల్లోకి ఎందుకు నెట్టడం లేదు?

పుణ్యభూమి

ఎనిమిదో తరగతి చదువుతోందా చిన్నారి... బోనాల పండుగకు హాస్టల్ నుంచి ఇంటికొచ్చింది. సంతోషంగా సంబురాలు చేసుకుంది. ఇంతలో కాస్త జలుబు, దగ్గు రావడంతో ఊళ్లోని ఆర్ఎంపీ దగ్గరికి తీసుకెళ్లారు అమ్మానాన్నలు. అక్కడ అతను సూదిమందు ఇవ్వగానే నురగ కక్కుకుని స్పృహ తప్పిపోయింది. ఆ తర్వాత చనిపోయింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన దారుణమిది! శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పది రోజుల కిందట ఓ యువకుడు గ్యాస్ట్రబుల్‌తో ఇబ్బంది పడుతూ స్థానిక ఆర్ఎంపీని కలిశాడు. ఆ ప్రబుద్ధుడు సెలైన్ పెట్టి డోసు ఎక్కువ ఇంజెక్షన్ చేశాడు. అంతే, కడుపునొప్పితో అల్లాడిపోయి ఆ కుర్రాడు చనిపోయాడు. వారం క్రితం హైదరాబాద్‌లో జ్వరమని వచ్చిన ఓ మహిళకు ఇలాగే ఇంజెక్షన్ చేసి ఆమె ప్రాణాలుతీశాడు మరో ఆర్ఎంపీ. ఇలాంటి ఘోరాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగానూ తరచూ వెలుగుచూస్తున్నాయి. అయినా పల్లెల్లో, పట్టణాల్లోని పేదల బస్తీల్లో అర్హతల్లేని వారు నిర్వహిస్తున్న క్లినిక్‌లు అలాగే నిక్షేపంగా వర్ధిల్లుతున్నాయి. 'ఆరోగ్యంపై భారతదేశం తగినంత శ్రద్ధపెట్టలేదు. గ్రామీణ ప్రాంతాల్లో తగినంత మంది వైద్యుల్లేరు. దాంతో వైద్యులుగా చెప్పుకొనేవారిపై జనం ఆధారపడాల్సి వస్తోంది. వాస్తవానికి వీళ్లకు ఎలాంటి అర్హతలూ ఉండవు.



కానీ, గ్రామీణ భారతంలో ఏదైనా చికిత్సకోసం మొదటిసారి వైద్యుణ్ని సందర్శించేవారిలో 80శాతం మంది వీళ్ల దగ్గరికే వెళ్తారు' అని ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ గతంలో ఆవేదన వ్యక్తంజేశారు. నకిలీ వైద్యులు చెదపురుగుల మాదిరిగా వ్యాపించడానికి మూలకారణమేంటో అంత స్పష్టంగా తెలుస్తున్నప్పుడు ప్రభుత్వాలెందుకు గుడ్లప్పగించి చూస్తున్నాయి? కలలో కూడా ప్రజాసంక్షేమాన్ని మర్చిపోమంటూ మైకులు బద్దలుకొట్టే నాయకులు పల్లెల్లో వైద్యవసతులను ఎందుకు బాగుపరచరు? నగరాల్లోని మురికివాడల్లో జీవనపోరాటాలు చేసే బీదాబిక్కీ జనానికి అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందేలా చేస్తే నేతల సొంత సొమ్ము ఏమైనా తరిగిపోతుందా?

నన్ను ఎరిగినవాడు లేకపోతే నా బడాయి చూడమన్నాడట వెనకటికొకడు. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేసిన ఓ మాయగాడు అలాగే చర్మవ్యాధుల నిపుణుణ్ని అని చెప్పుకొంటూ హైదరాబాద్‌లో ఆసుపత్రిని నడిపిస్తూ మూడు రోజుల క్రితం పట్టుబడ్డాడు. అతితెలివితేటల్లో ఆరితేరిపోయిన అతగాడు సోరియాసిస్ చికిత్సకంటూ సొంతంగా జెల్ ఒకటి తయారుచేసి రోగులకు అంటగడుతున్నాడట. ఇలా అర్హతలేమీ లేకుండానే ఎప్పటినుంచో హాస్పిటళ్లను నిర్వహిస్తున్న మొత్తం పన్నెండు మంది నకిలీ వైద్యులను హైదరాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. వైద్యంలో ఓనమాలు తెలియకపోయినా తెల్లకోటు వేసుకుంటున్న మాయగాళ్లు రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్‌లు ఇచ్చేస్తున్నారు. దానివల్ల భవిష్యత్తులో ఆ మందులేవీ పనిచేయని 'ఏఎంఆర్' సమస్య పెరిగిపోతోంది. డబ్బులు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా స్టెరాయిడ్లను కూడా రాసేస్తున్న దొంగ డాక్టర్ల కారణంగా ప్రజారోగ్యం ఇంకా దెబ్బతినిపోతోంది. కాసుల కక్కుర్తితో కాలంచెల్లిపోయిన మందులు, ఇంజెక్షన్లను రోగులకు అంటగట్టే నేరగాళ్లు కూడా వైద్యులుగా చలామణీ అవుతున్నారంటే మన వ్యవస్థ ప్రయోజకత్వాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? 'నకిలీ వైద్యానికి నయవంచన జతకలిస్తే భయంకర పరిణామాలకు దారితీయవచ్చు. వైద్యం పేరిట జరుగుతున్న దోపిడీపర్వాలకు అడ్డుకట్ట వేయాలి' అని ప్రసిద్ధ ఆర్థికనిపుణులు అమర్త్యసేన్ ప్రభుత్వాలకు పిలుపిచ్చి దశాబ్ద కాలమవుతోంది. కానీ, ఆలకించిన మహానుభావులు ఎవరున్నారు?

ఉత్తర్ ప్రదేశ్‌లో ఇటీవల ఓ దొంగ డాక్టర్ మూత్రపిండాల్లో రాళ్లు తీస్తానంటూ ఓ మహిళకు శస్త్రచికిత్స చేశాడు. పీకల్దాకా మందుకొట్టి యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్ మొదలుపెట్టిన ఆ దుర్మార్గుడు- పొట్టలోని నరాలను, చిన్నపేగును, అన్నవాహికను ఎడాపెడా కోసిపారేసి ఆమె ప్రాణాలు తీశాడు. ఇలా దేశవ్యాప్తంగా ఎంతోమంది మోసగాళ్లు మెడలో స్టెతస్కోపు తగిలించుకుని శస్త్రచికిత్సల పేరిట ఎందరో రోగులను బలిగొంటున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వైద్యం దొరక్క, ప్రైవేట్ హాస్పటళ్లలో ఖర్చులను భరించలేక సతమతమయ్యే పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారు కాస్త తక్కువకు చికిత్స చేస్తామనే ఇలాంటి నకిలీ డాక్టర్ల మాయలో పడుతున్నారు. చివరికి అయినవారిని అర్థాంతరంగా పోగొట్టుకుని అంతులేని దుఃఖంలో మునిగిపోతున్నారు. ప్రజారోగ్య రంగంలో సదుపాయాలను మెరుగుపరుస్తాన్నామంటూ ప్రభుత్వాలు దశాబ్దాలుగా ఊదరగొడుతున్నాయి కానీ, వాటి మాటలను నమ్మడమంటే మట్టెద్దుతో అరక దున్నించాలనుకోవడమే అవుతుంది. నకిలీ వైద్యులను పట్టుకుని కేసులు పెడుతున్నామని అధికార గణాలు సెలవిస్తుంటాయి కానీ, ఎంతమందికి ఎన్నేళ్లు శిక్షలు పడుతున్నాయంటే మాత్రం అవి నీళ్లు నములుతాయి. ప్రజలకోసమే తాము ఉన్నామన్న కనీసపాటి ఆలోచన నాయకుల్లోనూ యంత్రాంగంలోనూ రానంతకాలం జనభారతానికి పట్టిన ఈ ప్రారబ్ధం తప్పిపోదు. పేరుగొప్ప ప్రజాసేవకుల్లో ఆ స్పృహ ఎప్పటికైనా వస్తుందా అంటే, ఏలినవారు ఏమంటారో మరి!

– శైలేష్ నిమ్మగడ్డ

మన సూపర్ సూట్!

ఫ్రెండ్స్... మీరెప్పుడైనా మీ చర్మాన్ని గమనించారా? కొన్నిచోట్ల పలుచగా, కొన్నిచోట్ల మందంగా ఉంటుంది. పట్టుకుని లాగితే పలుచని పొరలా సాగుతుంది. నొప్పి కూడా అనిపిస్తుంది. ఇన్ని రకాల విశేషాలతో కూడిన మన శరీరంలో కీలక అవయవమైన చర్మం గురించి కొన్ని విషయాలు తెలుసుకుందామా?

మానవ శరీరంలో అతిపెద్ద అవయవం చర్మమే. మన బరువులో సుమారు 15శాతందాకా ఉంటుంది. పొరలతో కూడిన చర్మం మురికి, బ్యాక్టీరియా, సూర్య కిరణాల నుంచి మనల్ని కాపాడుతూ రక్షణ కవచంలా పని చేస్తోంది.

అలాగే ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. స్పర్శ, నొప్పి వంటి వాటిని అనుభూతి చెందిస్తుంది. చర్మం వేడి, చలి, నొప్పిని అనుభూతి చెందడానికి సూక్ష్మనాడులను ఉపయోగిస్తుంది. మనకు వేడిగా ఉన్నప్పుడు శరీరాన్ని చల్లబరచడానికి చెమట పట్టేలా చేస్తుంది. మనం ప్రతి నిమిషం వేలాది మృతచర్మ కణాలను కోల్పోతామన్న విషయం తెలుసా. కనురెప్పలపై చర్మం కాగితంలా పలుచగా ఉంటే, పాదాలపై మాత్రం మందంగా ఉంటుంది. చలిగా ఉన్నప్పుడు, వెచ్చని గాలిని బంధించడానికి చిన్న కండరాలు మీ వెంట్రుకలను నిటారుగా పైకి లాగుతాయి. గూస్‌బంప్స్ అంటే అదే!

హాయ్! బుజ్జీ!!

మూడు పొరలతో కూడిన చర్మం శరీరానికి ఒక 'సూపర్ సూట్'లా పనిచేస్తుంది. మనం బయటికి చూడగలిగే పై పొర బాహ్యచర్మమే ఎపిడెర్మిస్. దీనిలోనే మనకు రంగునిచ్చే మెలనిన్ ఉంటుంది. ఇది సూక్ష్మక్రిములను దూరంగా ఉంచుతుంది. దాదాపు నెలకోసారి కొత్త పొర వస్తుంటుంది. మధ్యలో ఉండే పొర డెర్మిస్. ఇందులో స్పర్శను గ్రహించే నాడుల చివర్లు, శరీరాన్ని చల్లబరిచే చెమట గ్రంథులు, చర్మాన్ని మృదువుగా ఉంచే నూనె గ్రంథులు ఉంటాయి. రక్తనాళాలు, నాడులు, వెంట్రుకల మొదళ్లు, స్వేద గ్రంథులనూ ఇది కలిగి ఉంటుంది. ఇక మూడోది హైపోడెర్మిస్. ఇది మన ఎముకలకు, కండరాలకు రక్షణ కవచంలా పనిచేస్తూ, మనల్ని వెచ్చగా ఉంచే అడుగున ఉండే లోతైన కొవ్వు పొర అన్నమాట.

మీరేం చేస్తారంటే: చర్మానికి సంబంధించిన మరిన్ని విశేషాలను సేకరించండి. వాటిని మీ ఫ్రెండ్స్‌కు ఫన్‌ఫ్యాక్ట్స్‌లా చెప్పండి. – శ్రీజన్

(c) eenadu

*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. Processing Fees and other charges is applicable as per Financier. Offer is based on minimum transactions slabs defined by Financer. Convenience fees may be charged by the financier. Kindly speak to our store sales staff for the Terms and Conditions of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Cashback Applicable on Select Banks & Cards. Up to off on select brands and models only. A processing fee of Rs.99 will be deducted from the cashback (which is inclusive of any QR-based instant cashback) and the net amount will be credited to the customer's IDFC FIRST Bank Wallet within 45 days of successful, on-time repayment of the first EMI.

పరుగులు పెట్టించారు.. పనులు చేయించారు

వెలిగొండ సాకారానికి కూటమి సర్కారు పట్టుదల

రెండేళ్లలోనే రూ.2,402 కోట్ల వ్యయం

ఈనాడు- అమరావతి: దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు చరిత్రలో గడిచిన రెండేళ్లూ ఎంతో కీలకం. కొల్లంవాగు నుంచి టన్నెళ్లలోకి నీళ్లు తీసుకువెళ్లే హెడ్ రెగ్యులేటర్ల పనుల నుంచి.. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాసానికి నిధుల చెల్లింపు వరకు అన్ని పనులూ వేగంగా సాగాయి. ప్రభుత్వం పరుగులు పెట్టించడంతో ఇవి 26 నెలల్లోనే కొలిక్కి వచ్చాయి. దీంతో నల్లమలసాగర్‌కు 10.70 టీఎంసీలు తరలించే చరిత్రాత్మక ఘట్టానికి సర్వం సిద్ధమైంది. నల్లమలసాగర్ నుంచి కాల్వలకు నీరు మళ్లించే హెడ్ రెగ్యులేటర్ పనుల్ని పాత ప్రభుత్వాలు పట్టించుకోపోవడంతో టన్నెళ్ల నుంచి నల్లమలసాగర్‌కు నీరు తీసుకువెళ్లే ఫీడర్ కాలువ పూడిపోయింది. పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఆ కాలువ మొత్తం పునరుద్ధరణ- నిర్వాసిత కుటుంబాలకు రూ.1,000 కోట్లకు పైగా పంపిణీ వంటివి ఈ రెండేళ్లలోనే పూర్తి చేశారు.

పెండింగ్ బిల్లులతో మొదలుపెట్టి..

■ 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.140 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించారు.

■ కొల్లంవాగు వద్ద టన్నెళ్లలోకి నీటిని విడుదల చేసే హెడ్‌రెగ్యులేటర్ పనులు 3,850 క్యూబిక్ మీటర్లు 14 నెలల్లోనే పూర్తి చేయించారు.

■ రెండో టన్నెల్‌లో 4.924 కి.మీ. తవ్వకం, 6.988 కి.మీ. లైనింగ్ పనులు ఈ రెండేళ్లలో చేశారు.

■ ఫీడర్ కాలువను పునరుద్ధరించారు. 21.8 కి.మీ. కాలువ పొడవుకు 18.75 కి.మీ. మేర లైనింగ్ పనులు చేశారు. ఈ కాలువకు ఆనుకుని కొండ ఉండటం, మొంథా తుపాను సమయంలో ఇబ్బందులు తలెత్తడంతో 5.30 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఇందుకు రూ.456 కోట్లు ఎన్డీయే ప్రభుత్వమే మంజూరు చేయించి వేగంగా పనులు పూర్తి చేయించింది.

■ వైకాపా ప్రభుత్వంలో రెండో సొరంగం తవ్వగా వచ్చిన మట్టిని మొదటి టన్నెల్‌లో 11.5 కి.మీ. రోడ్డుగా వేశారు. ఈ మట్టితోపాటు కొల్లంవాగు వద్ద వేసిన 94 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని కూటమి ప్రభుత్వం వచ్చాక తొలగించారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి అంశాన్నీ స్వయంగా సమన్వయం చేశారు. బడ్జెట్ కేటాయింపులను మించి ఆర్థికశాఖతో నిధులు ఇప్పించారు. రెండో టన్నెల్‌లో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) నిలిచిపోగా, దాన్ని ధ్వంసం చేయడానికి కోర్టులో కేసు అడ్డంకిగా మారింది. దానిపై సీఎం అడ్వొకేట్ జనరల్‌తో మాట్లాడి న్యాయ వివాదం పరిష్కారానికి అడుగులు వేయించారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎప్పటికప్పుడు వెలిగొండ వెళ్లి వాస్తవ పరిస్థితులు పరిశీలించి, సీఎంకు నివేదించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూశారు. ఆయన 2026 మే నెలలో దాదాపు 20 గంటల పాటు సొరంగాల్లోనే ఉండి, పనులపై తనిఖీలు చేశారు. 2025 నవంబరులో వెలిగొండ వెళ్లి లక్ష్యాలు నిర్దేశించిన మంత్రి.. అవి చేశారో లేదో తనిఖీ చేసేందుకు మళ్లీ 5 రోజుల్లోనే వెళ్లారు. దగ్గరుండి పనుల్ని పరుగులు పెట్టించారు.

1985 నుంచి 1999 వరకు..

1985: వెలిగొండ ప్రాజెక్టు ఆలోచనకు బీజం వేసిన ముఖ్యమంత్రి ఎన్టీఆర్

1989: ప్రాథమిక ప్రాజెక్టు నివేదిక

1994: పూర్తి డీపీఆర్ సిద్ధం

1996 మార్చి 5: ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

1998: సుంకేశుల, గొట్టిపడియ ఆనకట్టలకు రూ.138 కోట్లతో పాలనా అనుమతులు

1999: సుంకేశుల గ్యాప్ పనులు ప్రారంభం

2004- 2014 వరకు..

వైఎస్ హయాంలో వెలిగొండ తొలి దశ పనులను రూ.1,466 కోట్లతో ప్రారంభించారు. మొదటి దశ పనులు ప్రారంభించకుండా రెండో దశకు రూ.2,625 కోట్లతో ఒప్పందాలు జరిగాయి. 2014 నాటికి ప్రధాన కాలువ మొత్తం 518 కి.మీ.కు గానూ 351 కి.మీ. తవ్వారు. డిస్ట్రిబ్యూటరీలు తవ్వలేదు. ఈ కాలువపై 1,060 కట్టడాలు నిర్మించాల్సి ఉండగా 87 మాత్రమే పూర్తి చేశారు. పదేళ్లలో రూ.3,610 కోట్లు ఖర్చు చేశారు. మొదటి టన్నెల్ 11.634 కి.మీ. మేర లైనింగ్ చేశారు. రెండో టన్నెల్ 8.738 కి.మీ. తవ్వారు. మట్టిపనికి ఎక్కువ నిధులు ఖర్చు చేశారనే విమర్శలు వచ్చాయి. 2014 నాటికి గుత్తేదారు ఏజన్సీలు పనులు ఆపేశాయి.

2014-19 మధ్య..

■ పనులు నిలిపివేసిన గుత్తేదార్లతో ప్రభుత్వం చర్చించింది. ఈపీసీ విధానంలో సమస్యలు ఉండటంతో ప్రత్యేక జీవోలతో అదనపు నిధులు ఇప్పించారు. ధరల పెంపు అమలు చేశారు. దీంతో పనులు మళ్లీ పట్టాలెక్కాయి. ఐదేళ్లలో రూ.1,388.81 కోట్లు ఖర్చు చేశారు.

■ మొదటి టన్నెల్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి 7.215 కి.మీ. పని పెండింగ్ ఉంది. అందులో 4.331 కి.మీ. తవ్వారు.

■ రెండో టన్నెల్‌లో 10.04 కి.మీ. పెండింగ్ ఉండగా 2.355 కి.మీ. మేర తవ్వారు.

■ పునరావాస కాలనీల్లో రూ.63 కోట్లు ఖర్చు చేసి, వసతులు కల్పించారు.

2019-24 మధ్య..

ఐదేళ్లలో రూ.982 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. టన్నెళ్ల తవ్వకం పూర్తి చేయలేదు. రెండో టన్నెల్‌లో 2.770 కి.మీ. మాత్రమే తవ్వారు. మొదటి టన్నెల్‌లో 2.868 కి.మీ. మేర లైనింగ్ చేశారు. హెడ్ రెగ్యులేటర్లలో 6,942 క్యూబిక్ మీటర్ల పని చేశారు.

రామోజీ యానిమేషన్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం

ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఈటీవీ డైరెక్టర్ సుజయ్ చెరుకూరి నుంచి యంగ్ యానిమేటర్ ఆఫ్ ద ఇయర్ 2026 పురస్కారాన్ని వి.ఉన్నికృష్ణన్ తరఫున స్వీకరిస్తున్న విశాఖ్ వీఎం

ముంబయి: మీడియా మేరునగం రామోజీరావు స్ఫూర్తితో యానిమేషన్ రంగంలో ప్రతిభకు, సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించేందుకు స్థాపించిన రామోజీ యానిమేషన్ ఎక్సలెన్స్ అవార్డులను ఈటీవీ డైరెక్టర్ పూర్ణ సుజయ్ చెరుకూరి ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో విజేతలకు అందజేశారు. ముంబయిలోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన ఎనిమిదో యానిమేషన్ అండ్ మోర్ (ఏఎం) శిఖరాగ్ర సదస్సు, ఏఎన్ఎన్ అవార్డుల కార్యక్రమంలో వీటిని ప్రదానం చేశారు. తొలిసారిగా రామోజీ యానిమేషన్ ఎక్సలెన్స్ అవార్డులను రెండు కేటగిరీల్లో ఇచ్చారు. 'యంగ్ యానిమేటర్ ఆఫ్ ద ఇయర్ 2026' అవార్డును ఉన్నికృష్ణన్.వి గెలుచుకోగా 'ఎంటాంగిల్డ్ స్టూడియో' ఈ ఏడాదికి చెందిన ఉత్తమ ఇండీ స్టూడియో అవార్డు చేజిక్కించుకుంది. స్టూడియో సీఈవో శుభ్రాంశు సింగ్ ఈ అవార్డును స్వీకరించారు. అవార్డు విజేతలకు రూ. 1 లక్ష నగదు బహుమతితోపాటు, రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ట్రోఫీ, రామోజీ ఫిలిం సిటీ సందర్శనకై ఉచిత టికెట్లు అందించారు. దేశంలోని అత్యున్నత స్థాయి సృజనశీలురు, స్టూడియోల ప్రతినిధులు, యానిమేషన్ విద్యార్థులు, పరిశ్రమకు చెందిన ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అత్యంత ప్రతిష్ఠాత్మకం

ఈ అవార్డులు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవని యానిమేషన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ అభివర్ణించింది. రామోజీ యానిమేషన్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రవేశపెట్టడం యానిమేషన్ రంగంలో ఒక మైలురాయి అని పేర్కొంది. రామోజీరావు దార్శనికత కథాకథన రంగాన్ని సమూలంగా మార్చివేయడంతో పాటు అత్యంత గౌరవప్రదమైన మీడియా, వినోద రంగ సంస్థల స్థాపనకు దారితీసిందని కొనియాడింది.

మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో చీర, గాజులు, పసుపు, కుంకుమలను సారెగా సిద్ధం చేస్తున్న సిబ్బంది

నిర్వాసితులకు నిత్యావసరాల కిట్

6 వేల మంది మహిళలకు చీరలు, గాజులు

ఈనాడు, అమరావతి, మార్కాపురం, మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు మరింత సాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.4.07 కోట్లు మంజూరు చేస్తూ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.2,818 విలువైన నిత్యావసరాల కిట్ అందిస్తారు. దీనిలో 25 కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో చక్కెర, లీటరు నూనె, రెండు కిలోల ఉల్లిపాయలు, రెండు కిలోల బంగాళాదుంపలు ఇస్తారు. దాదాపు పది వేల మందికి ఈ కిట్లు అందించేందుకు రూ.2.81 కోట్లు మంజూరు చేశారు. ముంపు గ్రామాల్లోని 4,933 పశువులకు 30 రోజుల పాటు దాణా ఉచితంగా అందిస్తున్నారు. 295.98 మెట్రిక్ టన్నుల దాణా అవసరమవుతుందని లెక్కించి దానికోసం రూ.65.80 లక్షలు కేటాయించారు. చీర, గాజులు, పసుపు, కుంకుమతో కూడిన కిట్లను ఆరు వేల మంది మహిళలకు అందించనున్నారు. ఇందుకు రూ.60 లక్షలు కేటాయించారు. మార్కాపురం ఆర్డీవో కార్యాలయానికి ఆరు వేల మందికి సరిపడా కిట్లు వచ్చినట్లు అధికారులు చెప్పారు. సీఎం చేతుల మీదుగా వీటి పంపిణీని ప్రారంభించనున్నారు. ఈ కిట్లపై 'వెలిగొండ ప్రాజెక్టు త్యాగమూర్తులైన అక్క- చెల్లెమ్మలకు చంద్రన్న రాఖీ కానుక' అని ముద్రించారు.

'పనులు పూర్తికాకుండానే వెలిగొండను జాతికి అంకితం చేసిన జగన్'

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టులో రూ.4 వేల కోట్ల పెండింగ్ పనులు ఉన్నా.. దాన్ని జాతికి అంకితం చేసిన ఘనుడు అప్పటి సీఎం జగన్ అని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారని జగన్‌ను ప్రశ్నించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

నీట్ పీజీ పరీక్ష నేడు

రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 76 కేంద్రాల్లో నిర్వహణ

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న నీట్ పీజీ-2026 పరీక్ష నిర్వహణకు జాతీయ వైద్య పరీక్షల బోర్డు (ఎన్‌బీఈఎంఎస్) అన్ని ఏర్పాట్లు చేసింది. ఒకే షిఫ్ట్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరగనున్న ఈ పరీక్షకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. దేశవ్యాప్తంగా దాదాపు 1,300 కేంద్రాల్లో 2,73,183 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఉదయం 7 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా, బయోమెట్రిక్ వెరిఫికేషన్, జామర్ల ఏర్పాటుతో పాటు ఇతర సాంకేతిక భద్రతా చర్యలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష నిర్వహణకు దేశ వ్యాప్తంగా 60 వేలకు పైగా సిబ్బందిని వినియోగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాల్లోని 76 కేంద్రాల్లో 18,700 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారు. నోడల్ అధికారులుగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సాయిసుధీర్, డీఐజీ ఫకీరప్పను ప్రభుత్వం నియమించింది.

తీపి పదార్థాలు ఇంకా తినాలనిపిస్తుంది

తీపి పదార్థాలు తిన్నప్పుడు మెదడులో ఆనంద హార్మోన్ డోపమైన్ విడుదలై వాటిని మళ్లీమళ్లీ తినాలనిపిస్తుంది. ఎంత తీపి తిన్నా అది సాధారణంగానే ఉంటుంది. దీంతో తీపి పదార్థాలు తినాలనే కోరిక నుంచి బయటపడటం కష్టమనిపిస్తుంది. ఆ బలహీనతకు లోనుకాకుండా బయటపడితే ఆరోగ్యానికి అది తొలి మెట్టు అవుతుంది.

– బ్రియాన్ నియాన్‌డొరొ, కంటెంట్ రైటర్

సీఎం వెలిగొండ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- పైలాన్, జలహారతి ఇచ్చే ప్రాంతంలో మెట్ల నిర్మాణం
- పరిశీలించిన మంత్రుల బృందం

కృష్ణా జలాల విడుదలకు వెలిగొండ ఫీడర్ కాలువ 4.2 కి.మీ.వద్ద సిద్ధమైన క్రాస్ రెగ్యులేటర్

సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రులు రామానాయుడు, నారాయణ, వీరాంజనేయస్వామి తదితరులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 31న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. వెలిగొండ ఫీడర్ కాలువ 4.2 కి.మీ. వద్ద ఉన్న క్రాస్ రెగ్యులేటర్ వద్దకు శ్రీశైలం జలాశయంలోని కొల్లంవాగు నుంచి కృష్ణా జలాలను పంపుతారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి ఇచ్చి క్రాస్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి, నీటిని నల్లమలసాగర్ జలాశయానికి పంపుతారు. ఇందుకోసం పైలాన్ నిర్మాణం, జలహారతి ఇచ్చేందుకు ఫీడర్ కాలువలో మెట్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆ ప్రదేశంలోనే మహిళలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దానికి 1.5 కి.మీ దూరంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. గతంలో ఇది మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు.

మంత్రులు నిమ్మల రామానాయుడు, పి.నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలావీరాంజనేయస్వామి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు, కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన విజయవంతానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, కృష్ణా జిల్లా తెదేపా అధ్యక్షుడు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక రాజధానికి సుస్థిర బాట

రాజధాని అమరావతిలో పర్యావరణహిత రవాణాకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారీగా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ నెట్‌వర్క్ నిర్మించాలని నిర్ణయించింది. తొలుత వీఐటీ యూనివర్సిటీ జంక్షన్ సమీపంలో ఈ-9 రోడ్డులో ప్రయోగాత్మకంగా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ డిజైన్లు, నాణ్యతను ఉన్నతాధికారులు పరిశీలించి ఆమోదించిన తర్వాత అన్ని ప్రధాన రహదారుల్లోనూ నిర్మించనున్నారు.

– ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, తుళ్లూరు

జీర్ణకోశ సంరక్షణలో ఏఐజీ మరో ముందడుగు

- గట్ మైక్రోబయోమ్ థెరప్యూటిక్స్, పిల్ ల్యాబ్‌ల ఏర్పాటు
- ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి



క్యాప్సుల్స్ విడుదల చేస్తున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డితో పాటు డాక్టర్ శ్రీజిత్, డాక్టర్ రూపాబెనర్జీ, ఆక్టర్ హ్యారీ సోకోల్(ఫ్రాన్స్), డాక్టర్ జి.వి.రావు, డాక్టర్ మైఖేల్ కామ్ (ఆస్ట్రేలియా), డాక్టర్ నళినీ

ఈనాడు, హైదరాబాద్: మానవ జీర్ణ వ్యవస్థలోని సూక్ష్మజీవుల(గట్ మైక్రోబయోమ్) ప్రాధాన్యాన్ని గుర్తించి, వాటి ఆధారంగా సంక్లిష్టమైన జీర్ణకోశ వ్యాధులకు నూతన పరిష్కారాలు కనుగొనే దిశగా హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ) ఆసుపత్రి కీలక ముందడుగు వేసింది. ఇరిటబుల్ బౌల్ డిసీజ్(ఐబీడీ)లకు సంబంధించి అల్సరేటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్, తీవ్రమైన గ్యాస్ట్రిక్ ఇతర దీర్ఘకాలిక జీర్ణకోశ సమస్యల నివారణపై పరిశోధనల కోసం ప్రత్యేకంగా గట్ మైక్రోబయోమ్ థెరప్యూటిక్స్, పిల్ ల్యాబ్‌ను ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఏఐజీ ఐబీడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రూపా బెనర్జీ, అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు ప్రొఫెసర్ హ్యారీ సోకోల్(ఫ్రాన్స్), ప్రొఫెసర్ మైఖేల్ కామ్(ఆస్ట్రేలియా) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ "శరీరంలో ఉపయోగకరమైన బ్యాక్టీరియాలు కేవలం జీర్ణక్రియకే కాకుండా శరీర జీవక్రియ, వ్యాధి నిరోధక శక్తి, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు.. . ముఖ్యంగా అల్ట్రా ప్రాసెస్డ్ వినియోగం పెరిగిన తర్వాత మంచి బ్యాక్టీరియాకు ముప్పు వాటిల్లుతోంది. దీంతో ఐడీబీ, ఐబీఎస్, తీవ్రమైన గ్యాస్, అజీర్తి సమస్యలు పెరుగుతున్నాయి. వాటి చికిత్సకు సంప్రదాయ వైద్య విధానాల కంటే గట్ మైక్రోబయోమ్ చికిత్స ఎంతో మేలు చేస్తుందని పరిశోధనలో తేలింది. దాతల నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను డీహైడ్రేట్ చేసి, పౌడర్ రూపంలోకి మార్చి క్యాప్సుల్స్ (పిల్స్) ద్వారా రోగులకు అందించే అత్యాధునిక ఇంటెస్టైనల్ మైక్రోబయోటాన్స్ ప్లాంటేషన్ చికిత్సను అందుబాటులోకి తెచ్చాం" అన్నారు. ప్రొఫెసర్ హ్యారీ సోకోల్ మాట్లాడుతూ 'శరీరంలోని మంచి బ్యాక్టీరియా సంఖ్యను పెంచడం ద్వారా గట్ ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం నయం చేయవచ్చు' అని అన్నారు. డాక్టర్ రూపాబెనర్జీ, డాక్టర్ మైఖేల్ కామ్ సైతం మాట్లాడారు.

లలితకళలతో విద్యార్థి జీవితాన్ని అనుసంధానించాలి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

టి.వి.శ్రీనివాస్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఇంద్రసేనారెడ్డి. చిత్రంలో రమణాచారి, మండలి బుద్ధప్రసాద్, వెలుదండ నిత్యానందరావు, కోట్ల హనుమంతరావు

హైదరాబాద్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడితే ప్రజలంతా ఒక్కటిగా ఉంటారనే ఆలోచన ఉండేదని.. తర్వాత ఆయా రాష్ట్రాల్లో కొన్ని భాషలను బలవంతంగా అణచివేశారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం-మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాన్ని' పుణె-ఆంధ్ర అసోసియేషన్ గౌరవ సలహాదారు టి.వి.శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ప్రసంగించారు. 'ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినవారు మన భాష, సంస్కృతిని కాపాడుకోవాలనే ఆలోచనతో తెలుగు పాఠశాలలు పెట్టుకున్నారు. ప్రస్తుతం అక్కడి పాఠశాలల్లో తప్పనిసరిగా స్థానిక భాష నేర్చుకోవాలన్న ఆంక్షలు విధిస్తున్నారు. లలితకళలకు విద్యార్థి జీవితాన్ని అనుసంధానిస్తూ.. లోకజ్ఞానాన్ని అందించేలా సాంకేతిక విద్య పాఠ్య ప్రణాళిక రూపొందించుకోవాలి' అని సూచించారు. కార్యక్రమంలో ఏపీలోని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, అంతర్జాతీయ కేంద్రం డైరెక్టర్ ఆచార్య బీహెచ్ పద్మప్రియలతోపాటు ఆంధ్ర అసోసియేషన్(పుణె) ప్రతినిధులు, భాషవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడకపోతే కుటుంబాన్ని చంపేస్తా!

- నూజివీడు యువతికి ప్రేమికుడి బెదిరింపులు
- మహారాష్ట్ర వెళ్లి నిందితుణ్ని అరెస్టు చేసిన పోలీసులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: యువతి మాట్లాడటం లేదని ఆమె కుటుంబాన్నే అంతమొందించేందుకు ప్రయత్నించాడు ఓ ఉన్మాది. బాధితులు సరైన సమయంలో పోలీసులను ఆశ్రయించడంతో వారు యువకుడి ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ శనివారం తెలిపిన వివరాలకు మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ఒక యువతికి మహారాష్ట్రలోని సోలాపూర్‌లో స్థిరపడిన తెలంగాణ యువకుడు మేముల్ రోహన్ వైకుంఠం అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. చనువుగా మాట్లాడుతూ వ్యక్తిగత వివరాలను, మిత్రులు, సన్నిహితుల ఫోన్ నంబర్లు సేకరించాడు. మార్ఫింగ్‌తో న్యూడ్ కాల్స్‌ను తయారు చేసి వాటితో కుటుంబ సభ్యులను బెదిరించి కొంత నగదు కాజేశాడు. యువతితో ఫోన్ రీఛార్జ్‌లూ చేయించుకునేవాడు. ఈ నేపథ్యంలో యువతి మాట్లాడటం మానేసింది. దీంతో పగ పెంచుకున్న రోహన్.. కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని ఆమెను బెదిరించేవాడు. జులై 17 నుంచి 21 నూజివీడు వచ్చి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. యువతి తండ్రి పుట్టిన రోజైన ఈ నెల 26న అందరినీ చంపేస్తానని బెదిరిస్తూ మరో మెసేజ్ పెట్టాడు. బాధితులు ధైర్యం తెచ్చుకుని పోలీసులను సంప్రదించడంతో వారు సోలాపూర్ వెళ్లి నిందితుణ్ని అరెస్టు చేశారు. యువతి ల్యాప్‌టాప్‌ను యాక్సెస్ చేసుకుని చిత్రాలన్నింటినీ న్యూడ్ కాల్స్‌గా మార్చుతూ బెదిరింపులకు పాల్పడ్డాడని డీఎస్పీ తెలిపారు. నిందితుణ్ని రిమాండ్‌కు తరలించామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

రాజధానిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్‌కు టెండర్లు

ఈనాడు, అమరావతి: అమరావతిలోని ప్రభుత్వ భవనాల సముదాయం కోసం డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. 30,000 టీఆర్ (టన్స్ ఆఫ్ రిఫ్రిజిరేషన్) సామర్థ్యంతో రూ.415 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన భూమిని సీఆర్‌డీఏ లీజు ప్రాతిపదికన కేటాయిస్తుంది. ప్రాజెక్టు డెవలపర్‌గా ఎంపికైన సంస్థ.. ఏడాదిన్నరలో నిర్మాణం పూర్తి చేసి, 30 ఏళ్లపాటు నిర్వహించాలన్నది షరతు. బిడ్లు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 17 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు. భవనాలకు వేర్వేరుగా ఏసీ, చిల్లర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయకుండా.. ఒక కేంద్రీకృత ప్లాంట్‌లో చల్లబరిచిన నీటిని పైప్‌ల ద్వారా భవనాలకు సరఫరా చేసి వాటిని చల్లబరిచే వ్యవస్థను డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్‌గా పిలుస్తారు. అమరావతి పరిపాలనా నగరంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కోసం నిర్మిస్తున్న ఐదు టవర్లతో పాటు, భవిష్యత్తులో నిర్మించే మరో రెండు టవర్ల గరిష్ఠ డిమాండ్‌ను ఈ ప్లాంట్ తీర్చాల్సి ఉంది.

ఇద్దరు చిన్నారులు సహా భార్యాభర్తల బలవన్మరణం

వినోద్‌కుమార్, అన్విక, ఇతిక్ష, అహల్య

విశాఖపట్నం (పెందుర్తి), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ యాప్‌లు, ఇతర మార్గాల్లో అప్పులు చేసి తిరిగి చెల్లించలేక ఒత్తిడికి లోనైన భార్యాభర్తలు బలవన్మరణానికి పాల్పడ్డారు. ముక్కుపచ్చలారని ఇద్దరు కుమార్తెలను సైతం తమతోపాటే తీసుకెళ్లిపోయారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కుమ్మరిపేటకు చెందిన మళ్ల వినోద్‌కుమార్ (35)తో పెందుర్తి మండలం చింతలగ్రహారం కాలనీకి చెందిన అహల్య(25)కు 2019లో వివాహమైంది. వినోద్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా ఉపాధి పొందుతున్నారు. ఎనిమిది నెలల క్రితం స్వగ్రామం నుంచి అహల్య పుట్టింటి సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరికి ఇతిక్ష(3), అన్విక (ఏడాదిన్నర) వయసున్న కుమార్తెలున్నారు. శుక్రవారం వినోద్‌కుమార్ తన అక్కాచెల్లెళ్లతో రాఖీ కట్టించుకోవడానికి భార్యాపిల్లలతో కలిసి పెందుర్తి వెళ్లారు. అప్పుల ప్రస్తావన వచ్చినప్పుడు వినోద్‌కుమార్ సోదరుడు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వినోద్‌కుమార్, అతడి భార్య అహల్య పిల్లలతో కలిసి ఉన్న సెల్ఫీతో ఆర్.ఐ.పి. (రిప్) అని పెట్టి ఏడుస్తున్న ఎమోజీలను వాట్సప్ స్టేటస్‌గా పెట్టారు. వినోద్‌కుమార్ మేనకోడలు ఈ స్టేటస్‌ను చూసి కొత్తవలసలోని ఆయన సోదరుడికి సమాచారమిచ్చింది. ఆయన ఈ విషయాన్ని అహల్య తల్లిదండ్రులకు ఫోన్‌లో చేరవేశారు. వారు ఇంటికి వెళ్లి చూసేసరికి వినోద్‌కుమార్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. అహల్య, కుమార్తెలు మంచంపై పడి ఉండడం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాలున్న గదిలో ప్లేటులో అన్నం ముద్దలు ఉన్న నేపథ్యంలో తొలుత చిన్నారులు, భార్యకు విషపూరిత పదార్థాన్ని తినిపించి, తర్వాత వినోద్‌కుమార్ ఉరి వేసుకుని మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడం సరికాదు

- ఉమ్మడి హౌసింగ్ బోర్డు ఆస్తులు టీఎస్‌హెచ్‌బీ ఆధీనంలోనే ఉన్నాయి
- పిటిషనర్లకు జీపీఎఫ్ బకాయిలను మీరే చెల్లించండి
- తెలంగాణ హౌసింగ్ బోర్డుకు ఏపీ హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హౌసింగ్ బోర్డుల మధ్య ఆస్తులు, అప్పుల పంపిణీ వివాదం పరిష్కారం కాలేదనే కారణంతో ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు నిలిపివేయడం సరికాదని ఏపీ హైకోర్టు తేల్చిచెప్పింది. ఉమ్మడి హౌసింగ్ బోర్డుకు చెందిన 96% ఆస్తులు తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ (టీఎస్‌హెచ్‌బీ) ఆధీనంలో ఉన్నందున.. రాష్ట్ర విభజనకు పూర్వపు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బ్యాలెన్స్ బకాయిలను పిటిషనర్లకు చెల్లించాల్సిన బాధ్యత కూడా టీఎస్‌హెచ్‌బీపైనే ఉందని స్పష్టం చేసింది. బకాయిలను వడ్డీతో సహా 8 వారాల్లో చెల్లించాలని టీఎస్‌హెచ్‌బీని ఆదేశించింది. 8 వారాల్లో చెల్లించకపోతే.. పదవీ విరమణ తేదీ నుంచి ఇప్పటి వరకు ఏడాదికి 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. తమ ఆదేశాల మేరకు చేసే చెల్లింపులను రెండు రాష్ట్రాల హౌసింగ్ బోర్డుల మధ్య జరిగే ఆస్తులు, అప్పుల విభజన సమయంలో సర్దుబాటు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల కీలక తీర్పు ఇచ్చారు. ఉమ్మడి ఏపీ హౌసింగ్ బోర్డులో సేవలందించి, రాష్ట్ర విభజన అనంతరం ఏపీ హౌసింగ్ బోర్డుకు కేటాయించిన పలువురు ఉద్యోగులు 2018-20 మధ్య కాలంలో పదవీ విరమణ చేశారు. వారికి రావాల్సిన జీపీఎఫ్ సొమ్ము పూర్తిగా అందకపోవడంతో 2021, 2022 సంవత్సరాల్లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ పెండింగ్‌లో ఉండగా.. ఏపీహెచ్‌బీలో పనిచేసిన కాలానికి జీపీఎఫ్ సొమ్ము అందుకున్నారు. ఉమ్మడి హౌసింగ్ బోర్డులో పనిచేసిన కాలానికి సేకరించిన జీపీఎఫ్ నిధులను హైదరాబాద్ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు.

మరిన్ని వివరాలు www.eenadu.net లో

(c) eenadu

మొక్కలు లేవు.. ముచ్చటా లేదు...

బెంజ్‌సర్కిల్ పైవంతెన పిల్లర్లకు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు కనిపించడంలేదు. నిర్వహణ లోపం కారణంగా చాలా వరకూ డబ్బాలే కనిపిస్తున్నాయి. డ్రిప్ ఇరిగేషన్ సైతం సరిగా పనిచేయక కొన్ని మొక్కలు ఎండిపోగా.. చాలా వరకు చనిపోతున్నాయి. అయినా కనీసం కొత్తమొక్కలు ఏర్పాటు చేయడంలేదు. నిర్మలా కూడలి నుంచి మహానాడు కూడలివైపు వంతెన కింద పరిస్థితిది. - **ఈనాడు,అమరావతి**

నిత్యమై తెలుగు.. నిఖిలమై వెలుగు

ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి వేడుకలను విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళా వేదికలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్.. తెలుగు వైభవానికి గిడుగు చేసిన అపూర్వ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు-2026' మంత్రి అందజేశారు.

- విజయవాడ సాంస్కృతికం

అరాచకంగా వండేస్తూ.. అనారోగ్యాన్ని వడ్డిస్తూ..

- ప్రైవేటు హోటళ్లలో దారుణంగా వంటగదులు
- అపరిశుభ్రత, నిల్వ ఆహారం.. అన్నీ ఉల్లంఘనలే
- మొక్కుబడి జరిమానాలతో అధికారుల నిర్లక్ష్యం

విజయవాడలో అత్యధిక హోటళ్ల వంట గదుల్లో అసలు పరిశుభ్రత మాటే కనిపించదు. అందుకే అధికారులు ఎప్పుడు తనిఖీలు చేపట్టినా.. ప్రధానంగా బయటపడేది వంట గదుల్లో అపరిశుభ్రత, నిల్వ చేసిన మాంసం, కూరగాయలు, వండిన ఆహారమే. అక్కడే వండటం.. ఆ పక్కనే చెత్తను పడేయడం.. ఈగలు, దోమలు, బల్లులు, బొద్దింకలు, ఎలుకలు.. ఒకటి కాదు.. అన్ని జీవాలు అక్కడే కన్పిస్తుంటాయి. అందుకే కొద్ది కాలం కిందట నగరంలో ఓ హోటల్‌లో బిర్యానీలో బల్లి కన్పించింది. మరో హోటల్‌లో ఇలాగే ఓ జెర్రి కన్పించింది. ఇక మళ్లీ మళ్లీ వాడే నూనెలు, ప్రమాదకర రంగులు.. ప్రజల ప్రాణాలనే హరిస్తున్నాయి.

– ఈనాడు, అమరావతి



ఫ్రిజ్‌లో మాంసం నిల్వ

35 వేల పైమాటే..

ఉమ్మడి కృష్ణాలో 35 వేలకుపైగా హోటళ్లు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లున్నాయి. వీటిలో 80 శాతంపైగా వంట గదుల్లో, ఆహారం తయారీ ప్రాంతాల్లో పరిశుభ్రత ఊసేలేదు. తాజాగా నగరపాలిక అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లు, జ్యూస్ షాపులు, టీస్టాళ్లలో తనిఖీలు చేయగా.. నిబంధనల ఉల్లంఘనలు కనిపించాయి. కొన్ని హోటళ్లలో వంట గదులు దారుణంగా ఉండడంతో.. జరిమానాలు వేశారు.

తరచిచూస్తే దారుణం..

నగరంలోని 90 శాతంపైగా అల్పాహార హోటళ్లు, బండ్లు, పకోడీ, బజ్జీ బళ్లు వ్యాధులను వ్యాప్తిచేసే కేంద్రాలుగా మారాయి.

ప్లాస్టిక్ నిషేధమేది?

❖ అధికారికంగా ప్లాస్టిక్‌ను నిషేధించామని అధికారులు చెబుతుంటే.. చాలాచోట్ల ప్లాస్టిక్ రేపర్లను టిఫిన్ పొట్లాల్లో వాడుతున్నారు.

పేపర్లలోనే ప్యాకింగ్

❖ పకోడీ, బజ్జీ బండ్ల దగ్గర చాలా చోట్ల న్యూస్ పేపర్లలోనే వేసి ఇస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రమే పేపర్‌లో ఆకు పెట్టి ఇస్తున్నారు.

వేడివేడివి పాలిథీన్‌లో

❖ వేడి సాంబారు, టీ, పాలు ఇప్పటికీ పాలిథిన్ కవర్లలోనే వేసి ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, బిర్యానీ.. ప్లాస్టిక్ పూత ఉన్న ప్లేట్లలో వేడివేడిగా వేసి పార్సిల్ కట్టేస్తున్నారు.

మండల కేంద్రాల్లో అధ్వానం...

బందరు నగరపాలికలో ఏళ్లుగా అసలు ప్రజారోగ్య విభాగానికి ముఖ్యఅధికారే లేరు. ఇటీవల ఒకరిని నియమించారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, ఇబ్రహీంపట్నం, గన్నవరం, గుడివాడ, పెడన, పామర్రు లాంటి పట్టణాల్లోని హోటళ్లపై అసలు అధికారుల పర్యవేక్షణే లేదు.

వాడిన నూనె మళ్లీ మళ్లీ వాడేసి..

మిగిలింది.. మర్నాడు వేడిచేసి..

❖ హోటళ్లు, కర్రీ పాయింట్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ❖ నూనె పదే పదే వాడుతున్నారు. ఆహారం మిగిలిపోతే.. ఫ్రిడ్జ్‌లో పెట్టి మర్నాడు వేడిచేసి అమ్మేస్తున్నారు. ❖ మాంసాహారం నెలలుగా డీప్ ఫ్రిడ్జ్‌లలో ఉంచుతున్నారు. పాడైతే ఫ్రైచేసి ఇచ్చేస్తున్నారు. ❖ వంట గదుల్లో శుభ్రత లేక. ఆహారంలో బొద్దింకలు, పురుగులు, బల్లులు పడుతున్న ఘటనలు కోకొల్లలు.. ❖ ప్రమాదకర టేస్టింగ్ సాల్ట్, రంగులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు రోజైనా విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎస్‌ఈ హనుమయ్య తెలిపారు. దీంతో పాటు ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్తు సర్వీసు నంబరును యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కూడా విద్యుత్తు బిల్లులను చెల్లించవచ్చన్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్‌డెస్క్ యాప్‌ల ద్వారా కూడా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చని ఎస్‌ఈ తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

Exclusive
SSC
(Staff Selection Commission)
CGL / CHSL / MTS / GD CONSTABLES
and All other Competitive Exams
Batches on } 2-9-2026 (1.30 pm - 8.00 pm)
Sreedhar's® COLLEGE FOR COMPETITIVE EXAMS
Suryaraopet, VIJAYAWADA-2.
Cell : 9392668899
www.sreedharscce.com

కాలువలకు 9,302 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టిసీమ నీటికి(గోదావరి జలాలకు), స్థానికంగా కృష్ణా నదిలో మునేటి వరద తోడైంది. దీంతో కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు శనివారం నీటి విడుదలను బాగా పెంచారు. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులో కురిసిన వానలకు వైరా, కట్టలేరుల నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో మునేటి నుంచి ప్రకాశం బ్యారేజీకి 3,000 క్యూసెక్కుల మేర వరద నీరు వస్తోంది. ఈ క్రమంలో నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి మొత్తం 9,302 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 5,118, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 4,012, గుంటూరు ఛానల్‌కు 172 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్‌కు 2,005, ఏలూరుకు 1,302, కేఈబీకి 906, బందరు కాలువకు 905 క్యూసెక్కులు చొప్పున విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది. మునేటి వరద తాత్కాలికమేనని, ఆదివారం తగ్గవచ్చని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది.

NOTIFICATION RELEASED
SBI CLERK | 9766 VACANCIES
Last Date : 31-8-2026
Qlf: Any Graduate, Age: 20-28 years
EXAMS : PRELIMS in SEP-2026, MAINS in NOV-2026
Batches on } 2-9-2026 (10 am - 1 pm)
Sreedhar's® COLLEGE FOR COMPETITIVE EXAMS
Suryaraopet, VIJAYAWADA-2.
Cell : 9392668899
www.sreedharscce.com

నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

కానూరు: జిల్లాలో ఆదివారం జరగనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం నగరంలోని వీఎస్‌సీఎం ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ కేంద్రాల్లో 843 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలతో పాటు ఇతర సౌకర్యాల కల్పనను ఆయన పరిశీలించారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ✪ కృష్ణాజిల్లాలో కానూరు ఐయాన్ డిజిటల్ సెంటర్, గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలోనూ పరీక్షా కేంద్రాలు కేటాయించారు.

RAILWAY RECRUITMENT BOARD
ANNUAL CALENDAR RECRUITMENTS
Notification Released
JUNIOR ENGINEER 4028 VACANCIES
LAST DATE:13-9-26
NOTIFICATIONS SOON : NTPC/JE/GROUP-D/RPF/PARAMEDICAL
తెలుగు మీడియం } 23-9-2026 (1.30pm - 8.00pm)
Sreedhar's® COLLEGE FOR COMPETITIVE EXAMS
Suryaraopet, VIJAYAWADA-2.
Cell : 9392668899
www.sreedharscce.com

కోరినంత ఇచ్చుకో.. కావాల్సినంత పుచ్చుకో..

- ✪ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిన వ్యక్తి చనిపోయినా పట్టదు
- ✪ కోర్టు ఇంజంక్షన్ ఆదేశాలిచ్చినా అడ్డగోలు రిజిస్ట్రేషన్

ఈనాడు, అమరావతి

ఉమ్మడి కృష్ణాలో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా హద్దు మీరుతోంది. నిబంధనలు గాలికొదిలి మామూళ్ల కక్కుర్తితో అడ్డగోలుగా హక్కులను మార్చేస్తున్నారు. వివాదాస్పద భూములను, న్యాయస్థానాలు ఇంజంక్షన్ ఆదేశాలిచ్చిన భూములనూ ఇష్టమొచ్చినట్లు రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. అధికారులు భారీగా ముడుపులు తీసుకుని జేబులు నింపుకొంటుంటే.. నష్టపోయిన వారేమో అర్జీలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అంతా మాఇష్టం అన్నట్లు...

✱ గన్నవరం విమానాశ్రయం పరిధిలో విలువైన 3.43 ఎకరాల భూమిని 1996లో కొన్నారు. అమ్మిన భూమికి యజమానులు ఇద్దరికి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చినట్లు నకిలీ పత్రం సృష్టించారు. దాన్ని ఆధారంగా చేసుకుని 2023లో 2,000 గజాల భూమిని కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వాస్తవానికి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిన ఇద్దరిలో ఒకరు 2016లో చనిపోయారు. ఇలా చనిపోతే నిబంధనల ప్రకారం పవర్ ఆఫ్ అటార్నీ చెల్లదు. అయినా కొందరు అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులు భారీగా మామూళ్లు తీసుకుని అడ్డగోలుగా కథ నడిపారు. నష్టపోయిన రైతు ఫిర్యాదుతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయలేదు.

భారీగా ముడుపులు

✱ జగ్గయ్యపేట పరిధి తొర్రగుంటపాలెంలో ఓ కుటుంబం 50 ఏళ్లగా ఉంటోంది. వారికి ఇళ్ల స్థలాల హక్కు స్వాధీన పత్రాలు ఉన్నాయి. గ్రామంలో మరోవర్గంతో భూ వివాదాల నేపథ్యంలో న్యాయస్థానం ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చింది. న్యాయస్థానం ఉత్తర్వులు లెక్క చేయకుండా కొద్దిరోజుల కిందట ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో శాఖ అధికారులు, సిబ్బంది భారీగా ముడుపులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ✱ తిరువూరు మండలం గానుగపాడులో ఓ వ్యక్తికి 75 సెంట్ల భూమి ఉంది. దాన్ని 2016లో సొసైటీలో పెట్టి రుణం తీసుకున్నారు. రుణం చెల్లించకుండానే చనిపోయారు. ఇప్పటికీ పొలం మార్ట్‌గేజ్‌లో ఉండగానే వారసులకు తెలియకుండానే వేరొకరు కొన్నట్లు రిజిస్ట్రేషన్ చేసేశారు.

ఇష్టారాజ్యంగా...

✱ ఉమ్మడి జిల్లాలో చాలా కార్యాలయాల్లో మధ్యవర్తులు, అధికారులు, సిబ్బంది కుమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా.. దస్త్రం కదలటం లేదు. నేరుగా వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవటం దాదాపు అసాధ్యమే. ఒకవేళ వెళ్లినా కాళ్లరిగేలా తిరగటమే తప్ప పని చేయటంలేదు. ✱ సాధారణ రిజిస్ట్రేషన్లకు కమీషన్లు తీసుకోవటం సర్వసాధారణం కాగా.. కోర్టు ఉత్తర్వులున్న భూములు, రుణాలు తీసుకుని మార్ట్‌గేజ్‌లో ఉన్నవి, పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిన వారు చనిపోయిన భూములైనా.. మామూళ్లు ఇస్తే చాలు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.లక్షల్లో బాదేస్తున్నారు.

ఇక ప్రజల చెంతకే పీజీఆర్ఎస్

పట్టణాలు/పంచాయతీల్లో రోజూ నిర్వహణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని నగరం/పట్టణాలు/పంచాయతీల్లోని స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో రోజూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయాల పని రోజుల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ రిజిస్టర్‌ను నిర్వహిస్తూ పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు అర్జీలు స్వీకరించి, నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ✪ వ్యవసాయ సహాయకులు, సర్వే, రెవెన్యూ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నిర్వహించే రోజులు, అర్జీల స్వీకరణ వేళలు తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్, అర్జీల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

1.13లక్షల వెదురు విత్తన బంతుల తయారీ

యంగ్ ఇండియన్స్ అమరావతి చాప్టర్ నిర్వహణ | ఆసియా బుక్‌లో చోటు

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రాన్ని అందుకుంటున్న బాలకృష్ణ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: వీపీ సిద్ధార్థ కళాశాల మైదానంలో శనివారం 1,13,109 వెదురు విత్తన బంతులను విద్యార్థులు తయారు చేశారు. దీనికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం లభించింది. యంగ్ ఇండియన్స్ అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో ఈ పర్యావరణ హిత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యంగ్ ఇండియన్స్ అమరావతి చాప్టర్ ఛైర్మన్ బాలకృష్ణ చిట్టినేని, కో ఛైర్మన్ రామ్ నాగార్జున కొండ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, పెరిగిపోయిన కాలుష్య ప్రభావాన్ని తగ్గించడానికి.. చెట్లు నాటడం ఒక్కటే ఏకైక పరిష్కారం అనే నినాదంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రికార్డు స్థాయిలో విత్తన బంతులను తయారుచేయడంతో.. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు లభించింది. ఆ సంస్థ అధికార ప్రతినిధి సగయరాజ్ హాజరై.. ధ్రువపత్రాన్ని అందజేశారు. రెండు వేలమందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాల్లో చల్లేందుకు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

కథ కంచికి.. కంత్రీలు ఇంటికి

- పన్నులు చెల్లించని సరకుకి అండదండలు
- అక్రమార్కుల నుంచి యథేచ్ఛగా వసూళ్లు
- పన్నుల శాఖ ఖజానాకు భారీగా గండి

రాష్ట్ర పన్నుల శాఖ ఖజానాకు భారీగా గండి కొట్టిన కేసులో మూడేళ్ల తర్వాత ముగ్గురు ఉద్యోగులను... సర్వీసు నుంచి పూర్తిగా డిస్మిస్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2023లో విజయవాడ రాష్ట్ర పన్నుల శాఖ డివిజన్ 01 కార్యాలయ ఇంటెలిజెన్స్ యూనిట్‌లోని డిప్యూటీ కమిషనర్ కె. సంధ్య, జీఎస్‌టీవో బి. మెహర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కె.వి. చలపతి.. అక్రమార్కులతో కలిసి ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులను భారీగా వెనకేశారు.

ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో అప్పటి డివిజన్ 01 ఇంటెలిజెన్స్ విభాగం డిప్యూటీ కమిషనర్ జహీర్ ఫిర్యాదు మేరకు.. పటమట ఠాణాలో కేసు నమోదవగా నెలలపాటు విచారణ సాగింది. నిందితుల ఇళ్లలో సోదాల్లో కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు.

✪ విజయవాడ డివిజన్-01లో జీఎస్టీ లైసెన్స్‌లు పొందిన డీలర్లు, వ్యాపారులతో కుమ్మక్కై అధికారాన్ని దుర్వినియోగం చేయడం, ఏపీ జీఎస్టీ యాక్ట్ 2017 ప్రకారం నిర్వహించాల్సిన రికార్డులను మార్చేయడం, తప్పుడు రికార్డులు సృష్టించడం, పన్నులు చెల్లించాల్సిన కీలక దస్త్రాలను మాయం ఆరోపణలతో వీరిపై కేసు నమోదైంది.

రూ.10 కోట్ల వరకూ కొల్లగొట్టినట్టు..

✪ కేసు విచారణ, సోదాలు రెండు నెలలుపైగా సాగాయి. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు కూడా తరలించారు. రూ.100 కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. సీఐడీ, ఏసీబీ, పటమట పోలీసుల ఆధ్వర్యంలో విచారణ కొనసాగింది. చివరికి వీరు కొల్లగొట్టింది... రూ.10 కోట్లు ఉంటుందని లెక్కలు తేల్చారు.

జీఎస్టీ చట్టాన్ని అడ్డం పెట్టుకుని...

✪ నకిలీ పత్రాలతో జీఎస్టీ లైసెన్స్‌లు ఇవ్వడం, వేరే నగరాల్లో కొని తీసుకొచ్చిన పన్నులు చెల్లించని సరకును.. ఇక్కడ ఎవరూ పట్టుకోకుండా గోదాములకు తరలించేలా సహకరించడం, మాట వినని డీలర్లు, వ్యాపారులను బెదిరించడం వంటి అక్రమాలు విచారణలో బయటపడ్డాయి.

మాయమైన దస్త్రాలు దొరికాయ్...

నిందితుల ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో భారీగా నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం నుంచి కనిపించకుండా పోయిన అనేక దస్త్రాలు సైతం వీరి దగ్గర దొరికాయి.

పది మందిపై ఆరోపణలు...

అక్రమాల్లో.. డివిజన్-01 ఇంటెలిజెన్స్ విభాగంలో 10 మంది హస్తం ఉన్నట్లు అప్పట్లో గుర్తించారు. తర్వాత వీరిలో నలుగురికి క్లీన్‌చిట్, ఇద్దరికి ఇంక్రిమెంట్ల కోత, ఒకరికి పెన్షన్ కత్తిరించారు. తాజాగా ముగ్గురిని డిస్మిస్ చేస్తూ ప్రభుత్వం ఆదేశించింది. ✪ ప్రస్తుతం డిస్మిస్‌కు గురైన సంధ్య రాష్ట్ర కార్యాలయంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా, మెహర్‌కుమార్ డివిజన్ 03లో జీఎస్‌టీవోగా, కె.వి.చలపతి విజయవాడ సామరంగాచౌక్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

– ఈనాడు, అమరావతి

WANTED
1. PALM OIL PRODUCTION MANAGER: With 5 Years Experience able to manage Production Activities to work in Ghana, West Africa
2. PALM PLANTATION SUPERVISORS: Having Experience in Growing Palm Plantation to work in Ghana, West Africa.
Contact:9494959595
Email: rvripl@gmail.com
Address:
2-1-59, Opp:Subhadra Arcade Complex, 4th floor, Bhanugudi Junction, Kakinada-533004

WANTED FOR MODEL DAIRY
CASHIER : Well Experienced
Qualification : Any Degree, Candidates With Good Accounting & Tally skills and 10 to 15 Years of relevant experience.
Interested candidates may contact immediately.
MODEL DAIRY PVT. LTD.
Airport Road, Nidamanuru, Vijayawada.
Cell : 98485 47775
email : modeldairy111@yahoo.com

బాధ్యత మరిచి.. బరితెగించి..

- మద్యం మత్తులో కొందరు టీటీఈల విధులు
- రైల్లో ప్రయాణికులతో అసభ్య ప్రవర్తన

ఎంతో మంది రైల్వే టీటీఈలు నిబద్ధతతో పని చేస్తూ రైల్వే శాఖకు మంచి పేరు తీసుకొస్తుంటే మరికొందరు టీఈఈల తీరు రైల్వే శాఖకు మచ్చ తెస్తుంది. టీటీఈలు రైలు ప్రయాణంలో ఎంతో బాధ్యతగా, అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రయాణికులు రైలు ఎక్కిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు వారి భద్రతతో పాటు వారికి పూర్తి సహాయ, సహకారాలు అందించాల్సిన బాధ్యత టీటీఈలదే. డ్యూటీలో ఉండగా మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రైల్వే శాఖ రైలు ఎక్కే ప్రతి టీటీఈలను పరీక్షలు చేసేవారు. ప్రస్తుతం అలా జరగకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ఇటీవల విజయవాడ డివిజన్‌కు చెందిన ఓ టీటీఈపై ప్రయాణికురాలు తనకు జరిగిన సంఘటనను నేరుగా రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు టీటీఈలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

☛ నెల రోజుల కిందట టీటీఈ నర్సాపూర్ రైల్లో విధులు నిర్వహించాల్సి ఉన్నా అసలు రైలే ఎక్కలేదు. ప్రయాణికులు ఈ విషయాన్ని విజయవాడలోని కమర్షియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే విచారణ చేపట్టారు. ఆర్పీఎఫ్ దీనిపై విచారణ చేపట్టింది. రైలు ఎక్కకుండా మద్యం సేవించి ప్లాట్‌ఫామ్‌పై ఉన్నట్లు తేలింది. బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్ష చేయగా అధిక మొత్తంలో మద్యం తాగినట్లు బయటపడింది.

☛ మూడు నెలల కిందట మరో టీటీఈ విధుల్లో భాగంగా భీమవరం నుంచి విజయవాడకు వచ్చే ఎక్స్‌ప్రెస్ రైల్లో పూటుగా మద్యం తాగి మత్తులో బట్టలు కూడా లేకుండా ఏసీ బెర్తులో పడుకున్నారు. ప్రయాణికులు అతని కోసం వాకబు చేయగా ఎక్కడా కనబడలేదు. చివరికి రైలు విజయవాడ వచ్చినా లేవకపోవడంతో ఇక్కడి నుంచి విధులు చేపట్టే టీటీఈలు నిద్ర లేపాల్సి వచ్చింది. ☛ విజయవాడకు చెందిన ఓ టీటీఈ మద్యం మత్తులో రాత్రి సమయంలో మహిళా ప్రయాణికులు నిద్రిస్తుంటే మీద చేతులు వేస్తూ వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని సదరు మహిళ సామాజిక మాధ్యమం ద్వారా రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. – ఈనాడు,అమరావతి

☛ టీటీఈలు మద్యం మత్తులో ఉండడం దొంగలకు అవకాశంగా మారుతోంది. జనరల్ టికెట్ తీసుకొని టీటీఈకి రిజర్వేషన్ బెర్తుకు డబ్బులు ఇచ్చి ప్రయాణిస్తున్నారు. మార్గం మధ్యలో చోరీలు చేసి ఏదో ఒక స్టేషన్‌లో దిగిపోతున్నారు. ఇలా జనరల్ టికెట్ తీసుకొని రైలు ఎక్కితే దొంగలను పట్టుకోవడం పోలీసులకు కూడా సాధ్యపడదు.

139

☛ ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రయాణికులు రైల్వే హెల్ప్‌లైన్ నంబరు 139లో ఫిర్యాదు చేయవచ్చు. ఫొటో, వీడియోలు కూడా తీసి ఎక్స్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

☛ రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 145 ప్రకారం రైలు ప్రయాణంలో మద్యం సేవించడం లేదా అసభ్యకరంగా ప్రవర్తించడం చట్టవిరుద్ధం. నేరం రుజువు అయితే 6నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

A Project by LOTUS N DEVELOPERS
LOTUS GRAND
లోటస్‌లో ఇల్లు చిరునవ్వుల హరివిల్లు
3BHK LUXURIOUS APARTMENT 1700 S.Ft
READY TO OCCUPY
AP RERA APPROVED

FOR MORE INFORMATION CONTACT US 93978 45671
Beside Andhra Prabha Colony Road, Near Vishal Mega Mart, Nandamuri Nagar, Vijayawada -15
LOCATION SCANNER

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

జననం 25-05-1945 | మరణం 19-08-2026
కీ॥శే॥ శ్రీ మరీదు వెంకట నాంచారరావు (స్వామి) గారు
(ఆంధ్రా టైప్ ఇనిస్టిట్యూట్ అధినేత స్వామి గారు)
తరతరాలకు తరగని మంచితనం, మధురిమలను పంచి ఇచ్చిన మానవతామూర్తి, కుటుంబ ఉన్నతితోపాటు సమాజ అభివృద్ధికై నిరంతరం కృషి చేసిన మీరు మా నుండి దూరమవడం మాకు తీరని లోటు. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆ మహాదేవుని ప్రార్థిస్తూ.. - కుటుంబ సభ్యులు
పెద్దకర్మ: ది. 31-08-2026 సోమవారం విజయవాడ పటమట ఆటోనగర్ బస్ టెర్మినల్ ఎదురుగా సాయిబాబా కళ్యాణ మండపం నందు జరుపబడును. ✆ 91601 76740

MRB PRUTHVI TOYOTA
Build Your Career With Us
Locations: Vijayawada | Eluru
➤ SALES EXECUTIVES ➤ SERVICE ADVISOR
➤ ACCESSORIES INCHARGE ➤ SALES MANAGER

Contact us to schedule your interview
8712424389 | 8712628425
Send Your Resume: hr_vj04a@pruthvitoyota.com

(c) eenadu

దివ్యాంగుల ఉపాధికి ప్రభుత్వం భరోసా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టరేట్‌లో 58 మంది దివ్యాంగులకు రూ.66.70 లక్షల విలువైన మూడు చక్రాల మోటార్ వాహనాలను శనివారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ ఛైర్మన్ జి.నారాయణస్వామి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సీఎం చిత్రంతో పాటు, థ్యాంక్యూ సీఎం సార్ నినాదంతో కూడిన మూడు చక్రాల వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. ఛైర్మన్ నారాయణస్వామి, కలెక్టర్ జి.లక్ష్మీశలు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఇతరులపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునేలా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వాహనాలు ఎంతో దోహదపడతాయన్నారు. నారాయణస్వామి, కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియా ఈ వాహనాలను దివ్యాంగులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 113 దరఖాస్తులు అందగా.. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వాడ్రేవు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి మూడు చక్రాల వాహనాన్ని అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అడ్వాన్స్‌డ్ డ్రోన్‌తో.. గంజాయి కట్టడిపై వినూత్న ప్రచారం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

సాయంత్రం 6 గంటలు.. పండిట్ నెహ్రూ బస్టేషన్.. బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా పోలీస్ సైరన్ విన్నారు.. ఏమైందా అని పోలీస్ వాహనం కోసం ఎదురు చూశారు. కనుచూపు మేరలో ఎక్కడా వాహనం కనిపించకపోవటంతో ఏంటా అని ఆశ్చర్యపోయారు. ఈ లోగా విజయవాడ ప్రజలకు ఎన్టీఆర్ పోలీసుల ముఖ్యవిజ్ఞప్తి అంటూ మైక్ ప్రకటన రావటంతో ఎక్కడా చుట్టూ చూశారు. తలెత్తి పైకి చూసేసరికి ఎల్ఈడీ లైట్లతో ధగధగలాడుతూ మైక్ ప్రచారం చేస్తున్న డ్రోన్‌ను చూసి ఆశ్చర్యపోయారు.

ఈగల్ ఛాలెంజ్‌పై.. : గంజాయి తాగే వారిని పట్టిస్తే రూ.1500, అమ్మే వారిని పట్టిస్తే రూ.5 వేలు నగదు బహుమతిగా ఇస్తామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఇటీవల ప్రకటించారు. 'ఈగల్ ఛాలెంజ్'పై ఇప్పటికే విస్తృత ప్రచారం చేపట్టిన పోలీసులు తాజాగా మైక్ ఉన్న డ్రోన్‌తో ప్రచారం చేయటం ఒకింత ఆశ్చర్యం కలిగించింది. రాష్ట్రంలోనే తొలి సారిగా ఈ తరహా ప్రచారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ శ్రీకారం చుట్టారు. అడ్వాన్స్‌డ్ మాట్రిక్ 4టి డ్రోన్‌ను పోలీసులు ఈ ప్రచారంలో ఉపయోగించారు.

తొలి రోజు 10 ప్రాంతాల్లో.. : వినూత్న ప్రచారాన్ని తొలి రోజు 10 ప్రాంతాల్లో నిర్వహించారు. రాణిగారితోట, పండిట్ నెహ్రూ బస్టేషన్, ఎన్టీఆర్ కాంప్లెక్సు, లెనిన్ సెంటర్, 5వ రూట్, బీసెంట్ రోడ్డు, నక్కల రోడ్డు, పాత విజయా టాకీస్ కూడలి, అంబేడ్కర్ విగ్రహం తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. గాలిలో వెళుతూ మైక్‌లో చెబుతుండంతో అంతా ఆశ్చర్యంగా చూశారు. గంజాయి సమాచారం తెలిసిన వారు 112 లేదా ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972కు సమాచారం అందించాలంటూ ప్రచారం చేయటంతో అంతా ఆశ్చర్యంగా చూశారు. పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో మహిళలైతే ఔనా నిజమా అంటూ ఆశ్చర్యపోవటం కనిపించింది.

పీఎన్‌బీఎస్ సిటీ టెర్మినల్‌లో డ్రోన్‌తో చైతన్యం

ఈ శ్రావణ మాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో... సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!

అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగ అవివాహిత వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, నేడు, రేపు **అన్ని కులాల ప్రభుత్వ ఉద్యోగ** అవివాహిత వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (30 ఆదివారం & 31 సోమవారం, ఆగస్టు 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

నోట్: ఈ శ్రావణమాసంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో ★ ఒక నెల ప్రొఫైల్ హైలైటర్ (మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం) ★ అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్ట్‌లు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

మరిన్ని వివరాలకు: 95501 28306 & 92475 20500 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

న్యాయవాదుల సహకారంతోనే కక్షిదారులకు సత్వర న్యాయం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎంతో సహకారం అందిస్తున్నారని కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఆమె విజయవాడకు వచ్చేశారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో తాను విజయవాడలో న్యాయాధికారిగా పని చేసిన విషయాలను గుర్తు చేసుకున్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో కలసి పని చేస్తేనే కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ న్యాయస్థానాల సముదాయంలో ఉన్న కొన్ని సమస్యలను న్యాయమూర్తికి వివరించారు. అనంతరం బీబీఏ కార్యవర్గ సభ్యులు ఇస్సంశెట్టి ఉషాజ్యోతి, వేములపల్లి పద్మజ, రామతేజ, ఎం.శ్రీకాంత్ తదితరులు న్యాయమూర్తికి జ్ఞాపిక అందించారు. చలసాని అజయ్ కుమార్, గంగాభవానీ, ఎం.జయకర్, కిరణ్ బాబు, వి.జయప్రకాశ్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినికి జ్ఞాపిక అందిస్తున్న బీబీఏ కార్యవర్గ సభ్యులు

అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా

బాస్కెట్‌బాల్ అండర్-17 బాలుర విభాగంలో మొదటి స్థానం సాధించిన ఎన్టీఆర్ జట్టు

ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, తిరుపతి క్రీడలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు అంగరంగ వైభవంగా ముగిశాయి. శనివారం కబడ్డీ, హాకీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడల ఫైనల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు బహుమతులు అందజేశారు.

విజయ పాల సేకరణ ధర లీటరు రూ.88కి పెంపు

- పాలకమండలి నిర్ణయం
- సెప్టెంబరు 1 నుంచి అమలు
- సుమారు లక్షన్నర మంది రైతులకు ప్రయోజనం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పాల సేకరణ ధర లీటరు రూ.88కు పెంచడంతో సుమారు లక్షన్నర మంది పాడి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. చిట్టినగర్ సమీపంలోని విజయ డెయిరీ ప్రాంగణంలో పాలకమండలి సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. పాల సేకరణ ధర పెంపుపై చర్చించారు. ప్రస్తుతం గేదె పాల సేకరణ ధర 10 శాతం వెన్న ఉన్న లీటరు పాలకు రూ.85 ఇస్తుండగా, అదనంగా రూ.3 పెంచడం వల్ల రూ.88కి చేరింది. ఆవు పాల ధర లీటరు రూ.25 ఉండగా, ఇప్పుడు రూ.4 పెంచడంతో లీటరు పాల సేకరణ ధర రూ.29కి చేరింది. పెంచిన ధరలు సెప్టెంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తున్నాయి. పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఇదొక తీపి కబురు.

నారీమణుల సాధికారతే లక్ష్యం

మాట్లాడుతున్న ఛైర్మన్ ఎల్లారావు, వేదికపై అరుణ్‌కుమార్, రాంకీ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థిక పరిపుష్టితోపాటు మహిళా సాధికారతే లక్ష్యంగా పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పనిచేస్తుందని సంస్థ ఛైర్మన్ ఎ.ఎల్లారావు అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 13వ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారావు మాట్లాడుతూ విజయవాడ సీతారామపురంలో 12 ఏళ్ల క్రితం స్థాపించిన ఈ సొసైటీ అనతి కాలంలోనే అనూహ్య అభివృద్ధి చెందిందన్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యం ఇస్తూ 19వేల మంది మహిళలకు ఆర్థిక తోడ్పాటు ఇచ్చిందన్నారు. 79వేల మంది సభ్యులతో కొనసాగుతున్న ఈ సొసైటీలో రూ.5కోట్ల షేర్ క్యాపిటల్, రూ.227కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. రూ.150కోట్ల మేర తమ సంస్థ రుణాలను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 28 శాఖలతో సేవలు అందిస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.357కోట్ల టర్నోవరు సాధించేందుకు సహకరించిన సభ్యులు, డిపాజిట్‌దారుల అంకిత భావాన్ని ప్రశంసించారు. సంస్థ పూర్వ ఛైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, కోశాధికారి జోత్స్న, సీఈవో రాంకీ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ఠ భద్రత

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఈవీఎం, వీవీప్యాట్‌లు ఉన్న గోదాముకు పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును ఆయన శనివారం పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదామును అధికారులు, రాజకీయ నాయకుల సమక్షంలో ప్రతి నెలా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పోలీసు సిబ్బందితో పాటు సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతకం చేశారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నాయకులు రామయ్య, గోవింద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దేవినేని ఉమాపై కేసు కొట్టివేత

మచిలీపట్నం కార్పొరేషన్, కొండపల్లి, న్యూస్‌టుడే: మాజీమంత్రి, తెదేపా సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు, మరికొందరిపై పెట్టిన కేసు కొట్టివేస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి దుర్గాపూర్ణిమ శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. దేవినేని ఉమా మరో 17 మంది కలిసి కుట్రతో కార్లను అడ్డగించి, కులం పేరుతో దూషించి రాళ్లతో కొట్టి గాయపరచడమే కాకుండా పోలీసుల విధులకు ఆటంకంగా కలిగించారని 2021 జులై 27న దాసరి సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై జి.కొండూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక ఏపీపీ బోగిరెడ్డి వెంకన్నబాబు ఏడుగురు సాక్షులను విచారించగా ప్రాసిక్యూషన్ కథనానికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చారు. నేరం నిరూపణ కానందున కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

న్యాయం గెలిచింది..: కొండపల్లి అటవీప్రాంతంలో అక్రమమైనింగ్ జరుగుతుందని తెలిసి అడ్డుకోవడానికి వెళ్తే తమపై దాడిచేసిందే కాక అక్రమకేసు పెట్టారని దేవినేని ఉమా అన్నారు. పలువురు నాయకులతో కోర్టుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ.. హత్యాయత్నం, కుల దూషణ, ప్రభుత్వ నిషేధ ఉత్తర్వుల ఉల్లంఘన, దాడి, అక్రమ నిర్బంధం ఇలా అక్రమంగా 14 సెక్షన్లపై కేసులు పెట్టారన్నారు. తనతోపాటు మిగిలిన వారందరూ ఎన్ని పనులు ఉన్నా ఆరేళ్లుగా మచిలీపట్నంలోని కోర్టుకు వాయిదాలకు తిరుగుతూనే ఉన్నామని, చివరికి న్యాయమే గెలిచిందన్నారు. తనపై 90 కేసులు పెట్టారని, తమ నాయకుల్లో కొందరిపై 5 నుంచి 20 కేసులు ఉన్నాయన్నారు. ఎప్పటికైనా సత్యం, న్యాయం, ధర్మమే గెలుస్తాయన్నారు.

కోర్టు వద్ద నాయకులతో ఉమామహేశ్వరరావు

మచిలీపట్నం, శివమొగ్గ టౌన్ మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం మచిలీపట్నం, శివమొగ్గ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07217 ప్రత్యేక రైలు ఈ నెల 30వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3.55కి మచిలీపట్నంలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు శివమొగ్గ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07218 శివమొగ్గ టౌన్‌లో సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం 5.40కి బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.55కి మచిలీపట్నం చేరుతుంది. ఈ రైలు గుడివాడ, విజయవాడ, కృష్ణా కెనాల్, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, బేతంచర్ల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం, యలహంక, భద్రావతి స్టేషన్లలో ఆగుతుంది.

బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలి

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాజకీయాలకతీతంగా బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక శృంగేరీ శారదా పీఠ శ్రవణ మందిరంలో వృద్ధ బ్రాహ్మణ దంపతులను సత్కరించారు. బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో పయనిస్తూ తోటివారికి సహాయపడాలని కోరారు. అనంతరం 125 మంది మహిళలు లక్ష కుంకుమార్చన చేశారు. 125 మంది వృద్ధ బ్రాహ్మణ దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు తణుకు రామకృష్ణ, కొప్పరపు మారుతీ, పాండురంగ వరప్రసాద్, గొర్తి శ్రీనివాస్, వెంకటేశ్వరశర్మ, ప్రయాగ వరప్రసాద్, రమణ, యజ్ఞప్రసాద్, బాలసుందరి, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

బలరామ్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిర్వహణ ముఖ్యం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిర్వహణ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వికసిత్ భారత్, 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)లో పట్టణ, గ్రామీణ ఆంధ్రప్రదేశ్ కోసం సుస్థిర నీటి నిర్వహణ, వలయాకార, వాతావరణ మార్పులను తట్టుకోగల నీటి ఆర్థిక వ్యవస్థ దిశగా' అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో ప్రధానంగా నీటి భద్రత కోసం డిజిటల్ ట్విన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ప్రాంతీయ నీటి వ్యవస్థల పాలన, వర్షపు నీటి సేకరణ, పట్టణ నీటి సరఫరా వ్యవస్థలపై అతిథులు మాట్లాడారు. రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(అప్‌కాస్ట్) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆచార్య శరత్ కుమార్ గౌరవ అతిథిగా విచ్చేయగా, కళాశాల డైరెక్టర్ రమేష్ శ్రీకొండ కీలకోపన్యాసం చేశారు. నీటి భద్రతపై మిధున్ ఆనంద్, పట్టణ నీటి పద్ధతులపై అర్పన్ పాల్ సింగ్, మురుగు నీటి పునర్వినియోగాన్ని విస్తరించడంపై జితేంద్రపాల్, ప్రాంతీయ నీటి భద్రత కోసం ప్రణాళిక అంశంపై రాజీవ్.ఆర్ మాట్లాడారు. సదస్సులో ప్రభుత్వం, విద్యా సంస్థలు, ఆర్థిక సంస్థలు, సాంకేతిక సంస్థలు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కన రమేష్ శ్రీకొండ తదితరులు

ఘనంగా వెంకటేశ్వర అవధాని శత జయంతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అడవిరావులపాడులో శనివారం శ్రీ రామలింగ వేంకటేశ్వర వేద విద్వత్ సభ వ్యవస్థాపకులు దివంగత దుర్భాకుల వెంకటేశ్వర అవధాని శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని చెన్నమల్లికార్జునస్వామి దేవాలయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 70 మంది వేదపండితులు వేదపారాయణం చేశారు. ఈసందర్భంగా వేదపండితులు చింతపల్లి ఆంజనేయ ఘనాపాటి, లక్ష్మీనారాయణ ఘనాపాటి, విష్ణుభట్ల ఆంజనేయ చైనులు, గుళ్లపల్లి శివాంజనేయ ఘనాపాటి, దెందుకూరి సోమయాజులు, గొల్లపల్లి సీతారామ ఘనాపాటి, పల్లి రవి ఘనాపాటి, తిరుపతి ఎస్వీ వైదిక్ యూనివర్శిటీ డైరెక్టర్ అంబటిపూడి వెంకటరాధేశ్యామ్, కీసరగుట్ట వేద పండితులు మార్తి సత్యనారాయణ అవధాని ప్రసంగించారు. 200 ఆలయాలను ప్రతిష్ఠలు చేసి వేద విద్యకు ప్రాచుర్యం కల్పించిన అవధాని సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దుర్భాకుల గురునాథ ఘనాపాటి, దుర్భాకుల సాంబమూర్తి అవధాని, సుబ్రహ్మణ్యకామేశ్వర ఘనాపాటి, కుమార అవధాని, రఘునాథ్ ఘనాపాటి తదితరులు పాల్గొన్నారు.

వేదపారాయణం చేస్తున్న వేదపండితులు

వాంబే కాలనీలో ఘాతుకం

మహిళపై సామూహిక అత్యాచారం

పాయకాపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇంటికి వచ్చిన మహిళపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాంబే కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన మహిళ(35)కు భర్త, ఒక కుమారుడు ఉన్నారు. గత నాలుగేళ్లుగా ఆమె విజయవాడ వాంబే కాలనీలోని సీబ్లాక్ సమీపంలో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటోంది. ప్రస్తుతం హిజ్రాలతో భిక్షాటన చేస్తూ నివసిస్తోంది. శనివారం రాత్రి తన స్నేహితురాలైన ఓ హిజ్రా జన్మదిన వేడుకల నిమిత్తం వాంబే కాలనీలోని సీబ్లాక్‌కు వెళ్లింది. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. అనంతరం బాధితురాలు మద్యం మత్తులో హిజ్రా ఇంటి వద్ద పడిపోవడంతో బాధితురాలి మిత్రుడైన సాయి అనే వ్యక్తి ఆమెను ఆమె ఇంట్లోకి తీసుకువెళ్లి పడుకోబెట్టి వెళ్లిపోయాడు. రాత్రి ఒంటి గంట సమయంలో లింగాలపల్లి సాయికుమార్, షేక్.రహ్మతుల్లాలు వచ్చి తలుపు కొట్టారు. తలుపు తీసిన తరువాత బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి గడియ పెట్టారు. అనంతరం ఆమెను మంచంపైకి నెట్టేసి ఒకరి తరువాత మరొకరు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆమెను విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా నున్న సీఐ అహ్మద్ అలీ విలేకర్లతో మాట్లాడుతూ నిందితులు ఇద్దర్నీ గాలించే పనిలో ఉన్నామని, ఇద్దరు మాత్రమే అత్యాచారం చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

బిహార్‌వాసి హత్య కేసులో నిందితుల అరెస్టు

మధిర పట్టణం, న్యూస్‌టుడే : మధిరలో జరిగిన బిహార్ వాసి హత్య కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ నెల 11న మధిర-వైరా రోడ్డు పక్కన పీవీఆర్ అండ్ ఎస్ ఫంక్షన్ హాలు సమీపంలోని బ్రిక్స్ కంపెనీ వద్ద బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా సదాత్‌పూర్ పైగంబర్‌పూర్ కొల్హువా ప్రాంతానికి చెందిన ఎండీ తాలీమ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులు, బ్రిక్స్ కంపెనీలో పని చేస్తున్న గంపలగూడెం మండలం కొమెర గ్రామానికి చెందిన గద్దల జమలయ్య, ఎర్రుపాలెం మండలం గుంటుపల్లి గోపారం గ్రామానికి చెందిన గంజి రాములమ్మ దంపతులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

*బిహార్‌కు చెందిన ఎండీ తాలీమ్ మద్యం మత్తులో బ్రిక్స్ కంపెనీ వద్దకొచ్చి రాములమ్మతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె భర్త జమలయ్య కర్రతో కొట్టగా తలపై తీవ్ర గాయమై తాలీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారు బ్రిక్స్ కంపెనీ యజమాని కాసర్ల వెంకటేశ్వరరావు, అతని బంధువు పేరయ్యకు హత్య విషయం చెప్పారు. కొట్టి చంపిన కర్రను దాచి ఏటైనా పారిపొమ్మని వారు సలహా ఇచ్చారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. దంపతులపై హత్యా నేరం నమోదు చేయడంతో పాటు సాక్ష్యాధారాలను తారుమారు చేయాలని సూచించినందుకు వెంకటేశ్వరరావు, పేరయ్యలనూ నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం వారిద్దరూ పరారీలో ఉన్నారు. నిందితులు వినియోగించిన కర్ర, మృతుడి చరవాణి, దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ రమేష్, ఎస్సై నవిత, సిబ్బందిని వైరా ఏసీపీ సారంగపాణి అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న వైరా ఏసీపీ, మధిర సీఐ, ఎస్సై

ఎస్సీల సమస్యలపై పోరాటం

రాఘవయ్యపార్క్ కూడలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీలపై కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనం, భూముల ఆక్రమణలు, శ్మశాన వాటికలు తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సామాజిక శంఖారావంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్సీలకు కేటాయించిన శ్మశాన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని జీవో నంబరు 1235 ప్రకారం ప్రతి దళితవాడకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు సంబంధించి అర్హులకు పట్టాలు అందించడంతో పాటు అసైన్డ్ భూముల్లో ఆక్రమణలను తొలగించి బాధితులకు తిరిగి అప్పగించాలన్నారు. సామాజిక శంఖారావం అధ్యయన యాత్రల్లో గుర్తించిన ప్రతి సమస్యపై జిల్లా స్థాయిలో శాఖల వారీగా ప్రత్యేక సమీక్ష నిర్వహించి అమలు ప్రణాళికతో సమస్యలను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ చివరి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి తీర్మానం ప్రవేశపెట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.శ్రీనివాస్, కె.ప్రభాకరరెడ్డి, రమేష్ పట్నాయక్, పటేల్, కె.సుబ్బరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోకనాథం, వేదికపై మాల్యాద్రి, సుబ్బరావమ్మ, ప్రభాకరరెడ్డి తదితరులు

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం నిమిత్తం సెప్టెంబరు 12న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం నగరానికి చెందిన పోలీసు అధికారులతో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సమావేశమైంది. 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇరువర్గాలతో మాట్లాడి కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీమా కంపెనీల అధికారులు, ప్రతినిధులతో సమావేశం రేపు .. జాతీయ లోక్ అదాలత్‌లో రోడ్డు ప్రమాద బీమా కేసులు ఎక్కువగా పరిష్కరించే వీలుంది. ఈ క్రమంలో బీమా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి కేసులను పరిష్కరించేందుకు 31న మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాలులో బీమా కంపెనీల ప్రతినిధులతో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు సమావేశమవుతారు. ఇందులో కేసులు రాజీ చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తారు. తద్వారా వచ్చే నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాఘవయ్యపార్క్ కూడలి, న్యూస్‌టుడే: కౌలు రైతులే అధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లుగా విశ్రాంత ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విప్లవ కమ్యూనిస్ట్ యోధుడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తరిమెల నాగిరెడ్డి రాజకీయ దృక్పథం-నేటి భారత వ్యవసాయ సంక్షోభం అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సర్వే లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం కౌలు రైతులు అధికంగా ఉన్నారని, ఆత్మహత్యల్లో వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఎటువంటి సహాయం అందించక పోగా కనీసం గుర్తింపు కార్డులకు కూడా వారు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు నాయకుడు సురేష్ మాట్లాడుతూ నాగిరెడ్డి ఆలోచనలు ఇప్పటికీ ఆచరణీయంగా చెప్పారు. భాగంగా ధరిత్రీ క్రియేషన్స్ నిర్మించిన 'మ్యాన్ ఆఫ్ ది ఎర్త్' డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ట్రస్ట్ ఛైర్మన్ సింహాద్రి ఝాన్సీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి వీవీఎస్ బసవరావు తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్	ఉ. 7 - ఉ. 9
రాశి వాసి	ఉ. 9 - ఉ. 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ. 10 - మ. 2
ఈవారం అతిథి	మ. 2 - సా. 5
టెస్ట్ డ్రైవ్	సా. 5 - రా. 7
#హాష్‌టాగ్	రా. 7 - రా. 9
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 9 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

నీళ్లు లేని సమయంలో జలహారతి ఎందుకు?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత పరిమితంగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం కోసం జలహారతి నిర్వహించడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. శనివారం దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు నీటి లభ్యత ఇరు రాష్ట్రాల అవసరాల నేపథ్యంలో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పిన నేపథ్యంలో కేవలం 10.70 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించి జలహారతి చేయడం ద్వారా మొత్తం వెలిగొండ ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయిందని చెప్పడానికి టన్నెల్లో నీరు ప్రవహించడం, రిజర్వాయర్‌లో నీరు నిల్వ కావడం, జలహారతి నిర్వహించడం ప్రమాణాలు కాదని చివరి ఆయకట్టు రైతు పొలానికి నీరు చేరినప్పుడే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు వద్ద పూల సుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు సీపీఐ చేపట్టిన దశాబ్దాల పోరాట ఫలితమని దీన్ని రాజకీయ క్రెడిట్ కోసం ఉపయోగించవద్దని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అక్కినేని వనజ, పి.దుర్గాభవానీ, రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

బౌలర్ల మాయాజాలం

సెంట్రల్ జోన్ అండర్-23 క్రికెట్ టోర్నీ

కె.నాని సాయి ప్రకాష్ పార్థసారథి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ(మల్టీ డే)లో భాగంగా రెండో రోజైన శనివారం బౌలర్ల మాయాజాలం ఫలించింది. సీపీ మైదానంలో గుంటూరు, పశ్చిమ గోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో శనివారం 32 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బరిలోకి దిగిన పశ్చిమ గోదావరి జట్టు 47.4 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఒ.రణదీప్ 53 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు పి.శరత్ చంద్ర (4/23), పి.సిద్ధు కార్తిక్‌రెడ్డి (4/65)మెరిశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 48 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతోంది. జి.దేవ్ ప్రమోద్ 67, కె.ఎల్.శ్రీనివాస్ 63 పరుగులతో రాణించారు. డీవీఆర్ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో 97 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో శనివారం బ్యాటింగ్‌ను కొనసాగించిన ప్రకాశం జట్టు 68.4 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌటైంది. పి.దుర్గాబాలాజీ 82, ఎన్.అఖిల్ 38 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు కె.నాని (5/41), టి.సాయి ప్రకాష్ (4/69) మెరిశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఆట నిలిపే సమయానికి 40 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులతో కొనసాగుతోంది. కేఎస్ఎన్ నిశ్చయ్ 35 పరుగులు చేయగా.. ప్రత్యర్థి బౌలర్లు జి.జి.పార్థసారథి (4/44), పి.దుర్గా బాలాజీ (3/40) మెరిశారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

భక్తిశ్రద్ధలతో హోమాలు

విజయవాడ సిటీ: పున్నమ్మ తోటలోని తితిదే కల్యాణ మండపం ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడాళ్వార్, బలిపీఠాల ప్రతిష్ఠ, సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం స్మరణీయం

పతకాలు అందుకున్న క్రీడాకారులతో శ్యామ సుందరరావు, ఉపాధ్యాయులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మేజర్ ధ్యాన్‌చంద్ జీవితాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందని హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ శృంగారపాటి శ్యామ సుందరరావు పేర్కొన్నారు. పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వారు శనివారం ప్రకటించిన 'స్కూల్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026' తొలి అయిదు బహుమతుల్లో కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ 621 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలవడం స్కూల్ క్రీడాకారుల, వ్యాయామోపాధ్యాయుల కృషికి నిదర్శనమని కొనియాడారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులకు హెచ్‌సీఎల్ తరఫున వ్యక్తిగత పతకాలు బహూకరించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా.. పీడీలు ఎల్.దుర్గారావు, టి.చంద్రకళ, పీఈటీ సింహాద్రి రమేష్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ❖ ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ స్లైక్స్, మాజీ క్రికెటర్ బండ్లమూడి సుబ్బయ్య (గుంటూరు) పేర్కొన్నారు. స్థానిక ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నేటి యువత క్రీడలపై ప్రత్యేక ఆసక్తి కనబరచాలని పిలుపునిచ్చారు. వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాల్లో ఉన్న 3 శాతం స్పోర్ట్స్ కోటాను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవచ్చో వివరించారు.

ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండ్లమూడి సుబ్బయ్య, కె.భాగ్యలక్ష్మి, యుగంధర్, అంజాద్ అలీ, రమేష్, తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కరెన్సీనగర్: 80085 74652

స్పందన: ❖ మాచవరం పాత ప్రతిభా నికేతన్ రోడ్డులో కొంత కాలంగా తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి రమేష్ బాబు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఈఈ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పైపు వెల్డింగ్ చేయించారు. ❖ గుణదల విష్ణునగర్‌లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి రాజేశ్వరరావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా కార్పొరేషన్ మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ పెట్టించారు. ❖ 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీ 10-43/43 విద్యుత్తు స్తంభానికున్న వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదని స్థానిక నివాసి లక్ష్మీకాంతం మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - **న్యూస్‌టుడే, కరెన్సీ నగర్**

ఆధారం చూపిస్తారా.. ఓటు కోల్పోతారా

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

ప్రస్తుతం సర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా జాబితాలోని అభ్యంతరాలను ఓటర్ల నుంచి స్వీకరిస్తున్నారు. వీటితోపాటు గతంలో ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు ఇచ్చారు. తిరిగి వాటిని స్వీకరించి డిజిటైజేషన్ చేశారు. నియోజకవర్గంలో ఓటరు జాబితాలో పేర్లు తప్పులు, మ్యాపింగ్ కాని 36,856 మందిని గుర్తించారు. అలాంటి వారిని అనామలీస్ జాబితాలో చేర్చి వారందరూ నిర్దేశించిన ధ్రువపత్రాలను జారీ చేయాలని నోటీసులు జారీ చేశారు. విచారణ గడువు సమీపించడంతో ప్రక్రియను వేగవంతం చేశారు. కానీ తాఖీదులు అందుకున్న వారిలో వేలాది మంది విచారణకు హాజరు కావడం లేదు. వచ్చే నెల 28 నాటికి సర్ ప్రకియ గడువు ముగియనుంది. నోటీసులు అందుకున్న వారు ఆ లోపు హాజరై తమ అర్హతను నిరూపించే ఆధారాలను అధికారులకు అందజేస్తేనే ఓటు హక్కు ఉంటుంది. లేకపోతే తొలగించే అవకాశం ఉంటుంది.

సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో వెన్నెల శ్రీను

10,082 మంది వివరణ ఇవ్వాల్సి ఉంది

2002 ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని వారు, పేర్లు తప్పులు ఉన్న వారు, అక్షర దోషాలు, తండ్రికి కుమారుడికి వయసులో 15 ఏళ్ల వత్యాసం ఉన్న వారు నియోజకవర్గంలో 36,856 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ గత నెల 31 నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 29 నాటికి 26,054 మంది మాత్రమే విచారణకు హాజరయ్యారు. ఇంకా 10,082 మంది హాజరు కావాల్సి ఉంది. వీరందరి నుంచి వివరాలు సేకరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

అశ్రద్ధ చేయొద్దు..

అనర్హుల కింద చేర్చిన ఓటర్లందరికీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. వారందరూ పూర్తి ఆధారాలతో సమీపంలోని ఈఆర్వో, ఏఈఆర్వోలను సంప్రదించాలి. ఓటు హక్కు కోల్పోకుండా ఉండాలంటే అర్హతను నిరూపించుకోవాల్సిందే.. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా వ్యక్తిగతంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా ఆధారాలు సమర్పిస్తేనే ఓటు హక్కు కొనసాగిస్తారు. లేదంటే ఓటు రద్దవుతుంది. అక్టోబరు 3న తుది జాబితా ప్రచురణ నేపథ్యంలో నోటీసులు తీసుకున్న కొంత మంది స్పందించారు. వారిచ్చిన ఆధారాలను బీఎల్వోలు, సూపర్‌వైజర్లు పరిశీలిస్తున్నారు. ఇంకా వివరాలు ఇవ్వని వారికి బీఎల్వోలు ఫోన్లు చేస్తున్నారు. గడువులోగా ఆధారాలు ఇవ్వాలని తెలియజేస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు సమాచారం అందించి ఆధారాలు తీసుకురావాలని చెబుతున్నారు.

నూతన ఓటర్లుగా నమోదుకు అవకాశం

రాధానగర్‌లోని బీఎల్వో కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పద్దెనిమిది సంవత్సరాలు దాటిన యువత ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరంలోని రాధానగర్ సామాజిక భవనంలోని పోలింగ్ కేంద్రాన్ని కమిషనర్ శనివారం సందర్శించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని, ఓటరు కార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని వెల్లడించారు. అర్హత కలిగిన ఓటర్లు వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ❖ బందరు రోడ్డు, పంట కాలువ రోడ్డు, ఆటో నగర్, పటమట ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పోస్టర్ల కోసం ఏర్పాటు చేసిన గోడను పరిశీలించారు. ఆ గోడపైనే పోస్టర్లను అంటించాలని పేర్కొన్నారు. పటమటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. జోనల్ కమిషనర్ కె.షమ్మీ, సీఎంహెచ్‌వో గోపాలనాయక్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి: మూడు రోజులుగా ఇంద్రకీలాద్రిపై పాత యాగశాలలో నిర్వహిస్తున్న శ్రీపరాభవనామ సంవత్సర వార్షిక పవిత్రోత్సవాలు పూర్ణాహుతి క్రతువుతో శనివారం ముగిశాయి. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజాద్రవ్యాలు ఉంచిన పట్టు చీరను మూటగా కట్టి మూడు సార్లు హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం హోమగుండంలో అగ్నిదేవుడికి రుత్వికులు సమర్పించారు. అనంతరం యాగశాలలో పూజించిన పవిత్ర జలాలతో దేవతామూర్తులను, ఆలయప్రాంగణాన్ని సంప్రోక్షణ చేశారు.

తెలుగు భాషాభ్యున్నతికి తోడ్పడాలి

వివిధ వేషధారణల్లో లిటిల్ బ్రెయిన్స్ విద్యార్థులు

సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో పూర్ణచంద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సీతారామయ్య

సిద్ధార్థ మహిళా కళాశాలలో..

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమ్మ లాంటి మాతృభాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని యువ కవి పిటి పార్కర్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శనివారం ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, పీబీ సిద్ధార్థ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాలులో యువ కవులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.మనోరంజని, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, కళాపీఠం కార్యదర్శి బి.వి.ఎస్.ప్రకాశ్, ఉపాధ్యక్షుడు టి.రమేశ్, తెలుగు విభాగాధిపతి సశ్రీ తదితరులు పాల్గొన్నారు. యువ కవితాగానంలో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ❖ స్థానిక సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో తెలుగు భాష, విశిష్టతను తెలియజేసేలా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపల్ సుధా ప్రవీణ పాల్గొన్నారు. ❖ స్థానిక వీర మాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ రచయిత, భాషా పరిశోధకుడు డాక్టర్ జి.వి.పూర్ణచంద్‌ను ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య సత్కరించారు. ❖ సిద్ధార్థ మహిళా కళాశాలలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. కవయిత్రి విజయం అనే రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.వి.దుర్గావతి, తెలుగు విభాగాధిపతి కె.సరళ తదితరులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ కళాశాలలో మాట్లాడుతున్న యువ కవి పీటీ పార్కర్

విజేతలతో అతిథులు

లయోలలో.. కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నేటి యువత సామాజిక మాధ్యమాల్లోనూ తెలుగు ఆనవాళ్లను కాపాడే ప్రయత్నం చేయాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి జీవీ పూర్ణచంద్ అన్నారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఆంధ్రా లయోల కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పూర్ణచంద్ మాట్లాడుతూ ఆంగ్ల భాషను గౌరవిస్తూనే మాతృభాషను కాపాడుకునే బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందన్నారు. ప్రాచీన తెలుగు సాహిత్యంలో తెలుగు మాధుర్యాన్ని ఆయన తెలియజేశారు. పండిత భాష గొప్పదనాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ అరుల్ జ్యోతి మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. గత రెండు రోజులుగా నిర్వహించిన వ్యాసరచన, పద్య పఠన, వక్తృత్వ పోటీల విజేతలకు అతిథులతో బహుమతులు, సర్టిఫికెట్లు అందించామని కళాశాల ప్రాచ్య భాషల విభాగ అధ్యక్షుడు కోలా శేఖర్ తెలిపారు.

తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక .. మొగల్రాజపురం(విజయవాడ సిటీ): తెలుగు కేవలం ఒక భాషగా కాకుండా ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించాలని రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ విక్రమ్ పూలా అన్నారు. మొగల్రాజపురంలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారూఖ్ షుబ్లీ నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం విక్రమ్ పూలాను సత్కరించారు.

ఛైర్మన్ విక్రమ్ పూలాకి నూతన వస్త్రాలను అందజేస్తున్న ఫారూక్ షుబ్లీ

మురుగు లీకేజీతో దుర్గంధం

పటమట లంక కోనేరు చెన్న కేశవరావు వీధిలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ గత 10 రోజులుగా పొంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. లీకేజీతో దుర్వాసన, దుర్గంధం నలుదిశలా వ్యాపించి ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలోని వారంతా సంఘటితంగా మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలిపారు. - **న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

చెత్తలో విషపురుగుల తిష్ఠ

మాచవరం జమీందారు వీధిలో కొంత కాలంగా చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన తాండవిస్తోంది. చెత్తలో విషపురుగుల తిష్ఠ వేసి రాత్రివేళ ఇళ్లల్లోకి వస్తున్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు. సిబ్బందికి చెప్పినా తొలగించడలేదని, అధికారులు దృష్టి పెట్టి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, కరెన్సీనగర్

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర

శోభాయాత్రలో ఆంధ్రప్రదేశ్ వికాస తరంగిణి సభ్యులు

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి తిరు నక్షత్ర మహోత్సవాలు (జన్మదిన వేడుకలు) పురస్కరించుకుని శనివారం బెంజి సర్కిల్ నుంచి లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. భజన కీర్తనలు, శ్రీమన్నారాయణ నామస్మరణతో మర్మోగింది. నిర్వాహకులు మాట్లాడుతూ సమాజంలో మానవీయ విలువలను పెంపొందించడానికి, ప్రతి కుటుంబంలో ప్రేమ, గౌరవం, స్నేహభావాలు వర్ధిల్లడానికి స్వామి వారి అనుగ్రహంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముంతా మాధవీ భాస్కరరావు, వి.రాఘవన్, పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోమాంచకం చిత్రబృందం సందడి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: నగరంలో రోమాంచకం చిత్ర బృందం శనివారం సందడి చేసింది. ప్రచారంలో భాగంగా నగరానికి వచ్చిన వారు ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ సినిమా చాలా క్యూట్, లైట్ హార్టెడ్ వైబ్స్‌తో కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుందని తెలిపారు. హీరోయిన్ అనంతిక సనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ చిత్రంలో తనది ఎంతో డిఫరెంట్ క్యారెక్టర్ అని, అందరికీ కచ్చితంగా నచ్చుతుందన్నారు. సమావేశంలో దర్శకుడు వేణు గోపాల్ రెడ్డి, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా తదితరులు పాల్గొన్నారు.

4న సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 4న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. రూ.1500 చెల్లించిన భక్తులకు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, తెల్లరేషను కార్డు ద్వారా ఉచిత వ్రతానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సెయింట్ జాన్స్‌లో ట్వింక్లింగ్ రెయిన్‌బో డే

వివిధ వేషధారణల్లో చిన్నారులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆరోగ్య వర్సిటీ సమీపంలోని సెయింట్ జాన్స్ ఆంగ్ల పాఠశాల ప్రీ ప్రైమరీ విభాగంలో శనివారం 'ట్వింక్లింగ్ రెయిన్‌బో' డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించింది. విద్యార్థులు విబ్జియార్‌లోని ఏడు రంగులను ప్రతిబింబించేలా దుస్తులు ధరించి, ఒక్కో రంగు విశిష్టతను వివరించారు. పండ్లు, కూరగాయలు, పూల నుంచి సహజ రంగులను తయారు చేయడం, పాలకూర, బీట్‌రూట్, పసుపుతో టై అండ్ డై వేయడం, పాత టీ షర్టులకు రంగుల ముద్రణ, రంగులు చల్లడం, చేతి ముద్రలతో కళారూపాలను తయారు చేయడంలో విద్యార్థులు ఆసక్తి కనబర్చారు. పాఠశాల అధ్యక్షులు మోనికా సుమన్, కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, ప్రిన్సిపల్ షర్మిల, వైస్ ప్రిన్సిపల్ ఎం.శాంతి విరజ ఆసక్తిగా తిలకించారు.

చిన్నారుల సందడి

పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, న్యాయనిర్ణేతలు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: నగరంలోని నెక్స్టజెన్ స్కూల్‌లో నర్సరీ నుంచి యూకేజీ విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో స్టేజీపై తమ ప్రతిభ ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, స్టేజీ భయాన్ని తొలగించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. అంబేడ్కర్ వేషధారణలో పాల్గొన్న రుధిర విజేతగా నిలిచింది. పోటీకి న్యాయనిర్ణేతలుగా డా.దేవీ మానస, డా.శిరీష వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూలు సీఈఓ గౌతమీ కృష్ణ, ప్రిన్సిపల్ సుధ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆభరణాలతోనే ఆదరణ

లబ్బీపేట (విజయవాడ సిటీ): ప్రముఖ ఆభరణాల సంస్థ 'ముకుంద జ్యువెలరీ' తన మొట్టమొదటి ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌ను విజయవాడ ఎంజీ రోడ్డులోని పీవీఆర్ కాంప్లెక్స్, 'ది గోల్డ్ ఒయాసిస్' మొదటి అంతస్తులో శనివారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను అందుబాటు ధరల్లో అందిస్తూ సంస్థ వినియోగదారుల ఆదరణ, అభిమానాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. ముకుంద ఛైర్మన్ బత్తి నరసింహారెడ్డి, డైరెక్టర్లు నికితారెడ్డి, డి.కృష్ణ, ఎన్.బృందారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల ఆధునిక అభిరుచులకు, సంప్రదాయ డిజైన్లకు అనుగుణంగా విభిన్న రకాల కలెక్షన్లను ప్రదర్శనకు ఉంచామన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా కొనుగోలు చేసిన అన్ని రకాల ఆభరణాలపై సెప్టెంబర్ 6 వరకు తరుగు 6.99 శాతం మాత్రమే ఉంచినట్లు తెలిపారు.

ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టి.జి.భరత్

దాడి సత్యవతికి ఘన నివాళి

విజయవాడ వన్‌టౌన్: స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ దాడి అప్పారావు సతీమణి దాడి సత్యవతి తొలి వర్ధంతి కార్యక్రమం శనివారం కొత్తపేటలోని వారి నివాసంలో జరిగింది. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు, కూటమి నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

STOCK MARKETలో
డబ్బులు సంపాదించడం ఎలా?
తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించడం ఎలా?
SEND "HI"
630 323 5744
for Free Pass
FREE SEMINAR
AUGUST 30th SUNDAY
11 am, 3 pm, 7 pm
ILAPURAM CONVENTION CENTRE
HANUMANPET, VIJAYAWADA
KRISHNA KAILAS
703 280 4888
703 280 5888

మంత్రి దుర్గేష్‌ను కలిసిన ఎస్ఎస్ రావత్

పటమట, న్యూస్‌టుడే: పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి షంషేర్ సింగ్ రావత్ శనివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ను పటమటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రావత్‌కు మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, సాంస్కృతిక రంగ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురూ చర్చించారు. పీపీపీ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక ఒప్పందాలను వేగవంతం చేయడం, నూతన పర్యాటక పాలసీ అమలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మంత్రి నేతృత్వంలో పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎస్ఎస్ రావత్ తెలిపారు

సంస్థల స్థాయి పరిశోధనలతోనే గుర్తింపు

దీపక్ మతివతానన్‌ను సన్మానిస్తున్న ఫాదర్లు ఫ్రాన్సిస్ జేవియర్, మిల్కీయోర్ తదితరులు

విగరస్ అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ Female కంప్యూటర్ ఆపరేటర్ వెంటనే కావలెను. అర్హత: Tally& MS Office తప్పనిసరిగా తెలిసి ఉండాలి. ఇంగ్లీష్ చదవటం, రాయడం మరియు మాట్లాడటం వచ్చి ఉండాలి. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉద్యోగ స్థలం: విజయవాడ. జీతం అర్హత/ అనుభవంబట్టి. ✆ 96188 24400

జూనియర్ అకౌంటెంట్ Tally Exp- Sal 15K- 18K మరియు డెలివరి బాయ్స్ కావలెను. అమ్మ కళ్యాణ మండపం దగ్గర. VJA. ✆ 92468 03333.

Hydలోని ప్రముఖ టిఫిన్ సెంటర్‌లో స్టాల్‌బాయ్స్ సూపర్‌వైజర్స్ (ఫ్రెష్/Exp) కావలెను. జీ: 18K, 12గం|| ఫ్రీ వసతి+భోజనం. ✆ 96669 34949/ 99631 65905.

Vja శ్రీరామయ్య మెస్‌లో పని చేయుటకు కూరగాయల కట్టింగ్ మాస్టర్స్, సప్లయర్లు జెంట్స్ కావలెను. సంప్ర|| ✆ 98844 94628, 92464 01797.

MARKETING/ SALES

Wanted Sales Executives 2 + years of experience for FMCG Products at Tadepalli Interested candidates may contact: 99893 89797

Wanted Salesman Minimum 5 yrs Exp, Working At Gollapudi. ✆ 77990 44744.

FACULTY/ TEACHERS

Wanted Social and Science Teacher for Higher Classes. Ajith Sing Nagar, Vijayawada. Contact: 83091 22705

Wanted Teacher To Teach Hindi Subject for 7th To 10th Part-Time Sri Sathya Sai E.M.HighSchool Yanamalakuduru. ✆ 99498 93883

మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో P.G చేసి ఆబ్జెక్టివ్ బోధనలో 3-5సం||ల అనుభవంగల లెక్చరర్స్ మా స్టడీ మెటీరియల్ తయారీకి అర్జెంట్‌గా కావలెను. ✆ 89786 85897

DRIVERS

విజయవాడలో పనిచేయుటకు అనుభవం గల కార్ డ్రైవర్ కావలెను. అర్హత: ఇంటర్ (or) డిగ్రీ సంప్ర. ✆ 90003 33366

ACCOUNTING

Siddhartha Innopack Ind. Pvt. Ltd. Veeravalli, Wanted Jr. Accountant, Male, B.Com, 1Yr. Exp. Biodata to: accounts@siddharthagroup.net ✆ 99898 65697

TOURS AND TRAVELS

సాయి టూర్స్ sep-4 రామేశ్వరం, sep-16 రాజస్థాన్ జైపూర్ Sep-29 కేరళ టూర్, Oct22 మహారాష్ట్ర టూర్ Oct-30 కర్ణాటక టూర్ Nov-15 కాశీ ✆ 98486 64831

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

(c) eenadu

20,000 ఎకరాల్లో.. 25 పారిశ్రామిక పార్కులు!

- భవ్య పథకం కింద 22 ప్రతిపాదనలు
- భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా మరో మూడు
- ఏపీఐఐసీ ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) సంకల్పించింది. వాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ పథకాల కింద కేంద్ర నిధులను వినియోగించుకోవాలని భావిస్తోంది. భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) కింద 22 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటితో పాటు రాష్ట్రంలో ఏర్పాటయ్యే భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో కొత్తగా పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. భవ్య పార్కుల కోసం ఏపీఐఐసీ ఇప్పటికే 12,000 ఎకరాలను సేకరించింది. మూడు పార్కుల కోసం మరో 8,000 ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఎకరాకు రూ.కోటి చొప్పున కేంద్ర గ్రాంటు

భవ్య పథకం కింద రూ.33,660 కోట్లతో దేశవ్యాప్తంగా 100 పార్కులు అభివృద్ధి చేయాలన్నది కేంద్రం ప్రతిపాదన. మొదటి దశలో 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా, రాష్ట్రం నుంచి ఆరింటికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు పంపింది. ఇందులో రెండింటికి కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రెండో దశలో 80 పార్కుల కోసం కేంద్రం దరఖాస్తులు ఆహ్వానించింది. 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎకరాకు రూ.కోటి చొప్పున కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. 22 పార్కులకు కలిపి సుమారు 12 వేల ఎకరాలను ఏపీఐఐసీ ఇప్పటికే సేకరించింది. ఈ పథకం కింద పార్కుల అభివృద్ధికి 90% భూములు సేకరించి ఉండాలన్న నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో భూములు అందుబాటులో ఉన్న వాటినే అధికారులు ప్రతిపాదించారు. ఈ పథకం కింద కేంద్రం అనుమతించిన పార్కులు పోనూ.. మిగిలిన వాటిని ఏపీఐఐసీ సొంత నిధులతో అభివృద్ధి చేయాలని భావిస్తోంది.

8,000 ఎకరాల్లో మూడు పార్కులు

◆ రాష్ట్రంలో ఏర్పాటయ్యే భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా మరో మూడు పార్కుల అభివృద్ధికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు రూపొందించింది. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి చెందే ఎకోసిస్టమ్‌ను వినియోగించుకుని.. అనుబంధ సంస్థలకు అవసరమైన భూములను కేటాయించేందుకు వీలుగా వీటిని ప్రతిపాదించింది. మూడు పార్కుల ద్వారా మరో 8,000 ఎకరాలను పారిశ్రామిక అవసరాల కోసం అందుబాటులోకి తేవాలని ఏపీఐఐసీ భావిస్తోంది.

◆ శ్రీకాకుళం జిల్లా మూలపేటలో 2,000 ఎకరాల్లో కెమికల్ పార్కు అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్ణయించింది. భవ్య రసాయన పథకం కింద దేశవ్యాప్తంగా కెమికల్ పార్కుల అభివృద్ధికి కేంద్రం రూ.3,030 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ పథకం కింద మూలపేట కెమికల్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో 450 ఎకరాల్లో రూ.2,250 కోట్ల పెట్టుబడులతో ఫాస్పారిక్ యాసిడ్, ఫెర్టిలైజర్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ప్రభుత్వం కేటాయించింది.

◆ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి వద్ద రూ.15,803 కోట్లతో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా మరిన్ని అనుబంధ సంస్థలు వచ్చేందుకు వీలుగా ఇక్కడ మరో 5,000 ఎకరాల్లో కొత్త పార్కు ఏర్పాటుకు భూసేకరణ చేపడుతోంది.

◆ అనకాపల్లి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో రేర్‌ఎర్త్ మినరల్ పార్కు అభివృద్ధి చేయనున్నారు. ఏటా 25,000 టన్నుల రేర్ ఎర్త్ మినరల్స్ ఉత్పత్తి, శుద్ధి చేయాలన్నది లక్ష్యం. దీనికి అనుగుణంగా వచ్చే పరిశ్రమల కోసం కొత్త పార్కు అభివృద్ధిపై ఏపీఐఐసీ దృష్టి పెట్టిందని ఆ సంస్థ వీసీ, ఎండీ దినేష్‌కుమార్ 'ఈనాడు'కు తెలిపారు.

నీట్ యూజీ ఎంబీబీఎస్ సీట్లకు ఐచ్ఛికాల ప్రక్రియ ప్రారంభం

రాష్ట్రంలో 4,581 కన్వీనర్ కోటా సీట్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లలో ప్రవేశాలకు సంబంధించి ఐచ్ఛికాల (ఆప్షన్ల) ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఇప్పటికే 14,548 మందితో కూడిన మెరిట్ లిస్టును విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. జాబితాలో ఉన్న అభ్యర్థులంతా కళాశాలల ఐచ్ఛికాలను సెప్టెంబరు ఒకటో తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ఆంధ్ర, ఎస్వీయూ పరిధిలోని కళాశాలలను ప్రాధాన్యతాక్రమంలో పొందుపర్చాలి. ప్రత్యేక కేటగిరీ విభాగంలోని పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబులిటీ, ఆర్మీ సంతతి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, పోలీస్ అమరవీరుల సంతతి, ఆంగ్లో ఇండియన్ విభాగాల అభ్యర్థులు మెరిట్ లిస్టులో ఆయా కళాశాలల్లో పొందుపర్చిన సీట్ల ఐచ్ఛికాలను ప్రాధాన్యతా క్రమంలో పొందుపర్చాలి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించి ఆయా డైరెక్టరేట్ల విభాగాలతో ప్రాధాన్యతాక్రమాలు వెల్లడించిన తర్వాత ఆప్షన్లకు అవకాశం కల్పిస్తారు. రాష్ట్రంలోని 39 వైద్య కళాశాలల్లో మొత్తం 4,581 ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఎంబీబీఎస్ సీట్లివీ..

	ప్రభుత్వ కళాశాలలు	సీట్లు	ప్రైవేటు కళాశాలలు	సీట్లు
ఆంధ్రా యూనివర్సిటీ పరిధి	11	1258	11	1200
ఎస్వీయూ పరిధి	7	1160	9	750
స్టేట్ వైడ్ (సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల)	1	213	-	-

21 రోజుల్లో మరణాల నమోదు తప్పనిసరి

ఈనాడు, అమరావతి: రోడ్డు ప్రమాదాలు, మెడికోలీగల్ మరణాల నమోదు 21 రోజుల్లో జరగాలని వైద్యఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. ఆయా మరణాల వివరాలు జనన, మరణాల రిజిస్ట్రార్లకు సకాలంలో అందించకపోవడంతో మరణాల నమోదు ఆలస్యమవుతోందని పేర్కొంది. ఈ మేరకు రోడ్డు ప్రమాదాలు, మెడికో లీగల్ మరణాలను నిర్ణీత విధానంలో సకాలంలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ డీజీపీకి లేఖ రాశారు. దీనికి అనుగుణంగా డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని పోలీస్ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సర్క్యులర్ జారీ చేశారు.

ఇలా నిజాయితీ మీకు అలవడుతుంది

మీకు ఇబ్బంది అనిపించే నిజాల్ని ఒప్పుకోవడం మొదట్లో బలహీనతగా అనిపించినా దానిని కొనసాగిస్తే క్రమేణా నిజాయితీగా ఉండటం మీకు అలవడుతుంది. ఈ లక్షణంతో మీరు అబద్ధాలు చెప్పలేరు. ఒకవేళ అలా ప్రయత్నిస్తే అందుకు మీ మనసు ఒప్పుకోదు.

– దవే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్

నందమూరి హరికృష్ణకు చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ కుమారుడు, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారని ఎక్స్ వేదికగా శనివారం కొనియాడారు.

◆ మాజీమంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా తెదేపా నేతలు ఆయనకు నివాళులర్పించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీగా గాయత్రీదేవి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా టి.గాయత్రీదేవిని ప్రభుత్వం నియమించింది. ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమెను పదోన్నతిపై ఈఎస్‌సీగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

92.43 లక్షల గృహాలకు తెదేపా శ్రేణులు

ఈనాడు, అమరావతి: ఇంటింటికీ తెలుగుదేశంలో భాగంగా తెదేపా శ్రేణులు ఇప్పటి వరకు 92.43 లక్షల గృహాలను సందర్శించాయి. 34వ రోజైన శనివారం 1.87 లక్షల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని వివరించాయి.

పోలీసుల అదుపులో భద్రాచలం ఎమ్మెల్యే పీఏ?

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వద్ద పీఏ పనిచేసిన కల్యాణ్‌కుమార్... కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఉద్యోగాల పేరిట రెండు తెలుగు రాష్ట్రాల్లోని నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు వసూలు చేసినట్లు ఇతనిపై అభియోగం ఉంది. స్థానిక అంబాసత్రం రోడ్డుకు చెందిన రాయల శ్రీను అనే బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదైంది. నిందితుడు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడం వెనుక పాత్రధారులు, సూత్రధారులు ఎవరైనా ఉన్నారా... అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు.

ఇక విమానాలను నడిపే పాఠాలు

- కర్నూలులో రాష్ట్రంలోనే తొలి పైలెట్ల శిక్షణ కేంద్రం
- ప్రారంభానికి సర్వం సిద్ధం

ఈనాడు, కర్నూలు: రాష్ట్రంలోనే మొట్టమొదటి విమాన పైలట్ల శిక్షణ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మైసూరుకు చెందిన 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ'కి కర్నూలు విమానాశ్రయంలో 1.25 ఎకరాలు కేటాయించారు. అక్కడ శిక్షణ ఇచ్చేందుకు ఓ భవనాన్ని అకాడమీ నిర్మించింది. దానికి అనుకునే అధునాతన 'హ్యాంగర్' భవనాన్ని సిద్ధం చేసింది. ఇందులో నాలుగు వరకు శిక్షణ విమానాలను ఉంచొచ్చు. అక్కడే చిన్నపాటి ఎం.ఆర్.ఒ. (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. శిక్షణ విమానాలకు అవసరమయ్యే మరమ్మతులు, సర్వీసింగ్ పనులూ ఇక్కడే పూర్తి చేయొచ్చు. విమానాశ్రయ రన్‌వే నుంచి శిక్షణ కేంద్రం వరకు శిక్షణ విమానాల రాకపోకలకు వీలుగా ఒక టాక్సీవేను సిద్ధం చేశారు. విద్యార్థులకు శిక్షణ కోసం అధునాతన 'సిమ్యులేటర్ల'ను ఏర్పాటుచేశారు.

శిక్షణ విమానాలతో ట్రయల్స్ విజయవంతం

చెన్నైలోని 'హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్'లో 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఒక భాగం. ఈ సంస్థ మైసూరులో 12 ఏళ్లుగా శిక్షణ ఇస్తోంది. రెండో కేంద్రాన్ని కర్నూలులో ప్రారంభించబోతోంది. సెస్నా, టెక్నామ్ బ్రాండ్ల సింగిల్ ఇంజిన్, మల్టీ ఇంజిన్ శిక్షణ విమానాలు ఈ సంస్థ వద్ద ఉన్నాయి. మైసూరులో ఉన్న శిక్షణ విమానాల్లో

ప్రారంభానికి సిద్ధమైన కర్నూలు విమానాశ్రయంలోని ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ

మూడింటిని ఇకపై కర్నూలు విమానాశ్రయంలో ఉంచాలని భావిస్తున్నారు. ఇప్పటికే శిక్షణ విమానాలను కర్నూలు తీసుకువచ్చి ఇక్కడ ఉంచడానికి, విమానాలు నడపడంపై శిక్షణ ఇవ్వడానికి వీలుగా ట్రయల్ రన్ నిర్వహించారు. ఇబ్బందులేవీ రాకపోవడంతో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి రంగం సిద్ధం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రమాణాల ప్రకారం అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా కర్నూలు విమానాశ్రయంలోని అకాడమీలో సుమారు రూ.వంద కోట్ల వ్యయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏవియేషన్ అకాడమీ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం పైలట్లకు తరగతి గది బోధన కర్నూలులో జరుగుతోంది. విమానాలను నడిపే శిక్షణ (ప్రాక్టికల్స్) కోసం మైసూరు పంపిస్తున్నారు. కర్నూలు అకాడమీ ప్రారంభమైతే ఇక్కడే ప్రాక్టికల్స్ కూడా బోధించనున్నారు. భవిష్యత్తులో గ్రౌండ్‌స్టాఫ్, క్యాబిన్ క్రూ, ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగాలకు అవసరమయ్యే కోర్సులనూ ప్రారంభించనున్నారు.

441 మంది పిల్లలకు ఉచిత శస్త్రచికిత్సలు

మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు 19 వరకు 441 శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 289 మందికి, పాఠశాలల్లో 152 మంది పిల్లలకు రూ.2.42 కోట్లు వెచ్చించి ఈ శస్త్రచికిత్సలు చేయించినట్లు వెల్లడించారు. ఆర్‌బీఎస్‌కే సేవల పురోగతిపై మంత్రి శనివారం సమీక్షించారు. మొత్తం శస్త్రచికిత్సల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 238 చేయగా, మిగిలినవి ఆర్‌బీఎస్‌కేతో అనుసంధానమైన ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగినట్లు తెలిపారు. పిల్లలకు శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు సూచించినప్పుడు కొందరు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారని, అలాంటి వారికి అవగాహన పెంచాలని సూచించారు.

జేజేఎం పనులకు రూ.956 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: జలజీవన్ మిషన్ (జేజేఎం)లో భాగంగా చేపడుతున్న మల్టీ విలేజ్ స్కీం (ఎంవీఎస్), బల్క్ వాటర్ సప్లై పథకాల (బీడబ్ల్యూస్) పనులకు బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.956.77 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది. 2026-27లో మూడు బడ్జెట్ హెడ్‌ల కింద ఈ నిధులు కేటాయించింది. ఈ మేరకు పరిపాలన అనుమతులిచ్చిన ప్రభుత్వం.. తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీని ఆదేశించింది.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాజెక్ట్ 'అమానహ్'

రేపటి నుంచి ప్రయోగాత్మకంగా అమలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణదారుల చెరలో చిక్కుకోకుండా వాటిని డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం కొత్తగా ప్రాజెక్ట్ అమానహ్ (బాధ్యత)ను అమల్లోకి తీసుకురానుంది. సోమవారం నుంచి దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు పరిధిలో 12,855 ఆస్తులున్నాయి. ఒక్కో జిల్లా పరిధిలో 5 వక్ఫ్ ఆస్తుల చొప్పున డిజిటలైజ్ చేయనున్నారు. ఏడు రోజులపాటు ఇది కొనసాగనుంది. అనంతరం క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా మార్పుచేర్పులు చేసి మిగతా వాటికి అమలు చేస్తారు.

◆ ప్రాజెక్టు అమానహ్ నిర్వహణ బాధ్యతను వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు లేని జిల్లాల పరిధిలో అంత కంటే కింది స్థాయి అధికారి దీన్ని చేపడతారు. ◆ వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు తమ జిల్లా పరిధిలోని ప్రతి వక్ఫ్ ఆస్తి దగ్గరకు వెళ్లి దాని వాస్తవ స్థితిని నమోదు చేయాలి. సర్వే నంబర్, విస్తీర్ణం, భౌతిక స్థితి ఫొటోలు సమీకరించాలి. ◆ వాటిని సర్వే కమిషన్ ఆఫ్ వక్ఫ్ నివేదికతో పోల్చి, వాస్తవ వివరాలు నమోదు చేయాలి. వీటికి అనుగుణంగా ప్రతి వక్ఫ్ ఆస్తికీ ఒక ప్రత్యేక ఐడీ కేటాయిస్తారు. ఆ నంబర్‌పై వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.

కర్నూలులో వక్ఫ్ జోనల్ కార్యాలయం

ఈనాడు, అమరావతి: కర్నూలులో కొత్తగా వక్ఫ్ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వక్ఫ్ అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కొత్తగా సర్వేయర్ల నియామకాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు.

రెండు ప్రాణాలు బలిగొన్న వేపచెట్టు వివాదం

- గొడ్డలితో పొరుగింటి వ్యక్తి హత్య
- అడ్డుకోబోయిన తండ్రిపైనా దాడి.. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి
- తెలంగాణలోని సూర్యాపేట జిల్లాలో దారుణం

వెంకటేశ్వర్లు సైదా

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: వేప చెట్టు వివాదం ఇద్దరు వ్యక్తుల ప్రాణాలను బలిగొంది. నిప్పు పెట్టడంతో పడిపోయిన చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ఆగ్రహించిన పక్కింటి వారు గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో పొరుగింటి వ్యక్తి మృతిచెందగా అడ్డుకోబోయిన తండ్రిపైనా కుమారులు దాడి చేసి చంపేశారు. ఈ దారుణ ఘటన తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో శనివారం జరిగింది.

వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలో పడిపోయిన వేపచెట్టు

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రగట్టు తండాలో అమరబోయిన వెంకటేశ్వర్లు(70), భూక్యా సైదా(68) ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండిళ్ల మధ్య ఒక వేప చెట్టు ఉంది. ఈ చెట్టునే హద్దుగా చేస్తూ ప్రహరీ నిర్మించారు. కొన్నేళ్ల నుంచి వేపచెట్టును తొలగించే విషయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే సైదా పెద్ద కుమారుడు పెదబాబు చెట్టు అడుగు భాగంలో నిప్పు పెట్టి రోజూ కాల్చుతున్నాడు. శుక్రవారం చెట్టు వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలో పడిపోయింది. బయటకు వెళ్లేందుకు వీలుకాకపోవడంతో... శనివారం ఉదయం ఇంటి ఆవరణలో పడిపోయిన చెట్టు కొమ్మలను కొట్టేస్తున్నారు. అదే సమయంలో సైదా కుమారులు పెదబాబు, రాము, సైదా భార్య ఆగ్రహంతో వెంకటేశ్వర్లు ఇంట్లోకి ప్రవేశించి తలపై గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారించిన వీరి తండ్రి సైదాపై కూడా కుమారులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో పడిపోయిన సైదాను హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, తండావాసులు ఆగ్రహంతో రగిలిపోయారు. సైదా ఇంటిపై రాళ్లు విసిరారు. వారిని అడ్డుకోబోయిన మేళ్లచెరువు ఎస్సై నవీన్‌కుమార్ తలకు గాయమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సూర్యాపేట, మిర్యాలగూడ నుంచి పోలీసు బలగాలు తండాకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చాయి. కోదాడ రూరల్ సీఐ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

భావితరాలకు తెలుగు నేర్పించేందుకు 'కూల్‌ఫాబెట్స్' యాప్

రూపకర్తలు కొల్లు రంజిత్, వెంకట్ ఏలేటి బృందానికి చంద్రబాబు అభినందనలు

ఈనాడు, అమరావతి: పిల్లలకు ఆటపాటలతో పాటు తెలుగులో చదవడం, రాయడం నేర్పించే 'కూల్‌ఫాబెట్స్' యాప్ రూపొందించడం అభినందనీయమని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఈ యాప్‌ను రూపొందించిన కొల్లు రంజిత్, వెంకట్ ఏలేటి బృందానికి శనివారం 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ యాప్‌ను విడుదల చేయడం హర్షణీయమన్నారు. 'నేటి డిజిటల్ తరంలో పిల్లలకు తెలుగు చదవడం, రాయడం అలవాటు కావాలి. సాంకేతికత మన భాషను దూరం చేయకూడదు.. మరింత చేరువ చేయాలి. ఏఐ సాంకేతికతతో పిల్లల చేతిరాతను పరిశీలించి అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా ఈ యాప్ రూపొందించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

తెలుగు పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలి

చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: తెలుగు భాష పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా నిర్వహించుకునే తెలుగు భాషా దినోత్సవం.. మాతృభాష ప్రాశస్త్యాన్ని మరింత పెంచుతుందన్నారు. 'ఎక్స్' వేదికగా తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

◆ తెలుగు భాషా వికాసానికి గిడుగు రామమూర్తి అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవహారిక భాషోద్యమానికి ఆద్యుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు అని పేర్కొన్నారు.

విద్యార్థుల దృష్టిని ఆకర్షించేలా బోధన ఉండాలి

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

ఈనాడు, అమరావతి: డిజిటల్ యుగంలో విద్యార్థుల దృష్టిని ఆకర్షించేలా బోధనా పద్ధతులు మారాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి సూచించారు. ఉన్నత విద్యలో జెనరేటివ్ ఏఐ, ఇంటరాక్టివ్ ఈ-కంటెంట్, అభివృద్ధి చెందుతున్న విద్యా సాంకేతికతలను అనుసంధానించే లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదురోజుల పాటు నిర్వహిస్తున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'అధ్యాపకులకు ఏఐ శక్తిమంతమైన సాధనం. దీన్ని సరిగ్గా వినియోగిస్తే బోధనను మరింత ప్రభావవంతంగా మార్చవచ్చు. కంటెంట్ తయారీ, ప్రశ్నాపత్రాల రూపకల్పన, కమ్యూనికేషన్ పెంపొందించడంలో ఏఐ ఎంతగానో తోడ్పడుతుంది' అని మధుమూర్తి తెలిపారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి

- మలేసియా టామ్ వేడుకల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రవాసాంధ్రుల సాధికారత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మలేసియాలోని టామ్ (తెలుగుదనం, అంకితభావం, మంచితనం) 70వ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కడి తెలుగువారిని ఉద్దేశించి మాట్లాడుతూ '1955లో మలేసియా తెలుగు సంఘం చిన్న విత్తనంలా ప్రారంభమై. . ప్రస్తుతం 5 లక్షల మంది తెలుగు ప్రజలకు అండగా నిలిచేలా ఒక మహా వృక్షంలా ఎదిగింది. ఇక్కడి

తెలుగు వారు మలేసియా అభివృద్ధిలో భాగస్వాములవుతూనే తెలుగు గుర్తింపును విశ్వవ్యాప్తం చేస్తున్నారు. మనం ఉండే గడ్డ ఏదైనా మన రక్తం తెలుగు. మన మూలాలు ఆంధ్రప్రదేశ్. మలేసియాలో ప్రవాసాంధ్రులు సాధించిన వ్యాపార నైపుణ్యాలు, అనుభవాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టాలి. కూటమి ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా అండగా ఉంటుంది. మీ హక్కుల రక్షణ, మీ సంక్షేమానికి ఎల్లప్పుడూ ముందుంటుంది. ప్రవాసాంధ్రుల కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌శాఖను తీసుకొచ్చింది' అని పేర్కొన్నారు.

చర్చా సంప్రదాయాన్ని దెబ్బతీస్తే రాజ్యాంగానికి ముప్పు



ఎంపీ మేనకా గురుస్వామి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పార్లమెంటరీ చర్చా సంప్రదాయాన్ని అనుమతించకపోయినా.., పాటించకపోయినా, న్యాయ వ్యవస్థ వంటి సంస్థలు రాజకీయీకరణకు గురైనా భారత రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతుందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన డా.మేనకా గురుస్వామి అన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్మారకార్థం 'ఎస్.జైపాల్‌రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్', 'మంథన్' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'భారత రాజ్యాంగం-పరిరక్షణ' సభలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జెన్‌జీ నిరసనలు, కేంద్ర ప్రభుత్వం స్పందించిన పరిస్థితులపై ఆమె మాట్లాడారు. వ్యవస్థలు యువ గళాలకు ప్రాధాన్యమివ్వాలని, సమస్యలు పరిష్కారం కానప్పుడే యువత రహదారులపైకి వచ్చి నిరసనలకు దిగుతోందన్నారు. 'ఇది ముగింపు కాదు.. ఆరంభం మాత్రమే..అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించేలా వారు ఈ దేశ యువతను మేల్కొల్పారు' అని అన్నారు. దివంగత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విలక్షణ రాజకీయ నాయకుడని కొనియాడారు. నల్సార్ వీసీ శ్రీకృష్ణదేవరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు, మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, పద్మారెడ్డి, పలువురుఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

గతంలో దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేయించింది మీరు కాదా జగన్?

మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరు, మాచర్ల, పులివెందుల సహా రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో దౌర్జన్యాలకు పాల్పడి బలవంతపు ఏకగ్రీవాలు చేయించింది మీరు కాదా అని వైకాపా అధినేత జగన్‌ను మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు నిలదీశారు. అప్పట్లో వైకాపా నాయకులు చేసిన అరాచకాల్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చింపేశారు. రిటర్నింగ్ అధికారుల్ని బెదిరించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని అప్పటి ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ భావిస్తే.. ఆయనకు కులం ఆపాదించి వేధించారు" అని అశోక్‌బాబు మండిపడ్డారు.

ఎంఐఎంలో సంచలనం!

చర్చనీయాంశంగా ఎమ్మెల్సీ రహమత్‌పై వేటు

ఈనాడు, హైదరాబాద్: మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన సంఘటన సంచలనం సృష్టించింది. ఆయన పదవీ కాలం 2029 వరకు ఉండగా.. తక్షణమే రాజీనామా చేయాలని ఆ పార్టీ శుక్రవారం రాత్రి ఆదేశించడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ నుంచి బహిష్కరించడం, పదవికి రాజీనామా చేయాలని ఆదేశాలు జారీ చేయడం మజ్లిస్ చరిత్రలోనే తొలిసారి. ప్రస్తుతం రహమత్ బేగ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. శాసనమండలి ఛైర్మన్‌కు రాజీనామా సమర్పించకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. రాజేంద్రనగర్ ప్రాంతంలో ఒక సంఘటన జరిగిందంటూ ఐదు రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో ఒక అశ్లీల వీడియో వైరల్ అయింది. అందులో ఎమ్మెల్సీ బేగ్ ఉన్నారు. అది తీవ్ర దుమారం రేపింది.

దురుసు ప్రవర్తన... వివాదాలు..: మజ్లిస్ మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ వద్ద డ్రైవర్‌గా చేరిన బేగ్... అనంతర కాలంలో పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా ఎదిగారు. ఎదిగే క్రమంలో ఇతర పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులతో దురుసుగా ప్రవర్తించేవారని, వివాదాల్లో తలదూర్చేవారని ఆరోపణలున్నాయి. పాత

బస్తీ సహా నగరంలో ఎక్కడ గొడవ జరిగినా.. క్షణాల్లో తన అనుచరగణంతో చేరుకుని హల్‌చల్ సృష్టించడం అలవాటని కార్యకర్తలే అంటున్నారు.

మజ్లిస్‌లో కొనసాగాలని భావిస్తున్నా: రహ్మత్ బేగ్

"కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 26న ఉమ్రాకు వచ్చా. నా పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా అశ్లీల వీడియోలను ప్రసారం చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశా. మజ్లిస్ పార్టీ కార్యకర్తగా కొనసాగాలని భావిస్తున్నా" అని రహ్మత్‌బేగ్ శనివారం సాయంత్రం ఓ వీడియోను విడుదల చేశారు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

అలా 'పుంజు'కుంది వ్యాపారం!

'మగవాళ్లతో పోటీ అవసరమా..?' 'నువ్వు చేయలేవు.. నష్టాలు వస్తాయి'... 'అసలు నీకేం తెలుసని?'... వ్యాపారం చేస్తాననగానే ప్రతి ఒక్కరూ చెప్పిన మాటలే ఇవి. అయినా... అడుగుపెట్టారు యడ్లపల్లి రత్నకుమారి. రాణిస్తుండటమే కాదు... మరికొందరికి ఉపాధినీ చూపిస్తున్నారు. ఇంతకీ తన వ్యాపారమేంటో... ఆమె మాటల్లోనే..!

నేను పదో తరగతి మాత్రమే చదివా. మాది పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పరిధి రుస్తుంబాద. పెళ్లైన కొత్తలో మావారు రాజేశ్ రకరకాల నాటు కోళ్లు పెంచేవారు. వాటికే ఎక్కువ సమయం కేటాయించేవారు. మొదట్లో కోపం వచ్చినా... క్రమంగా నేనూ ఆయనతో కోళ్ల షెడ్లకు వెళ్లడం ప్రారంభించా. నాకూ వీటి పెంపకంపై ఆసక్తి పెరిగింది. మొదట్లో 'కోళ్లు పెంచడం ఏముంది? మేత వేసి.. నీళ్లు పెడితే చాల'నుకునేదాన్ని. అందులోకి దిగిన తర్వాతే తెలిసింది కష్టమెంతో! కోళ్ల జాతులు, వాటి పెంపక విధానాలు, తెలుగు జాతుల ప్రత్యేకతలు, వాటిని పెంచే శాస్త్రాలు... ఇలా ఎన్నో ఉంటాయని తెలిసి నేర్చుకోవడం ప్రారంభించా. ఇంతలో వ్యాపారంలో నష్టాలు రావడంతో పెంపకం ఆపేద్దామన్నారు మావారు. అందరూ అదే మంచి నిర్ణయమన్నా నాకు మాత్రం నచ్చలేదు. అందుకే నేనే వ్యాపారాన్ని నిర్వహిస్తా, లాభాల్లోకి తీసుకొస్తానని చెప్పా. అందరూ నవ్వారు. 'మగవాళ్లే చేయలేక నష్టపోతున్నారు. నీలాగే ఎంతోమంది ప్రయత్నించి తర్వాత వ్యాపారాన్ని మూసేసి వేరే పనులు చేసుకుంటున్నారు. నీ వల్ల ఏమవుతుంది' అని ఇంట్లో వాళ్లూ వద్దన్నారు. నేను మాత్రం ఒక్క అవకాశమిస్తే నిరూపించుకుంటా అన్నా. మావారు నన్ను ప్రోత్సహించారు.

ఇతర రాష్ట్రాల నుంచీ...

ముందు వ్యాపారంలో రాణిస్తున్న కొందరిని సంప్రదించా. సాధారణంగా ఎవరూ కోళ్ల పెంపక రహస్యాలను చెప్పరు. నాకు దీనిపై ఉన్న అంకితభావాన్ని చూసి, వాళ్లు మార్గనిర్దేశం చేశారు. తక్కువ ధరకే సీడ్ కోళ్లు ఇచ్చారు. తర్వాత మా పొరపాట్లు, ఏం చేస్తే లాభాలొస్తాయనే విషయాలపై దృష్టిసారించా. మన ఉత్పత్తి ఎంత నాణ్యమైనదైనా వినియోగదారులకు తెలియకపోతే వ్యర్థమనే విషయాన్ని గ్రహించా. తెలిసేలా ఏం చేయాలా అని ఆలోచించినప్పుడు ఓ ఫ్రెండ్ సోషల్ మీడియా గురించి చెప్పారు. షెడ్లు శుభ్రం చేయడం, కోళ్లకు ప్రొటీన్ ఆహారం పెట్టడం, స్నానం చేయించడం, వాటికి ఆరోగ్య పరీక్షలు చేయించడం... వంటివన్నీ వీడియోలు తీసి 'రత్న ఫామ్స్' పేరుతో ఇన్‌స్టాలో పోస్ట్ చేసేదాన్ని. వాటిని చూసి తెలుగు రాష్ట్రాలే కాదు... ఇతర రాష్ట్రాల నుంచీ వచ్చి కోళ్లు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. అలా వ్యాపారం క్రమంగా పెరిగి, విస్తరించింది.

ఒక్కో పుంజును జాతి, రకం, వయసు, రంగు ఆధారంగా విక్రయిస్తుంటా. వీటిని కోడి పందేల కోసం ఎక్కువగా తీసుకెళ్తుంటారు. రూ.లక్ష పలికేవీ ఉంటాయి. ఫలదీకరణ గుడ్లను ఒక్కొక్కటి రూ.300 నుంచి అమ్ముతున్నాం. కోళ్లను పెంచాలనుకునేవారు వీటిని తీసుకెళ్తుంటారు. తెలుగు కోళ్ల జాతుల్లో పచ్చకాకి, సేతువా, నెమలి, కాకిడేగ, గట్టికాకులు, కోడికాకి, అబ్రాసు, పింగళ వంటివెన్నో జాతులు మా వద్ద ఉన్నాయి. మొత్తంగా ఏడాదికి రూ.20లక్షల వరకూ సంపాదిస్తున్నా. పలువురికి ఉపాధినీ కల్పిస్తున్నా. ఇది ఒక్క రాత్రి, నెలలో సాధ్యమవ్వలేదు. మా అయిదేళ్ల కష్టం. ఈ రంగంలో మహిళలు అరుదు. నేను అందరికీ స్ఫూర్తిగా నిలిచి... మహిళలూ కోళ్ల పెంపకంలో ఆర్థికాభివృద్ధి సాధించేలా చేయడమే నా లక్ష్యం. దేశీ కోళ్ల పెంపకం చాలా పెద్ద శాస్త్రం. ఎన్నో సంవత్సరాలు అధ్యయనం చేశా. నేను నేర్చుకున్న విషయాలను నలుగురికీ నేర్పిస్తున్నా. అందుకు సంతోషంగా ఉంది.

– దుర్గారావు కుతాడ, తాడేపల్లిగూడెం

బేబీమూన్‌కి వెళుతున్నారా?

కొత్త జంట పెళ్లయ్యాక హనీమూన్‌కి వెళ్లడం అందరికీ తెలిసిందే. పెళ్లి పనుల్లో సాయం చేసిన స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు పెళ్లయ్యాక బడ్డీమూన్‌కీ వెళుతున్నారిప్పుడు. అలాంటి మరో ట్రిప్ బేబీమూన్. హీరోయిన్ సమంత కారణంగా ఇప్పుడిది మళ్లీ ట్రెండ్ అవుతోంది.

ఇద్దరు వ్యక్తులు... పెళ్లితో ఒకటవుతారు. అప్పటికే కాస్త పరిచయం ఉన్నప్పటికీ పెళ్లి తరవాత ఏర్పడే బంధంలోనే ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకుంటారు. తమదైన ప్రపంచాన్ని నిర్మించుకుంటారు.

ఈలోగా ప్రెగ్నెన్సీ. ఓపక్క తల్లిదండ్రులు కాబోతున్నామన్న ఆనందం, మరోపక్క... కొత్త బాధ్యతలు... జీవితం ఒక్కసారిగా మారిపోతుంది. నిద్ర లేని రాత్రులు గడపాల్సి ఉంటుంది. వీటికి మానసికంగా సిద్ధపడాలంటే ముందు ఇద్దరిమధ్యా చక్కని అవగాహన ఉండాలి. బంధం మరింత దృఢపడాలి. ముఖ్యంగా ప్రెగ్నెన్సీతో అమ్మాయిల్లో శారీరక, మానసిక మార్పులెన్నో... హార్మోన్ల అసమతౌల్యతలతో ఒత్తిడి, భయాందోళనలకు లోనవుతారు. అది అర్థంగాక అబ్బాయిలూ గందరగోళానికి లోనవుతారు. అపోహలు, అపార్థాలు... ఇవన్నీ లేకుండా ఉండేందుకు... ఈతరం ఎంచుకుంటున్నదే బేబీమూన్. వీళ్లనే బేబీమూనర్లు అనీ అంటున్నారు. ఎక్కువగా 14-28 వారాల మధ్యలో ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందుకోసం చాలామంది రిసార్టులకీ స్పాలకీ పచ్చని పరిసరాల్లోకీ వెళుతున్నారు. మనదగ్గర బేబీమూన్‌కోసం ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయ, తెలంగాణలో అనంతగిరిహిల్స్, కేరళంలోని కుమరకోమ్ బ్యాక్‌వాటర్స్, తమిళనాడులోని ఊటీ, కర్ణాటకలోని కూర్గ్, దక్షిణ గోవా బీచ్‌లూ... వంటివాటిని ఎంపికచేసుకుంటున్నారు.

ప్రణాళిక ఎలా?

- ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. సరేనంటేనే వెళ్లాలి. వైద్యుల నంబరు దగ్గర పెట్టుకోవడం మర్చిపోవద్దు. వెళ్లే ప్రదేశంలోనూ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఉన్నాయా అన్నదీ చెక్ చేసుకోవాలి. కొండప్రాంతాలకు వెళితే దగ్గర్లోని స్థానిక హాస్పిటల్స్, ఎన్ఐసీయూ ఉందో లేదో చూసుకోవాలి.
- వికారం ఎక్కువగా ఉండేవాళ్లు వెళ్లకపోవడమే మంచిది. మీ శరీరం చెప్పేదే వినండి. దానిగురించి మీకే బాగా తెలుసు. అంతా బాగుంటేనే వెళ్లండి. ఒకళ్లని చూసి మీరు ప్లాన్ చేసుకోవద్దు. ఎవరికి వారే ప్రత్యేకం. అందరి ఆరోగ్యం ఒకేలా ఉండదు.
- సాధ్యమైనంతవరకూ మరీ దూరప్రాంతాలొద్దు. కాదూ వెళ్లాలీ అనుకుంటే... హడావుడి, గందరగోళం నెలకొన్న కిక్కిరిసిన నగరాల్లో కాకుండా ప్రశాంత ప్రదేశాలనే ఎంచుకోవాలి. వెళ్లేటప్పుడు అక్కడి నీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి.
- ఈ సమయంలో ఫ్యాషన్‌కన్నా సౌకర్యమే ముఖ్యం. వదులుగా సౌలభ్యంగా ఉండే దుస్తుల్నే పెట్టుకోండి. దిండు, విటమిన్ ట్యాబ్లెట్లు మర్చిపోవద్దు. ఆహారంలో కొత్త పదార్థాలను ప్రయత్నించకపోవడమే మేలు. మీ శరీరానికి సరిపడేవీ, ప్రొటీన్ స్నాక్స్... చాలావరకూ ఇంటినుంచి తీసుకెళ్లడమే ఉత్తమం!
- మార్చుకోగలిగే లేదా రద్దు చేసుకునే సౌలభ్యం ఉన్న టిక్కెట్లు బుక్ చేసుకోండి. విమానంలో, రైల్లో ప్రయాణిస్తుంటే మధ్యలో లేచి నడవాలి. నీళ్లు తాగాలి.
- దూరం వెళ్లలేనివాళ్లు వారాంతాల్లో దగ్గర్లో వెల్‌నెస్ రిట్రీట్‌లకీ వెళ్లొచ్చు. ప్రసవం తేలికగా అయ్యే మసాజ్‌లు చేయించుకోవడం, ప్రకృతిలో చిన్నగా నడవడం, ధ్యానం చేయడం... వంటి వాటివల్ల ప్రెగ్నెన్సీ సమయంలో హార్మోన్ల మార్పులతో వచ్చే ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి.

తగు జాగ్రత్తలు తీసుకుంటూ మిమ్మల్ని మీరు తెలుసుకుంటూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ విహరించినప్పుడే... మీ బేబీమూన్ ఓ అందమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

లాభాలేంటి?

కొన్ని రోజులపాటు ప్రశాంత వాతావరణంలో గడపడంవల్ల కాబోయే తల్లిదండ్రుల్లో ఒత్తిడి తగ్గుతుంది. ఒకరి గురించి ఒకరు పట్టించుకునేందుకూ రాబోయే బిడ్డ గురించి ఆలోచనలు పంచుకునేందుకూ భావోద్వేగపరంగా దగ్గరయ్యేందుకూ దోహదపడుతుంది. కొందరైతే తామిద్దరే కాకుండా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతోనూ ఆనందంగా గడిపేందుకు.. దీన్ని ప్లాన్ చేసుకుంటున్నారు. దాంతో వాళ్ల మధ్య బంధాలు మరింత బలపడటమే కాదు, బిడ్డ పుట్టాక కుటుంబీకులు దంపతులకు అండగా నిలబడేందుకూ ఈ ట్రిప్‌లు దోహదపడుతున్నాయి. బిడ్డ బాధ్యతల్ని పంచుకోవడం, పోస్ట్‌పార్టమ్ సపోర్ట్, ఆర్థిక విషయాలు... వంటివన్నీ చర్చించుకునేందుకు ఈ రకమైన విరామం మంచిదే.

అయితే దీనికోసం వేరే ప్రాంతాలకే వెళ్లనక్కర్లేదు. దంపతులిద్దరూ తమకోసం సమయం కేటాయించుకుని మానసికంగా దగ్గరవ్వడమే బేబీమూన్‌కి సరైన అర్థం!

– అర్చనాకృష్ణ సైకాలజిస్ట్

ఇదేం తలనొప్పి?

'అబ్బబ్బ అసలే తలనొప్పిగా ఉంటే...' పిల్లలు అల్లరి చేస్తున్నా, శ్రీవారు మాటిమాటికీ పనులతో విసిగించినా చెప్పే మాటే! పైగా తరచూ అంటుంటాం కూడా. అలాగని ఊరికే అనం. నిజంగానే పదే పదే పలకరిస్తూ ఉంటుంది. కేవలం మాత్రలు వేసుకుని ఊరుకుంటున్నారేమో! వీటినీ చెక్ చేసుకోవాలి.

'పనుల్లో పడితే నీళ్లే గుర్తుండవు' చాలా మంది ఆడవాళ్లు చెప్పే మాటే! కానీ ఈ నిర్లక్ష్యం ప్రభావం పడేది మెదడు మీదేనట. అది కొనసాగి కొంతసేపయ్యాక తలనొప్పిగా కనిపిస్తుంది. ఏడు గంటల కనీస నిద్ర చాలు... అనుకుంటున్నారేమో! ఒకరోజు పదింటికి, మరోరోజు అర్ధరాత్రి దాటాక... ఇలా రోజుకో రకంగా పడుకున్నారనుకోండి. వేళలు పాటించకపోయినా ఇది పలకరించేస్తుందట. కాబట్టి, మెదడుని గజిబిజి చేయకండి. లేదంటే ఇలా ఇబ్బంది పెడుతుందట.

ఎలా కూర్చుంటున్నారు? సిస్టమ్, మొబైల్‌లోకి చూస్తున్నప్పుడు తెలియకుండానే తలను ముందుకు వంచి ఉంచుతాం. ఆ ప్రభావం పుర్రె ఎముకల మీద పడుతుందట. ఇక స్క్రీన్ చూస్తే కళ్లు ఆర్పనే ఆర్పం. ఈ ప్రభావమూ జతై తలనొప్పికి దారితీస్తుంది. ఉపవాసాలు, పనిలో పడి మర్చిపోవడం... మనల్ని తిండికి దూరం చేసే కారణాలెన్నని? ఇలా గంటలకొద్దీ తినకుండా ఉంటే గ్లూకోజ్ స్థాయులు తగ్గుతాయి. అదీ ఇలా బయటపడుతుందట. ఇవి చాలవన్నట్లు ఒత్తిడి తోడు. అది దరిచేరితే తెలియకుండానే దవడలు బిగించి ఉంచుతామట, భుజాలూ పైకి లేస్తాయట. ఆ కండరాలన్నీ పట్టినట్లయ్యీ తలనొప్పికి దారితీస్తాయట. కాబట్టి, ట్యాబ్లెట్లు మింగుతూ వెళ్లకండి. కారణాన్ని గమనించుకోండి. దానికి తగ్గట్టుగా జీవనశైలిలో మార్పులు చేసుకోండి. అలాగని తీవ్రంగా వస్తుంటే వదిలేసేరు. అప్పుడు మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాల్సిందే.

సున్నిత చర్మంతో సమస్య!

నా చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాస్మెటిక్స్, సబ్బులు వాడితే చర్మంపై దద్దుర్లు, దురద వస్తున్నాయి. ఇది ఏదైనా సమస్యా? నేనెలాంటి ఉత్పత్తులు ఉపయోగిస్తే మేలు? – ఓ సోదరి

ఈ పరిస్థితికి రెండు రకాల కారణాలు ఉండొచ్చు. వాటిల్లో ఒకటి... స్వతహాగానే మీ చర్మం ఎక్కువ సున్నితంగా ఉండి క్రీములు, రసాయనాలు వంటివి పడకపోయి ఉండొచ్చు. లేదా రెండో దాని ప్రకారం మీరు ఇప్పటికే హార్ష్ కెమికల్స్... అంటే బ్లీచ్‌లు, అదనపు ఎక్స్‌ఫోలియేషన్స్ (ఏహెచ్ఏ, బీహెచ్ఏ, రెటినాల్స్) ఎక్కువ వాడటం వల్ల స్కిన్ బ్యారియర్ దెబ్బతిని ఇలా జరిగి ఉండొచ్చు. ముందు మీకు దేనివల్ల ఇబ్బంది ఎదురవుతోందో గమనించుకుని దాన్ని ఆపడం ముఖ్యం. కఠిన రసాయనాలున్న ఫేస్‌వాష్‌లు, స్క్రబ్‌లు, ఎక్స్‌ఫోలియంట్స్ వాడకూడదు. గాఢత తక్కువ ఉండే క్లెన్సర్‌లతోనే ముఖం కడుక్కోవాలి. ఇక, బ్యారియర్ రిపేర్ క్రీమ్స్, వీటిలో ముఖ్యంగా సెరామైడ్స్, స్క్వాలేన్, హైలురోనిక్ యాసిడ్ ఉండే వాటిని క్రమం తప్పకుండా రోజుకు మూడు, నాలుగుసార్లు సమస్యకు పరిష్కారం దొరికేవరకూ వాడాలి. అలానే సూథింగ్ ఏజెంట్స్.. సికాల్ఫేట్ గానీ, కామమైల్ వంటివి వాడుతుంటే మీ చర్మం శాంతపడి సున్నితత్వం కొంతవరకూ తగ్గుతుంది. మీరు క్రమం తప్పకుండా సన్‌స్క్రీన్ అదీ రసాయనాలు లేని, ఫిజికల్ బ్లాకర్స్ ఏజెంట్స్ ఉన్నవి వాడితే మంచిది. అట్లాగే రాత్రిపూట ఈ రెటినాల్స్, ఏహెచ్ఏ, బీహెచ్ఏలకు దూరంగా ఉండాలి. ఏ క్రీమ్ వాడినా ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకుని మీకు నప్పుతుందో లేదో చూసుకుని క్రమంగా పెంచుకోవాలి. అలానే దేనివల్ల మీకు అలర్జీ, సెన్సిటివిటీ వస్తోందో పరీక్ష చేయించుకుని దాని ప్రకారంగా ఆ పదార్థాలు ఉన్న క్రీమ్స్ వాడటం మానేస్తే ఫలితం ఉంటుంది.

డియర్ వసుంధర

- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

మీకు తెలుసా?

రోష్నీ శర్మ... 2014లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ ఒంటరిగా మోటార్‌బైక్‌పై ప్రయాణించిన మొదటి మహిళ. పదకొండు రాష్ట్రాల గుండా సాగిన ఆమె ప్రయాణం... మహిళలు ధైర్యంగా, స్వేచ్ఛగా ప్రయాణించగలరన్న విషయాన్ని లోకానికి చాటింది.

పాత దుపట్టాలతో రిబ్బను పువ్వులు!

ఎంతో ఇష్టంగా కొన్న కుర్తీలు-ప్యాంట్లు పాతవైపోతాయి కానీ, వాటికి జతగా వచ్చిన దుపట్టాలు మాత్రం వన్నె తగ్గవు. దాంతో ఆ చున్నీలను పారేయ బుద్ధికాదు... అలాంటప్పుడు ఇలా చేసి చూడండి.

- అందమైన ఎంబ్రాయిడరీ, డిజైనర్ బోర్డర్లు, మిర్రర్ వర్క్, ప్రింటెడ్ చున్నీలను తీసి పక్కనపెట్టండి. ముఖ్యంగా వాటిల్లో హెవీ వర్క్ దుపట్టాలతో స్టైలిష్ జాకెట్లు, షర్ట్ స్టైల్ బ్లౌజులు లేదా ఇండో-వెస్టర్న్ క్రాప్ టాప్స్ కుట్టించుకోవచ్చు.
- వీటిని దుస్తుల కోసమే కాదు... ఇంటి అవసరాలకూ వాడొచ్చు. వాటి డిజైన్‌ను బట్టి అందమైన కుషన్ కవర్లు, డైనింగ్ టేబుల్ రన్నర్లు, విండో కర్టెన్లు, మిక్సీ గ్రైండర్ కవర్లూ వంటివి కుట్టుకోవచ్చు.
- పూల డిజైన్లు ఉన్న బోర్డర్లతో ప్రత్యేకమైన ఫొటో ఫ్రేమ్‌లను కూడా తయారు చేసుకోవచ్చు.
- నెట్ లేదా షిఫాన్ రకపు చున్నీలతో ట్రెండీ హెడ్‌బ్యాండ్‌లు, రిబ్బన్ ఫ్లవర్స్... వంటివి సులభంగా తయారు చేసుకోవచ్చు.

దీనివల్ల అదనపు ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసినట్లు అవుతుంది అలాగే మన సృజనాత్మకతకు పదును పెట్టినట్లు ఉంటుంది.

బంగారం - వెండి

29న ముగింపు

	బంగారం (24క్యా|10గ్రా)	ఆర్నమెంట్ (22క్యా|10గ్రా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,61,410	1,45,500	2,44,050
విజయవాడ	1,56,635	1,45,050	2,44,000
ప్రొద్దుటూరు	1,51,200	1,39,100	2,38,000
రాజమహేంద్రవరం	1,58,240	1,45,050	2,60,000
విశాఖపట్నం	1,58,000	1,45,000	2,45,000
తమిళనాడు	-----	1,45,050	2,60,000

తీరానికి రక్షణ కవచంలా..!

తుపాను తీరాన్ని తాకినప్పుడు ఆ బీభత్సం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలా ఉంటుందో తెలిసిందే. అయితే ఒడిశా తీరప్రాంతంలో గ్రామాలు మాత్రం ఆ బీభత్సాన్ని ఎదుర్కొనేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నాయి. మహిళలు లాఠీలు పట్టుకుని అడవిని కాపలా కాస్తూ తీరానికి రక్షణ కవచంగా మారారు అక్కడి మహిళలు.

ఒడిశాలోని దేవి నది ముఖ ద్వారానికి దగ్గరగా ఉండే సనా ఝూడలింగ్, గుండల్బా వంటి గ్రామాల్లో ఉదయాన్నే అద్భుత దృశ్యం కనిపిస్తుంది. వందలమంది మహిళలు గుంపులుగా నడుస్తూ తీరప్రాంతం వెంబడి ఒక చేత్తో విత్తనాలు, మరో చేత్తో మొక్కలు పట్టుకుని నడుస్తారు. మోకాళ్లలోతు బురదను కూడా లెక్కచేయకుండా మొక్కల్ని నాటుతారు. కారణం 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్ వాళ్ల జీవితాల్లో ఈ మార్పు తీసుకొచ్చింది. వేలమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో మడ అడవులు ఉన్న గ్రామాలు సురక్షితంగా ఉండటం, అడవులు లేని గ్రామాలు వరదలో కొట్టుకుపోవడం గమనించారు అక్కడి మహిళలు. ఆరోజే వాళ్లంతా ఒక నిర్ణయానికి వచ్చారట... తమ ఇళ్లనూ, పిల్లల్నీ కాపాడుకోవాలన్నా... భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఆపదలు రాకూడదన్నా... ముందు అడవుల్ని కాపాడుకోవాలని. దాంతో తీరప్రాంతం మొత్తం మొక్కలు నాటడం మొదలుపెట్టారు. అలా ఇప్పటి వరకు తీరం వెంబడి 45వేలకు పైగా మొక్కల్ని నాటి అడవిగా మార్చి హరిత విప్లవాన్ని తీసుకొచ్చారు. అంతటితో సరిపెట్టుకోలేదీ మహిళలు. వాటి బాగోగులు చూసుకుంటూనే పెరిగిన మొక్కల్నీ, అడవినీ స్మగ్లర్ల నుంచి కాపాడుకుంటున్నారు. దీనికోసం 'గ్రీన్ మిషన్' అనే కార్యక్రమాన్ని కూడా ఏర్పాటుచేసుకున్నారు. దాదాపు 75 మంది మహిళలు కొన్ని గ్రూపులుగా విడిపోయి కర్రలు పట్టుకుని తీరం చుట్టూ పెట్రోలింగ్ చేస్తారు. వంట చెరకు కోసం చెట్లను నరికే వాళ్లు, స్మగ్లర్ల నుంచి ప్రాణాలకు తెగించి మరీ రాత్రింబవళ్లు అడవిని కాపాడుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే... ఇలా పహారా కాసే మహిళల్లో చాలామందికి ఇక్కడ సొంత భూముల్లేవు. వాళ్లు మొక్కలు నాటుతూ కాపాడుతున్న ఆ భూమి ప్రభుత్వానిదే. అయినా 'ఈ భూమి మాది కాకపోవచ్చు. కానీ ప్రకృతి మాది. గ్రామం మాది. తుపానుల సమయంలో అధికారులు హెచ్చరికలు జారీ చేయగానే ఎక్కడవక్కడే వదిలేసి మమ్మల్ని మేము కాపాడుకోవడానికి గుడో, బడో వెతుక్కోవాలి. ఒక్కోసారి నడుము లోతు నీటిలో పదేసి రోజులు ఉండాల్సి వస్తుంది. పంటలు మొత్తం నాశనమవుతాయి. మాతో పాటు దాదాపు ఎనభై గ్రామాల ప్రజలు వరదలో స్తంభించిపోతారు. ఆహారం దొరకదు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూడాల్సిందే. ఇలా అయితే భవిష్యత్తు తరాలు ఇంకా కష్టపడాలి. తీరం పచ్చగా ఉంటే మా ఇళ్లు, పిల్లల జీవితాలు పచ్చగా ఉంటాయి. అందుకే ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరాన్ని కాపాడుకోవాలనే ఈ కార్యక్రమానికి పూనుకున్నాం. రాబోయే తుపానుల నుంచి మా గ్రామాలు నీటమునగకుండా ఇవి అడ్డుకుంటాయి. పర్యావరణ వేత్త అయిన సౌమ్య రంజన్ బిస్వాల్ 'విమెన్ ఫర్ మాంగ్రూవ్స్' ఉద్యమాన్ని మొదలుపెట్టి తమవంతు సహకారం అందించారు. అయితే మడ అడవులను కాపాడుతున్నందుకు ఒడిశా పర్యావరణ సంరక్షణ అభియాన్ నెలకు వెయ్యి రూపాయలు గౌరవ వేతనం ఇస్తుంది' అని చెబుతున్నారీ మహిళలు.

ఆటతోనే నేర్చుకుంటారు!

కిడ్స్ కార్నర్

పిల్లల్ని ఫోను, టీవీలకు దూరంగా ఉంచి చదువు చెప్పాలంటే కష్టమే కదా! అందులోనూ ప్లే స్కూల్ లేదా, ఇప్పుడే అక్షరాలు నేర్చుకునే పిల్లలకైతే మరీనూ. అదే ఈ ఫన్ అండ్ లర్నింగ్ టూల్స్‌తో ఆడిస్తూ చదువు చెబితే భలేగా గుర్తుంచుకుంటారు. డిజిటల్ స్క్రీన్‌కు దూరంగానూ ఉంటారు.

చక్కగా గుర్తుపట్టేస్తారు!

వేర్వేరు ఆకారాలను, గుర్తులను ఒకదానితో ఒకటి పోల్చడం వల్ల పిల్లల్లో లాజికల్ థింకింగ్ పెరుగుతుంది. అందుకే లెక్కలు చెప్పే ముందు సింబల్స్‌ని గుర్తించడం నేర్పిస్తారు. కొందరికి ఇవి గుర్తుపెట్టుకోవడం కష్టమే. అలాంటి వాళ్లకు ఈ 'మ్యాచింగ్ షేప్ బోర్డు' ఇస్తే సరి. ఈ బోర్డులో ఉండే ఆకారాలను చూస్తూ సింబల్స్‌ని కరెక్ట్ ప్లేస్‌లో పెట్టాలి. ఇలా చేయడం ద్వారా పిల్లలకు వాటిపై అవగాహనా వస్తుంది.

సులువుగా రాసేస్తారు...

స్కూల్‌కి వెళ్లే తొలిరోజుల్లో నేరుగా అక్షరాలు కాకుండా నిలువు, అడ్డ గీతలు, కర్వ్స్ రాయడం నేర్పిస్తారు. అప్పుడే చేతివేళ్లకు గ్రిప్ వచ్చి పెన్సిల్‌ని బాగా పట్టుకోగలుగుతారు. స్కూల్‌లో అయితే టీచర్, తోటి పిల్లలు ఉంటారు కాబట్టి కాసేపైనా రాస్తారు. అదే ఇంట్లో చేయించాలంటే పెద్ద టాస్కే చేయాలి అమ్మలు. కానీ ఈ 'రెయిన్‌బో రైస్'తో రాయించి చూడండి చక్కగా రాసేస్తారు. ఈ బియ్యంపై వేళ్లతో గీతలు, అక్షరాలు గీయడం, రాయడం వల్ల సరదాగా అనిపించి ఎంతసేపు అయినా రాస్తారు. పైగా వాళ్లకు ఇది చదువులా కాకుండా ఆటలా అనిపిస్తుంది. రసాయనరహిత రంగులతో తయారుచేయడం వల్ల చిన్నారికి ఎలాంటి హానీ ఉండదు. అంతేకాదు, వీటితో ఆడుకోవడం వల్ల కంటికీ, చేతికీ సమన్వయం కుదిరి ఏకాగ్రత పెరుగుతుంది.

ఏబీసీడీలు చెబుతుంది...

టీవీ లేదా ఫోన్లో బొమ్మలు, పాటలు వస్తే పిల్లలు కదలకుండా కూర్చుని మరీ చూస్తారు కదా! దీనివల్ల ఒకరకంగా తెలియకుండానే వాళ్లు డిజిటల్ స్క్రీన్‌కి అలవాటు పడిపోతుంటారు కూడా. మీ చిన్నారికి స్క్రీన్ ఫ్రీ వినోదాన్ని అందించాలంటే... ఎడ్యుకేషనల్ ల్యాప్‌టాప్ ఉండాల్సిందే. పిల్లలు దీని కీబోర్డుపై అక్షరాలు లేదా పదాలు, అంకెలను నొక్కితే మ్యూజిక్‌తో కలిపి చక్కగా వినిపిస్తుంది. ఇవేకాకుండా 20రకాల లర్నింగ్ యాక్టివిటీలను ఇందులో ఇన్‌బిల్ట్ చేయడం వల్ల ఆటలు కూడా ఆడుకోవచ్చు. డిజిటల్ స్క్రీన్‌కు దూరంగానూ ఉంటారు.

(c) eenadu

ఛాంపియన్

సూర్యకుమార్

అలా ఎలా తప్పిస్తారు

ముంబయి: తనను భారత టీ20 జట్టు నుంచి కెప్టెన్‌గా, ఆటగాడిగా తప్పించడాన్ని ఏమాత్రం ఊహించలేదని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌ను విజేతగా నిలిపాక.. వచ్చే రెండేళ్లలో జట్టును ఎలా నడపాలనే విషయంలో ప్రణాళికలతో ఉండగా, తనపై వేటు వేయడం ఆశ్చర్యం కలిగించినట్లు సూర్య చెప్పాడు. "జట్టును ప్రకటించడానికి రెండు మూడు రోజుల ముందు నాకు ఫోన్ చేశారు. మార్పు చేయడానికి ఇదే సమయం అన్నారు. నేనేమీ స్పందించలేదు. ఎందుకంటే ఇందులో నా తప్పేమీ లేదు. కానీ ఇలా జరుగుతుందన్న ఊహ కూడా నాకు లేదు. టీ20 ప్రపంచకప్ గెలిచాక ఇంకో రెండేళ్లు ఈ జట్టును ఎలా నడిపించాలా అని ఆలోచించా. ఒలింపిక్స్ వస్తాయి, ఇంకో టీ20 ప్రపంచకప్ ఆడాలి. ఈ సవాళ్లకు సిద్ధంగా ఉండాలనుకున్నా. కానీ అవతలి వ్యక్తులు భిన్నంగా ఆలోచించారు. నేను వారి ఆలోచనలను గౌరవిస్తా. జట్టు ప్రయోజనాల కోసం వాళ్లు ఆ నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. కాబట్టి నేను స్పందించలేదు. కానీ ఇలా ఎలా చేస్తారనిపించింది. నెలన్నర పాటు ఇంట్లో ఒంటరిగా ఉండిపోయాను. స్నేహితులు, కుటుంబ సభ్యులు వచ్చి ఓదార్చేవాళ్లు. కానీ వాళ్లు వెళ్లిపోయాక ఒంటరిగా అనిపించేది" అని సూర్య చెప్పాడు. తన తర్వాత శ్రేయస్‌ను కెప్టెన్‌గా చేయడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సూర్య అన్నాడు. "శ్రేయస్‌తో కలిసి నేను చాలా క్రికెట్ ఆడా. అతను మెరుగైన ఆటగాడు, కెప్టెన్. మంచి మనిషి కూడా. అతన్నెందుకు కెప్టెన్‌ను చేశారు అని నేననుకోలేదు. కానీ నా వరకు నిరాశ చెందా. ఎందుకంటే రెండేళ్ల కాలంలో ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, ప్రపంచకప్ గెలిచా. అంతా బాగున్నపుడు మార్పు ఎందుకో అర్థం కాలేదు" అని చెప్పాడు. కెప్టెన్సీకి దూరమైనప్పటికీ ఆటగాడిగా తాను జట్టుకు అందుబాటులోనే ఉంటానని.. ఎప్పుడు పిలిచినా ఆడేందుకు సిద్ధమని సూర్య పేర్కొనడం విశేషం. 2024లో టీమ్‌ఇండియా టీ20 ప్రపంచ కప్ గెలిచాక కెప్టెన్ రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో సూర్య పగ్గాలందుకున్నాడు. అతను కెప్టెన్ అయ్యాక టీమ్‌ఇండియా ఏ సిరీస్‌లోనూ ఓడిపోలేదు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌తో పాటు గత ఏడాది ఆసియా కప్‌లోనూ నెగ్గింది. కానీ సారథిగా విజయవంతం అయినప్పటికీ ఈ కాలంలో బ్యాటర్‌గా సూర్య విఫలమయ్యాడు. 45 మ్యాచ్‌ల్లో 25.88 సగటుతో 932 పరుగులే చేశాడు.

మహిళల టీ20 ఆసియాకప్

భారత్ జోరందుకునేనా?

రాత్రి 8 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

● థాయ్‌లాండ్‌తో పోరు నేడు

హర్మన్‌ప్రీత్ కౌర్

దుబాయ్: ఈ ఏడాది టీ20 క్రికెట్లో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయిన భారత మహిళల జట్టు.. జోరందుకోవాలనే లక్ష్యంతో మహిళల టీ20 ఆసియాకప్‌కు సిద్ధమైంది. గ్రూప్-ఎలో ఆదివారం థాయ్‌లాండ్‌తో పోరుతో టైటిల్ వేటను ఆరంభిస్తుంది. మహిళల ఆసియాకప్‌లో భారత్‌కు మంచి రికార్డు ఉంది. టీ20 ఫార్మాట్లో జరిగిన అయిదు టోర్నీల్లో జట్టు మూడుసార్లు టైటిల్ గెలిచింది. కానీ ప్రస్తుత ఫామ్ మాత్రం గొప్పగా లేదు. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఈ ఏడాది ఆడిన 16 టీ20 మ్యాచ్‌ల్లో 9 ఓడింది. టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. వచ్చే నెలలో ఆసియా క్రీడలు కూడా ఉండడంతో ఫామ్‌ను అందుకోవడం, నిలకడ సాధించడం భారత్‌కు చాలా అవసరం. హర్మన్‌ప్రీత్ కౌర్ ఫామ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆమె సత్తా చాటాల్సివుంది. స్మృతి మంధాన, షెఫాలి వర్మతో భారత ఓపెనింగ్ బలంగానే ఉంది. ఆ తర్వాత వచ్చే బ్యాటర్లు జోరు కొనసాగిస్తారా అన్నదే ప్రశ్న. భారత జట్టు ఫీల్డింగ్ కూడా బాగా మెరుగుపడాల్సివుంది. తెలుగమ్మాయి శ్రీచరణి, దీప్తి శర్మలతో భారత స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. వాళ్లకు తోడుగా రాధ యాదవ్ కూడా ఉంది. రేణుక సింగ్, అరుంధతి, క్రాంతి గౌడ్, నందని శర్మలతో భారత పేస్ బౌలింగ్ కూడా పదునుగానే ఉంది. వీళ్లలో ఎవరు తుది జట్టులో ఉంటారో చూడాలి. పసికూన థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు పెద్దగా ప్రతిఘటన ఎదురుకాకపోవచ్చు. గ్రూప్-ఎలో భారత్, థాయ్‌లాండ్‌తో పాటు హాంకాంగ్, పాకిస్థాన్ ఉన్నాయి. పాకిస్థాన్ మాత్రమే కాస్త గట్టి ప్రత్యర్థి.

ఆసియా క్రీడల నుంచి

నీరజ్ ఔట్

నీరజ్ చోప్రా

దిల్లీ: ఆసియా గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ పోరు కళ తప్పనుంది. స్టార్ జావెలిన్ త్రోయర్, టోక్యో ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా.. గాయం కారణంగా ఈ క్రీడల నుంచి వైదొలిగాడు. 2026లో మిగతా సీజన్ మొత్తానికి తాను దూరమవుతున్నట్లు అతడు శనివారం సోషల్ మీడియాలో ప్రకటించాడు. లుసానె డైమండ్ లీగ్ తర్వాత తాను గాయపడ్డట్లు నీరజ్ తెలిపాడు. "చాలా రోజులు శ్రమించాక.. లుసానెలో లయను అందుకున్నట్లు నాకు అనిపించింది. కానీ దురదృష్టవశాత్తు ఆ లీగ్ తర్వాత నాకు చీలమండ గాయమైంది. నా వైద్యులు, జట్టుతో చర్చించాక మిగిలిన సీజన్ మొత్తానికి దూరం కావాలని నిర్ణయించుకున్నా" అని నీరజ్ చెప్పాడు. ఈ నిర్ణయం తనకు నిరాశ కలిగించిందని అన్నాడు. "ఇప్పుడు నా దృష్టి కోలుకోవడంపైనే. తిరిగి బలంగా వస్తా" అని నీరజ్ చెప్పాడు. సెప్టెంబరు 5న జరిగే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అతడు దూరమయ్యాడు. వచ్చే నెల 19న ఆసియా క్రీడలు ఆరంభం కానున్నాయి.

నేటి నుంచి యుఎస్ ఓపెన్

అల్కరాస్‌కు ఎదురుందా..!

బరిలో జకోవిచ్, సబలెంకా

రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

న్యూయార్క్

సబలెంకా

అల్కరాస్

జకోవిచ్

యుఎస్ ఓపెన్‌కు వేళైంది. ఆదివారం మొదలయ్యే ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్ ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. మణికట్టు గాయం నుంచి కోలుకుని నాలుగు నెలల విరామం తర్వాత సర్క్యూట్‌లోకి వచ్చిన ఈ స్పెయిన్ స్టార్.. యుఎస్ ఓపెన్లో ఎలా ఆడతాడో చూడాలి. అతడి ప్రధాన ప్రత్యర్థి యానిక్ సినర్ (ఇటలీ) గాయంతో టోర్నీకి దూరం కావడంతో టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి అల్కరాస్‌కు ఇదో మంచి అవకాశం. రెండో సీడ్‌గా బరిలో ఉన్న అల్కరాస్.. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో రోమన్ సఫిలిన్ (రష్యా)తో తలపడనున్నాడు. అల్కరాస్ ఉన్న పార్శ్వంలోనే మాజీ ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) కూడా ఆడుతున్నాడు. మరోసారి 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ వేటకు దిగుతున్న నాలుగో సీడ్ నొవాక్.. తొలి రౌండ్లో నవోన్ (అర్జెంటీనా)తో పోటీపడనున్నాడు. అల్కరాస్‌కు జకోవిచ్ సెమీఫైనల్లో ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్ టాప్ సీడ్‌గా బరిలో ఉన్నాడు. తొలి రౌండ్లో సొనెగో (ఇటలీ)తో ఈ జర్మనీ స్టార్ పోటీపడనున్నాడు.

హ్యాట్రిక్‌పై సబలెంకా గురి: మహిళల సింగిల్స్‌లో అర్యానా సబలెంకా (బెలారస్) హ్యాట్రిక్ యుఎస్ ఓపెన్ టైటిల్‌పై గురి పెట్టింది. ఈ టాప్ సీడ్ ప్లేయర్ తొలి రౌండ్లో ఒసారియో (రొమేనియా)తో తలపడనుంది. ఇగా స్వైటెక్ (పోలెండ్), పెగులా (అమెరికా), కొకో గాఫ్ (అమెరికా), ఆండ్రీవా (రష్యా) నుంచి సబలెంకాకు పోటీ ఎదురు కానుంది. ఎనిమిదో సీడ్ స్వైటెక్.. తొలి రౌండ్లో వాంగ్ (చైనా)తో ఆడనుంది. సన్‌మేజ్ (తుర్కియే)తో నాలుగో సీడ్ గాఫ్.. రూస్ (కొలంబియా)తో మూడో సీడ్ పెగులా తలపడనున్నారు. వింబుల్డన్ ఛాంపియన్ నోస్కోవా (చెకియా)ను కూడా తక్కువ అంచనా వేయలేం. ఆరో సీడ్ నోస్కోవా.. వాల్‌నెట్స్ (అమెరికా)తో పోటీని షురూ చేయనుంది.

సెరెనా-వీనస్ మళ్లీ..: అమెరికా దిగ్గజ జంట సెరెనా విలియమ్స్-వీనస్ విలియమ్స్ యుఎస్ ఓపెన్లో ఆడబోతోంది. మహిళల డబుల్స్‌లో బరిలోకి దిగనున్న 46 ఏళ్ల వీనస్-44 ఏళ్ల సెరెనాలకు వైల్డ్ కార్డు ఎంట్రీ లభించింది. వీనస్ సింగిల్స్ లోనూ ఆడుతోంది. తొలి రౌండ్లో సోఫియా కెనిన్ (అమెరికా)తో ఆమె తలపడనుంది. చాన్నాళ్ల తర్వాత ఈ ఏడాది వింబుల్డన్ ద్వారా సెరెనా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో పునరాగమనం చేసింది. సింగిల్స్ తొలి రౌండ్లో ఓడింది. డబుల్స్‌లో వీనస్‌తో ఆడాల్సి ఉన్నా.. గాయంతో సెరెనా వైదొలిగింది. యుఎస్ ఓపెన్లో ఆమె సింగిల్స్‌లో పోటీ పడట్లేదు.

భారత్.. డబుల్స్‌లోనే

యుఎస్ ఓపెన్లో భారత్ నుంచి సింగిల్స్‌లో ఒక్కరు కూడా మెయిన్‌డ్రాకు అర్హత సాధించలేకపోయారు. క్వాలిఫికేషన్ టోర్నీ ఆడిన సుమిత్ నగాల్ తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. డబుల్స్‌లో యుకి బాంబ్రి, శ్రీరామ్ బాలాజీ బరిలోకి దిగుతున్నారు. మైకెల్ వీనస్ (న్యూజిలాండ్)తో యుకి.. ఇవాన్ కింగ్ (అమెరికా)తో బాలాజీ బరిలోకి దిగనున్నారు.

వయసు 51.. వికెట్లు 5

జోయాన్ హిక్స్

బుకరెస్ట్: వయసులో అర్ధ సెంచరీ దాటాక క్రీడల్లో కొనసాగడం పురుషులకైనా, మహిళలకైనా చాలా కష్టమే. కానీ ఐల్ ఆఫ్ మాన్‌కు చెందిన మహిళా క్రికెటర్ జోయాన్ హిక్స్ 51 ఏళ్ల వయసులో 5 వికెట్ల ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఆమె ఆడింది అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఆఫ్ స్పిన్నర్ జోయాన్.. గ్రీస్‌తో టీ20 పోరులో 10 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. అంతర్జాతీయ క్రికెట్లో ఓ మ్యాచ్‌లో అయిదు వికెట్లు తీసిన పెద్ద వయస్కురాలిగా హిక్స్ ఘనత సాధించింది. 96 ఏళ్లుగా ఆస్ట్రేలియా క్రికెటర్ బెర్ట్ ఐరన్‌మాంగర్ పేరిట ఉన్న రికార్డును ఆమె తుడిచిపెట్టింది. బెర్ట్ 1932లో (టెస్టు మ్యాచ్‌లో) దక్షిణాఫ్రికాపై 49 ఏళ్ల వయసులో అయిదు వికెట్ల ప్రదర్శన చేసింది. హిక్స్ ధాటికి తడబడిన గ్రీస్ 15 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఐల్ ఆఫ్ మాన్ ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్నందుకుంది.

యూఏఈపై శ్రీలంక విజయం

మిథాలి

దుబాయ్: మహిళల టీ20 ఆసియాకప్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. శనివారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-బి మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. మిథాలి (3/14), చేతన (3/16), సుగంధిక (2/18) ధాటికి మొదట యూఏఈ 19.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. ఈషా ఓజా (18) టాప్ స్కోరర్. లక్ష్యాన్ని శ్రీలంక 7.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. చమరి ఆటపట్టు (48 నాటౌట్), ఇమేషా దులాని (25) రాణించారు.

లంక పర్యటన ముగిసిన 48 గంటలకే..

భారత క్రికెటర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు

బెంగళూరు: టీమ్‌ఇండియా ప్రధాన ఆటగాళ్లు.. శ్రీలంక పర్యటనను ముగించుకుని స్వదేశానికి రాగానే వారికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ)లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సహా బీసీసీఐతో సెంట్రల్ కాంట్రాక్టులున్న ఆటగాళ్లందరూ ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. లంకతో రెండో టెస్టు గురువారం ముగియగా.. శనివారం ఆటగాళ్లు సీఈవోలో పరీక్షలకు హాజరయ్యారు. వీరితో పాటు లంక పర్యటనకు వెళ్లని కాంట్రాక్టు ఆటగాళ్లు పరీక్షల్లో పాల్గొన్నారు. భారత జట్టు స్వదేశీ సీజన్ త్వరలో మొదలు కానుంది. శుభ్‌మన్ సేన న్యూజిలాండ్‌తో రెండు టెస్టులు, ఆపై ఆస్ట్రేలియాతో అయిదు టెస్టులు ఆడాల్సి ఉంది. ఇవి కాక పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఉన్నాయి. ఆపై ఐపీఎల్ ఆడాల్సి ఉంటుంది. ఇలా ఎనిమిది నెలల పాటు భారత క్రికెటర్లు తీరిక లేకుండా గడపబోతున్నారు.

తిలక్ వర్మ

తిలక్ సారథ్యంలో సౌత్

● నార్త్‌తో దులీప్ ట్రోఫీ సెమీస్ నేటి నుంచి

మరో మ్యాచ్‌లో సెంట్రల్‌తో ఈస్ట్ ఢీ

బెంగళూరు: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఆఖరి దశకు చేరుకుంది. ఆదివారం ప్రారంభంకానున్న సెమీఫైనల్లో తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్.. నార్త్‌తో పోటీపడుతోంది. గత సీజన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకున్న సౌత్ ఈసారి విజేతగా నిలవాలని పట్టుదలగా ఉంది. ఇటీవల జరిగిన టీజీ20లో సత్తాచాటి, సౌత్‌కు ఎంపికైన కొడిమెల హిమతేజకు తుది జట్టులో అవకాశం వస్తుందేమో చూడాలి. రికీ భుయ్ (వైస్ కెప్టెన్), షేక్ రషీద్, కావూరి సాయితేజ, త్రిపురణ విజయ్, తనయ్ త్యాగరాజన్ వంటి తెలుగు ఆటగాళ్లు బరిలో ఉన్నారు. నారాయణ్ జగదీశన్, కరుణ్ నాయర్, శ్రేయస్ గోపాల్ వంటి సీనియర్లతో జట్టు సమతూకంగా కనిపిస్తోంది. మరోవైపు క్వార్టర్స్‌లో సమష్టిగా రాణించిన నార్త్ ఆత్మవిశ్వాసంతో ఉంది. ఆ జట్టు సారథి కన్నయ్య వధవాన్ టీమ్‌ను ముందుండి నడిపిస్తున్నాడు. పేస్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కంబోజ్ నార్త్‌కు బలం. మరో సెమీస్‌లో రజత్ పాటీదార్ నేతృత్వంలోని సెంట్రల్ జోన్, ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఢీకొంటున్నాయి. గత టోర్నీ గెలిచిన సెంట్రల్.. ట్రోఫీ నిలబెట్టుకోవాలని ఉత్సాహంగా ఉంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈస్ట్ తరఫున బరిలో దిగనున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో చాలా దూకుడుగా ఆడే అతడు.. సుదీర్ఘ ఫార్మాట్‌కు ఆటను అన్వయించుకునేందుకిది చక్కని అవకాశం. డిఫెండింగ్ ఛాంపియన్స్ హోదాలో సెంట్రల్ జోన్, రన్నరప్‌గా సౌత్ నేరుగా సెమీస్‌కు అర్హత సాధించాయి.

మహిళల హాకీ ప్రపంచకప్ విజేత అర్జెంటీనా

ఆమ్‌స్టెల్వీన్: మహిళల హాకీ ప్రపంచకప్‌లో అర్జెంటీనా విజేతగా నిలిచింది. శనివారం జరిగిన తుది పోరులో ఆ జట్టు షూటౌట్లో 3-1తో ఆతిథ్య నెదర్లాండ్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి రెండు జట్లూ 1-1తో సమంగా నిలిచాయి. యిబీ జాన్సన్ (30వ నిమిషం) గోల్ కొట్టి నెదర్లాండ్స్‌కు ఆధిక్యాన్ని అందించింది. మరో ఆరు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా పెనాల్టీ కార్నర్‌ను మారియో గ్రానాటో (54వ నిమిషం) గోల్‌గా మలిచి స్కోరు సమం చేసింది. షూటౌట్లో నెదర్లాండ్స్ జట్టులో మారీన్ గోల్ కొట్టగా.. సాండర్స్, ఫెలిస్ విఫలమయ్యారు. అర్జెంటీనా జట్టులో విక్టోరియా గ్రానాటో, బ్రిసా, సోఫియా కైరో గోల్స్ కొట్టి జట్టును విజయపథంలో నడిపించారు. అర్జెంటీనా మహిళల జట్టుకు ఇది మూడో ప్రపంచ కప్. గతంలోనూ నెదర్లాండ్స్‌పైనే (2002, 2010) నెగ్గి ఆ జట్టు ట్రోఫీ కైవసం చేసుకోవడం విశేషం. 2022 ప్రపంచకప్‌లోనూ నెదర్లాండ్స్‌తో అర్జెంటీనా ఫైనల్ ఆడినా.. డచ్ జట్టుదే పైచేయిగా నిలిచింది. ప్రస్తుత టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో బెల్జియం 1-0తో ఆస్ట్రేలియాను ఓడించింది.

డిఫెన్స్ ఇంకా మెరుగుపడాలి

హర్మన్‌ప్రీత్

వావ్రే (బెల్జియం): డిఫెన్స్‌లో భారత్ బాగా మెరుగుపడాలని భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. ప్రపంచకప్‌లో భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "భారత్, బెల్జియం ఏడో స్థానం కోసం ఆడాలని అనుకోలేదు. రెండు జట్లూ మానసికంగా సమాన స్థితిలో ఉన్నాయి. ప్రపంచంలో అత్యుత్తమ జట్లలో ఒకటైన బెల్జియంను వారి సొంత అభిమానుల మధ్య ఎదుర్కొని మెరుగైన ప్రదర్శన చేయడం సానుకూలాంశమే. 60 నిమిషాలు రాణించాలనుకున్నాం. ఆఖరిదాకా పోరాడాం. మా ఆట పట్ల ఆనందంగానే ఉన్నా.. ఎనిమిదో స్థానం సాధించడం మాత్రం నిరాశగానే అనిపిస్తోంది. ప్రపంచకప్‌లో డిఫెన్స్ పరంగా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. ఈ విభాగంలో భారత్ బాగా మెరుగవ్వాలి. తర్వాతి లక్ష్యం ఆసియా క్రీడలు. అక్కడ పసిడి గెలిచి లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంపై గురి పెట్టాం" అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

'చెస్‌లో ఎవరితోనూ వైరం లేదు'

ప్రజ్ఞానంద

దిల్లీ: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ కోసం గత రెండేళ్లు ఎంతో శ్రమించానని, ప్రస్తుతం ఆటను ఆస్వాదిస్తున్నానని ప్రజ్ఞానంద పేర్కొన్నాడు. చెస్ ప్లేయర్లలో ఎవరితోనూ తనకు వైరం లేదని ఈ భారత గ్రాండ్ మాస్టర్ తెలిపాడు. గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ విజయానంతరం అతడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. "క్యాండిడేట్స్ టోర్నీలో విజయం సాధించడం కోసం చాలా కష్టపడ్డాను. అనుకున్నది సాధించలేకపోయినా.. కానీ దాని ఫలితాలు ఇప్పుడు వస్తున్నాయి. ప్రస్తుతం నాకు ఎలాంటి లక్ష్యం లేదు. చెస్‌ను ఆస్వాదిస్తున్నా. క్యాండిడేట్స్‌లో ఓడాక.. నార్వే చెస్, గ్రాండ్ చెస్ టూర్ టైటిళ్లు చేజిక్కించుకోవడం గొప్ప అనుభూతినిస్తోంది. పరాజయాల్లో ఉన్నప్పుడు ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. ఆ సమయంలో ఫలితాల కంటే ఎలా ఆడతాం, ఎలా ఆలోచిస్తామన్నదే ముఖ్యం. ఎంత గొప్ప ఫామ్‌లో ఉన్నా, సామర్థ్యంపై ఎంత నమ్మకమున్నా.. ఉత్తమ క్రీడాకారులను ఓడించాలంటే ఉత్తమ ఆటతీరు కనబరచాల్సిందే" అని అన్నాడు. టాప్ ప్లేయర్లందరికీ అహం ఉంటుందన్న హికారు నకమురు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "ఒక ఆటగాడిపై ఓడిపోయినప్పుడు తిరిగి గెలవాలని అనుకుంటాం. ఆ విధమైన అహం ఉంటుందంతే. చెస్‌లో ఎవరితోనూ నాకు వైరం లేదు. రాబోయే ఒలింపియాడ్‌లో నా పాత్రపై స్పష్టత లేదు. ఏ బోర్డులో ఆడేందుకైనా, రిజర్వ్ ప్లేయర్‌గా ఉండేందుకైనా సిద్ధమే" అని ప్రజ్ఞ అన్నాడు.

ఇంగ్లాండ్ × పాకిస్థాన్ టెస్టుకు వర్షం దెబ్బ

లార్డ్స్: పాకిస్థాన్‌తో రెండో టెస్టుపై ఇంగ్లాండ్ పట్టు మరింత బిగిసింది. పాక్ ఓటమిని తప్పించుకుంటే అద్భుతమే. అయితే మూడో రోజు మ్యాచ్‌ను వర్షం దెబ్బతీసింది. 25 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఓవర్‌నైట్ స్కోరు 81/3తో మూడో రోజు, శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. వాన వల్ల ఆట నిలిచిపోయే సమయానికి 7 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. లారెన్స్ (50), రాబిన్సన్ (2) క్రీజులో ఉన్నారు. అబ్బాస్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ మొత్తం 357 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 290 పరుగులు చేయగా.. పాక్ 110కే కుప్పకూలింది.

ఛెత్రి

కొంచెం అసూయగా ఉంది

కోల్‌కతా: ప్రస్తుత తరం భారత ఫుట్‌బాల్ ప్లేయర్లకు దిగ్గజ జట్లు బ్రెజిల్, ఉరుగ్వేలతో ఆడే అవకాశం దక్కడం చూస్తే కొంచెం అసూయగా ఉందని మాజీ స్టార్ సునీల్ ఛెత్రి అన్నాడు. అక్టోబరులో సొంతగడ్డపై బ్రెజిల్, ఉరుగ్వేతో భారత్ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "చాలా అసూయగా అనిపిస్తోంది. నా రెండు దశాబ్దాల కెరీర్‌లో ఒక్కసారి కూడా బ్రెజిల్, ఉరుగ్వే లాంటి జట్లతో ఆడే అవకాశం రాలేదు" అని ఛెత్రి చెప్పాడు. ఇటీవలే మళ్లీ శిక్షణ మొదలుపెట్టిన ఛెత్రి.. తాను మళ్లీ పునరాగమనం చేసే అవకాశం లేదని సరదాగా అన్నాడు. "నా వయసు ఇప్పుడు 42 ఏళ్లు. 20 నిమిషాలు ట్రైనింగ్ చేశా. సరిగా పరుగెత్తడానికి కూడా ఇబ్బందిపడ్డా" అని ఛెత్రి అన్నాడు. 2025లో ఛెత్రి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు చెప్పాడు.

(c) eenadu

ఆటలతో చదువులను అనుసంధానించాలి

- వాలీబాల్ క్రీడాకారులకు రైల్వే ఉద్యోగాలిచ్చేలా అసెంబ్లీలో తీర్మానం చేద్దాం
- అమరావతి ఛాంపియన్ షిప్-2026 ముగింపు వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు


జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు నమూనా చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, శాప్ ఛైర్మన్ రవినాయుడు

ఈనాడు డిజిటల్, తిరుపతి: నేటి యువత సెల్‌ఫోన్లకు బానిసలై అర్ధరాత్రి వరకు మేల్కొంటూ నిద్రను కోల్పోతున్నారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి వారిని క్రీడలవైపు ప్రోత్సహించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. క్రీడలతో చదువును అనుసంధానం చేసినప్పుడే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. శనివారం తిరుపతిలోని ఎస్వీయూ ఆడిటోరియంలో 'అమరావతి ఛాంపియన్ షిప్-2026' ముగింపు వేడుకలు, జాతీయ క్రీడా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన అయ్యన్నపాత్రుడు ప్రసంగిస్తూ "నేను ఒకప్పుడు వాలీబాల్ క్రీడాకారుడిని. రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. అప్పటి సీఎం ఎన్టీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో తర్వాత ఆటలు మర్చిపోయా. నకిలీ సర్టిఫికెట్లు తెచ్చినవారికి కాకుండా నిజమైన క్రీడాకారులకే ఉద్యోగాలు దక్కేలా చూడాలి. వాలీబాల్‌లో బంగారు పతకం సాధించిన వారికి గతంలో రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ విధానం లేదు. దానిని తిరిగి అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. బడ్జెట్‌లో క్రీడలు, విద్య, వైద్యంపై కోతలు విధించొద్దు. మా ఊరి నుంచి ఒక అమ్మాయి కష్టపడి ప్రాక్టీస్ చేసి జపాన్ వెళ్లి స్కేటింగ్‌లో పతకం తెచ్చింది. అలాంటివారు ప్రతి ఊళ్లోనూ ఉన్నారు" అని చెప్పారు.

అమరావతిలో స్పోర్ట్స్ సిటీ: మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమరావతిలో రెండువేల ఎకరాల్లో భారీ స్పోర్ట్స్ సిటీని నిర్మించేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోనూ క్రీడా ప్రాంగణాలు, ఆడిటోరియంల నిర్మాణానికి స్థలాలు కేటాయించామన్నారు. "నెల్లూరు పరిసర ప్రాంతాల్లో సుమారు 1,000 ఎకరాల్లో క్రీడా సామగ్రి తయారీ యూనిట్ ఏర్పాటుకు రష్యా ప్రతినిధులతో, కేంద్రంతో సీఎం చర్చలు జరుపుతున్నారు. జడ్పీ స్కూళ్లలోని మైదానాలను సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు" అని చెప్పారు. వైకాపా ప్రభుత్వంలో 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో వాళ్లే ఆడుకున్నారు తప్ప క్రీడాకారులను ప్రోత్సహించలేదని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

★ ఎమ్మెల్యేలకు సైతం క్రీడలు నిర్వహించి, వారిని మైదానం బాట పట్టించిన ఘనత స్పీకర్ అయ్యన్నపాత్రుడిదేనని శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రశంసించారు. వేదికపై నలుగురు క్రీడా మంత్రులు (అయ్యన్నపాత్రుడు, సోమిరెడ్డి, కొల్లు రవీంద్రలు గతంలో క్రీడల మంత్రులుగా పనిచేశారు) ఉండడం విశేషమని చమత్కరించారు.

విజేతలకు నగదు బహుమతులు

తిరుపతిలో జరిగిన ఫైనల్స్‌కు 9,911 మంది క్రీడాకారులు చేరుకోగా.. వారిలో 378 మంది విజేతలుగా నిలిచారు. వీరికి రూ.92 లక్షల బహుమతులను అతిథులు అందజేశారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన 264 మంది క్రీడాకారులకు రూ.8.80 కోట్ల నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. పారా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు చెక్కు అందుకునే సమయంలో భావోద్వేగానికి గురయ్యారు.

ఈనాడు పెళ్లిపందిరి

ఈనాడు పెళ్లిసంబంధాల వెబ్ www.eenadupellipandiri.net ఫోన్: 8008001886, 8008002165 For More Details Log on to www.eenadupellipandiri.net

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

CA

వధువు కావలెను

SM4 Kapu Naidu Boy 34/ 5'10" Dental Surgeon, Own Clinic, Multicity Healthtech Startup. Seeks Bride Pref Dr/CA. ✆ 7987613250 (A)

కాపు: 29/5'10"/ MBBS, MD జనరల్ మెడిసిన్, DM న్యూరాలజీ గల వరుడికి తగిన వధువు కావలెను. కులపట్టింపులేదు. Only OC, BC వాళ్లు మాత్రమే. ✆ 8688003942 (A)

మాల 28/5'9", Muncipal Commissioner Group-I Officer only Son వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9493285326 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

SC మాదిగ/ 5'7"/ 29 సం/ B.Tech./ Govt. Job/ లోకల్ బ్యాంక్ ఆఫీసర్ స్కేల్ 1 యూనియన్ బ్యాంక్/ వరుడుకు Govt. జాబ్ వధువు కావలెను. Cell: 98496 13447. (G)

SC మాదిగ, కట్నప్రసక్తిలేదు 29/5'9", M.Tech (IIT), IOCL, C.Govt, 18 Lakhs P/A సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7095019114 (A)

వెలమ, 34 సం॥ MCA, బిజినెస్, ఆస్తి Hyd లో ఇల్లు, 1st మ్యారేజ్ వరుడికి & 42 సం॥ బిజినెస్, ఆస్తి, Hyd లో ఇల్లు, 2nd మ్యారేజ్ వరుడికి 1st/2nd వధువు కావలెను. ✆ 9010579775 (A)

వరుడు కావలెను

బ్రాహ్మణ ★ 33 Yrs/5'2"/ ఇంటర్ ★ 29 Yrs/5'4"/ డిగ్రీ ★ 25 Yrs/ 5'2"/ MBA/ వధువులకు వరులు కావలెను. రిక్రైట్‌మెంట్ Pvt/ Govt. జాబ్ & పురోహితం అయినా OK. ✆ 9959725419 (A)

బ్రాహ్మణ, 34 Yr, పెయిర్/ MA, Telugu (1st & 2nd మ్యాచ్ OK), తండ్రి లేని వధువుకు వరుడు కావలెను. Pvt. జాబ్, 45K PM. ఇల్లు (కట్నం ఆశించని Any జాబ్, పురోహితం OK) ✆ 6309407091 (A)

కమ్మ/ కులపట్టింపులేదు/ 47/5'4"/ విడో, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయి/ సొంత ఇల్లు 20 ఎకరాల పొలం గల వధువుకు/ ఇల్లరికం వరుడు కావలెను. ✆ 9059729844 (A)

కమ్మ/ కులపట్టింపులేదు/ ఏజ్: 57 Yrs/ 2nd Match/ 5'4"/ పెయిర్/ Govt. జాబ్/ 98K (PM)/ ఒంటరి/ ప్రాపర్టీ గల వధువుకు ఇల్లరికం వరుడు కావలెను. ✆ 9581120134 (A)

రజక/ B.Tech/ C.Govt. ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్/ టాక్స్ Dept/ 80,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8341650195 (A)

క్రిస్టియన్ మాల/ B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్/ బ్యాంక్ ఆఫ్ బరోడా/ 80,000/- PM/ 5'4" ఎత్తు/ 27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 6304751169 (A)

వివాహ వేదిక

గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, వడ్డీలు, నెయ్యాల, పల్లెకార్లు, వన్నెరెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్: ✆ 9000541008 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాలు లేదా రిజిస్ట్రేషన్ కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్య పరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కేవలం యాదవ/కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్, www.gokulmarriage.com, Hyd: 9440831748, GNT/VIZ: 9440759945, BGL: 8332926034. (A)

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 (A)

★ ★

జాలరి పెళ్లిపందిరి వధువు/ వరుడు కొరకు ఏకైక వివాహవేదిక. మరిన్ని వివరాలకోసం మీ ఫొటో & బయోడేటాను ఈ వాట్సాప్ నెంబరుకు పంపగలరు. 8985338599. (C)

పవర్ బ్యాంక్‌తో ఆటలొద్దు!



- సూరత్‌కు చెందిన ఓ మహిళ పవర్ బ్యాంక్‌కు ఛార్జింగ్ పెట్టి బయటకు వెళ్లి వచ్చేలోపు అది పేలి గది మొత్తం కాలిపోయింది. అదృష్టవశాత్తు లోపల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ బాలుడు ఇటీవల వాడిపడేసిన పవర్ బ్యాంక్‌తో ఆడుకుందామని జేబులో పెట్టుకుని వెళ్తుండగా అది పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి.

మొబైల్ ఫోన్‌కు అత్యవసర సమయంలో ఛార్జింగ్ అందించే పవర్ బ్యాంక్ ఇప్పుడు చాలామంది దగ్గర తప్పనిసరి పరికరంగా మారింది. అయితే ఇందులో ఉపయోగించే లిథియం-అయాన్ బ్యాటరీల్లో లోపాలు, నాసిరకం ఉత్పత్తులు, తప్పు ఛార్జింగ్ పద్ధతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పవర్ బ్యాంక్‌ను ఎలా ఉపయోగించాలి? ఎలాంటి సంకేతాలు కనిపిస్తే పక్కన పెట్టాలి?

పేలుడుకు ప్రధాన కారణాలివే..

- నాణ్యత లేని సెల్స్ లేదా తక్కువ నాణ్యత కలిగిన పవర్ బ్యాంక్‌లలో అంతర్గత లోపాలు ఏర్పడే అవకాశం ఎక్కువ. సెల్‌లో షార్ట్‌సర్క్యూట్ జరిగితే వేడి వేగంగా పెరిగి ప్రమాదానికి దారితీయొచ్చు.
- పవర్ బ్యాంక్‌ను ఎండలో, కారులో, దిండు లేదా దుప్పటి కింద పెట్టి ఛార్జ్ చేయడంతో వేడి బయటకు వెళ్లే అవకాశం తగ్గుతుంది. ఉష్ణోగ్రత అధికమైతే బ్యాటరీ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.
- కిందపడటం, బలంగా ఢీకొనడం వల్ల లోపలున్న బ్యాటరీ సెల్ దెబ్బతినొచ్చు. అది బయటకు పెద్దగా కనిపించకపోయినా లోపల నష్టం ఉండవచ్చు.
- తగిన ప్రమాణాలు లేని ఛార్జర్, కేబుల్ వాడటం వల్ల అవసరానికి మించిన కరెంట్ లేదా వేడి ఏర్పడే అవకాశం ఉంటుంది. బ్యాటరీ ఉబ్బడం, పవర్ బ్యాంక్ ఆకారం మారడం ప్రమాదానికి ముందస్తు సంకేతం. ఇలాంటి పరికరాన్ని మళ్లీ ఛార్జ్ చేయకూడదు. పవర్ బ్యాంక్‌ను నెలల తరబడి పూర్తిగా ఖాళీ స్థితిలో ఉంచడం వల్ల బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినొచ్చు.

ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపేయండి!

- పవర్ బ్యాంక్ అసాధారణంగా వేడెక్కడం
- బ్యాటరీ ఉబ్బడం లేదా ఆకారం మారడం
- కాలిన వాసన రావడం, పొగ రావడం
- ఛార్జింగ్ సమయంలో అసాధారణ శబ్దాలు రావడం
- పగుళ్లు, లీకేజీ లేదా ఇతర భౌతిక నష్టం కనిపించడం
- ఛార్జింగ్ పదేపదే ఆగిపోవడం, సరిగా పనిచేయకపోవడం.

ఇలా సురక్షితం...

- నాణ్యమైన ఉత్పత్తినే ఎంచుకోండి.. ముఖ్యంగా ఎంఏహెచ్ పవర్ బ్యాంకులను ఉపయోగించడం శ్రేయస్కరం.
- తెలియని బ్రాండ్, అనుమానాస్పదంగా తక్కువ ధర ఉన్న పవర్ బ్యాంక్‌లకు దూరంగా ఉండాలి.
- భద్రతా ప్రమాణాలు, తయారీదారు వివరాలు ఉన్నాయో లేదో చూడాలి.
- తయారీదారు సూచించిన ఛార్జింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఛార్జర్, కేబుల్ ఉపయోగించాలి.
- ఛార్జింగ్ పెట్టే సమయంలో దుప్పటి, దిండు, సోఫా వంటి వేడిని గ్రహించే వస్తువులపై పెట్టి ఛార్జ్ చేయకూడదు.
- కారు డ్యాష్‌బోర్డ్, మూసి వేసిన వాహనం వంటి అధిక ఉష్ణోగ్రత ఉండే ప్రదేశాల్లో పవర్ బ్యాంక్‌ను ఉంచకూడదు.
- పవర్ బ్యాంక్‌ను పిల్లలు ఆడుకునే వస్తువుగా ఉపయోగించకుండా చూడాలి. ముఖ్యంగా కేబుళ్లు, కనెక్టర్లు నోట్లో పెట్టుకోకూడదు.
- ఎత్తు నుంచి పడిపోయినా లేదా బలంగా దేన్నైనా తాకినా పవర్ బ్యాంక్‌ను వెంటనే మళ్లీ ఛార్జ్ చేయకుండా నిపుణులతో తనిఖీ చేయించడం మంచిది.
- నీరు తగలకుండా చూసుకోవాలి. నీరు తగిలితే బ్యాటరీలోకి చేరి మంటలు వచ్చే అవకాశం ఉంటుంది.

లోపాలను తేలిగ్గా తీసుకోకూడదు..

పవర్ బ్యాంక్ చిన్న పరికరమే అయినా.. ఇందులో అధిక శక్తిని నిల్వచేసే లిథియం-అయాన్ బ్యాటరీ ఉంటుంది. అందువల్ల వేడి, నాసిరకం ఛార్జింగ్ పరికరాలు, బ్యాటరీలో లోపాలను తేలిగ్గా తీసుకోకూడదు. అనుమానం కలిగించే పవర్ బ్యాంక్‌ను ఉపయోగించకుండా పక్కన పెట్టడమే సురక్షితమైన మార్గం.

–సతీష్, సాంకేతిక నిపుణులు

ఫోన్ ఛార్జ్ కాకపోతే..

- ఛార్జింగ్ ఎక్కకపోతే.. ముందుగా పవర్ బ్యాంక్‌లో ఛార్జ్ ఉందా అనేది చూడాలి. తర్వాత కేబుల్‌ను మార్చి ప్రయత్నించాలి. మరో అవుట్‌పుట్ పోర్టు ఉంటే దానితో పరీక్షించవచ్చు. అయినా పనిచేయకపోతే పవర్ బ్యాంక్‌ను తెరిచి పరిశీలించకుండా సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలి.
- పవర్ బ్యాంక్ బ్యాకప్ క్రమంగా తగ్గడం బ్యాటరీ సామర్థ్యం తగ్గిన సంకేతం కావచ్చు. పాత బ్యాటరీని స్వయంగా తెరిచి మార్చడం ప్రమాదకరం. బ్యాటరీ లేదా సర్క్యూట్‌లో లోపం ఉన్నట్లు అనిపిస్తే అర్హత కలిగిన టెక్నీషియన్‌ను సంప్రదించాలి.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ ఎం.బాలాజీ తదితరులు ★ కుటుంబసభ్యులతో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.బాలాజీ, జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులతో కలిసి శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి తిరుమలలో వరుణయాగం

తిరుమల, న్యూస్‌టుడే: దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ ఆదివారం నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు వరుణయాగం, పర్జన్యశాంతి సహిత కారీరిష్టి యాగాలు నిర్వహించాలని తితిదే నిర్ణయించింది. 32 మంది వేద పండితుల ఆధ్వర్యంలో తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రహ్మణ్యం అవధాని పర్యవేక్షిస్తున్నారు.

ప్రైవేట్ వైద్య, దంత వైద్య కళాశాలల ఫీజు ఖరారు

యూజీ కోర్సులకు 10%, పీజీ, సూపర్ స్పెషాలిటీలకు 15% పెంపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ ప్రొఫెషనల్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో యూజీ, పీజీ, సూపర్‌స్పెషాలిటీ కోర్సుల ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన ఈ ఫీజుల పెంపును వర్తింపజేస్తూ వైద్య ఆరోగ్య శాఖ శనివారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ఫీజు నియంత్రణ మండలి పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరణ కాకపోవడంతో 2026-27 బ్లాక్ పీరియడ్ ఫీజులు ఖరారు కాలేదు. దీంతో వైద్య విద్యార్థుల ప్రవేశాలకు ఆటంకం కలగకుండా 2025-26 (గతేడాది) ఫీజులపై యూజీ కోర్సులకు 10%, పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15% పెంచినట్లు పేర్కొంది. ప్రభుత్వం నిర్ణయించిన తాత్కాలిక ఫీజు కంటే ఎక్కువ మొత్తాన్ని కళాశాలలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పులు, ఫీజుల నియంత్రణ మండలి సిఫార్సుల ప్రకారం ఖరారయ్యే ఫీజు తక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని విద్యార్థులకు వెనక్కి ఇచ్చేయాలని, ఒకవేళ ఫీజు పెరిగితే ఆ మొత్తాన్ని విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొంది.

సూపర్‌స్పెషాలిటీ కోర్సుల్లో.. (15 శాతం పెంపుతో..)

రాష్ట్రంలోని ఐదు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో రుసుము (ట్యూషన్ ఫీజు) రూ.19,83,750గా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ జాబితాలో జీఎస్ఎల్, కాటూరి, నారాయణ, ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలు, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఉన్నాయి.

యూజీ కోర్సుల ఫీజుల వివరాలు www.eenadu.net లో..

వాణిజ్య పన్నులశాఖలో ఇద్దరు అధికారుల డిస్మిస్

- సీనియర్ అసిస్టెంట్ కూడా..
- అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో చర్యలు

ఈనాడు, అమరావతి: అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె.సంధ్య, జీఎస్టీ అధికారి బి.మెహర్‌కుమార్‌లతో పాటు అప్పటి సీనియర్ అసిస్టెంట్ కె.వి.చలపతిలను సర్వీసు నుంచి తొలగించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శనివారం విడివిడిగా ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ విజయవాడ మొదటి డివిజన్ జాయింట్ కమిషనర్ కార్యాలయంలోని ఇంటెలిజెన్స్ విభాగంలో వీరు పని చేసేవారు. వీరిపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో అభియోగాలు నమోదు చేశారు. రాష్ట్ర పన్నులశాఖ అదనపు కమిషనర్, విశాఖ రీజినల్ అధికారి బి.శేఖర్‌లను ఈ అంశంపై విచారణాధికారిగా నియమించగా నమోదు చేసిన 8 అభియోగాలు రుజువయ్యాయని తేల్చారు. దీనిపై ఆ ముగ్గురూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో అభియోగాలపై ముందుకు వెళ్లొద్దని 2023లో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది మార్చిలో తుది తీర్పు ఇస్తూ ప్రభుత్వం తన విధివిధానాల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని ఆదేశాలిచ్చింది. దీంతో ఆ ముగ్గురినీ వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారులు కోరారు. వాటిని పరిశీలించిన అనంతరం సర్వీసు నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు వెలువడ్డాయి.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో తమ్మినేని వాణిశ్రీ విచారణ

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: బతికున్న వ్యక్తి చనిపోయినట్లుగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడం, రూ.4 కోట్ల విలువైన భూమిని తప్పుడు దస్త్రాలు తయారు చేసి కాజేసిన కేసులో వైకాపా నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి వాణిశ్రీని శ్రీకాకుళం గ్రామీణం పోలీసులు శనివారం విచారించారు. అక్రమ భూ రిజిస్ట్రేషన్ కేసులో ఈమె ఏ7గా ఉన్నారు. ఈ నేపథ్యంలో వాణిశ్రీని పోలీసులు గంటపాటు వివిధ అంశాలపై ప్రశ్నించారు. విచారణలో భూ వివాదానికి తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఆమె దాటవేత సమాధానాలు చెప్పినట్లు సమాచారం. వాణిశ్రీతో పాటు తమ్మినేని సీతారాం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

ప్రభుత్వానికి, ఉద్యోగులకు సఖ్యత చెడగొట్టే కుట్రలు

- మేం మేలు చేయాలనుకుంటుంటే ఉద్యోగుల్ని రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తారా?
- ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య సఖ్యత చెడగొట్టడానికి ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ఆయన వ్యవహార్శైలి చూస్తుంటే ముమ్మాటికీ రాజకీయ ఎజెండాతోనే పనిచేస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. ఉద్యోగులకు మేలు చేసేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతున్న సమయంలో రెచ్చగొట్టేలా ఆయన వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిల్ని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ బొప్పరాజు దుష్ప్రచారం చేస్తున్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిధుల గురించి కనీసం ప్రస్తావించకపోవడం ఆయన దురుద్దేశాలకు అద్దం పడుతోంది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఆర్థిక కష్టాలున్నా సమస్యల్ని పరిష్కరిస్తూనే ఉన్నాం. వైకాపా ప్రభుత్వం పెట్టిన పెండింగ్ బకాయిల్ని చాలావరకూ చెల్లించాం. మిగతావి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతున్నాం' అని అనగాని స్పష్టం చేశారు.

జగన్ ప్రభుత్వం వాడుకొన్న సొమ్ము.. ఉద్యోగుల ఖాతాల్లో తిరిగి జమ

సీపీఎస్ కాంట్రిబ్యూషన్ సహా ఉద్యోగుల ఖాతాల్లోని సొమ్మును జగన్ ప్రభుత్వం సొంతానికి వాడుకుంటే.. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని తిరిగి వారి ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లించామన్నారు. 'జగన్ రివర్స్ పీఆర్సీ ఇచ్చారు. జీతాల్లో రికవరీ పెట్టారు. ఇలాంటి వాటిని బొప్పరాజు మర్చిపోయారా? మర్చిపోయినట్టు నటిస్తున్నారా? వైకాపా చేసిన పాపాల్ని కూటమి ప్రభుత్వం ఖాతాలో వేయాలని చూస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని అడ్డుకునేలా బొప్పరాజు శైలి ఉంది. దీన్ని ఉద్యోగులు గమనించాలి' అని అనగాని పేర్కొన్నారు.

సీఎంను అవమానిస్తే సహించం

విజయవాడలో ఏపీ ఐకాస అమరావతి రాష్ట్రస్థాయి సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబును అవమానించేలా ఉందని మంత్రి మండిపడ్డారు. ఉద్యమాలు చేయడాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని సహిస్తాం కానీ కుట్రపూరితంగా సీఎంను అవహేళన చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో జగన్, చంద్రబాబుల వ్యవహార్శైలి మధ్య తేడాను ఉద్యోగులు గమనించాలని ఆయన కోరారు.

బొప్పరాజుది రాజకీయ ఎజెండానే

- అందులో భాగంగానే ఏపీ ఐకాస సమావేశం
- చంద్రబాబు, భువనేశ్వరి, పవన్ కల్యాణ్‌లను తెరపై చూపిస్తూ.. వ్యంగ్య వ్యాఖ్యలా?
- అమరావతి రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ రవీంద్రరాజు ధ్వజం

ఈనాడు, అమరావతి: రాజకీయ ఎజెండాలో భాగంగానే ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారని అమరావతి రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు విమర్శించారు. గతంలో ఏ ఉద్యోగ సంఘమూ ప్రభుత్వం గురించి వీడియోలు తెరపై ప్రదర్శించలేదని, వ్యంగ్యంగా మాట్లాడలేదని గుర్తుచేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో బొప్పరాజు ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శిస్తూ మాట్లాడారని, ఆయన సతీమణి భువనేశ్వరి వ్యాఖ్యల్ని వ్యంగ్యంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులకు స్క్రీన్‌పై చూపారని ఆక్షేపించారు. అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు హేళనగా మాట్లాడటమూ సరికాదంటూ రవీంద్రరాజు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో అలా మాట్లాడటం వల్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావని, చర్చలతో సామరస్యంగా పరిష్కరించుకునేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.

ఆ స్క్రిప్టులకు అనుగుణంగానే..

'ఏపీ ఐకాస అమరావతి సమావేశంలో పాల్గొన్న ఉద్యోగుల్లో కొందరితో మాట్లాడించాలని బయట నుంచి స్క్రిప్టులు వచ్చాయి. తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడబోమని కొందరు చెప్పారు. మరికొంతమంది ఆ స్క్రిప్టుల్ని యథాతథంగా చదివారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేయాలనేదే బొప్పరాజు, ఆయన బృందం పన్నాగం, వైకాపా ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిల గురించి బొప్పరాజు ఎందుకు మాట్లాడటం లేదు?' అని రవీంద్రరాజు ప్రశ్నించారు. రెవెన్యూ క్రీడల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసిన బొప్పరాజుపై సీఐడీ, విజిలెన్స్ విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటిపై అప్పట్లోనే కొంతమంది సంఘ నాయకులు సీఐడీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినా పక్కనపెట్టారని గుర్తుచేశారు.

చిలకలూరిపేట బైపాస్‌కు జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి

ఈనాడు, అమరావతి: కోల్‌కతా- చెన్నై హైవేలో భాగంగా చిలకలూరిపేట వద్ద 16.34 కి.మీ మేర నిర్మించిన బైపాస్ వెంబడి మొక్కల పెంపకంపై జాతీయ స్థాయిలో మొదటి బహుమతి వచ్చింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గ్రీన్ హైవేస్ ఎక్సలెన్స్ అవార్డు కింద అమరావతి ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పరిధిలోకి వచ్చే ఈ బైపాస్‌కు పురస్కారం లభించింది.

ఆ తిండితో పశ్చాత్తాపమే..

అనారోగ్యకర ఆహారం తీసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. తిన్న తర్వాత పశ్చాత్తాపం తప్ప అది మంచిదన్న భావన మీకూ కలగదు. ఈ విషయాన్ని మీరు మనసులో నిలుపుకొంటే అనారోగ్యకరమైన ఆహారాన్ని తినాలనే కోరికలను జయించొచ్చు.

– బ్రియాన్ జాన్సన్, ఇన్‌ఫ్లుయెన్సర్

గత ప్రభుత్వంలో నరకడమే.. నాటడం లేదు

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు

నందనవనంలో రావి-వేప మొక్కలు నాటి పూజ చేస్తున్న నాగబాబు దంపతులు

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వంలో పాలకులకు చెట్లను నరకడమే తప్ప, మొక్కలు నాటాలనే ఆలోచనే రాలేదు.. ఏ కార్యక్రమం చేసినా అడ్డొచ్చిన చెట్లను నరుక్కుంటూ పోయారని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదెల నాగబాబు విమర్శించారు. పర్యావరణ పరిరక్షణలో మనం ప్రపంచానికే ఆదర్శంగా నిలవాల్సి ఉందన్నారు. శనివారం ఆయన సతీసమేతంగా మంగళగిరిలోని అరణ్యారామం నందనవనానికి వచ్చి రావి-వేప మొక్కలు నాటారు. నాగబాబు మాట్లాడుతూ 'అడవులు నరకడం, విచక్షణరహితంగా మైనింగ్‌తో ప్రకృతిని మనమే కలుషితం చేస్తున్నాం. దాన్ని కాపాడటం మన కర్తవ్యం. ప్రకృతిని ప్రేమించడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నాకు ఒకే రకమైన ఆలోచనలు ఉన్నాయి. ఇటీవల సీఎంను కలిసినప్పుడు పర్యావరణంపై ఆయనకున్న నిబద్ధత స్పష్టంగా తెలిసింది' అని చెప్పారు.

★ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణకు రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. భవన నిర్మాణాన్ని పది నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు వివరించారు. ఇందుకోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠించామని తెలిపారు. నాగబాబు వాటిని పరిశీలించారు.

(c) eenadu

చల్లని ఊరట... జాగ్రత్తలే బాసట!

జిమ్‌లో చెమటోడ్చిన తర్వాత శరీరమంతా నొప్పి.. పరుగు, సైక్లింగ్ అనంతరం కండరాల్లో బిగుతు.. రోజువారీ పనులతో మానసిక ఒత్తిడి.. వీటన్నింటికీ ఓ 'చల్లని' పరిష్కారం ఉంది. అదే ఐస్ బాత్ లేదా కోల్డ్ ప్లంజ్. పెద్ద తొట్టెలు, ప్రత్యేక టబ్‌లలో చల్లటి నీటితో పాటు ఐస్ గడ్డలు వేసి కొద్దిసేపు అందులో కూర్చోవడం ఇప్పుడు ఫిట్‌నెస్, వెల్‌నెస్ కేంద్రాల్లో ట్రెండ్‌గా మారుతోంది. ఇది కొన్ని సమస్యలకు మంచి ఉపశమనమని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఆరోగ్య సమస్యలున్న వారు వైద్యుల సలహా లేకుండా ఈ ప్రయోగం చేయొద్దని హెచ్చరిస్తున్నారు.



వ్యాయామం తర్వాత కండరాల నొప్పిని తగ్గించేందుకు కోల్డ్ వాటర్ ఇమ్మర్షన్‌ను క్రీడాకారులు ఉపయోగిస్తుంటారు. చల్లటి నీటి ప్రభావంతో రక్తనాళాలు తాత్కాలికంగా కుంచించుకుపోవడం, నొప్పి సంకేతాల ప్రసారం మందగించడం వల్ల కండరాల నొప్పి, బిగుతు తగ్గినట్లు అనిపించొచ్చు. ముఖ్యంగా తీవ్రమైన వ్యాయామం తర్వాత వచ్చే డిలేయ్డ్ ఆన్‌సెట్ మజిల్ సోర్‌నెస్ (డీవోఎమ్ఎస్)... అంటే ఆలస్యంగా మొదలయ్యే నొప్పులను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ సమీక్ష కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అయితే ఇది అన్ని రకాల వ్యాయామాలకు, అందరికీ ఒకే విధంగా పనిచేస్తుందని చెప్పలేమని అధ్యయనాలు స్పష్టం చేశాయి.

- చల్లటి నీటిలోకి దిగినప్పుడు శరీరం ఒక్కసారిగా స్పందిస్తుంది. శ్వాస వేగంగా మారడం, అప్రమత్తత పెరగడం వంటి అనుభూతులు కలుగుతాయి. ఈ సమయంలో శ్వాసపై దృష్టి పెట్టడం వల్ల కొందరికి మానసికంగా ప్రశాంతత కలగొచ్చు. ఆరోగ్యకరమైన పెద్దలకు చల్లటి నీటి చికిత్స తర్వాత ఒత్తిడి తగ్గినట్లు ఆధారాలు లభించాయి. అయితే ఒత్తిడి లేదా డిప్రెషన్ చికిత్సకు ఇది పూర్తిస్థాయి మందు కాదని నిపుణులు చెబుతున్నారు.
- ఐస్ గడ్డలు వేసిన నీటిలో ఎక్కువసేపు కూర్చోవడమే మంచిదన్న భావన సరైంది కాదు. 10 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న నీటిలో తక్కువ సేపు ఉండడం అలవాటు చేసుకోవాలని క్రీడా వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అనుభవం లేకుండా అత్యంత చల్లటి నీటిలో ఎక్కువసేపు ఉండటం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.
- కండరాలు పెంచుకోవడం, బలం పెంపొందించుకోవడమే ప్రధాన లక్ష్యంగా క్రమం తప్పకుండా స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేసే వారికి ప్రతి వ్యాయామం ముగిసిన వెంటనే ఐస్ బాత్ చేయడం తప్పనిసరి కాదని పరిశోధనలు సూచిస్తున్నాయి. తరచూ వెంటనే చల్లటి నీటిలో మునగడంతో కండరాల సహజ అనుకూలత, పెరుగుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంటుంది.
- చల్లటి నీటిలోకి ఒక్కసారిగా దిగడం వల్ల గుండె స్పందన, రక్తపోటులో ఆకస్మిక మార్పులు రావచ్చు. అందువల్ల ఆయా సమస్యలున్న వాళ్లు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. అధిక చలి కారణంగా స్పృహ కోల్పోవడం, హైపోథర్మియా వంటి ప్రమాదాలు తలెత్తుతాయి కాబట్టి చలికి సంబంధించిన సమస్యలున్నవారికీ జాగ్రత్త అవసరం.

ఇలా చేస్తే సురక్షితం

- తీవ్రమైన చలితో కాకుండా క్రమంగా చల్లటి నీటికి అలవాటు పడాలి.
- ఒంటరిగా ఐస్ బాత్ చేయకుండా సమీపంలో మరొకరు ఉండేలా చూసుకోవాలి.
- మద్యం తాగిన తర్వాత లేదా తీవ్రమైన అలసటలో ప్రయత్నించకూడదు.
- ఛాతీ నొప్పి, తలతిరగడం, అసాధారణ వణుకు కనిపిస్తే వెంటనే బయటకు రావాలి.
- దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారు ముందుగా వైద్యుల సలహా తీసుకోవాలి.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

నిపుణుల సూచనలతోనే...

వ్యాయామం తర్వాత కండరాల నొప్పికి చల్లని ఉపశమనం కావాలనుకునేవారికి ఐస్ బాత్ ఉపయోగపడొచ్చు. కానీ ఎంత ఎక్కువ చలి అయితే అంత ప్రయోజనం అనే భావన మాత్రం ప్రమాదకరం. సరైన పద్ధతి, పరిమిత సమయం, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా నిపుణుల సూచనలతో చేస్తేనే ఈ కొత్త వెల్‌నెస్ ట్రెండ్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

–షేక్ అజ్గర్ సుల్తాన్, ఐస్‌మాన్ ఇండియా నిర్వాహకులు, హైదరాబాద్

వ్యర్థానికి బెంచ్ మార్క్ అర్థం

చాక్లెట్, బిస్కెట్ల కవర్లు.. ఖాళీ పెన్నులు, పెన్సిళ్ల డబ్బాలు ఇస్తే అందమైన బెంచీలు వస్తాయంటే ఆసక్తిగా అనిపిస్తుంది కదూ! విశాఖలోని డ్రాప్ సంస్థ వీటితోనే బెంచీలు తయారు చేసింది. పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలతో ఉపయోగపడే వస్తువులు తయారు చేయాలని భావించిన ఈ సంస్థ నగరంలోని ఈస్టుపాయింట్ కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఓ బాక్స్‌ను ఏర్పాటు చేసింది. చిరుతిళ్ల ప్లాస్టిక్ కవర్లు, వృథా పెన్నులు, పెన్సిళ్ల వ్యర్థాలను అందులో వేయాలని అక్కడి విద్యార్థులకు అవగాహన కల్పించింది. అలా సంస్థ ప్రతినిధులు సుమారు 200 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను పాఠశాల నుంచి సేకరించి, కియా సంస్థ తోడ్పాటుతో రీసైక్లింగ్ చేసి అందమైన రెండు బెంచీలు తయారు చేయించి తాజాగా పాఠశాలకు ఇచ్చారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం(పెదవాల్తేరు)

కాసరకాయలు.. మినీ కాకరకాయలు

చూడటానికి చిన్న కాకరకాయల మాదిరిగా కనిపిస్తున్న వీటి పేరు కాసరకాయలు. తెలుగు రాష్ట్రాల్లో రాయలసీమ జిల్లాల్లో తప్ప మిగతా చోట్ల వీటి గురించి పెద్దగా తెలియదు. ఎందుకంటే ఇది అడవులు, చేల గట్లెంబడి సహజంగా పెరిగే ఒకరకమైన అడవి కూరగాయ. ఆకారానికి తగ్గట్లే కాకరకాయల మాదిరిగా మహా చేదుగా ఉంటాయి. అందువల్ల నూనెలో బాగా వేయించి, కారం చల్లి రాగిసంగటి, జొన్నరొట్టెలతో ఇష్టంగా తింటారు. ఇవి మార్కెట్లో ఎల్లప్పుడూ దొరకవు, వర్షాకాలంలో ఆగస్టు నుంచి అక్టోబరు మధ్య అక్కడక్కడా లభిస్తాయి. దీనిపై అనంతపురం ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రఘురాములు మాట్లాడుతూ.. 'ఈ మొక్క కింద తేళ్లు ఎక్కువగా ఉంటాయి. కాయలు కోసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ముదిరిన కాయలు 2 సెంటీమీటర్ల పొడవుంటాయి. వీటిలో కాల్షియం, ఇనుము, పొటాషియం, సోడియం, మాంగనీస్, జింక్ లాంటి ఖనిజ లవణాలతో పాటు పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి' అని చెప్పారు. అనంతపురంలోని పాతూరు మార్కెట్లో ఇవి కనిపించగా.. కేజీ దాదాపు రూ.300 పలికాయి. – ఈనాడు, అనంతపురం

వందేళ్ల చింతమ్మకు హమాలీల ప్రేమాభరణం

వందల ఏళ్లు జీవించే చింత చెట్లతో ఆయా ప్రాంతాల వారికి ప్రత్యేక అనుబంధం ఉంటుంది. వాటి చిగురు, కాయలంటే అందరికీ ఇష్టమే. కానీ, రోడ్ల విస్తరణ, ఇళ్లకు స్థలాభావం దృష్ట్యా చాలాచోట్ల భారీ చింత చెట్లను నరికేస్తున్నారు. సూర్యాపేటలోని హమాలీలు మాత్రం భిన్నంగా ఆలోచించారు. పోస్టాఫీసు వెనుక ఉన్న వందేళ్ల నాటి చింతచెట్టు కింద రేకుల షెడ్డులో వారి యూనియన్ కార్యాలయం నిర్వహించేవారు. కొన్నేళ్ల క్రితం సంఘం ఆధ్వర్యంలో షెడ్డు స్థానంలో శాశ్వత భవనం నిర్మించాలని నిర్ణయించారు. అలాగని ఇన్నేళ్లపాటు తమకు నీడనిచ్చిన వృక్షాన్ని తొలగించేందుకు వారు ఇష్టపడలేదు. అందుకు బదులుగా చెట్టు చుట్టూ గోడలు నిర్మించి, స్లాబు వేసి దాన్ని తమ భవనంలో భాగంగా మార్చుకున్నారు. 'చెట్టు చేసిన, చేస్తున్న మేలు ఎలా మరిచిపోతాం' అనే సందేశాన్ని సమాజానికి ఇచ్చారు.

– న్యూస్‌టుడే, సూర్యాపేట సాంస్కృతికం

తరగని రాయిలో.. కరిగే 'కాలం'

కాలం ఎవరి కోసమూ ఆగదు అంటారు. కానీ, అదే కాలాన్ని వేల సంవత్సరాలు మౌనంగా వీక్షిస్తున్న రాళ్లకు నిమిషాల ముల్లులు అమరిస్తే ఎలా ఉంటుంది? నదీ ప్రవాహాల్లో దశాబ్దాల తరబడి దొర్లి నునుపుదేలిన రాళ్లు, లేదా భూమి పొరల్లో లక్షల సంవత్సరాలు రంగులు మార్చుకున్న సహజ ఖనిజాలు ప్రకృతి చెక్కిన చారిత్రక సాక్ష్యాలు. ఇప్పుడు ఆ 'వృద్ధ' రాళ్లను ఆధునిక గడియారాలుగా మలుస్తున్నారు మహారాష్ట్ర నాగ్‌పుర్‌కు చెందిన యువ కళాకారుడు రోహిత్ ఎనుకర్. రాతి సహజ రూపాన్ని కాపాడుతూ వీటిని తీర్చిదిద్దారు. ఆకృతిని బట్టి వీటి ధర రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంది. శనివారం ఇందిరా పార్కులోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనలో ఈ 'స్టోన్ క్లాక్'లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– ఈనాడు, హైదరాబాద్

వర్షం కోసం దేవుడికి నిందా స్తుతి

వర్షం రాకపోవడంతో దేవుడిపై తిట్ల వర్షం (నిందా స్తుతి) కురిపించారు కర్ణాటకలోని హొసపేటె వాసులు. ఇక్కడి కాటమయ్య ఆలయానికి సాధారణ రోజుల్లో భక్తులెవరూ వెళ్లరు. వర్షాలు కురవకపోతేనే ఆలయాన్ని తెరుస్తారు. 3 నెలల నుంచి వాన చుక్క లేకపోవడంతో స్థానికులు తాజాగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవుడిపై తిట్ల వర్షం కురిపిస్తూ ప్రదక్షిణ చేశారు. ఇలా చేస్తే కాటమయ్య వర్షాలు కురిపిస్తాడని నమ్ముతారు. ప్రదక్షిణలు పూర్తయిన గంట తర్వాత పట్టణంలో వర్షం పడటం విశేషం. -న్యూస్‌టుడే, హొసపేటె

బిహార్‌లో ఫెయిల్ ఉండదిక!

నైపుణ్య శిక్షణకు అర్హులు'తో భర్తీ

పట్నా: బిహార్‌లో ఇక 10, 12వ తరగతి విద్యార్థులెవరూ ఫెయిల్ కారు. కనీస మార్కులు రాకున్నా ఫెయిల్ అని ఎక్కడా కనిపించదు. కారణం... బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల మార్క్‌షీట్లలో 'ఫెయిల్' అనే పదాన్ని బిహార్ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచే ఎత్తేస్తోంది. ఎవరైనా విద్యార్థి ఉత్తీర్ణులు అవటానికి అవసరమైన కనీస మార్కులు సాధించలేకపోతే... మెమోలో ఫెయిల్ బదులుగా... 'నైపుణ్య శిక్షణకు అర్హులు' అనే పదంతో భర్తీ చేయాలని బిహార్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యార్థులను బిహార్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ అండ్ ఎగ్జామినేషన్ (బీబీఓఎస్ఈ) అందించే వృత్తి విద్యాశిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. "పరీక్షలో కనీస మార్కులు రానంత మాత్రాన విద్యార్థుల్లో నైపుణ్యం లేనట్లు కాదు. అందుకే ఈ ఏర్పాటు. ఈ మార్పును అమల్లోకి తేవడానికి విద్యాశాఖ నిబంధనలు సవరిస్తుంది" అని బిహార్ విద్యాశాఖ మంత్రి మిథిలేశ్ తివారీ వివరించారు.

తాష్కెంట్‌లో మోదీకి ఆత్మీయ స్వాగతం

తాష్కెంట్: భారత్-ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతమవడంతో పాటు దినదినాభివృద్ధి చెందుతున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా శనివారం ఆయన దిల్లీ నుంచి బయలుదేరి ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్ చేరుకున్నారు. విమానాశ్రయంలో దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ మోదీకి స్వాగతం పలికారు. పెట్టుబడులు, వాణిజ్యం తదితర అంశాల్లో సహకారంపై శని, ఆదివారాల్లో ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయి. ఉజ్బెకిస్థాన్‌లోని అధికారిక కార్యక్రమాల అనంతరం మోదీ కిర్గిజిస్థాన్ చేరుకుంటారు. బిష్కెక్ నగరంలో నిర్వహించనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. భారత ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో తాష్కెంట్ నగరం త్రివర్ణ శోభితంగా మారింది. అక్కడి ఓ భవనంపై ప్రదర్శించిన భారత జాతీయ పతాకం ఆకట్టుకుంటోంది.

మోదీతో షవ్కత్ మిర్జియోయెవ్

నీరు రంగు మారుతోంది

నేపాల్‌కు చైనా వరద హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: హిమానీనదం బద్దలై నేపాల్‌లో భారీ వరదలు రాగా.. ఆ విపత్తువల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఏర్పడిన సరస్సు పొంగుతోంది. దానిపై చైనా మరోసారి హెచ్చరిక చేసింది. ఏ క్షణాన అయినా అది ఉప్పొంగి, కిందికి దూసుకురావొచ్చని పేర్కొంది. నీటి రంగులో మార్పును అందుకు కారణంగా చెప్పింది. నేపాల్ విదేశాంగశాఖతో ఈ సమాచారాన్ని పంచుకుంది. "విపత్తు తర్వాత ఏర్పడిన సరస్సు రంగు మారుతోంది. ముదురురంగులోకి వస్తోంది. అంటే అది బద్దలయ్యేందుకు అవకాశం ఉంది" అని చైనా అధికారులు వెల్లడించారు. నది, ఇతర వనరుల్లో నీటి రంగు మారడం అనేది వరదలు వచ్చే ముందు ప్రధానంగా కనిపించే సూచన. పర్వత ప్రాంతాలు, నీటి వనరులకు ఎగువ భాగంలో భారీ వర్షాలు కురిసినప్పుడు.. అక్కడి నుంచి కిందికి ప్రవహించే నీటిలో మట్టి, రాళ్లు, ఇసుక, ఆకులు, ఇతర వ్యర్థాలు కొట్టుకొస్తుంటాయి. దాంతో నీటి రంగులో మార్పు వస్తుంటుంది.

సందట్లో సడేమియా!

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఒకవైపు ఆకస్మిక వరదలతో వందల మంది మరణించి, వేల మంది ఆచూకీ గల్లంతయి ఉంటే కొందరు మాత్రం చేతివాటం చూపుతున్నారు. బుధవారం నాటి విపత్తుతో త్రిశూలి నదిలోకి ఓ బ్యాంకు లాకర్ కొట్టుకొచ్చింది. సమీపంలోని వారు దానిని పగులగొట్టి లక్షల నేపాలీ రూపాయలను ఎత్తుకెళ్లారు. అయితే పోలీసులు వెంటనే స్పందించి 29 మందిని అదుపులోకి తీసుకుని 92 లక్షలను రికవరీ చేశారు. ఆ లాకర్ ధాడింగ్ జిల్లాలోని బెల్కుఖోలాకు చెందినది.

కేంద్ర మంత్రుల మధ్య రిజర్వేషన్ల రగడ

జితన్‌రాం మాంఝీ రాజీనామాకు చిరాగ్ పాస్వాన్ డిమాండ్

దిల్లీ: దేశంలోని రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలంటూ హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం-సెక్యులర్) చేస్తోన్న డిమాండ్ కేంద్ర మంత్రుల మధ్య వివాదానికి ఆజ్యం పోసింది. ప్రస్తుత రిజర్వేషన్లలో భాగంగానే ఎస్సీ, ఎస్టీల్లో ఉపకోటా/క్రీమీలేయర్ విధానాన్ని అమలుచేయాలని కేంద్ర మంత్రి జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హెచ్ఏఎం(సెక్యులర్) కోరుతోంది. ఈ ఉపకోటా డిమాండ్‌ను మరో కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఓబీసీల్లో మాదిరిగా దళితుల్లోనూ క్రీమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాలంటున్న జితన్‌రాం.. కేంద్ర మంత్రి పదవిని, ఆయన కుమారుడు సంతోష్ కుమార్ బిహార్ రాష్ట్ర మంత్రి పదవిని వీడాలని పాస్వాన్ డిమాండ్ చేస్తుండడంతో వివాదం తీవ్ర రూపం దాల్చే సూచనలు కనిపిస్తున్నాయి. జితన్‌రాం మాంఝీ.. ఎస్సీలలోని బాగా వెనుకబడిన ముషాహర్ దళిత వర్గీయుడు. రిజర్వేషన్ల ప్రయోజనాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని, ఆర్థికంగా, పలుకుబడిపరంగా ముందున్న పాస్వాన్‌లు, రవిదాస్‌లు వాటిని దక్కించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కులాల ఆధారిత రిజర్వేషన్లను రద్దుచేసి ఆర్థిక ప్రాతిపదికన వాటిని అమలు చేయాలని ఇతర వర్గాలు ఉద్యమిస్తున్న పరిస్థితుల్లో ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలైన హెచ్ఏఎం(సెక్యులర్), లోక్‌జనశక్తి పార్టీ(రాంవిలాస్) మధ్య ఉపకోటా వివాదం ముదరడం గమనార్హం.

దీర్ఘకాలిక సంపద సృష్టి సూత్రం

దీర్ఘకాలిక సంపదను కూడబెట్టడంలో ఓ ఆశ్చర్యకరమైన, సాధారణ సూత్రం ఏంటంటే?.. 'సంపాదించిన మొత్తంలో కొంత భాగాన్ని పొదుపు చేయడం, పెట్టుబడులకు మళ్లించడం.. దీర్ఘకాలం పాటు ఈ పద్ధతిని క్రమం తప్పకుండా పాటించడం.. ఈ సుదీర్ఘ ప్రక్రియను గౌరవిస్తూ దానికి కట్టుబడి ఉండటం'

– లిల్లీ, ఇన్‌ఫ్లుయెన్సర్

మమతపై కోల్‌కతా పోలీసుల ఎఫ్ఐఆర్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీపై కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తృణమూల్ ఛాత్ర పరిషత్ వ్యవస్థాపక దినోత్సవ నిర్వహణకు సంబంధించి కలకత్తా హైకోర్టు విధించిన షరతులను ఉల్లంఘించినందుకు ఆమెపై ఈ చర్య తీసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు శనివారం తెలియజేశారు. "కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. విచారణలో భాగంగా ఉలంఘనకు కారకులైన అందరి పాత్రపై దర్యాప్తు జరుపుతాం. భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద ఆగస్టు 28న కేసు నమోదు చేశాం" అని అధికారి వివరించారు.

భారతీయ ప్రామాణిక సమయం నోటిఫై

- యూటీసీకి 5.30 గంటలు కలిపితే అదే ఐఎస్‌టీ
- 180 రోజుల తర్వాత నుంచి అమల్లోకి

ఈనాడు, దిల్లీ: భారతీయ ప్రామాణిక సమయాన్ని (ఇండియన్ స్టాండర్డ్ టైం) కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ నోటిఫై చేసింది. లీగల్ మెట్రాలజీ చట్టం-2009లోని సెక్షన్ 52కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఇందుకు సంబంధించిన నిబంధనలను విడుదల చేసింది. కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైం (యూటీసీ)కి 5.30 గంటలను జతచేస్తే వచ్చే సమయాన్ని భారతీయ ప్రామాణిక సమయంగా ప్రకటించింది. అదే అధికారిక సమయం అని, దాన్నే భారత్‌లో వాణిజ్య, న్యాయపరమైన కార్యకలాపాలకోసం ఉపయోగించాలని స్పష్టంచేసింది. సమయాన్ని గంటలు: నిమిషాలు: సెకెండ్ల రూపంలో ప్రదర్శించాలి. లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్‌టైం) రూల్స్-2026 పేరుతో జారీచేసిన ఈ నిబంధనలు 180 రోజుల తర్వాతి నుంచి అమల్లోకి వస్తాయి. దీన్ని అన్ని న్యాయ, ప్రభుత్వ, పరిపాలన కార్యకలాపాల్లో ఉపయోగించాలి. వాణిజ్యం, రవాణా, ఆర్థిక లావాదేవీలు, న్యాయపరమైన ఒప్పందాలకు ఈ సమయాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో భారతీయ ప్రామాణిక సమయాన్ని ప్రదర్శించడం తప్పనిసరి. టెలికం, బ్యాంకింగ్, ఇంధనం, డేటా సెంటర్లలాంటి ముఖ్యమైన రంగాలు తమ వ్యవస్థలను ఐఎస్‌టీతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇస్రో 'నావిక్'ను, ప్రాంతీయ ప్రామాణిక ప్రయోగశాలల్ని ప్రాతిపదికగా తీసుకోవచ్చు.

ఉల్లంఘిస్తే జరిమానా.. శిక్ష

ఇతర సమయాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇక నిషిద్ధం. జాతీయ, ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి రక్షణ, విద్యుత్తు వ్యవస్థలు, టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, రవాణా, పరిశ్రమలు, డేటా సెంటర్లు- నావిక్ లేదంటే ఇతర అధీకృత వనరులను ఉపయోగించాలి. అన్ని సంస్థలు, వ్యవస్థలు తమ గడియార వ్యవస్థల్ని వీటితో సమీకృతం చేసుకోవాలి. ఆదేశాలను ఉల్లంఘిస్తే లీగల్ మెట్రాలజీ డైరెక్టర్ విచారణ జరిపి జరిమానాలు, శిక్షలు విధిస్తారు.

ఖర్గే సభావేదికను 'శుద్ధీకరించిన' వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రాహుల్‌గాంధీ డిమాండ్

ఈనాడు, దిల్లీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఈనెల 8న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ఒక సభావేదికను "శుద్ధీకరించిన" ఘటనకు సంబంధించి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భాజపా-ఆరెస్సెస్‌లను తీవ్రంగా విమర్శించారు. ఖర్గే బహిరంగసభ వేదికను శుద్ధి చేసి అంటరానితనాన్ని ప్రోత్సహించిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసేలా ప్రధాని మోదీ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "అక్కడ వేదికను శుద్ధి చేసిన వారంతా ఆరెస్సెస్ వారే. అందువల్ల బాధ్యులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ప్రధాని ఉత్తర్వులు ఇవ్వాలి. దేశంలో రెండు భావజాలాల మధ్య పోరాటం సాగుతోంది. ఈ పోరాటంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూలు రూపొందించిన రాజ్యాంగం ఒకవైపు, భాజపా-ఆరెస్సెస్‌లు మరోవైపు ఉన్నాయి" అని రాహుల్ పేర్కొన్నారు. కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించేలా రాహుల్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని భాజపా పేర్కొంది. ఖర్గే కార్యక్రమం పూర్తి చేసుకున్న తర్వాత వేదిక అపరిశుభ్రంగా ఉన్న కారణంగానే అక్కడ పూజ నిర్వహించామని భాజపా అధికార ప్రతినిధులు సుధాన్షు త్రివేది, గురు ప్రకాశ్ పశ్వాన్‌లు చెప్పారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

అది ఆత్మకథా..కల్పిత గాథా?

సోనియాగాంధీ పుస్తకం వివాదంపై భాజపా విసుర్లు

ఇంటర్నెట్‌డెస్క్: మోదీ ప్రభుత్వ ఒత్తిడి వల్లే సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని భారత్‌లో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురించడం లేదంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన విమర్శలను భాజపా తిప్పికొట్టింది. పుస్తకంలోని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తింది. 'ఆ పుస్తకం ఆత్మకథనా లేక కల్పితగాథనా అనేది రచయిత్రి, ప్రచురణకర్త తేల్చుకోవాల్సిన విషయం. ప్రచురించడానికి ముందు పబ్లిషర్ దానిని తప్పక పరిశీలిస్తారు. ఆత్మకథ పేరిట మీరు రాజకీయం చేయాలని చూస్తే..కచ్చితంగా ప్రశ్నలు వస్తాయి. ఈ పుస్తకం విడుదల విషయంలో కాంగ్రెస్ నేతలు అల్లుతోన్న స్టోరీలు విడ్డూరంగా ఉన్నాయి' అని భాజపా ఎదురుదాడికి దిగింది.

భారత్‌లో ముస్లింలు ఉండొద్దనుకునేవారు హిందువే కాదు: భాగవత్

న్యూయార్క్: భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఎవరైనా అనుకుంటే వారు అసలు... హిందువే కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ అన్నారు. ముస్లింలు లేకుండా 'హిందూ రాజ్యం'మనే భావనే లేదని చెప్పారు. న్యూయార్క్‌లో మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'అమెరికన్ హిందూ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ (ఏహెడ్) ఆధ్వర్యంలో 'విశ్వ ఐక్యతా వేడుక' పేరుతో దీనిని నిర్వహించారు. మత సామరస్యం గురించి భాగవత్ ఈ సందర్భంగా మాట్లాడారు. "మనమంతా ఒక్కటే. మన మధ్య విభేదాలు ఒక భ్రమ. అన్ని మతాల మార్గాలు ఒకే లక్ష్యానికి తీసుకెళ్తాయని గుర్తించాలి. మనుషుల మధ్య ఎలాంటి తేడా లేదు. విదేశీయుల ఆక్రమణల్లో చాలా కోల్పోయినా మన సంస్కృతి-సంప్రదాయాలు పదిలంగానే ఉన్నాయి. ప్రపంచాన్ని ఒక కుటుంబంగా చూసే గుణాన్ని మరవలేదు. ఏ మతాన్ని అనుసరించినా చివరకు అందరి గమ్యం ఒక్కటే. సత్యం వైపు నడిపించడమే మతం లక్ష్యం. ఆరెస్సెస్ స్వయం సేవకులు అన్నిచోట్లా సేవలందిస్తారు. సేవ చేసేటప్పుడు హిందువులా, ముస్లిములా అని చూడరు" అని భాగవత్ చెప్పారు. అంతకుముందు న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్‌లో మోహన్ భగవత్ చిత్రాన్ని ప్రదర్శించారు.

ఆస్పత్రులు, బ్యాంకులు, నైట్ క్లబ్బులు.. చైనాలో ఎక్కడైనా వివాహం చేసుకోవచ్చు

బీజింగ్: చైనాలో వివాహాలు తగ్గుముఖం పడుతున్నాయి. 2026 సంవత్సర ప్రథమార్ధంలో దేశంలో నమోదైన వివాహాల సంఖ్య అంతకు ముందుతో పోలిస్తే 7.5 శాతం తగ్గిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వివాహాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. ఇందులో భాగంగా వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా సరళీకరించింది. తాజా నిబంధనల ప్రకారం కేవలం పౌర వ్యవహారాల కార్యాలయాలే కాక బ్యాంకులు, ఆస్పత్రులు, విమానాశ్రయాలు, ఆలయాలు, మెట్రో స్టేషన్లు, నైట్ క్లబ్బుల్లో కూడా యువ జంటలు వివాహం చేసుకొని ధ్రువపత్రాలు పొందేందుకు వీలు కలిగింది.

EENADU Vol: 53, Issue: 21 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు సినిమా

నాని, కీర్తి సురేశ్

ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాల...

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయిక నుంచి వస్తున్న రెండో సినిమా 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 24న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. జనాల్లో ఎంతో ఆదరణ పొందిన 'ఏష నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాల..' అనే జానపద బాణీకి కొత్తదనాన్ని జోడించి అనిరుధ్ స్వరపరిచిన ప్రత్యేక గీతమిది. దీనికి కాసర్ల శ్యామ్ సాహిత్యమందించగా.. జంగిరెడ్డి, ప్రభ బంగారిగళ్ల ఆలపించారు. ఆట సందీప్ నృత్యరీతులు అందించారు. ఈ పాటలో జడల్‌గా మాస్ లుక్స్‌లో నాని కనిపించిన తీరు.. కీర్తి సురేశ్‌తో ఆయన కెమిస్ట్రీ.. వాళ్లిద్దరూ కలిసి వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ చిత్రానికి కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి.

నేడు ఈటీవీ విన్‌లో 'నందిని'

కాలేజీలో చదువుకునే రోజుల నుంచి నందిని అంటే శివకి చాలా ఇష్టం. తనని మొదటిసారి కలిసినప్పటి నుంచే అతని మనసులో మాటను చెప్పి ఆమెను పెళ్లి చేసుకోవాలని ఎదురుచూస్తుంటాడు. కానీ నందినికి మాత్రం పెళ్లంటేనే భయం. మరి వివాహ బంధం పట్ల భయం ఉన్న నందిని మనసు గెలుచుకోవడానికి శివ ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? ప్రేమ, పెళ్లి పట్ల ఆమెకున్న అభిప్రాయాన్ని అతను మార్చగలడా? శివ.. నందినిలోని భయాలను తొలగించి ఆమెను పెళ్లిచేసుకుంటాడో లేదో తెలియాలంటే 'నందిని' సినిమా చూడాల్సిందే. 'కథాసుధ' పేరిట ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ ప్రతి ఆదివారం వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ నేపథ్యంలో నేడు ఈ చిత్రంతో మీ ముందుకు రాబోతుంది. ఆకాంక్ష, పవన్ సింగులూరి జంటగా నటించారు. మీనా వాసు, శరణ్య, నళినీ దేవి, రమా, హెత్విక్, తుమరాడ శరత్‌చంద్ర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి రామారావు సిరిపురం దర్శకత్వం వహించారు. కె.రాఘవేంద్రరావు సమర్పణలో వెంకట్ తలారి నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేమ, భయం, ఆశల కలయికతో కూడిన అందమైన ప్రేమకథతో సినీప్రియుల్ని ఆకట్టుకుంది.

క్రిస్మస్‌కు 'కింగ్ 100'


నాగార్జున

అగ్ర కథానాయకుడు నాగార్జున వందో చిత్రానికి 'కింగ్ 100' అనే పేరుని ఖరారు చేశారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై అక్కినేని కుటుంబం నిర్మిస్తోంది. రా. కార్తీక్ దర్శకుడు. టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజుని పురస్కరించుకుని శనివారం సినిమా పేరుతో కూడిన ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. 'మనుషుల్లో రెండు రకాలు. డబ్బున్నోళ్లు, డబ్బు లేనోళ్లు. డబ్బు లేనప్పుడు నన్ను లూజర్ అన్నారు. డబ్బు ఉన్నప్పుడు కింగ్ అని పిలిచారు...' అనే సంభాషణలతో ఈ ప్రచార చిత్రం సాగుతోంది. ఈ గుర్తింపు డబ్బు కంటే ఎంతో శక్తిమంతమైనదనీ, దాన్ని నిలబెట్టుకోవడం కోసం పరుగెడుతూనే ఉండాలన్నదే ఇందులో కథానాయకుడు నమ్మి అనుసరించే మార్గం. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో హీరో నాగార్జున స్టైలిష్ అవతారంలో కనిపించనున్నట్టు ప్రచార చిత్రం చాటుతోంది. డబ్బు, మోసాలతో ముడిపడిన కథతో రూపొందిన సినిమా అని తెలుస్తోంది. ప్రచార చిత్రంతోపాటే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. నాగార్జునకు బాగా అచ్చొచ్చిన డిసెంబరు నెలలోనే ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమాకి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ఎవరికీ భయపడని పోలీసు అధికారులు

కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్, బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'దాయరా'. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్నారు. వినీత్ జైన్, ధవల్ గడా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 18న హిందీ, మలయాళ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నటీనటుల పాత్రలను పరిచయం చేస్తూ కొత్త పోస్టర్లను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "నిబ్బరమైన, అంతుచిక్కని, ఎవరికీ భయపడని డీసీపీ అజూనీ కోహ్లీ. ప్రణాళిక, పట్టుదలతో అనుకున్నది సాధించే వ్యక్తి డీసీపీ రమణ్‌కుమార్' అనే క్యాప్షన్‌ను జోడించింది. ఈ పోస్టర్లలో పృథ్వీరాజ్, కరీనా కపూర్ పోలీసు అధికారులుగా కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది.


పృథ్వీరాజ్ సుకుమారన్

"మనుషుల పనితీరులో కనిపించే సహజత్వం.. భావోద్వేగాల్ని ఏఐ సాంకేతికత తీసుకురాలేదు" అంటున్నారు ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేశ్. ఏఐ వల్ల లైవ్ ఆర్ట్ వర్క్‌కి ఎలాంటి నష్టం జరగదని.. అది డిజైనింగ్ ఆలోచనలకు లేదా రిఫరెన్స్‌లకు సహాయకారిగా ఉంటూ సమయాన్ని ఆదా చేసేందుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. 50 సినిమాలకు పైగా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేసిన ఆయన ఇటీవల రవితేజ 'ఇరుముడి' చిత్రానికి పని చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా మంచి ప్రేక్షకాదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలోనే 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు సాహి సురేశ్.

అవి సెట్లని ప్రేక్షకులకు అర్థమైంది అప్పుడే!

"మేము 'ఇరుముడి' సినిమాపై మొదటి నుంచి చాలా నమ్మకంగా ఉన్నాం. కాకపోతే ఈస్థాయి భారీ విజయాన్ని అందుకుంటామని కలలో కూడా ఊహించలేదు. దాదాపు నా 50 సినిమాల ప్రయాణంలో ఈ రకమైన ఆదరణను చూడటం ఇదే తొలిసారి. ఈ సినిమా చూసిన వెంటనే ఫస్ట్ నాకు నిర్మాత స్వప్నదత్ ఫోన్ చేశారు. 'ఏంటి అసలు.. ఎలా తీశారు ఈ సినిమాని' అంటూ దాదాపు 20నిమిషాలు ప్రశంసలు కురిపించారు. సెట్ వర్క్ చాలా సహజంగా కథలో భాగమైపోయిందని మెచ్చుకున్నారు. ఈ చిత్ర విషయంలో నాకు లభించిన గొప్ప ప్రశంస అది".

సాహి సురేశ్

మా కథంతా అక్కడే కనిపించింది..

"దర్శకుడు శివ నిర్వాణ నాకీ కథ చెప్పాక.. దీన్ని రొటీన్ విలేజ్ లొకేషన్స్‌లో కాకుండా కాస్త కొత్తగా చేద్దామని చెప్పారు. దీంతో కొండ ప్రాంతాల నేపథ్యంలో ఉండేలా చేద్దామనుకున్నాం. సరిగ్గా అప్పుడే సీలేరు డ్యామ్‌కి సంబంధించిన వీడియో ఒకటి శివ కంటపడింది. అది బాగా నచ్చడంతో ఆ లొకేషన్ చూడటానికి మేమిద్దరం స్వయంగా అక్కడికి వెళ్లాం. ఆ చుట్టు పక్కలున్న మారుమూల గ్రామాల్లోకి వెళ్లి చూస్తే అద్భుతమైన లొకేషన్లు కనిపించాయి. మేమనుకున్న కథంతా అక్కడే కనిపించేసింది. దీంతో మూడు రోజుల్లోనే ఆ షూట్‌కి అవసరమైన లొకేషన్స్ అన్నింటినీ లాక్ చేసుకున్నాం".

సవాల్ విసిరిన సెట్ అదే..

"ఈ చిత్రం కోసం మేము సీలేరుతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని సెట్లు వేశాం. అలాగే హైదరాబాద్‌లో మరికొన్ని వేశాం. వాటిలో బాగా సవాల్‌గా అనిపించింది సీలేరు వాటర్ ఫాల్స్ ప్రవాహం మధ్యలో వేసిన బ్రిడ్జి సెట్. నిజానికి సీలేరు అనేదే చాలా సున్నితమైన ప్రాంతం. ఒడిశాకి సరిహద్దుల్లో ఉంటుంది. పూర్తిగా అటవీ ప్రాంతం కావడంతో చిత్రీకరణలకు అనుమతులు తెచ్చుకోవడం పెద్ద టాస్క్. ఇక వాటర్ ఫాల్స్ ఏరియాలో కరెంట్ కూడా ఉండదు. సెట్‌కి కావాల్సిన వస్తువులన్నింటినీ నదీ ఒడ్డుదాకా మోసుకుంటూ వెళ్లాల్సిందే. అలాగే ప్రవాహం మధ్య సెట్ వేయడం ఇంకా పెద్ద టాస్క్. నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో మేము ముందుగా ఐరన్ స్ట్రక్చర్‌తో సెట్ వేసి.. అది చెక్కలా కనిపించేలా లుక్ ఇచ్చాం. దీన్ని పూర్తి చేయడానికి 10రోజులు పట్టింది. ఇక కొండవాలుపై ఉండేలా హీరో ఇంటి సెట్ నిర్మించడానికి నెల రోజులు, అయ్యప్ప స్వామి ఆలయ సెట్‌కి మరో నెల రోజులు పట్టింది. వీటితో పాటు మార్కెట్, థియేటర్, క్లైమాక్స్ జాతర సెట్లు నిర్మించాం. కానీ, సినిమా చూస్తున్నప్పుడు అవెక్కడా సెట్స్‌లా కనిపించవు. చాలా సహజంగా కథలో భాగమైపోయాయి. ఈ చిత్ర మేకింగ్ వీడియోలు బయటకి వచ్చాకే ఇందులోని సెట్స్ ఏవన్నది అందరికీ అర్థమైంది".

ఓర్పు ఉంటేనే ఇక్కడ నిలదొక్కుకోగలరు

"నాకు వ్యక్తిగతంగా పీరియాడిక్, రూటెడ్ విలేజ్ కథలంటే చాలా ఇష్టం. అలాంటి కథల్లో మన ఆర్ట్ వర్క్ చూపించడానికి ఎక్కువ అవకాశముంటుంది. మార్కెట్‌లో దొరకని వస్తువుల్ని వెతికి పట్టుకోవడం, పాత వాతావరణాన్ని పునఃసృష్టించడంలో ఓ రకమైన ఆసక్తి కలుగుతుంటుంది. ప్రొడక్షన్ డిజైనింగ్‌లో నిలదొక్కుకోవడానికి సమయం పడుతుంది. కాబట్టి ఈ రంగంలోకి రావాలనుకునే వాళ్లు ఓర్పుతో పని చేయాలి. భారీ సెట్లు వేయడం మాత్రమే ప్రొడక్షన్ డిజైనింగ్ కాదు. కథకి సరిపోయేలా ఏది నిజమైనదో.. ఏది సెట్ వర్కో తెలియని విధంగా సహజమైన లుక్ తీసుకురావడాన్ని అలవర్చుకోవాలి. ప్రస్తుతం నేను నితిన్ సినిమాతో పాటు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చిత్రానికి పని చేస్తున్నా. మరికొన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి".

'సీక్రెట్ సోల్జర్' వస్తున్నాడు

విశ్వనాథ్, శైలేష్, నిహాల్, శాన్వీ

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ సంస్థ నిర్మించింది. కమల్ కామరాజు, రఘుబాబు, మహేశ్, శాన్వీ మేఘన తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకులు శైలేష్ కొలను, బీవీఎస్ రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. "అందరూ దీన్ని చిన్న సినిమా అంటున్నారు. కానీ, ఇది చాలా పెద్ద చిత్రం" అన్నారు దర్శకుడు. హీరో సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. "మంచి కథతో పాటు అన్ని రకాల వాణిజ్య హంగులున్న చిత్రమిది" అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ రెడ్డి, దీక్షా పంత్, హర్షిత, కమల్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహావీర్, భాస్కర్, చంద్రబోస్, వితిక, జై జ్ఞానప్రభ

మార్పు కోసం... 'ధర్మస్థల నియోజకవర్గం'

అది ధర్మస్థల నియోజకవర్గం. అక్కడ మంత్రి, ముఖ్యమంత్రి, రాజ్యాంగం అంతా ఒక్కరే! అలాంటి చోట మార్పు రావాలని, ప్రజాస్వామ్యం కావాలని ఎవరెలాంటి ప్రయత్నాలు చేశారు? వారి పోరాటం ఫలించిందో లేదో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు జై జ్ఞానప్రభ తోట. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే... 'ధర్మస్థల నియోజకవర్గం'. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రధారులు. మేరుం భాస్కర్ నిర్మాత. ఈ చిత్రం సెప్టెంబరు 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుకని నిర్వహించారు. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ "నాకు 'రంగస్థలం' తర్వాత పాటల పరంగా అంత సంతృప్తినిచ్చిన చిత్రమిది. విభిన్నమైన సందర్భాలకు వినూత్నమైన సాహిత్యం అందించే అవకాశం ఈ సినిమాతో దక్కింది" అన్నారు.

కుటుంబం కోసం ఎంతదూరమైనా వెళ్తా!


అజయ్ దేవగణ్

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్'. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రియ, టబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "కౌంట్‌డౌన్ షురూ.. తప్పు, ఒప్పు.. ఏదైనా సరే కుటుంబం కోసం నేను ఎంతదూరమైనా వెళ్తా" అనే వ్యాఖ్యల్ని జోడించింది. క్రైమ్, సస్పెన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అంశాల కలయికతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో విజయ్ సాల్గాంకర్ పాత్రలో మరోసారి ప్రేక్షకుల్ని అలరించనున్నారు అజయ్. పనోరమా స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రాబోతుంది.

అందర్నీ ఆకట్టుకునే చిత్రం

వాసుకి, అరుణ్, రోహన్

"పిల్లలు, తల్లిదండ్రులు థియేటర్స్‌కి వచ్చి చూడగలిగే సినిమా 'సమ్మర్ హాలిడేస్'" అన్నారు నిర్మాత ధీరజ్ మొగిలినేని. ఇప్పుడాయన నిర్మాణం నుంచి వస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర్ తెరకెక్కించారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి ముఖ్య పాత్రలు పోషించారు. జయసుధ, రాజీవ్ కనకాల, వాసుకి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రంలోని "స్కూల్ సాంగ్"ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ.. "పిల్లలతో ఓ పూర్తి పాట పాడించాలనేది నా కల. అది ఈ సినిమాతో తీరింది" అన్నారు. "సింజిత్ అందించిన బాణీ నచ్చి.. దానికి తగ్గట్లుగా ఈ పాటకి స్టెప్స్ రూపకల్పన చేశాను" అన్నారు కొరియోగ్రాఫర్ ఆట సందీప్. "పిల్లల్నే కాదు.. పెద్దల్ని కూడా ఆకట్టుకునే సినిమా ఇది" అన్నారు దర్శకుడు శ్రీకర్. ఈ కార్యక్రమంలో విశ్వదత్తా, మాస్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'మిసెస్' దర్శకురాలితో కరీనా?

కరీనా కపూర్

వైవిధ్యమైన పాత్రలు, కథలతో వెండితెరపైనే కాకుండా.. ఓటీటీ వేదికగా కూడా అభిమానుల్ని అలరిస్తోంది బాలీవుడ్ కథానాయిక కరీనా కపూర్. ఇప్పుడామె మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వివాహం తర్వాత కొంత మంది యువతులకు ఎదురయ్యే ఇబ్బందుల నేపథ్యంలో 'మిసెస్' అనే సినిమాని రూపొందించి మంచి విజయాన్ని అందుకున్నారు దర్శకురాలు ఆరతి కడవ్. ఇప్పుడీమెతో తన రాబోయే ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపిందట కరీనా. "1990ల నేపథ్యంలోనే సాగే క్రైమ్ డ్రామాగా రాబోయే చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో కరీనా మునుపెన్నడూ చూడని కొత్త కోణంలో కనిపించనుంది. హర్మన్ బావేజా నిర్మించనున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రారంభించుకున్న ఈ ప్రాజెక్ట్ సెప్టెంబరులో పట్టాలెక్కడానికి సిద్ధంగా ఉంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

ముగ్గురూ ముగ్గురే!

'ముగ్గురు కోతులు'

తేజ కొండపల్లి, గణేశ్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్న చిత్రం... 'ముగ్గురు కోతులు'. వర్షిక పాశం కథానాయిక. కార్తీక్ గరిమెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. శోభారాణి గరిమెళ్ల నిర్మాత. ఇటీవల ఈ సినిమాలోని టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఎస్.సుహాస్ స్వరకల్పనలోని ఈ గీతానికి జగదీశ్ బుసయవలస సాహిత్యం అందించగా, చైతన్య గన్నవరపు ఆలపించారు. ముగ్గురు కలిసి చేసే అల్లరి పనుల్ని, వాళ్ల సరదాల్ని వర్ణిస్తూ సాగే ఆ పాట, చిత్రీకరణ వినోదాన్ని పంచుతోంది. యువతరం ఆలోచనలు, హాస్యం ప్రధానంగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోందని సినీ వర్గాలు తెలిపాయి.

కొత్త సినిమా ప్రారంభం

కిట్టు పవన్

తెలంగాణ జానపద గీతాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపుని సంపాదించిన కిట్టు పవన్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. దిలీప్ సాయినాయక్ దర్శకుడు. ముని శివ, శివ మల్లాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గీత రచయిత చంద్రబోస్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నివ్వగా, విజయ్ రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు, స్వరకర్త ఆర్.పి.పట్నాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు సతీశ్ వేగేశ్న, బుల్లెట్‌బండి లక్ష్మణ్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ని అందజేశారు. మంచి కథతో, ప్రతిభ కలిగిన బృందం చేస్తున్న ఈ సినిమా విజయవంతం కావాలని అతిథులు ఆకాంక్షించారు.

(c) eenadu

ఈనాడు బిజినెస్ వారాంతం

విద్యుత్ స్కూటర్ కావాలా.. 2 నెలలు ఆగాల్సిందే

ప్రజాదరణ ఎక్కువగా ఉండే కార్లకు వేచిచూసే సమయం ఉండడం మామూలే. అయితే ఇపుడా పరిస్థితి విద్యుత్ స్కూటర్లలోనూ కనిపిస్తోంది. వీటికి గిరాకీ పెరుగుతుండడంతో పాటు, అందుకు తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో షోరూముకు వెళ్లి కొత్త స్కూటర్‌ను వెంటనే తీసుకొచ్చే రోజులు పోయాయి. కనీసం 3 వారాల నుంచి గరిష్ఠంగా 2–3 నెలల వరకూ ఆగాల్సి వస్తోంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఇటీవల భారీగా పెరిగిన గిరాకీ వల్లే

అన్ని బ్రాండ్లకూ అదే సమస్య

దాదాపు అన్ని ప్రముఖ బ్రాండ్లకూ వేచిచూసే సమయం పెరిగింది. ముఖ్యంగా కొనుగోలుదార్ల ఆసక్తి ఎక్కువగా ఉండే మోడళ్లు, వినియోగదార్లకు నచ్చిన రంగుల వేరియంట్‌లకు ఉన్న గిరాకీకి తగ్గట్లుగా వెయిటింగ్ కూడా పెరుగుతోంది. దీంతో కంపెనీలు తయారీ సామర్థ్యాలను పెంచుకునే పనిలో పడ్డాయి. అయితే అందుకు 1-2 ఏళ్ల వరకు సమయం పడుతుంది. 'కొద్ది నెలలుగా అన్ని విద్యుత్ ద్విచక్ర వాహన బ్రాండ్లకు వేచిచూసే సమయం పెరిగింది. అయితే నగరం, బ్రాండ్, వేరియంట్‌ను బట్టి ఇది కాస్త అటూఇటూగా ఉంటోంద'ని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ అంటున్నారు. వేర్వేరు ధరల వద్ద వేర్వేరు వేరియంట్లు లభిస్తుండడంతో వినియోగదార్లు ఎంచుకునేందుకు ఎక్కువ ఆప్షన్లు కనిపిస్తున్నాయి. అదీకాక పశ్చిమాసియాలో యుద్ధం పుణ్యమాని పెట్రోలు ధరలపై అనిశ్చితి ఏర్పడడంతో సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్(ఐసీఈ) వాహనాల నుంచి ఈవీలవైపు వినియోగదార్లు మళ్లుతున్నారు.

ఉన్న వేరియంట్లే కొనేస్తున్నారు..

చాలా వరకు డీలర్ల వద్ద నిల్వలు ఎక్కువగా ఉండడం లేదు. పరిమిత రంగుల వేరియంట్లే లభ్యమవుతున్నాయి. దీంతో ఎక్కువ కాలం వేచిచూసే ఓపికలేని వారు తమకు అందుబాటులో ఏది ఉందో అదే కొనేస్తున్నారు. గిరాకీ ఎంతలా పెరిగిందో ఈ క్యాలెండర్ సంవత్సరంలో విక్రయాలే చెబుతున్నాయి. 2025 మొత్తం మీద 13.4 లక్షల వాహనాల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాదిలో ఇప్పటికే 11.8 లక్షల విద్యుత్ ద్విచక్రవాహనాలు విక్రయమయ్యాయి. మొత్తం ద్విచక్ర వాహనాల్లో ఈవీల వాటా 11 శాతంగా ఉండగా, స్కూటర్ల విభాగంలో ఇది 25 శాతంపైగా చేరడం ఈ విభాగంలో గిరాకీని తేటతెల్లం చేస్తోంది.

గిరాకీకి తగ్గట్లు ఉత్పత్తి కష్టంగానే..

ఈ పరిస్థితి చేదు మిఠాయిలా ఉందని ఏథర్ ఎనర్జీ సీఈఓ తరుణ్ మెహతా అంటున్నారు. కంపెనీ సరఫరా సామర్థ్యంతో పోలిస్తే గిరాకీ ఎపుడూ అధికంగానే కొనసాగుతోందన్నారు. త్రైమాసిక ప్రీ ఆర్డర్లు ఏడాది కిందటితో పోలిస్తే 158% పెరిగి 1,50,000 వాహనాలకు చేరగా, ఉత్పత్తి 83,000 వద్ద ఉందని ఆయన వివరించారు. ఇక డీలర్ల వద్ద నిల్వలు తొలి త్రైమాసికంలో 14 రోజుల నుంచి 3 రోజులకు తగ్గాయన్నారు. ప్రతీ నెలా చాలా రాష్ట్రాల నుంచి 50,000 వరకు ప్రీఆర్డర్లు వస్తున్నాయి. దీంతో డీలర్లు తాజా బుకింగ్‌లను ఆర్డర్లు ఆపేస్తున్నారు. ఎందుకంటే వేచిచూసే సమయం 2 నెలలు, అంతకు మించి చేరుతోందని మెహతా అంటున్నారు.

సామర్థ్య విస్తరణలో..

గిరాకీ-సరఫరా అంతరాన్ని పూడ్చడానికి కంపెనీలు నడుం బిగించాయి. టీవీఎస్ స్కూటర్ నెలవారీ విద్యుత్ స్కూటర్ల ఉత్పత్తిని ప్రస్తుత 40,000 నుంచి 50,000కు చేర్చుతోంది. బజాజ్ ఆటో 50,000 వాహనాల నుంచి 60,000కు పెంచుతోంది. ఏథర్ ఇప్పటికే హోసూర్ ప్లాంటును 35,000 యూనిట్ల నెలవారీ పూర్తి సామర్థ్యంతో నడుపుతోంది. మహారాష్ట్రలో కొత్త ఫ్యాక్టరీ మూడో త్రైమాసికంలో అందుబాటులోకి వస్తే వార్షిక సామర్థ్యానికి 5,00,000 యూనిట్లు జతచేరుతాయి. గిరాకీ ప్రస్తుత వేగంతో కొనసాగితే, అప్పటికి ఆ ఉత్పత్తీ సరిపోకపోవచ్చు.

ఆర్థిక సేవల సంస్థలదే అగ్రస్థానం

జీసీసీల అద్దె లావాదేవీల్లో 70% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణలో విదేశీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఈ ఏడాది జనవరి-జూన్ కాలంలో విదేశీ బీఎఫ్ఎస్ఐ సంస్థలు 73.20 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకొని, కొత్త రికార్డును నమోదు చేశాయి. స్థిరాస్తి సేవల సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే సమయంలో నమోదైన 43.10 లక్షల చ.అడుగుల స్థలంలో పోలిస్తే ఇది 70 శాతం వృద్ధిని సూచిస్తోంది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలైన ముంబయి, దిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతాలలో జీసీసీల మొత్తం లీజింగ్ 2.06 కోట్ల చదరపు అడుగులకు చేరింది. ఈ మొత్తం కార్యాలయ అద్దె లావాదేవీల్లో 36 శాతం వాటాను బీఎఫ్ఎస్ఐ రంగమే దక్కించుకోవడం విశేషం.

ఇనుప ఖనిజం దిగుమతిలో కృష్ణపట్నం పోర్టు సరికొత్త రికార్డు

ఎంవీ మినరల్ డాయిష్‌లాండ్ నౌక

ముత్తుకూరు, న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్(ఏకేపీఎల్) ఇనుప ఖనిజం దిగుమతిలో సరికొత్త రికార్డు సృష్టించింది. 300 మీటర్ల పొడవు 17.70 మీటర్ల డ్రాఫ్ట్ కలిగిన అతి భారీ కేప్-సైజ్ నౌక 'ఎంవీ మినరల్ డాయిష్‌లాండ్' ద్వారా ఒకేసారి 1,95,128 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని శనివారం దిగుమతి చేసింది. గతంలో 2024 నవంబరు 23న 'ఎంవీ మినరల్ హెల్లాస్' నౌక ద్వారా 1,95,014 మెట్రిక్ టన్నులు దిగుమతి చేయగా తాజాగా ఆ రికార్డును పోర్టు అధిగమించింది. దేశంలో ఇలాంటి అతి భారీ నౌకలను సురక్షితంగా నిలిపేందుకు ఏకంగా అయిదు బెర్తులు అందుబాటులో ఉన్న ఏకైక ఓడరేవు కృష్ణపట్నం కావడం విశేషం.

పెద్ద కంపెనీల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సులభతరం!

దిల్లీ: జీఎస్‌టీ మండలి 57వ సమావేశం సెప్టెంబరు 12న దిల్లీలో జరగనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. పెద్ద వ్యాపారాలకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, జీఎస్‌టీ రద్దు విధానాన్ని ఆటోమేట్ చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. జీఎస్‌టీ మండలి సమావేశానికి ఒక రోజు ముందు అంటే సెప్టెంబరు 11న అధికారుల సమావేశం జరగనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జీఎస్‌టీ మండలి ఏడాది విరామం తర్వాత సమావేశం కానుండటం గమనార్హం.

కోడి గుడ్లు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	530
వరంగల్	532
విజయవాడ	575
తూ/ప గోదావరి	555
విశాఖపట్నం	555
చిత్తూరు	573

త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి

లలితా జువెలరీ

దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా 110 స్టోర్లు



కిరణ్ కుమార్

ఈనాడు, హైదరాబాద్: తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, దిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

మలేషియా, సింగపూర్‌లో..: వచ్చే 2-3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించబోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగుపెడతామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న భారతీయ, ఆసియా వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను, అత్యుత్తమ ధరకే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

విక్రయాలు పెంచుకుంటూ...: అధిక లాభాలు ఆశించకుండా, తక్కువ లాభంతో ఎక్కువ విక్రయాలు సాధించడమే సంస్థ ప్రధాన వ్యూహమని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 58 షోరూముల ద్వారా రూ.25,000 కోట్ల మొత్తం ఆదాయం, రూ.1,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో స్టోర్ల సంఖ్య పెరిగిన కొద్దీ విక్రయాల విలువ మరింత వృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు 9 లేదా 14 క్యారెట్ల బంగారం విక్రయించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. 22 క్యారెట్ల పసిడి ఆభరణాలనే విక్రయిస్తామన్నారు. తమ వద్దకు వస్తున్నవారిలో 60% పాత బంగారం మార్పిడి చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

పసిడి ధరలపై..: 'నేను వ్యాపారం మొదలు పెట్టినప్పుడు గ్రాము రూ.280 ఉండేది. కరోనా సమయంలో కిలో బంగారం రూ.48 లక్షలకు చేరింది. ఇప్పుడు దాదాపు రూ.1.63 కోట్ల దరిదాపుల్లో ఉంది. బంగారం ధర ఎప్పుడూ వృద్ధి దశలోనే ఉంటుంది. కాబట్టి, పసిడిని అత్యంత సురక్షితమైన సాధనంగా చూడాల'ని ఆయన సూచించారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు కొత్త ఎండీ, సీఈఓ!

- వారసుడి ఎంపిక ప్రక్రియలో బోర్డు
- పునర్నియామకానికి శశిధర్ ససేమిరా

ముంబయి: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ అక్టోబరు 26న తన ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత పునర్నియామకం కోసం పరిశీలనలో ఉండకూడదని నిర్ణయించుకున్నారని నియంత్రణ సంస్థలకు బ్యాంక్ సమాచారం ఇచ్చింది. బ్యాంకులో మూడు దశాబ్దాల పాటు పని చేసిన జగదీశన్ (61) అక్టోబరు 26న పదవీ విరమణ చేయనున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు జగదీశన్ వారసుడి ఎంపిక, నియామక ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తుందని ఎక్స్ఛేంజీలకు సమాచారం అందింది. ఎండీ, సీఈఓగా తిరిగి నియామకం కోరకూడదనే తన నిర్ణయాన్ని ఆయన తెలియజేశారని, బోర్డు నుంచి ఒత్తిడి ఎదురైనా ఆ నిర్ణయాన్నే జగదీశన్ పునరుద్ఘాటించారని తెలుస్తోంది.

ఏథర్ ఎనర్జీ నుంచి కోణార్క్ స్కూటర్

ప్రారంభ ధర రూ.99,999

బెంగళూరు: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ కోణార్క్‌ను విడుదల చేసింది. మూడు వేరియంట్లు- ఎస్100, ఎస్125, ఎస్160లో తీసుకొచ్చిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ల ధర రూ.99,999 (ఎక్స్‌షోరూం, బెంగళూరు) నుంచి ప్రారంభం అవుతుంది. సెప్టెంబరు నుంచి వీటి డెలివరీలు మొదలవుతాయని పేర్కొంది. ఏథర్ కొత్తతరం ఈఎల్ ప్లాట్‌పామ్‌పై తయారైన మొట్టమొదటి స్కూటర్ ఇదే కావడం గమనార్హం. ఈ ప్లాట్‌పామ్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.400-500 కోట్లను వెచ్చించినట్లు కంపెనీ తెలిపింది. ఈఎల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌బోర్డ్ ఛార్జింగ్, ఏబీఎస్, 10,000 కి.మీ సర్వీస్ ఇంటర్వెల్స్ లాంటి కొత్త ప్రత్యేకతలను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. కోణార్క్‌లో మరిన్ని వెర్షన్‌లను కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు మద్దతిస్తాం: టెమాసెక్

దిల్లీ: ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు తాము మద్దతు ఇస్తామని సింగపూర్ ప్రభుత్వ వెల్త్‌ఫండ్ అయిన టెమాసెక్ తెలిపింది. నష్టాల్లో ఉన్న ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టిన పెట్టుబడులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో టెమాసెక్ పై ప్రకటన చేసింది. ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉండగా.. మిగిలిన వాటా టాటా సన్స్ వద్ద ఉంది. 2022 జనవరిలో భారత ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా సన్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో టెమాసెక్ వాటాదారుగా ఉంది. టాటా సన్స్ గ్రూపు భారీ స్థాయిలో చేపడుతున్న ఎయిరిండియా నవీకరణ ప్రక్రియ సంక్లిష్టమైనదే కాకుండా, పలు సంవత్సరాలు కొనసాగుతుందని, అనుసంధానపరంగా సవాళ్లు ఉంటాయని టెమాసెక్ అభిప్రాయపడింది. 'ముఖ్యంగా విమానయాన రంగంలో ఇలాంటి ప్రక్రియకు సమయం పడుతుంది. గగనతల ఆంక్షలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఇంధన ధరల్లో అస్థిరత లాంటి పలు బాహ్య అంశాలపై ఇది ఆధారపడి ఉండటమే ఇందుకు కారణమ'ని తెలిపింది. సింగపూర్ బయట దీర్ఘకాలిక వృద్ధిని సాధించేందుకు, రెండో హబ్‌గా భావిస్తున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తామనే విషయాన్ని సింగపూర్ ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసినట్లు వెల్లడించింది. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద విమాన రవాణా మార్కెట్‌గా ఉన్న భారత్ తమకు రెండో ప్రధాన కేంద్రంగా సేవలు అందించే స్థితిలో ఉందని తెలిపింది. '2013 నుంచి విస్తారా ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. చాలా కాలంగా భారత విపణితో సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంబంధాన్ని కలిగి ఉంది. భారత విమానయాన రంగ వృద్ధిలో తన భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు ఎయిరిండియాలో పెట్టుబడి ఆ సంస్థకు ఉపయోగపడుతుంద'ని టెమాసెక్ వివరించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో వాటాదారుగా తాము ఆ సంస్థ వ్యాపార నిర్ణయాన్ని దీర్ఘకాలిక దృక్పథంతో చూస్తామని, దానికి మద్దతు కూడా తెలుపుతామని తెలిపింది.

ప్రపంచం కోసం భారత్‌లో తయారీ ప్లాంట్లను నెలకొల్పండి

- సాంకేతికత, ఆవిష్కరణ కేంద్రాలనూ ప్రారంభించండి
- ప్రపంచ పెట్టుబడిదార్లను ఆహ్వానించిన ఆర్థిక మంత్రి

వాషింగ్టన్: భారత్‌లో తయారీ, సాంకేతిక, ఆవిష్కరణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచ పెట్టుబడిదార్లను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆహ్వానించారు. భారత్‌లోని ప్రతిభను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనడాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆమె అమెరికాకు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా చికాగోలో ప్రముఖ పెట్టుబడిదార్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఇందులో భారత్ సాధిస్తున్న వేగవంత వృద్ధి, సంస్కరణలు, దీర్ఘకాలిక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రముఖంగా వారితో ఆమె ప్రస్తావించారు. 'వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి, తయారీ, ఆవిష్కరణ, విస్తరణకు వీలు కల్పించే వాతావరణాన్ని సృష్టించేలా విధానాలు తీసుకొని రావడంపై భారత్ ఎక్కువగా దృష్టి సారిస్తోంద'ని యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సహకారంతో చికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె అన్నారు. భారత్‌ను కేవలం సేవలు అందించే మార్కెట్‌గానే కాకుండా.. ప్రపంచం కోసం నిర్మించడానికి ఒక వేదికగా చూడాలని ఆమె వారికి తెలిపారు. భారతదేశ ఇంజినీరింగ్ ప్రతిభ, తయారీ స్థాయి, సాంకేతికత వ్యవస్థను సద్వినియోగం చేసుకుంటూ దానిని ఒక తయారీ కేంద్రంగా, సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా, వినియోగదార్ల విపణిగా, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గమ్యస్థానంగా చూడాలని సూచించారు. భారత గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ప్రపంచ ఆవిష్కరణల కేంద్రాలుగా మారుతున్న నేపథ్యంలో ఏఐ, ఇంజినీరింగ్, అనాలటిక్స్, ఉత్పత్తి, అభివృద్ధి, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అత్యధిక విలువ కలిగిన వ్యాపారాలను నిర్మించడమే తదుపరి అవకాశమని అన్నారు. ప్రపంచ మూలధనాన్ని భారత్‌లో ఉన్న అవకాశాలతో అనుసంధానించే అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా గిఫ్ట్ సిటీ అవతరిస్తోందని తెలిపారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశంలో మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారు. ఈ సమావేశంలో కీలకమైన ప్రపంచ ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపై చర్చిస్తారు. ఆ తర్వాత సీతారామన్ న్యూయార్క్ వెళ్లనున్నారు. అక్కడ ఆమె న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ కంపెనీల సీఈఓలు, ఉన్నతాధికార్లతో సమావేశం అవుతారు.

ల్యాప్‌టాప్ కొనుగోలులో ప్రాసెసర్‌కే ప్రాధాన్యం!

- అమెజాన్ 'బెస్ట్ ఇన్ టెక్' సర్వే

దిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌ల కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. బ్రాండ్ పేరు కంటే సాంకేతిక ఫీచర్లు, సామర్థ్యానికే వినియోగదారులు పెద్దపీట వేస్తున్నారని ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ నిర్వహించిన బెస్ట్ ఇన్ టెక్ సర్వేలో తేలింది. దాదాపు 40,000 మంది వినియోగదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. దీని ప్రకారం..

ల్యాప్‌టాప్ కొనుగోలుదారుల్లో అత్యధికంగా 87% మంది ప్రాసెసర్ పనితీరు ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటున్నారు. ట్యాబ్లెట్ విషయానికొస్తే.. స్క్రీన్ పరిమాణం, డిస్‌ప్లే నాణ్యతకే 74% మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్యాబ్లెట్ విషయంలో ధర (12%), ప్రాసెసర్ (9%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒకే ధర శ్రేణిలో మెరుగైన ఫీచర్లు లభిస్తే.. ఇతర బ్రాండ్ వైపు మొగ్గుచూపేందుకు 53 శాతం మంది సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ఫీచర్లపై విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. ల్యాప్‌టాప్‌ల్లో ఏఐ ఫీచర్లు ఉత్పాదకతను భారీగా పెంచుతాయని 58 శాతం మంది భావిస్తున్నారు.

నేపాల్ వరదల్లో ఐపీఎస్ సీఈఓ గోపిశెట్టి గల్లంతు

ఇంటర్నెట్ డెస్క్: నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ (ఐపీఎస్) సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి(లాక్స్ గోపిశెట్టి) కూడా ఉన్నారు. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ ధ్రువీకరించింది. 'వ్యక్తిగత పని మీద నేపాల్ వెళ్లిన గోపిశెట్టిని సంప్రదించలేకపోతున్నాం. ఆయన కోసం సంబంధిత ఏజెన్సీలతో కలిసి పని చేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి అండగా ఉంటామ'ని ఇన్ఫోసిస్ తెలిపింది.

ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేసిన గోపిశెట్టి.. బిజినెస్ అప్లికేషన్స్, డిజిటల్ వర్క్‌స్పేస్ సర్వీస్ విభాగానికి కూడా నాయకత్వం వహించారు. అంతకు ముందు యాక్సెంచర్‌లో ఎండీగా పని చేసిన ఆయనకు ఐటీ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యనభ్యసించిన గోపిశెట్టి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు.

మన వంటకి.. అమెరికా గ్యాస్

- ఆగస్టులో 0.62 మి. టన్నుల ఎల్‌పీజీ దిగుమతి
- హర్మూజ్ మూసివేత ప్రభావం

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ మూతపడడంతో గల్ఫ్ సరఫరాదార్లకు ఆటంకం ఏర్పడింది. దీంతో అమెరికా నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ), ద్రవీకృత సహజ వాయువు(ఎల్‌ఎన్‌జీ) దిగుమతులను భారత్ పెంచుకుంది. కెప్లర్ గణాంకాల ప్రకారం, ఆగస్టులో అమెరికా నుంచి 0.62 మి. టన్నుల ఎల్‌పీజీని దిగుమతి చేసుకోగా, జులైలో 0.89 మి. టన్నుల వరకు తెచ్చుకున్నాం. దేశ ఎల్‌పీజీ దిగుమతుల్లో అమెరికా వాటా 73 శాతానికి పైగా పెరగడం గమనార్హం. యూఏఈ నుంచి తెచ్చుకున్న నెలవారీ గరిష్ఠ ఎల్‌పీజీ దిగుమతులకు సమానంగా జులై నెల అమెరికా దిగుమతులుండడం విశేషం. అక్టోబరు 2025లో అత్యధికంగా ఆ గల్ఫ్ దేశం నుంచి 0.891 మి. టన్నుల ఎల్‌పీజీ దిగుమతి అయింది. హర్మూజ్ జలసంధి మూసివేత అనంతరం గల్ఫ్ నుంచి దిగుమతులు తగ్గాయి. యూఏఈ నుంచి ఆగస్టులో 1.4 లక్షల టన్నులకు ఎల్‌పీజీ దిగుమతులు తగ్గాయి. ఖతార్ నుంచి 60,000 టన్నులే వచ్చాయి. సౌదీ అరేబియా నుంచి జులై, ఆగస్టులో ఎటువంటి ఎల్‌పీజీ సరఫరా జరగలేదు.

పొదుపు అలవాట్లు మారుతున్నాయి

- ఈక్విటీలు, డిపాజిట్లపైనే ఆసక్తి
- బ్యాంకు ఖాతాల్లో భారీగా చేరిన సగటు నిల్వ

ఈనాడు, హైదరాబాద్: భారతీయ కుటుంబాల పొదుపు ధోరణిలో విప్లవాత్మక మార్పు వస్తోంది. గతంలో సామాన్యులు తమ కష్టార్జితాన్ని భూమి, బంగారం వంటి భౌతిక ఆస్తుల్లో దాచుకునేందుకు మొగ్గు చూపేవారు. 'జేఎమ్ ఫైనాన్షియల్' తాజా నివేదిక ప్రకారం.. ఇప్పుడు ప్రజలు సంప్రదాయ ఆస్తుల కంటే షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బ్యాంకు డిపాజిట్ల వంటి ఆర్థిక సాధనాల్లో మదుపు చేసేందుకు మొగ్గు చూపిస్తున్నారు. కొవిడ్ మహమ్మారి తర్వాత ఈ ధోరణి మరింత పెరిగింది. కుటుంబాల పొదుపులో ఆర్థిక ఆస్తుల వాటా 2005లో 39.5% కాగా, 2024 నాటికి ఇది 44.7 శాతానికి పెరిగింది.

విలువ పెరుగుతోంది...

బ్యాంకుల్లో కొత్త ఖాతాల సంఖ్య కంటే ఇప్పటికే ఉన్న ఖాతాల్లో నగదు నిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. 2026 మార్చికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల సంఖ్య 1.8% వృద్ధితో 261.7 కోట్లకు చేరుకుంది. కానీ, డిపాజిట్ల విలువ 9.7% వార్షిక వృద్ధితో ఏకంగా రూ.134.8 లక్షల కోట్లకు చేరింది. ఒక్కో బ్యాంకు ఖాతాలో ఉండే సగటు 7.7% వృద్ధితో రూ.51,494కు పెరిగింది. ప్రజలు సాధారణ బ్యాంకు ఖాతాల్లోనే పెద్ద మొత్తంలో నగదు ఉంచుతున్నారు.

పొదుపులో మేటి మహిళలు

బ్యాంకింగ్ వ్యవహారాల్లో పురుషులతో పోలిస్తే, మహిళల వాటా వేగంగా పెరుగుతోంది. 2019-26 మధ్య మహిళల బ్యాంకు ఖాతాలు 8.5% వార్షిక వృద్ధి రేటు నమోదు చేశాయి. వారి ఖాతాల్లోని డిపాజిట్ల విలువ 13.4% పెరిగింది. ఇదే కాలంలో పురుషుల ఖాతాల వృద్ధి 3.1%, డిపాజిట్ల వృద్ధి 7.5 శాతంగా ఉంది. మొత్తం వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో మహిళల వాటా 41 శాతానికి చేరింది. దేశంలో ప్రస్తుతం మహిళలకు 107.4 కోట్ల బ్యాంకు ఖాతాలుండగా, అందులోని డిపాజిట్ల విలువ రూ.55.5 లక్షల కోట్లు. పురుషుల డిపాజిట్ల విలువ రూ.79.3 లక్షల కోట్లుగా ఉంది.

మ్యూచువల్ ఫండ్ల ద్వారా..

సాధారణ పెట్టుబడిదారులు నేరుగా షేర్లు కొనడానికి బదులు మ్యూచువల్ ఫండ్ల ద్వారా మార్కెట్లో అడుగుపెడుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్ల యాజమాన్య వాటా 2024-25లో 10.2% అయితే 2025-26లో 11.3 శాతానికి విస్తరించింది. నేరుగా షేర్లు కొనే మదుపరుల వాటా 9.9% నుంచి 9.4 శాతానికి తగ్గింది. 2014లో మ్యూచువల్ ఫండ్ల వాటా 3.4 శాతమే.

సిప్ చేస్తున్నారు..

చిన్న మదుపరులు క్రమానుగత పెట్టుబడి విధానాన్ని (సిప్) ఎంతో ఇష్టపడుతున్నారు. వార్షిక సిప్ చెల్లింపులు 20.8% వృద్ధితో రూ.3.49 లక్షల కోట్లకు చేరాయి. నెలవారీ సిప్ ప్రవాహం 2016 జూన్‌లో రూ.3,310 కోట్లు కాగా, 2026 జూన్‌లో రూ.31,780 కోట్లకు చేరింది. మ్యూచువల్ ఫండ్ల పోర్ట్‌ఫోలియోల సంఖ్య 16.8% వృద్ధితో 27.4 కోట్లకు చేరింది. ఇందులో రిటెయిల్ మదుపరుల వాటా 90.5%. అధిక నికర విలువ ఉన్న వ్యక్తుల (హెచ్‌ఎన్ఐ) వాటా 8.9 శాతానికి పెరిగింది.

జెన్ జీ.. డీమ్యాట్ ఖాతాలు

వ్యక్తిగత డీమ్యాట్ ఖాతాలు 17.6% వార్షిక వృద్ధితో 22.5 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఈ విభాగ వృద్ధి రేటు 26.7 శాతంతో పోలిస్తే ఈ ఏడాది కొంత తగ్గినా, కొత్త ఖాతాలు ప్రారంభమవుతూనే ఉన్నాయి. డీమ్యాట్ ఖాతాల్లో 30 ఏళ్లలోపు వారి పెట్టుబడులే 38.4%. మొత్తం మీద మార్కెట్ పెట్టుబడిదారుల సగటు వయసు 35.8 ఏళ్ల నుంచి 36.1 ఏళ్లకు పెరిగింది.

పీఎంఎస్ సేవల కోసం..

హెచ్‌ఎన్ఐలు ప్రత్యేక సలహాదారుల సేవలతో కూడిన పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. పీఎంఎస్ ఆస్తుల విలువ (ఏయూఎం) 10.4% పెరిగి, రూ.35.1 లక్షల కోట్లకు చేరింది. ఈ తరహా పెట్టుబడిదారుల సంఖ్య 8.8% పెరిగి 2.08 లక్షలకు చేరుకోగా, వారి సగటు మదుపు పరిమాణం రూ.16.88 కోట్లకు పెరిగింది.

(c) eenadu

బ్రెడ్ బిర్యానీ చేసేశా!

బ్యాచిలర్స్ కిచెన్

ఆదివారం సాయంత్రం.. ఆకలి దంచేస్తోంది. బయటికెళ్లి తిందామంటే మా జేబుల్లో చిల్లర తప్ప పెద్ద నోట్లేమీ లేవు. ఫ్రిజ్ తెరిచి చూస్తే నాలుగు బ్రెడ్ ముక్కలు, కొంచెం పెరుగు ఉన్నాయంతే. 'వీటితో ఏం చేయగలంరా? ఇవాళ మనం ఆకలితో పోయేట్టే ఉన్నాం' రూమ్మేట్ పవన్ నిరాశగా అన్నాడు. 'బ్రెడ్ బజ్జీ చేద్దాం' అన్నాన్నేను. అందరి ముఖాలూ వెలిగిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిపోయా. ముందుగా శనగపిండిలో కొంచెం నీళ్లు పోసి కలిపా. బ్రెడ్‌ని ముక్కలుగా కట్ చేసి పిండిలో ముంచి, నూనెలో వేశా. అవి ఎంచక్కా వేగుతుంటే.. నా రూమ్మేట్స్ ఆనందంతో ఈలలేశారు. 'ఆకలికి ఆగలేకపోతున్నా.. రెండు నా ప్లేటులో వేసెయ్‌రా!' అన్నాడు శేఖర్. 'ఆగు.. అసలు సినిమా ఇంకా ఉంది' అని.. మరో కడాయిలో ఉల్లి, మిర్చి, టొమాటో ముక్కలు, మసాలాలు వేసి గ్రేవీ తయారుచేశా. అందులో బ్రెడ్ బజ్జీలు వేసి, కొత్తిమీర చల్లి సెగ తీసేశా. అప్పటికే పవన్, శేఖర్ ప్లేట్లు పట్టుకొని రెడీగా ఉన్నారు. వేయగానే ఆబగా తిని.. 'టేస్ట్ అద్దిరిపోయిందిరా' అన్నారు. నా ఛాతీ ఉప్పొంగిపోయింది, నవ్వి కాలరెగరేశా. 'ఒరేయ్ షెఫ్పూ! నిన్నటి లాంటిదే మళ్లీ చేసి పెట్టరా' అంటూ మర్నాడు తయారయ్యారు. ఈసారి రెట్టించిన ఉత్సాహంతో.. మరింత వెరైటీగా బ్రెడ్‌తో బిర్యానీ చేశా. ఇక మావాళ్లు.. నన్ను పొగడ్తలతో ముంచేయడమే కాదు.. కాలేజీలోనూ నా గురించి గొప్పలు చెప్పారు. వాళ్లు నాకు 'బ్యాచిలర్ షెఫ్' అని బిరుదిచ్చేసి, మా రూమ్‌ని చాట్‌భండార్‌గా మార్చేశారు. **– కమలాకర్, కరీంనగర్**

నోరూరించే చామాకు వడలు

పాఠక వంట

సాయంత్రం వేళ వేడివేడి చిరుతిండి కావాలనిపిస్తుంది. అందుకోసం.. తరచూ తినే ఆలూ బజ్జీ, ఉల్లి పకోడీ లాంటివి కాకుండా కొంచెం భిన్నంగా ఉండాలంటే.. 'చామాకు వడలు' చేసేయండి. ఇవెంతో రుచిగా ఉండి, అందరికీ నచ్చేస్తాయి.

కావలసినవి: చామాకులు - 6, శనగపిండి - కప్పు, బియ్యప్పిండి - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్ర, ధనియాల పొడులు - స్పూన్ చొప్పున, నువ్వులు - 2 స్పూన్లు, ఇంగువ - చిటికెడు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: చామాకులను కడిగి, తొడిమెలు తీసేయాలి. వెనుక భాగంలో ఎత్తుగా కనిపిస్తున్న మధ్యలోని ఈనెను చాకుతో కోసి.. చదునుగా ఉండేట్లు చేయాలి. ఆకులు మరీ పెద్దగా ఉంటే సగానికి తుంచాలి. శనగపిండిలో బియ్యప్పిండి, ఉప్పు, వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్ర, ధనియాల పొడులు, ఇంగువ వేసి.. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండి కలపాలి. పిండి గట్టిగా ఉండాలి. వెడల్పాటి పళ్లెంలో చామాకును ఉంచి.. తగినంత పిండిని సమంగా పూసి, నువ్వులు చల్లాలి. దాని మీద మరో ఆకు ఉంచి అలాగే చేయాలి. అలా ఒకదాని మీద ఒకటి చొప్పున అన్నీ అయ్యాక.. గట్టిగా చాపలా చుట్టాలి. ఈ రోల్స్‌ను సుమారు పావుగంట సేపు ఆవిరి మీద ఉడికించాలి. చల్లారాక.. ముక్కలుగా కట్‌చేసి.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అంతే.. నోరూరించే చిరుతిండి సిద్ధం.

– సంగీతా మైస్కర్, హైదరాబాద్

ఇంట్లోనే చికెన్ ప్రొటీన్ చిప్స్

గుడ్డు, చికెన్ కలయికతో తయారయ్యే ప్రొటీన్ చిప్స్ ఎంతో రుచిగా ఉంటాయి. సాధారణ పెనంపైనే సులువుగా, వేగంగా వీటిని చేసుకోవచ్చు. కరకరలాడే స్నాక్స్ ఇష్టపడేవారికి ఇది బెస్ట్ ఛాయిస్!

కావలసినవి: చికెన్ బ్రెస్ట్ పీస్ - 300 గ్రా, గుడ్లు - 2, కారం, ఉల్లి, మిరియాల పొడులు - స్పూన్ చొప్పున, ఉప్పు - తగినంత, ఆలివ్ నూనె - 2 స్పూన్లు

తయారీ: చికెన్ ముక్కలను కడిగి, తడి లేకుండా తుడవాలి. వాటిని జార్‌లో వేసి.. గుడ్డుసొన, కారం, ఉప్పు, ఉల్లి, మిరియాల పొడులు జతచేసి మెత్తటి పేస్ట్‌లా అయ్యే వరకూ గ్రైండ్ చేయాలి. దాన్ని పైపింగ్ బ్యాగ్‌లోకి తీసుకోవాలి. స్టవ్ మీద దోశల పెనం వేడయ్యాక.. నూనె వేసి, పెనం అంతటా పరచుకునేలా చేయాలి. ఇప్పుడు చికెన్ మిశ్రమాన్ని సన్నగా, బలపాల్లా ఒత్తుకోవాలి. అంటే.. అవి చూడటానికి కుర్‌కురే స్టిక్స్‌లా ఉండాలి. మందంగా ఉంటే.. సరిగ్గా ఉడకవు, లోపల పచ్చిగా ఉంటుంది. కాబట్టి వీలైనంత సన్నగా ఒత్తుకోవాలి. వాటిని తక్కువ సెగ మీద అటూ ఇటూ కదిలిస్తూ.. బంగారు రంగులోకి మారే వరకూ ఉంచి, తీసేయాలి. ఇక కరకరలాడే, చికెన్ ప్రొటీన్ చిప్స్‌ను తిని ఆనందించడమే తరువాయి. ఇవి రుచీ, బలం కూడా. జిమ్‌కి వెళ్లేవారికి మంచి హై-ప్రొటీన్ ఫుడ్. ఇంట్లో పైపింగ్ బ్యాగ్ లేకపోతే.. ప్లాస్టిక్ కవర్‌తో కోన్ రూపొందించి, కింది భాగంలో సన్న రంధ్రం చేసి.. ఉపయోగించవచ్చు.

షెఫ్ స్పెషల్

పనీర్‌తో పసందైన రుచులు

పనీర్ రుచిగా ఉండటమే కాదు.. మంచి పోషకాహారం కూడా. దీంతో దమ్ పనీర్, చిల్లీ పనీర్ వంటి కూరలు, టిక్కా, పకోడీ, సమోసా లాంటి చిరుతిళ్లు, ఖీర్, సందేశ్ లాంటి స్వీట్లు.. ఇలా బోలెడ్ని రకాల వంటకాలు చేసుకోవచ్చు. మీ కోసం పనీర్‌తో కొన్ని ప్రత్యేక రెసిపీలు..

భునా మసాలా

కావలసినవి: పనీర్ - పావు కిలో, నూనె - 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు - తగినంత, క్రీమ్ - 2 టేబుల్ స్పూన్లు, ఉల్లి తరుగు - కప్పు, టొమాటో ముక్కలు - ముప్పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - ఒకటిన్నర స్పూన్లు, జీడిపప్పుల పేస్ట్ - రెండున్నర టేబుల్ స్పూన్లు, వెన్న, జీలకర్ర, కసూరీ మేథీ, కారం, జీలకర్ర పొడి, పచ్చిమిర్చి ముద్ద - స్పూన్ చొప్పున, గరం మసాలా, పసుపు - అర స్పూన్ చొప్పున, ధనియాల పొడి - 2 స్పూన్లు, కొత్తిమీర తరుగు - గుప్పెడు

తయారీ: పనీర్‌ను అంగుళమంత ముక్కలుగా కోసి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి జీలకర్ర వేయాలి. అది వేగాక ఉల్లితరుగును లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి జోడించాలి. ఒక నిమిషం వేయించి.. టొమాటో ముక్కలు, పసుపు, ధనియాలు, జీలకర్ర పొడులు, కారం, ఉప్పు వేసి నిరంతరం కలియబెడుతూనే ఉండాలి. ముక్కలు బాగా వేగి.. నూనె తేలుతున్నప్పుడు జీడిపప్పుల పేస్ట్, కొద్దిగా నీళ్లు జోడించాలి. నాలుగు నిమిషాల తర్వాత పనీర్, గరం మసాలా, కసూరీ మేథీ, వెన్న, క్రీమ్ జతచేయాలి. సన్న సెగ మీద ఇంకో రెండు నిమిషాలుంచి.. కొత్తిమీర చల్లి దించేయాలి. అంతే.. పసందైన 'పనీర్ భునా మసాలా' తయారైపోతుంది. ఇది అన్నం, చపాతీలు ఎందులోకైనా బాగుంటుంది.

పనీర్ చమ్ చమ్



కావలసినవి: పనీర్ - 250 గ్రా, కొబ్బరి తురుము - అర కప్పు, మైదా, రవ్వ - స్పూన్ చొప్పున, పంచదార - 2 కప్పులు, నీళ్లు - 5 కప్పులు, యాలకుల పొడి - అర స్పూన్, కుంకుమపువ్వు - కొద్దిగా, పాలు - 2 టేబుల్ స్పూన్లు, పిస్తా, బాదంపప్పు పలుకులు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున

తయారీ: గోరువెచ్చని పాలలో కుంకుమపువ్వు వేసి నానబెట్టాలి. పనీర్‌ను తుంచి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో మైదా, రవ్వ వేసి మళ్లీ మళ్లీ కలిపి.. మెత్తగా అయ్యాక.. కోలగా ఆకృతులు చేయాలి. వెడల్పాటి గిన్నెలో పంచదార, కొన్ని నీళ్లు, యాలకుల పొడి వేసి మరిగించాలి. ఈ పాకంలో పనీర్ చమ్ చమ్‌లు వేసి ఉడికించాలి. పావుగంట తర్వాత కుంకుమపువ్వు కలిపిన పాలు జతచేయాలి. మరో ఐదు నిమిషాలు ఉడికించి, సెగ తీసేయాలి. ఒక గంట అలా ఉంచితే.. పాకాన్ని పీల్చుకుంటాయి. ఇప్పుడు పాకం లోంచి తీసి.. కొబ్బరి తురుములో దొర్లించాలి. పైన సన్నగా తరిగిన డ్రైఫ్రూట్స్ చల్లితే.. నోరూరించే 'పనీర్ చమ్ చమ్' సిద్ధం. పనీర్‌లో తడి ఎక్కువగా ఉంటే చమ్ చమ్‌లు పాకంలో ఉడుకుతున్నప్పుడు విరిగిపోతాయి. కాబట్టి పనీర్‌ను బాగా వడకట్టి, మెత్తగా అయ్యేట్లు కలపాలి.

షాహీ కుర్మా

కావలసినవి: పనీర్ - పావు కిలో, ఉల్లి తరుగు, కొబ్బరి తురుము - అర కప్పు చొప్పున, పుదీనా, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, టొమాటో ప్యూరీ - కప్పు, ఉప్పు - తగినంత, పసుపు - పావు స్పూన్, బిర్యానీ ఆకు - 1, యాలకులు, నల్ల యాలకులు - 2 చొప్పున, జీలకర్ర, కారం, అల్లం వెల్లుల్లి ముద్ద - స్పూన్ చొప్పున, ధనియాలు, జీలకర్ర పొడులు, గరంమసాలా - అర స్పూన్ చొప్పున, బాదం, జీడిపప్పులు - గుప్పెడు, పెరుగు - అర కప్పు, నూనె - 4 స్పూన్లు

తయారీ: సగం నూనె వేడిచేసి.. పనీర్ ముక్కలను వేయించాలి. బాదంపప్పులను వేడినీళ్లలో నానబెట్టి పొట్టు తీయాలి. అందులో కొద్దిగా నీళ్లు, జీడిపప్పులు, కొబ్బరి తురుము జోడించి గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో మిగిలిన నూనె వేసి.. బిర్యానీ ఆకు, జీలకర్ర, రెండు రకాల యాలకులను వేయించాలి. అవి వేగాక.. ఉల్లి తరుగును దోరగా వేయించి.. అల్లం వెల్లుల్లి పేస్టు, పుదీనా, పసుపు, జీలకర్ర పొడి, కారం, ఉప్పు, టొమాటో ప్యూరీ జోడించి కలియతిప్పుతుండాలి. నాలుగు నిమిషాలయ్యాక కొబ్బరి మిశ్రమం జతచేయాలి. మరో ఏడెనిమిది నిమిషాల తర్వాత వేయించిన పనీర్, గరంమసాలా, ధనియాల పొడి, పెరుగు చేర్చాలి. చివర్లో కొత్తిమీర వేసి దించేస్తే.. వహ్వా అనిపించే 'పనీర్ షాహీ కుర్మా' తయారైపోతుంది.

బ్రెడ్ రోల్స్

కావలసినవి: పనీర్ - 200 గ్రా, బ్రెడ్ స్లైసులు - 12, ఉల్లి తరుగు, కొత్తిమీర - గుప్పెడు, అల్లం తరుగు, పచ్చిమిర్చి ముద్ద, నిమ్మరసం - స్పూన్ చొప్పున, కారం, గరం మసాలా, మిరియాల పొడి, చాట్ మసాలా - అర స్పూన్ చొప్పున, ఉప్పు - తగినంత, మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: వెడల్పాటి గిన్నెలో తురిమిన పనీర్, ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం, కారం, గరం మసాలా, చాట్ మసాలా, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఈ మిశ్రమంతో పొడవుగా రోల్స్ చేసుకోవాలి. మొక్కజొన్న పిండిలో రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి కలిపి ఉంచాలి. బ్రెడ్ స్లైసుల అంచులను తొలగించాలి. ఒక్కో స్లైస్‌ను నీళ్లలో ముంచి, వెంటనే తీసేయాలి. దాని మధ్యలో పనీర్ ఫిల్లింగ్‌ను ఉంచి, చాపలా చుట్టి, అంచులను మూసేయాలి. వీటిని మొక్కజొన్న పిండిలో ముంచి తీసి, కాగుతున్న నూనెలో వేయిస్తే.. పనీర్ బ్రెడ్ రోల్స్ సిద్ధం. వేడివేడిగా టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో వడ్డించారంటే వహ్వా అనేస్తారంతా. ఇవి సాయంత్రం చిరుతిండిగా చాలా బాగుంటాయి.

పనీర్ చీజ్ బాల్స్

కావలసినవి: పనీర్ - 200 గ్రా, చీజ్ - 100 గ్రా, ఉప్పు - తగినంత, బంగాళదుంపలు - 2, మొక్కజొన్న పిండి - 3 టేబుల్ స్పూన్లు, బ్రెడ్ పౌడర్ - అర కప్పు, పచ్చిమిర్చి - 2, కొత్తిమీర తరుగు - గుప్పెడు, అల్లం తురుము - స్పూన్, చాట్ మసాలా, కారం, మిరియాల పొడి, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: పనీర్, చీజ్‌లను తురమాలి. బంగాళదుంపలను ఉడికించి, మెదపాలి. అందులో పనీర్, పచ్చిమిర్చి, కొత్తిమీర, అల్లం తురుము, చాట్ మసాలా, కారం, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, ఒక స్పూన్ మొక్కజొన్న పిండి వేసి కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న రొట్టెల్లా చేయాలి. వాటి మధ్యలో తగినంత చీజ్ ఉంచి, అంచులు మూసేసి, బంతిలా చేయాలి. మిగిలిన మొక్కజొన్న పిండిలో కొద్దిగా నీళ్లు పోసి కలపాలి. పనీర్ బాల్స్‌ను మొదట కార్న్‌ఫ్లోర్ పేస్ట్‌లో ముంచి, తర్వాత బ్రెడ్ పొడిలో దొర్లించి, ఫ్రిజ్‌లో ఉంచాలి. పావుగంట తర్వాత కాగుతున్న నూనెలో వేయిస్తే సరిపోతుంది. వీటికి చిల్లీ సాస్ లేదా కొబ్బరి చట్నీ బాగుంటుంది. పనీర్‌లో నీరు ఎక్కువగా ఉండకూడదు. నూనె బాగా వేడెక్కిన తర్వాత మధ్యస్థమైన సెగ మీద వేయిస్తే కరకరలాడతాయి.

మజారే.. మటన్ కారంపొడి!

కూరలెన్ని ఉన్నా.. రోటిపచ్చడి, కారప్పొడుల స్థానం ప్రత్యేకమైంది. పల్లీకారం, నువ్వుల కారం లాంటివి కాకుండా.. మటన్ కారంపొడి ఉందనుకోండి.. మజా వస్తుంది కదూ! ఇంకెందుకాలస్యం.. చేసేయండి మరి.

కావలసినవి: బోన్‌లెస్ మటన్ - పావు కిలో, ఎండుమిర్చి - 20, ధనియాలు - 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర - టేబుల్ స్పూన్, మిరియాలు - అర స్పూన్, వెల్లుల్లి రెబ్బలు - 15, కరివేపాకు - 2 రెమ్మలు, ఉప్పు - తగినంత, పసుపు - పావు స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: మాంసం ముక్కల్లో కొన్ని నీళ్లు, పసుపు, ఉప్పు జతచేసి కుక్కర్‌లో 5 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. ఆవిరి పోయి, మూత తీశాక ముక్కల్లో నీరుంటే.. పూర్తిగా ఇగిరిపోయే వరకూ సన్న సెగ మీదుంచాలి. ఆ ముక్కలను నూనెలో వేయించాలి. ముక్కలు బాగా వేగి, ముదురు రంగులోకి మారితేనే కారంపొడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి.. ధనియాలు, జీలకర్ర, మిరియాలు, ఎండుమిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలను దోరగా వేయించి చల్లార్చుకోవాలి. ముందుగా ధనియాలు, జీలకర్ర, మిరియాలను గ్రైండ్ చేయాలి. అందులో ఎండుమిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు చేర్చి పొడి చేయాలి. చివరగా ఉప్పు, మటన్ ముక్కలను జతచేసి, మిక్సీని ఆన్ చేస్తూ, ఆపుతూ.. కొంచెం బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. అంతే.. ఎంతో రుచిగా ఉండే మటన్ కారంపొడి తయారైపోతుంది. దీన్ని తడి లేని డబ్బాలో భద్రపరిస్తే.. 15 రోజులు నిల్వ ఉంటుంది. **– వెంకటలక్ష్మి, హైదరాబాద్**

బలాన్నిస్తాయి.. ఒత్తిడి తగ్గిస్తాయి

ఆహారం - ఆరోగ్యం

పెసల్లో కొవ్వు స్వల్పం, పోషకాలు అధికం. వీటిని తరచూ తింటుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. సమతుల్య ఆహారంలో భాగంగా.. రోజూ ఏదో రూపంలో పెసలు తినడం అలవాటు చేసుకోవాలి.

● పెసల్లో ఉండే పీచు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ● ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తాయి. వీటిల్లో పోషకాలు అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలిగించి, త్వరగా ఆకలి వేయదు. పెసలు కొద్ది పరిమాణంలో తీసుకున్నా సరిపోతుంది కాబట్టి ఊబకాయం రాదు. ● వీటిల్లోని ఐరన్ ఎర్ర రక్తకణాల తయారీకి దోహదంచేస్తే, ఫోలేట్ శరీరంలోని కణాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ● పెసల్లో పొటాషియం ఉండటం వల్ల గుండె జబ్బుల నుంచి రక్షణ కలుగుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ● వీటిలోని మెగ్నీషియం కండరాలు, నరాల పనితీరుకు ఉపయోగపడుతుంది. ● మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ● పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. ● పెసలు శరీరానికి అవసరమైన వివిధ విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. వీటిలోని బి9- రక్తకణాల తయారీకి సహాయపడగా; బి1, బి2, బి3 విటమిన్లు- శక్తి ఉత్పత్తికి దోహదం చేస్తాయి. బి5, బి6 విటమిన్లు- జీవక్రియను మెరుగుపరిచి, నరాల పనితీరుకు సహాయపడతాయి. ఇ-విటమిన్ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రక్తం గడ్డకట్టడం, ఎముకల ఆరోగ్యానికి కె-విటమిన్ సాయపడుతుంది. ● పెసలను నానబెట్టి, మొలకెత్తాక తినడం శ్రేష్ఠం. లేదంటే ఉడికించిన పెసలు తినొచ్చు.

భక్తి.. అనురక్తి!

చిత్రంగా..



ఆబాలగోపాలానికీ ఇష్టమైన కృష్ణుణ్ణి తల్చుకోగానే.. గోవులూ, గోపికలు కళ్లముందు కదలాడటం సహజం. గోకులాష్టమి సందర్భంగా నల్లనయ్య మీది భక్తితో, అనురక్తితో.. పాలు, వెన్న, వేణువు వంటి నందకిశోరుడి చిహ్నాల్ని ఆహార పదార్థాల్లో రూపొందించారు.. చూసి తరించండి.

(c) eenadu

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ ఎకానమీ

1. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ వ్యాపారం చేసే సౌలభ్య సూచికలో కిందివాటిలో లేని పరామితిని గుర్తించండి.
   1) విద్యుత్తు పొందడం
   2) పన్నులు చెల్లించడం
   3) శాంతిభద్రతల నిర్వహణ
   4) ఒప్పందాలను అమలు చేయడం
2. 2021లో నిలిపివేసిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్'ను ఏ సంస్థ ప్రచురిస్తుంది?
   1) ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ)
   2) అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)
   3) ప్రపంచ వాణిజ్య సంస్థ
   4) ప్రపంచ బ్యాంక్
3. వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బీఏఆర్‌పీ) 2020 నివేదిక ప్రకారం అగ్రశ్రేణి ప్రతిభ సాధించిన జాబితాలో ఏ రాష్ట్రం లేదు?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
   3) ఉత్తర్‌ప్రదేశ్ 4) తెలంగాణ
4. గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టం రిపోర్ట్ 2022 ప్రకారం ఉత్తమ ప్రతిభ చూపి ఆసియాలో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రం?
   1) దిల్లీ 2) కేరళ
   3) గుజరాత్ 4) పంజాబ్
5. ప్రతిష్ఠాత్మక 'ద ఎకానమిక్ టైమ్స్ సంస్థ' 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం పొందిన వారు?
   1) రేవంత్ రెడ్డి
   2) నారా చంద్రబాబు నాయుడు
   3) సతీశన్ 4) ఎవరూకాదు

సమాధానాలు
1-3, 2-4, 3-3, 4-2, 5-2.

దరఖాస్తు చేశారా?
☛ ఐఓసీఎల్‌లో 470 ఎగ్జిక్యూటివ్ పోస్టులు
చివరి తేదీ: 03.09.2026
☛ ఇస్రో-లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్‌లో ఖాళీలు
చివరి తేదీ: 04.09.2026

ప్రాచీన భారతదేశ చరిత్ర రచన - శాసనాల ప్రాముఖ్యత

రాతి పలకలపై నాటి వైభవం!

కాలాన్ని జయించి రాళ్లు, రాతి స్తంభాలు, లోహ పలకలపై పదిలంగా నిలిచిన ప్రాచీన శాసనాలు భారతీయ చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యాలు. ఆధునిక కాలంలో జేమ్స్ ప్రిన్సెప్ అశోకుడి లిపుల రహస్యాన్ని ఛేదించడంతో, శతాబ్దాలుగా మరుగున పడి ఉన్న ప్రాచీన భారతదేశ వైభవం మళ్లీ వెలుగులోకి వచ్చింది. అశోకుడి శాంతి-ధర్మ సందేశాలు, శాతవాహనుల శౌర్యప్రతాపాలు, ఖారవేలుడి విజయాలు, సముద్రగుప్తుడి సామ్రాజ్య విస్తరణ, రెండో పులకేశి రణ కౌశలం సహా ఎన్నో నాటి రాజకీయ, సామాజిక, మత సంస్కృతుల విశేషాలను కథలు కథలుగా వినిపిస్తూ, గతాన్ని నేటికీ సజీవంగా కళ్ల ముందు నిలిపే కాల యంత్రాలే శాసనాలు. సాహిత్య ఆధారాలకు ప్రామాణికతను అందిస్తూ, కచ్చితమైన కాలక్రమాన్ని నిర్ధారించడంలో చరిత్రకారులకు అవి దిక్సూచిగా నిలిచాయి. ప్రాచీన భారతదేశ చరిత్రను అధ్యయనం చేయడంలో కీలకమైన ఆ శిలాశాసనాల ప్రాముఖ్యతను పోటీ పరీక్షార్థులు అర్థం చేసుకోవాలి. ప్రతి శాసనాన్ని వేయించిన రాజు, దాని భాష-లిపి, శాసనకర్త వివరాలను గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

దిల్లీలోని అశోకుడి స్తంభ శాసనం

సాధారణంగా బండరాళ్లు, రాతి స్తంభాలు లేదా లోహ పలకల మీద చెక్కిన పురాతన లిపిని 'శాసనాలు' అంటారు. వీటిని 'శిలాశాసనాలు' లేదా 'శాసనాజ్ఞలు' అని పిలుస్తారు. భారతదేశంలో లభించిన వాటిలో చదవగలిగిన అత్యంత పురాతనమైన శాసనాలు మౌర్య చక్రవర్తి అశోకుడు వేయించినవే. ఆధునిక భారతదేశంలో ఈ శాసనాలపై శాస్త్రీయ పరిశోధనలు ఆంగ్లేయుల పాలన కాలంలోనే ప్రారంభమయ్యాయి. క్రీ.శ. 1764లో జరిగిన బక్సర్ యుద్ధం తదనంతర పరిణామాల వల్ల ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి బెంగాల్ ప్రాంతంపై రాజకీయ, ఆర్థిక అధికారాలు (దివానీ హక్కులు) లభించాయి. ఆ సమయంలో ఇక్కడి ప్రజలను సమర్థంగా పరిపాలించడానికి వారి సంప్రదాయాలు, ఆచారాలు, న్యాయ శాస్త్రాలను అర్థం చేసుకోవడం కంపెనీకి తప్పనిసరైంది. ఈ క్రమంలోనే కొంతమంది బ్రిటిష్ అధికారులు ప్రాచీన భారతీయ చరిత్ర, సంస్కృతిపై ఆసక్తి పెంచుకుని పరిశోధనలు ప్రారంభించారు. ఈ ప్రక్రియలో భాగంగా, ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి, ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్‌కు చెందిన జేమ్స్ ప్రిన్సెప్, క్రీ.శ. 1837లో పురాతన బ్రాహ్మీ, ఖరోష్ఠి లిపుల రహస్యాన్ని ఛేదించాడు. దీని ద్వారా మౌర్య చక్రవర్తి అశోకుడు వేయించిన గొప్ప శాసనాలు వెలుగులోకి వచ్చాయి. అప్పటి నుంచి బ్రిటిష్ ఇండియాలో దేశవ్యాప్తంగా శాసనాలపై విస్తృతమైన పరిశోధనలు జరిగి, భారత చరిత్రను పునర్నిర్మించడానికి ఉపయోగపడే ఎన్నో వేల ప్రాచీన శాసనాలు వెలుగు చూశాయి. ప్రాచీన భారతదేశ చరిత్రను పునర్నిర్మించడంలో సాహిత్య ఆధారాలతో పాటు పురావస్తు ఆధారాలైన శాసనాలు, నాణేలు, ప్రాచీన కట్టడాలు అత్యంత ప్రామాణికమైనవి. సాహిత్యంలోని అంశాలను సరిచూసుకోవడానికి, సంఘటనలు జరిగిన కచ్చితమైన కాలాన్ని గుర్తించడానికి, రాజవంశాల కాలక్రమాన్ని అమర్చడానికి శాసనాలు ఎంతగానో దోహదపడ్డాయి. అంతేకాకుండా, ఆనాటి రాజకీయ పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకోవడానికి ఇవి నమ్మకమైన ప్రాథమిక ఆధారాలుగా నిలిచి, చరిత్ర రచనలో కీలక పాత్ర పోషించాయి.

జేమ్స్ ప్రిన్సెప్

అశోకుడి శాసనాలు

మౌర్య వంశ చక్రవర్తి అశోకుడి శాసనాలను మొదటిసారిగా 1837లో పరిశోధించి, వాటి లిపిని విశ్లేషించి అర్థాన్ని వివరించిన ఘనత ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి జేమ్స్ ప్రిన్సెప్‌నకు దక్కుతుంది. ఈ చరిత్రాత్మక ఆవిష్కరణ వల్లే మౌర్య సామ్రాజ్య వైభవం, అశోకుడి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలిశాయి. భారత ఉపఖండమంతటా విస్తరించి ఉన్న అశోకుడి శాసనాలను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

బృహత్ శిలా శాసనాలు: పెద్ద బండరాళ్లపై చెక్కిన 14 ప్రధాన ప్రకటనలు. ఇవి సామ్రాజ్య నైతికత, మత సహనం, ధర్మ ప్రచారం గురించి వివరిస్తాయి. 13వ బృహత్ శిలా శాసనం మౌర్య సామ్రాజ్యచరిత్రలోనే ముఖ్యమైన చారిత్రక ఆధారం. ఇది వినాశకరమైన కళింగ యుద్ధం (క్రీ.పూ. 261) బీభత్సాన్ని, యుద్ధం వల్ల జరిగిన ప్రాణ నష్టాన్ని చూసి అశోకుడు తీవ్రంగా పశ్చాత్తాప పడిన తీరును వివరిస్తుంది. ఈ శాసనం ద్వారానే ఆయన యుద్ధ విజయాల (భేరీఘోష) కంటే ధర్మ విజయమే (ధర్మఘోష) గొప్పదని గ్రహించినట్లు వెల్లడించారు. **ఉదా:** 1) గిర్నార్, ధౌలీ

13వ బృహత్ శిలా శాసనం

లఘు శిలాశాసనాలు: అశోకుడి వ్యక్తిగత జీవితం, బౌద్ధమతం పట్ల ఆయనకు ఉన్న అనుబంధాన్ని తెలిపే చిన్న శిలాశాసనాలు. **ఉదా:** మస్కి, సిద్ధాపుర్.

స్తంభ శాసనాలు: నునుపుగా చెక్కిన రాతి స్తంభాలపైన లిఖించిన (చెక్కిన) శాసనాలు. అశోకుడి పరిపాలనాసూత్రాలు, ధమ్మనియమాల ప్రచారానికి ఈ స్తంభాలు ఉపయోగపడ్డాయి. **ఉదా:** రుమిండై.

భాష-లిపి: అశోకుడి శాసనాలు అత్యధికంగా ప్రాకృతంలో, ప్రజలకు అర్థమయ్యే బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. సామ్రాజ్యానికి వాయవ్యంలో (ప్రస్తుత పాకిస్థాన్) ఉన్న సహాబాజ్‌గఢి, మాన్‌సేహ్రా శాసనాలు కుడి నుంచి ఎడమకు రాసే ఖరోష్ఠి లిపిలో ఉన్నాయి.

శాసనాల ముఖ్య ఉద్దేశం: ఈ శాసనాలు ప్రధానంగా అశోకుడి 'ధమ్మ'(ధర్మం), యుద్ధ రహిత నైతికపాలన, అహింస, జీవకారుణ్యం, మతసామరస్యం, ప్రజల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న చర్యలను ప్రతిబింబిస్తాయి.

శాతవాహన శాసనాలు

నాగనిక నానాఘాట్ శాసనం: శాతవాహన చక్రవర్తి మొదటి శాతకర్ణి భార్య దేవి నాగనిక (నాయనిక) మహారాష్ట్రలోని పుణె సమీపంలో ఉన్న నానాఘాట్ గుహల్లో వేసిన శాసనం ప్రాకృత, బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి. మొదటి శాతకర్ణి సైనిక విజయాలు, అతడి శౌర్యపరాక్రమాలతోపాటు, అశ్వమేధ, రాజసూయ లాంటి అనేక వైదిక యాగాలను ఈ శాసనం వివరంగా తెలియజేస్తుంది. శాసన ప్రారంభంలోనే సంకర్షణుడు (బలరాముడు), వాసుదేవుడు (కృష్ణుడు) తదితర దైవాలను స్తుతించడం ద్వారా నాటి శాతవాహన సమాజంలో భాగవత (వైష్ణవ) మత ప్రాచుర్యం స్పష్టమవుతోంది. మొత్తంగా, శాతవాహనుల రాజకీయ, ఆర్థిక, సామాజిక, మతపరమైన చరిత్రను ప్రామాణికంగా తెలుసుకోవడానికి ఈ శాసనం ఉపయోగపడింది.

